శ్రీరస్తు
శ్రీః ॥ శ్రీమతే రామానుజాయ నమః ॥

# శ్రీ భగవద్రామానుజవిరచితే శ్రీ శారీరకమీమాంసా భాష్యే

## చతుర్థాధ్యాయే ప్రథమః పాదః (ఆవృత్తిపాదః)

## ॥ ఆవృత్త్యధికరణమ్ ॥ 4-1-1 ॥

### ॥సి.సూ.॥ ఆవృత్తిరసకృదుపదేశాత్ ॥ 4-1-1 ॥

*తృతీయేऽధ్యాయే సాధనైః సహ విద్యా చిన్తితా, అథేదానీం విద్యాస్వరూపవిశోధన పూర్వకం విద్యాఫలం చిన్త్యతే తత్ర, 'బ్రహ్మవిదాప్నోతి పరమ్'(తై.ఆనం.1), 'తమేవ విదిత్వాऽతిమృత్యు*

---

శ్రీరస్తు
శ్రీః శ్రీమతే రామానుజాయ నమః

# శ్రీ భగవద్రామానుజవిరచితమైన శ్రీ శారీరకమీమాంసాభాష్యము సుఖబోధినిలో

## నాలుగవ అధ్యాయము మొదటిపాదము (ఆవృత్తిపాదము)

## ॥ఆవృత్త్యధికరణము ॥ 4-1-1 ॥

### ॥సి.సూ.॥ ఆవృత్తిరసకృదుపదేశాత్ ॥ 2-1-1 ॥

**సూత్రార్థము:-** **అసకృత్ ఆవృత్తిః** = (మోక్షసాధనమైన) భగవానుని గురించిన జ్ఞానము పలుసారులు తలచుకొనుట అనే ధ్యానమే అయినదని- **ఉపదేశాత్** = (ఉపనిషత్తులు ఆవిధంగా) ఉపదేశించినందున.

నాలుగవ అధ్యాయమును ఫలాధ్యాయము అందురు. మూడవ అధ్యాయములో సాధనము- ఉపాయము అంగములతో నిరూపించబడినది. ఈ అధ్యాయములో ఫలము చెప్పబడుచున్నది.

ఉపాసకునికి పాపముయొక్క అశ్లేషవినాశములు, మూర్ధన్యనాడిద్వారా ఈ శరీరమునుండి బయటికి బయలుదేరుట, బయటికి వచ్చినవాడు అర్చిరాదిమార్గమున ప్రయాణించుట, బ్రహ్మమును చేరుట అను నాలుగుఫలములు నాలుగు పాదములలో చెప్పబడబోవుచున్నవి.

మొదటి పాదములో విద్యను గురించి విచారించవలసిన కొన్ని విషయములను మొదట విచారించుచున్నారు.

**ప్రశ్న-**

ఈ విషయములో ఒక ప్రశ్న లేవవచ్చును. అదేమనగా- మూడవ అధ్యాయములో మూడవ పాదములో బ్రహ్మప్రాప్తికి సాధనమైన విద్యనుగురించి బాగుగా విచారించబడియున్నదిగదా! మరల ఈ అధ్యాయములో తిరిగి ఎందుకు విచారించవలెను? అని.

అచ్చట చెప్పక వదలివేసిన కొన్ని విషయములను ఇచ్చట చెప్పనున్నారు అను సమాధానము సరికాదు. చెప్పవలసినవాటిని సాధనాధ్యాయములోనే చెప్పియుండవలసినది. ఇన్ని అధికరణములలో

వెనుకటి అధ్యాయమును పూర్తి చేయవలెను అను నిర్బంధమేమైన ఉండెనా? ఎట్టి నిర్బంధమును కనబడనందున ఫలాధ్యాయములో ఉపాయమును గురించి విచారించుట సంగతముకాదు. 'అధ్యాయసంగతి కావలెను' అను నిర్బంధము సూత్రకారులకును కలదు. అందుచే ఈ అధ్యాయములో విద్యను గురించి విచారించకూడదు గదా! అని ప్రశ్న. దానికి సమాధానము క్రిందనియ్యబడుచున్నది-

విద్యావిషయములో వెనుక నిరూపించబడని - చెప్పబడనివాటినే ఇచ్చట చెప్పుట జరుగుచున్నది. ఈ అధ్యాయమందు విచారించుటకు నాలుగుకారణములున్నవి. అవేవనగా- 1. "నాన్యః పన్థా అయనాయ విద్యతే" అను శ్రుతివాక్యముప్రకారము మోక్షమును భక్తికంటే వేరైన ఉపాయముతో పొందుట సాధ్యము కాదు. 2. బ్రహ్మోపాసనము, మోక్షము - ఇవి రెండును విడదీయలేనివి. అనగా బ్రహ్మోపాసనము చేసినచో మోక్షము నిశ్చయముగా లభించును అనునది. 3. "తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే' అను శ్రుతివాక్యము ప్రకారము ఉపాసనచే ఆలస్యములేకుండ మోక్షమును పొందుచున్నాడు, (ప్రారబ్ధకర్మపతనము వరకే ఆలస్యము. ప్రారబ్ధకర్మ గడచినవెంటనే మరి ఆలస్యము లేకుండ మోక్షమును పొందును). 4. "తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి" అను శ్రుతివాక్యము ననుసరించి, ముక్తునకు పరిపూర్ణబ్రహ్మానుభవరూప మహానందావస్థవలె భక్తి- ఉపాసనము చేయు కాలములోకూడ దానికి సమమైన ఆనందము కలుగుచున్నది.

"ఈవిధమైన నాలుగు కారణములతో సూత్రకారులు ఫలాధ్యాయములో విద్యాస్వరూపశోధనను చేయుచున్నారు" అని వేదాంతదేశికులవారు అధికరణసారావళి ఈ చతుర్థాధ్యాయారంభములో రెండవ శ్లోకములో ఇట్లు తెలిపియున్నారు

"సూక్తా ప్రాగేవ విద్యా కిమితి పునరిమాం వక్తి, యద్యస్తి శేషం,
బ్రూతాం ఏతచ్చ పూర్వం నహి తదిహఫలే సంఘటేతేతి చేన్న ।
ముక్తేరన్యైరసిద్ధిం ప్రకృతతదవినాభావం ఆసన్నసిద్ధిం
ముక్తావస్థాసమంచ స్థిరభజనరసం వ్యఙ్క్తుం అత్రానుబన్ధాత్॥"

(ఈ బ్రహ్మవిద్యను గురించి ఇదివరకే వివరముగా చెప్పుట జరిగినదిగదా! తిరిగి ఇచ్చట దీని ప్రస్తావన చేయుట ఎందుకు? అచ్చట చెప్పబడనిది కొంత మిగిలియున్నచో అప్పుడే చెప్పియుండవచ్చును గదా! ఇచ్చట ఫలనిరూపణము చేయుచు మరల వెనకటి విషయమును చర్చించుట తగునా? అని పూర్వార్థములో లేవనెత్తిన ఆక్షేపమునకు సమాధానము తరువాతి రెండు పాదములలో చెప్పబడుచున్నది-

ఇక పైన చెప్పబోవు మోక్షఫలము ఇటువంటి బ్రహ్మజ్ఞానమువలననే పొందుట సాధ్యము. ఇతరములైన ఉపాయములు ముక్తికి సాధనములు కావు- అని ఇతరసాధనములను నిరసించుట ఒక ప్రయోజనము. ఈ విషయమే "నాన్యః పన్థా అయనాయ విద్యతే" అను శ్రుతివాక్యముచేత నిర్ధారితము. "ప్రకృతేః తదవినాభావం" అను పదములచేత మోక్షఫలము, బ్రహ్మజ్ఞానమునుండి విడదీయరానిది. అంటే సాధనానుష్ఠానముచేత బ్రహ్మజ్ఞానము సిద్ధించియే తీరును అనగా ఉపాసనను అనుష్ఠించుటచే ఫలము తప్పక లభించును. తరువాత "ఆసన్నసిద్ధిం" అను పదముచేత ఫలము వెంటనే సిద్ధించును అని తెలుపు

*మేతి' (శ్వే.3-8), 'బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి' (ము.3-2-9), 'యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణమ్' (ము.3-1-3) ఇత్యాదివేదాన్తవాక్యేషు బ్రహ్మప్రాప్తిసాధనతయా విహితం వేదనం కిం సకృత్కృతమేవ శాస్త్రార్థః, ఉతాసకృదావృత్తమితి సంశయః।*

*కిం యుక్తమ్? సకృత్కృతమితి; 'బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి' ఇతి వేదనమాత్రస్యైవ*

---

చున్నది. ఆపైన "ముక్తావస్థాసమంచ స్థిరభజనరసం" అను పదములచేత సాధనమును అనుష్ఠించుటలోనే కలుగురసానుభవము ముక్తుడు పొందు అవస్థతో సమమైనది. అనగా ముక్తిదశలో "సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా" అని చెప్పినట్లుగా ఉపాసనదశలోనే బ్రహ్మానందమువంటి ఆనందానుభవము కలుగగలదని చెప్పుట మరియొక ప్రయోజనము. ఇట్లు నాలుగు ప్రయోజనములను చెప్పుచున్నది అని తెలుపుటకే తిరిగి బ్రహ్మవిద్యగురించిన ప్రస్తావము చేయబడినది అని చెప్పుచున్నారన్నమాట.

**సంగతి**: మూడవ అధ్యాయము చివరి అధికరణమైన ముక్తిఫలాధికరణములో "ఫలకర్తృత్వాభి-సంధి అనే దోషరహితమైన- ఈ ఫలము కావలెను, ఈ కార్యమును నేను చేయుదును అను నిశ్చయము లేని, మోక్షసాధనమైన విద్యకు అంగమైన వర్ణాశ్రమధర్మములచేతను, శమదమాదులచేతను (బ్రహ్మవిదపచారము లేనిచో) బ్రహ్మోపాసనము సిద్ధించును" అని చెప్పబడినది. ఈ అధికరణములో అట్టి విద్యాస్వరూపమును విచారించుచున్నారు.

**విషయము**: 'బ్రహ్మవిదాప్నోతి పరమ్'(తై. 2-1-1), 'తమేవ విదిత్వాతిమృత్యుమేతి'(శ్వే. 3. 8), 'బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి'(ముం. 3-2-9), 'యదా పశ్యః పశ్యతో రుక్మవర్ణమ్(ముం. 3-1-3)' ఇత్యాది ఉపనిషద్వాక్యములు.

**సంశయము**: "వెనక ఉట్టంకించబడిన ఉపనిషద్వాక్యములలో బ్రహ్మప్రాప్తిసాధనముగా విధించబడిన 'వేదనము' ఒకసారి చేసిననే శాస్త్రమును అనుష్ఠించినట్లగునా లేక పలుసారులు అనుష్ఠించవలెనా?" అని సంశయము.

**సంశయము వచ్చుటకు కారణము.**

వెనుక చెప్పబడిన ఉపనిషద్వాక్యములలో 'విత్', 'విదిత్వా', 'వేద', 'పశ్యః' అను శబ్దములకు సాధారణముగా చూచినచో జ్ఞానపరముగనే అర్థము చెప్పవలెను. ఇతర వాక్యములకును చేర్చి అర్థము చెప్పనారంభించినచో ఉపాసనపరముగా అర్థము చెప్పవలసియుండును. ఇట్లు కేవలజ్ఞానపరముగా అర్థము చెప్పినచో సకృత్కృతమేవ యుక్తమ్- ఒకసారి చేయుటయే సరిపోవును. ఉపాసనపరముగా అర్థమును చెప్పినచో అసకృదావృత్తి చెయ్యవలెను. ఈ రెండుపక్షములలో ఏ పక్షము యుక్తియుక్తము?" అని నిర్ణయించలేకపోవుటయే సంశయము వచ్చుటకు కారణమైనది.

**పూర్వపక్షము**: "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి" అని వేదనామాత్రమును చెప్పుటచేత సకృదనుష్ఠానమే - ఒక్కసారి అనుష్ఠించుటయే - తెలిసికొనుటయే సరిపోవును. ఇట్లు మోక్షోపాయము జ్ఞానమని చెప్పబడినదట్లైనది. మోక్షోపాయభూతమైన జ్ఞానమును ఒకసారి అనుష్ఠించవలెనా? లేక, చాలసారులు అనుష్ఠించవలెనా? ఆవృత్తి చేయవలెనా లేక ఆవృత్తి చేయవలదని శాస్త్రమేదియు చెప్పలేదు. కనుక,

*విధానాత్, అసకృదావృత్తౌ ప్రమాణాభావాత్। న చావఘాతాదివత్ వేదనస్య బ్రహ్మాపరోక్షం ప్రతి దృష్టోపాయత్వాత్ యావత్ కార్యమావృత్తిరితి శక్యం వక్తుమ్; వేదనస్య దృష్టోపాయత్వాభావాత్ । జ్యోతిష్టోమాదికర్మాణి వేదాన్తవిహితం చ వేదనం పరమపురుషారాధనరూపం, ఆరాధితాచ్చ పరమపురుషాత్, ధర్మార్థకామమోక్షాఖ్య పురుషార్థావాప్తిరితి హి, "ఫలమత ఉపపత్తేః" (శారీ.3-2-37), ఇత్యత్ర ప్రతిపాదితమ్। అతో జ్యోతిష్టోమాదివత్ యథాశబ్దం సకృత్కృత మేవ శాస్త్రార్థః-*

*ఇతి ప్రాప్తే ప్రచక్ష్మహే- ఆవృత్తిరసకృత్- ఇతి। అసకృదావృత్తమేవ వేదనం శాస్త్రార్థః। కుతః? ఉపదేశాత్- ధ్యానోపాసనపర్యాయేణ వేదనశబ్దేనోపదేశాత్। తత్పర్యాయత్వం చ విద్యుపాస్తి ధ్యాయతీనామేకస్మిన్ విషయే వేదనోపదేశపరవాక్యేషు ప్రయోగాదవగమ్యతే। తథా హి, "మనో బ్రహ్మేత్యుపాసీత- (ఛాం.3.18.1), ఇత్యుపాసినోపక్రాన్తోఽర్థః; "భాతి చ తపతి చ కీర్త్యా యశసా*

---

ఒకసారి అనుష్ఠించుటయే సౌకర్యము. "సకృత్కృతః శాస్త్రార్థః" అను న్యాయము ప్రకారము ఒకసారి అనుష్ఠించుటచేతనే మోక్షోపాయవిధియు చరితార్థమగుచున్నది.

అంతే కాక, పూర్వమీమాంసలో "ప్రయాజాదులను అధికఫలమును ఉద్దేశించి మరల మరల చేయవచ్చునా??" అని ప్రశ్నించుకొని "సకృద్వా కారణైకత్వాత్" అను సూత్రములచే 'ఒకసారి చేసినచో చాలును' అని సిద్ధాంతీకరించబడినది. కనుక అసకృదావృత్తికి ప్రమాణమును లేదు.

నను– ఆవృత్తిని చేయుటలో ప్రమాణము లేకపోయినను, వ్రీహ్యవఘాతమందు – ధాన్యమును దంచుటలో "దృష్టేసమ్భవతి అదృష్టస్య అన్యాయ్యత్వాత్" అను న్యాయము ప్రకారము పొట్టు పోవు నంతవరకు ధాన్యమును దంచుచునే యున్నట్లుగా ఇచ్చట వేదనము బ్రహ్మసాక్షాత్కారము నుద్దేశించిన దృష్టోపాయము గనుక, యావత్కార్యం – ఫలసిద్ధిపర్యంతము అసకృదావృత్తి చేయవలెను అని చెప్పుట యుక్తము కాదు. వేదనము అదృష్టోపాయమని (సిద్ధాంతియైన) మీచేతనే ఒప్పుకొనబడియున్నది. కనుక దృష్టోపాయమును అదృష్టోపాయవిషయములో దృష్టాంతముగా చూపుట కుదరదు.

"ఫలమత ఉపపత్తేః" అన్నచోట జ్యోతిష్టోమాదికర్మలును వేదాంతవిహితమైన – ఉపనిషత్తులలో విధించబడిన, వేదనము– ఉపాసనము అనునవియును భగవదారాధనరూపములు. ఆరాధనముచే ప్రీతిచెందిన భగవానుడు ధర్మ,అర్థ,కామ,మోక్షరూపఫలములను ఇచ్చుచున్నాడు అనిగదా నిర్ధారించ బడినది! యజేత అని చెప్పియుండుటచేత జ్యోతిష్టోమాది యాగములను ఎట్లు ఒకసారి చేయుచున్నామో అదేవిధముగ వేద అని చెప్పియుండుటచేత యథాశబ్దము ఒకసారి అనుష్ఠించుటచేతనే మోక్షోపాయవిధి చరితార్థమగుచున్నది.

**సిద్ధాంతము** – "ఆవృత్తిరసకృదుపదేశాత్" ఉపాసనపదమునకు పర్యాయముగా వేద అను పదము ఉపదేశించబడినది గనుక అసకృదావృత్తవేదనమే మోక్షసాధనమగుచున్నది. అప్పుడే మోక్షోపాయవిధి చరితార్థమగుచున్నది

ఉపనిషత్తులలో ఒకే విషయమందు "విది", "ఉపాసనము", "ధ్యానము" అను పదములను పర్యాయములుగా ప్రయోగించియుండుటచే ఇవి పర్యాయశబ్దములు అని తెలియుచున్నది. వీటిని వివరించి చెప్పుచున్నారు– "మనో బ్రహ్మేత్యుపాసీత" అని ఆరంభించి "భాతి చ తపతి చ కీర్త్యా

*బ్రహ్మవర్చసేన య ఏవం వేద' ఇతి విదినోపసంహ్రియతే; తథా "యస్తద్వేద యత్ స వేద స మయైతదుక్తః'(ఛాం.4.1.4) ఇత్యుపక్రమే విదినోక్తం రైక్వస్య జ్ఞానమ్ 'అను మ ఏతాం భగవో దేవతాం శాధి, యాం దేవతాముపాస్సే' ఇత్యుపాసినోపసంహ్రియతే। తథా 'బ్రహ్మవిదాప్నోతి పరమ్" (తై.ఆనం.1-1) ఇత్యాదివాక్యసమానార్థేషు వాక్యేషు "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః' (బృ.4.4.5), 'తతస్తు తం పశ్యతి నిష్కలం ధ్యాయమానః(ము.3.1. 8) ఇత్యాదిషు ధ్యాయతి నా వేదనమభిధీయతే। ధ్యానం చ చిన్తనమ్। చిన్తనం చ స్మృతిసన్తతిరూపమ్; న స్మృతిమాత్రమ్। ఉపాస్తిరపి తదేకార్థః; ఏకాగ్రచిత్తవృత్తినైరన్తర్యే ప్రయోగదర్శనాత్। తదుభయైకార్థ్యాత్ అసకృదావృత్తసన్తతస్మృతిరిహ,*

---

యశసా బ్రహ్మవర్చసేన య ఏవం వేద" అని పూర్తిచేయబడినది. అనగా, 'ఉపాసీత' అని ఆరంభించి, 'వేద' అని పూర్తియగుచున్నది. ఈ విధముగనే 'యస్తద్వేద' అని ఆరంభించి "యాం దేవతాం ఉపాస్సే" అని పూర్తిచేయబడినది. ఇట్లే చాలచోట్లు విదితో ఉపక్రమించి ఉపాసనతో పూర్తి చేయుటయు కలదు.

'బ్రహ్మవిదాప్నోతి పరమ్' అను విధివాక్యసమానార్థముగల వాక్యములలో "ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః', 'తతస్తు తం పశ్యతి నిష్కలం ధ్యాయమానః' అని ధ్యానముచేత వేదనము చెప్పబడుచున్నది. ఇట్లు వీటిచేత వేదనము, ఉపాసనము, ధ్యానము – వీటిని పర్యాయ శబ్దములని నిర్ణయించబడినది.

"ఇవి పర్యాయశబ్దములు కావచ్చును. అందుచే అసకృదావృత్తి చేయవలెను అని ఎట్లు చెప్పగలరు?' అని ప్రశ్నించవచ్చు. దానికి సమాధానమిదిగో–

"ధ్యై చిన్తాయామ్' అను ధాతుపాఠముచేత చింతనమే ధ్యానమగును. కనుక, ధ్యానము అన్నచో చిన్తనము. అది స్మృతిసన్తతిరూపము. విచ్ఛేదములేకుండ తైలధారవలె నడచుచున్న స్మరణమే చిన్తనము అనబడును. దానినే "తైలధారావచ్ఛిన్నస్మృతిసన్తతిరూపం న స్మృతిమాత్రమ్।"

కాని భాష్యమందు "ఉపాస్తిరపి తదేకార్థః" అని యున్నది. ఉపాసనమును, ధ్యానమును ఒకే అర్థము గలవి అని దీని అర్థము. ఇదివరకే వేదన,ధ్యాన, ఉపాసనములు పర్యాయశబ్దములని చెప్పబడియున్నది. అందుచేతనే ఒకే అర్థమును గలవి అని తెలియుచున్నదిగదా! తిరిగి 'ఉపాస్తిరపి తదేకార్థః' అని ఎందుకు చెప్పవలెను? అను సందేహము కలుగవచ్చును.

దానికి సమాధానము– ధ్యానమనినచో చింతనము. ఆ చింతనము చోర, సర్వవిషయముగా నున్నను ధ్యానమనవలెను. కనుక ఆవిధముగా భావించకూడదని తెలుపుటకు ఉపాసనమును ధ్యానమును ఒకే అర్థముగలవి అని చెప్పబడుచున్నది. ఉపాసనమనగా, ఉత్కృష్టవిషయమందు చేయు భక్తియగును. అందుచే, ధ్యానము అనగా, కేవలము చింతనమని మాత్రము చెప్పుట లేదు. కాని అనుకూలవిషయ–మాత్రానుసన్ధానమని చెప్పబడుచున్నది.. దీనినే స్వామి దేశికులు అధికరణసారావళిలో "ధ్యానే ఉపాస నోక్తిః పరభజనతయా వక్తి సేవాత్మకత్వ"మని (436వశ్లో.) సాదించిరి,

ఇట్లు వెనుకచెప్పినట్లుగా, 'బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి', జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాపైః" ఇత్యాది వాక్యములలో ఉన్న వేదనాదిశబ్దములు అసకృదావృత్తిస్మృతిసన్తతినే చెప్పుచున్నవని నిర్ణయించ బడుచున్నది.

*'బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి', 'జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః' (శ్వే.1-8) ఇత్యాదిషు వేదనాదిశబ్దైః అభిధీయతే ఇతి నిశ్చీయతే॥ 1 ॥*

## ॥ సి. సూ.॥ లిఙ్గాచ్చ ॥ (4-1-2)

*లిఙ్గం- స్మృతిః । స్మృతేశ్చాయమర్థోఽవగమ్యతే । స్మర్యతే హి మోక్షసాధనభూతం వేదనం స్మృతిసన్తతిరూపమ్, 'తద్రూపప్రత్యయే చైకా సన్తతిశ్చాన్యనిస్పృహా । తద్ధ్యానం ప్రథమైః షడ్భిరఙ్గై*

---

ఇచ్చట సామాన్యవిశేషాధికరణన్యాయముచే వేదనాదిసామాన్యశబ్దములు ధ్యానరూపవిశేషమందు పర్యవసించినవిగా గ్రహించవలెను. ఆవృత్తిః, అసకృత్, ఉపదేశాత్ – మోక్షోపాయభూతమైన వేదనము, అసకృదావృత్తిరూపము, ఉపదేశాత్– పర్యాయమైన ధ్యానోపాసన శబ్దములు చెప్పబడియున్నందున అని సూత్రార్థము. 1.

ఇక– వేదనమునకు ధ్యానపర్యాయమును అంగీకరించుచున్నాను. కాని, వేదనపదమునకు జ్ఞానపరముగా అర్థము చెప్పుటచే ఒకసారి తెలసినచో సరిపోవుననుటచే దాని పర్యాయమైన ధ్యానపదమునకును స్మృతిమాత్రపరముగనే అర్థమును చెప్పవలెనను విషయములో నియమము లేదని పూర్వపక్షి ఆక్షేపించగా, దానికి సమాధానముగా **లింగాచ్చ** అని సాదించుచున్నారు.

'స్మర్యతే హి మోక్షసాధనభూతవేదనం స్మృతిసన్తతిరూపమ్' అనే వాక్యమును పరామర్శించి ఈవిధంగా అవతారిక వ్రాయబడినది.

## ॥ సి. సూ ॥ లిఙ్గాచ్చ ॥ 4-1-2 ॥

**సూత్రార్థము:– లిఙ్గాత్ చ** = స్మృతినుండికూడ (ఈ విషయము స్పష్టమగుచున్నది)

ధ్యానశబ్దమునకు వేరువిధముగా అర్థము చెప్పకూడదు. వెనుక చెప్పినవిధముగనే అర్థమును చెప్పవలెనని స్మృతిచేతకూడ తెలియుచున్నది. లింగమను పదము స్మృతిని చెప్పును. లిఙ్గమ్– అనుమానము. స్మృతిచే శ్రుతియొక్క అర్థము ఊహించబడుటచే స్మృతియే లింగమని చెప్పబడుచున్నది.

శ్రీవిష్ణుపురాణములో మోక్షసాధనభూతమైన వేదనమే స్మృతిసంతతిరూపముగా **"తద్రూపప్రత్యయే చైకా"** అని స్మరించబడియున్నది. **"తద్రూపప్రత్యయే– తస్య** – పరమాత్మయొక్క, **యత్ రూపం–శుభాశ్రయం**–దివ్యమంగళవిగ్రహము, **తస్య ప్రత్యయే**– దానియొక్క ధ్యానమందు, **అన్యనిస్పృహా** – విజాతీయప్రత్యయవ్యవహితము లేక (వేరు ధ్యాస మధ్యను కలియకుండ), **ఏకా యా సన్తతిః**– విచ్ఛేదములేని సజాతీయప్రత్యయప్రవాహము (ఒకేవిధమైన తలంపు), **తద్ధ్యానం**– ఆ ధ్యానము **షడ్భిరఙ్గైః**– యమనియమాది ఆరు అంగములచేత, **నిష్పాద్యతే**– కలుగుచున్నది.

కనుక, అసకృదావృత్తమేవ వేదనం– మోక్షసాధనమైన భగవానుని గురించిన జ్ఞానమును పలుసారులు తలుచుకొనుటయే ధ్యానమని– శాస్త్రసమ్మతమగుచున్నది.

**ఉపాసనమునకు కావలసిన ఆరు అంగములు**–

యమ,నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ అనబడు ఆరు అంగములు.

ర్నిష్పాద్యతే తథా॥' (వి.పు.6.7.91) ఇతి। తస్మాదసకృదావృత్తమేవ వేదనం శాస్త్రార్థః॥ 2 ॥
॥ ఇతి ఆవృత్త్యధికరణమ్॥ 1 ॥

1. యమము- **అహింసా సత్య మస్తేయం బ్రహ్మచర్యా అపరిగ్రహః యమః** - హింసించకుండుట, భూతహితమునే మాటాడుట, దొంగతనము లేకపోవుట, ఇంద్రియములను నియమించుట, ద్రవ్యాపేక్ష లేకుండుట అనునవి యమముయొక్క స్వరూపము.

2. నియమము- "శౌచ-సన్తోష-తపస్స్వాధ్యాయ-ఈశ్వరప్రణిధానాని నియమాః" - పరిశుద్ధిని చేసికొనుట, సంతోషము, తపస్సు, యోగసిద్ధికి అనుకూలమైన మంత్రములను జపించుట, అన్ని కర్మలను ఈశ్వరార్పణము గావించుట అనునవి నియమమగును.

3. ఆసనము- "స్థిరసుఖమాసనమ్" ఆసనమనునది స్థిరమైనదై కూర్చొనుటకు సుఖముగా నుండుట.

4. ప్రాణాయామము- "సవ్యాహృతిం సప్రణవాం గాయత్రీం శిరసా సహ । త్రిః పఠేదాయతప్రాణః ప్రాణాయామః స ఉచ్యతే - ప్రణవముతో కూడిన వ్యాహృతులు, గాయత్రి, దాని శిరస్ వీటిని మూడుసారులు జపించి శ్వాసను నిరోధించుట ప్రాణాయామమనబడును. "తస్మిన్ సతి శ్వాసప్రశ్వాసయో గతివిచ్ఛేదః ప్రాణాయామః" అందులో (ఆసనజయము కలిగినప్పుడు) శ్వాసయొక్క గతిని నిరోధించుట ప్రాణాయామమని చెప్పబడుచున్నది. ఆసనజయముద్వారా శరీరము స్వాధీనములోనికి తీసుకొని వచ్చుటకు ప్రాణాయామము చేయుట సాధ్యమగును. ప్రాణమును ఆయామము- దీర్ఘమగునట్లు చేయుట ప్రాణాయామము.

5. ప్రత్యాహారము- "స్వవిషయసంప్రయోగే చిత్తస్వరూపానుకూల ఇవ ఇంద్రియాణాం ప్రత్యాహారః॥" ప్రత్యాహారమనగా - ఇంద్రియములు విషయములతో సంబంధములేక చిత్తముయొక్క స్వభావమును అనుసరించుచున్నట్లు ఉండుటయే అగును.

6. ధారణ- "దేశబన్ధచిత్తస్య ధారణా" ధారణ అనగా మనస్సును ఒక నిర్ణీతమైన స్థలమునకు కట్టివేయుట.

**ప్రశ్న-సమాధానము.**

"ఆవృత్తిః" అన్నచో ఒకసారికంటె ఎక్కువగా చేయవలెను అని వచ్చుచున్నది. "అసకృత్" అను పదమునకును ఇదియే అర్థము. ఇట్లుండగా రెండింటినీ సూత్రములో చెప్పుటకు కారణమేమి?

రెండుసారులు చేసి ఆపివేసినను ఆవృత్తి చేసినట్లగును. దానిచే శాస్త్రార్థము చరితార్థమగును. కనుక ఉపాసనము అసకృదావృత్తము కావలెననుటకు రెండింటిని చేర్చి చెప్పిరి.

ఈ విధముగా చెప్పినచో, "ఆప్రయాణాధికరణము ఎందులకు?" అని ప్రశ్నించవచ్చును. ఏదో కొన్ని దినములు అనగా దర్శనసమానాకారస్మృతిసన్తతి కలుగువరకు ఉపాసనమును చేసిననే అసకృదావృత్తి చేసినట్లగును. మరణపర్యన్తము చెయ్యవలెను అని ఈ అధికరణముచే నిర్ణయించ సాధ్యము కాదు. కనుకనే ఆప్రయాణాధికరణమునకు ఆవశ్యకత కలిగినది.

ఆవృత్త్యధికరణము పూర్తియైనది.

## ఆత్మత్వోపాసనాధికరణమ్ 4-1-2

**॥ సి. సూ. ॥ ఆత్మేతి తూపగచ్ఛన్తి గ్రాహయన్తి చ ॥ 4-1-3 ॥**

*ఇదమిదానీం చిన్త్యతే- కిముపాస్యం బ్రహ్మ ఉపాసితురన్యత్వేనోపాస్యమ్, ఉతోపాసితుః ఆత్మత్వేనేతి। కిం యుక్తమ్? అన్యత్వేనేతి। కుతః? ఉపాసితుః ప్రత్యగాత్మనోఽర్థాన్తరత్వాత్ బ్రహ్మణః। అర్థాన్తరత్వఞ్చ, 'అధికం తు భేదనిర్దేశాత్' (శారీ.2.1.22), 'అధికోపదేశాత్'(శారీ.3.4.8),*

## ఆత్మత్వోపాసనాధికరణము ॥ 4-1-2 ॥

**॥సి. సూ.॥ ఆత్మేతి తూపగచ్ఛన్తి గ్రాహయన్తి చ ॥ 4-1-3 ॥**

**సూత్రార్థము:- ఆత్మా ఇతి తు** = ఆత్మ అనే (బ్రహ్మము ఉపాసింపబడవలెను) (ఎందులకనగా) **ఉపగచ్ఛన్తి** = (ఉపాసించినవారు ఆవిధముగనే ) తెలిసికొనినారు గదా! **గ్రాహయన్తి చ** = (శాస్త్రములు కూడ అటులనే) తెలియజేయుచున్నవిగదా!

**సంగతి:**- వెనుకటి అధికరణములో పరమాత్మ ఉపాసనమును అసకృదావృత్తి చేయవలెనని నిర్ణయించబడినది. ఈ అధికరణములో ఉపాసనప్రకారము - అనగా ఉపాసనము చేయు పద్ధతి నిర్ణయించబడుచున్నది.

**విషయము** :- బ్రహ్మోపాసనము

**సంశయము:**- ఉపాస్యమైన బ్రహ్మమును ఉపాసకుని కంటెను వేరైనవానిగ ఉపాసించవలెనా? ఉపాసకుని ఆత్మ అని ఉపాసన చేయవలెనా? అనగా- ఉపాసకుని - జీవునియొక్క - శరీరి అని ఉపాసించవలెనా? లేక శరీరిశరీరభావసంబంధమును మనసులో భావించకనే ఉపాసించవలెనా?

లేక - ఆత్మశబ్దము స్వవాచి. అప్పుడు 'అహం బ్రహ్మాస్మి' అని అహమర్థసామానాధికరణ్యేన ఉపాసించవలెనా? వైయధికరణ్యేన ఉపాసించవలెనా?

**సంశయము వచ్చుటకు కారణము:**- ఉపాసకుని ఆత్మత్వేన ఉపాసనము చేసినచో, 'పృథగాత్మానం ప్రేరితారం చ మత్వా'(శ్వే. 1.6) – జీవునియు, అతడికి నియంతగానుండు పరమాత్మను భిన్నులుగా తలంచి' అను భేదశ్రుతికి విరోధము వచ్చును. ఉపాసకునికంటె అన్యత్వేన – వేరైనవానిగ– ఉపాసనము చేసినచో "సర్వం ఖల్విదం బ్రహ్మ" (పరిదృశ్యమానమైన–కనబడుతూండే– ఇవన్నీ బ్రహ్మమేగదా!) అనే సామానాధికరణ్యశ్రుతికి విరోధం వస్తుంది.

కనుక, ఈ రెండు పక్షాల్లో ఏ పక్షం యుక్తియుక్తమైనది అనే నిర్ణయం చెయ్యలేకపోవటమే సంశయానికి కారణమౌతున్నది.

**పూర్వపక్షము**– ఉపాసకునికంటెను **అన్యత్వేన**యే ఉపాసించవలెను. ఎందుచేతననగా, ఉపాసకుని కంటెను అనగా జీవాత్మకంటెను బ్రహ్మము వేరైనదిగదా! ఆ భేదమేమనగా– "అధికం తు భేదనిర్దేశాత్" (2–1–22) ఆధ్యాత్మిక, ఆధిభౌతికాది దుఃఖసంబంధార్హుడైన ప్రత్యగాత్మకంటే వేరైన బ్రహ్మము, **అధికం**– అర్థాన్తరభూతము– అనగా భేదము గలది. ఎందువలన అనగా, **భేదనిర్దేశాత్**– య ఆత్మని తిష్ఠన్

*'నేతరోఽనుపపత్తేః'(1.1.17) ఇత్యాదిషూపపాదితమ్। యథావస్థితఞ్చ బ్రహ్మ ఉపాస్యమ్; అయథోపాసనే హి బ్రహ్మప్రాప్తిరప్యయథాభూతా స్యాత్; 'యథాక్రతురస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి'(ఛాం.3-14-1) ఇతి న్యాయాత్। అతోన్యత్వేనోపాస్యమితి ॥*

*ఏవం ప్రాప్తే అభిధీయతే -ఆత్మేతి తు- ఇతి। తు శబ్దోఽవధారణే । ఉపాసితురాత్మేత్యే-వోపాస్యమ్ । ఉపాసితా ప్రత్యగాత్మా స్వశరీరస్య స్వయం యథా ఆత్మా, తథా స్వాత్మనోఽపి పరం*

అన్న శ్రుతి ప్రత్యగాత్మకంటే వేరైనదిగా బ్రహ్మమును చెప్పినదిగనుక. అధికోపదేశాత్ (3.4.8)- కర్మలలో, కర్మలను అనుష్ఠించుచున్న జీవునికంటెను, హేయప్రత్యనీక, అనవధికాతిశయ కల్యాణగుణాకరత్వేన, **అధికస్య- అర్థాన్తరభూతస్య**- భేదముగల పరమాత్మయైనవాడు ఉపాసించబడ దగినవాడు అని ఉపదేశించుటచేత. నేతరోనుపపత్తేః (1.1.17)- పరమాత్మకంటెను, **ఇతరః**- జీవశబ్దముచే చెప్పబడువాడు ముక్తదశను పొందినప్పటికిని, మాంత్రవర్ణికునిగా కానేరడు. ఎందువలన?- **అనుపపత్తేః**- ముక్తావస్థలోనివాడైన ఆత్మకు నిరుపాధికవిపశ్చిత్త్వము, **నోపపద్యతే**- సంభవించదు అని సూత్రములలో ఉపపాదించబడినది.

అంతేకాక, బ్రహ్మమును యథావస్థితముగనే ఉపాసించవలెను. అయథావస్థితముగా- యథార్థముకాని వానిగా- బ్రహ్మోపాసనము చేసినచో ఫలముకూడ తత్క్రతున్యాయముచే మారిపోయినదిగనే లభించును.

**యథాక్రతురస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి(ఛాం.3.14.1) - అస్మిన్ లోకే ఇహలోకే, పురుషః యథాక్రతుః-యథోపాసనః, తథైవ, ఇతః ప్రేత్య ఆముష్మికలోకే భవతి।** "ఉపాసనము చేయువాడు ఈ లోకములో ఏయే కల్యాణగుణవిశిష్టునిగా బ్రహ్మమును ఉపాసించునో, ఆయా గుణవిశిష్టుడైన బ్రహ్మమును ఈ లోకమునుండి పోయి, (శ్రీవైకుంఠలోకములో) అనుభవించును" అని తత్క్రతున్యాయమునకు అర్థము.

'**బ్రహ్మము వేరు, ఉపాసనము చేయువాడు (జీవుడు) వేరు**' అని ఉపాసనము చేసినచో యథావస్థితమైన బ్రహ్మమును పొందును. బ్రహ్మముకంటె వేరైన జీవుని 'అహం బ్రహ్మాస్మి' అని ఉపాసనము చేసినచో యథావస్థితమైన బ్రహ్మమును పొందుట సాధ్యము కాదు. ఇది బ్రహ్మోపాసనముకూడ కాదు. దృష్టివిధిగనే అగును. బ్రహ్మముకానిదానిని బ్రహ్మముగా భావించుటయే దృష్టివిధిగదా! ఇతడు- అనగా ఈ ఉపాసకుడు- బ్రహ్మముకానిదానిని బ్రహ్మముగా ఉపాసించు జీవుడు- బ్రహ్మము కాడుగదా! జీవుని బ్రహ్మముగా భావించినచో అది దృష్టివిధియేగదా! కనుక, **అన్యత్వేనైవ** - వేరైనదిగనే ఉపాసించ వలెను.

**సిద్ధాంతము**:- ఇచ్చట సూత్రములోనున్న 'తు' అనే పదము 'ఏవ' అను అర్థములో ప్రయోగించబడినది. కనుక, ఉపాసకుని ఆత్మ అనియే ఉపాసించవలెను. ఉపాసితయైన ప్రత్యగాత్మ- అనగా జీవాత్మ- తన శరీరమునకు తాను ఎట్లు ఆత్మయగునో, అట్లే తనకును - అనగా ఈ జీవాత్మకును- పరబ్రహ్మము ఆత్మ యగును. కనుక, ఆత్మ అనియే ఉపాసించవలెను. ఈవిధముగానే "ఉపగచ్ఛన్తి-

*బ్రహ్మ ఆత్మేతి ఆత్మేత్యేవోపాసీతేత్యర్థః। కుతః? ఏవం హ్యుపగచ్ఛన్తి పూర్వే ఉపాసితారః, "త్వం వా అహమస్మి భగవో దేవతే అహం వై త్వమసి' ఇతి। ఉపాసితు రర్థాన్తరభూతం బ్రహ్మ ఉపాసితారో ऽహమితి కథమభ్యుపగచ్ఛన్తీ త్యత్రాహ- గ్రాహయన్తి చ ఇతి । ఇమమర్థమవిరుద్ధ ముపాసితౄన్ గ్రాహయన్తి శాస్త్రాణి- తాన్ ప్రత్యుపపాదయన్తీత్యర్థః । 'య ఆత్మని తిష్ఠన్ ఆత్మనోऽన్తరః, యమాత్మా న వేద, యస్యాऽऽత్మా శరీరమ్, య ఆత్మానమన్తరో యమయతి, స త ఆత్మాऽన్తర్యామ్యమృతః' (బృ.5.7.22) ఇతి, తథా, "సన్మూలాః సోమ్యేమాః సర్వాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః। ఐతదాత్మ్యమిదం సర్వమ్'(ఛాం.5.8.4), 'సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి' (ఛాం.3.14.1) ఇతి చ*

---

ఉపాసతే" పూర్వము ఉపాసనము చేసినవారు ఉపాసనమును చేసిరి. "త్వం వా అహమస్మి భగవో దేవతే అహం వై త్వమసి" అని. –హే భగవో – దేవతే! త్వం వా అహమస్మి– అహంబుద్ధిః అహంశబ్దస్య త్వత్పర్యవసాయినౌ । అహం వై త్వమసి– అహంశబ్దపర్యవసాయభూమిః త్వమ్– నేనే నీవు. నీవే నేను అని వ్యధికరేణ – మార్చి ఉపాసించిరి.

ఇది దృష్టివిధి కానేరదు. బ్రహ్మము కానిదానిని బ్రహ్మముగా భావించి ఉపాసించుటయే దృష్టివిధి యగును. "నేను నీవు, నీవే నేను" అని మార్చి మార్చి ఉపాసించుట దృష్టివిధి కానేరదు.

సరియే! అట్లైనచో, ఈవిధముగా అనుసంధానము చేసినచో, ఉపాసితయు ఉపాస్యమును ఒకటే అని గాదా! ఉపాసితకంటెను ఉపాస్యము వేరు అని నిర్ణయించబడియున్నదిగదా! అట్లుండగా, బ్రహ్మోపాసకులు "అహం" అని ఎట్లు భావింతురు? అను శంకకు సమాధానము చెప్పబడుచున్నది –– "గ్రాహయన్తి చ" అని. ఈ అర్థము తప్పైనది కాదు అని శాస్త్రములు ఉపాసకునిగురించి ఉప–పాదించుచున్నవి.

ఆ ఉపపాదక శాస్త్రములను చెప్పుచున్నారు – "య ఆత్మని తిష్ఠన్ ఆత్మనో అన్తరః; యం ఆత్మా న వేద; యస్య ఆత్మా శరీరమ్, య ఆత్మానమన్తరో యమయతి, స తే ఆత్మా అన్తర్యామీ అమృతః" (బృ. 5. 7. 22) – ఆత్మని స్థితః, తదన్తర్గతః, తద్వేద్యః, తచ్ఛరీరస్సన్, యః అన్తః ప్రవిశ్య, ప్రవృత్తి–నివృత్తి–లక్షణం నియమనం కరోతి ఏషోऽన్తర్యామీ తే అమృతాత్మా నిరుపాధిక–అమృతశాలీ ఆత్మేత్యర్థః" (ఆత్మయందు ఉండి, దానిలోపలను ఉన్నవాడై, ఆత్మచే తెలియబడనివాడై, ఆత్మను శరీరముగా గలవాడుగా ఎవడు లోపల ప్రవేశించి 'దీనిని చేయుము, దీనిని చేయకుము' అని నియమనము చేయుచున్నాడో, అట్టి ఈ అంతర్యామి నీయొక్క అమృతమైన ఆత్మ"

"సన్మూలాః సోమ్యేమాః సర్వాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః । ఐతదాత్మ్యమిదం సర్వమ్" (ఛాం. 5. 8. 4) – మన కంటికి గురియైన, జీవునితోనున్న, ఈ జగత్తు సత్తను కారణముగను, ఆధారముగను, లయకారణముగను గలది. "ఐతదాత్మ్యమిదం సర్వమ్" పరిదృశ్యమైన సర్వజగత్తును పరమాత్మను ఆత్మగా గలది.

"సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలాన్ ఇతి 'ఛాం,3. 14. 1)–జశ్చ, లశ్చ,అనశ్చ–జలాన్। తస్య జలాన్ తజ్జలాన్। జాయత ఇతి జమ్। తస్మాత్ జాయత ఇతి తజ్జమ్। లీయత ఇతి లమ్। తస్మిన్ లీయత ఇతి తల్లమ్।

*- సర్వస్యచిదచిద్వస్తునః తజ్జత్వాత్, తల్లత్వాత్ తదనత్వాత్ తన్నియామ్యత్వాత్ తచ్ఛరీరత్వాచ్చ సర్వస్యాఽయమాత్మా। అతః స తే ఆత్మా । అతో యథా ప్రత్యగాత్మనః స్వశరీరం ప్రతి ఆత్మత్వాత్ "దేవోఽహమ్, మనుష్యోఽహమ్" ఇత్యనుసన్ధానమ్, తథా ప్రత్యగాత్మనోఽప్యాత్మత్వాత్ పరమాత్మనః తస్యాప్యహమిత్యేవానుసన్ధానమ్ యుక్తమ్" ఇతి । ఏవం శాస్త్రైరుపపాదితం సర్వబుద్ధీనాం బ్రహ్మైకనిష్ఠత్వేన సర్వశబ్దానాం బ్రహ్మైకనిష్ఠత్వ మభ్యుపగచ్ఛన్తః, 'త్వం వా అహమస్మి భగవో దేవతే అహం వై త్వమసి భగవో దేవతే' ఇతి వ్యతికరేణోక్తవన్తః। ఏవం చ, 'అథ యోఽన్యాం దేవతాముపాస్తే అన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద' (బృ.3.4.10), 'అకృత్స్నో హ్యేషః. . . .ఆత్మేత్యేవోపాసీత' (బృ.3.4.7),*

---

అనితీతి అన్। తేన అనితీతి తదన్। అతి జీవనితీత్యర్థః । అతశ్చ, తజ్జత్వ–తల్లత్వ–తదనత్వాత్ సర్వాత్మకం బ్రహ్మ।

ఈ ప్రపంచము పూర్తిగా అతడినుండియే సృష్టించబడుటచేతను, అతడిచే రక్షింపబడుట చేతను, అతనియందు లయమగుటచేతను, అతడు పరమాత్మయే. అనగా పరమాత్మను ఆత్మగా గలది.

సమస్తమైన చిద్వస్తువులును, అచిద్వస్తువులును పరమాత్మనుండియే సృష్టించబడుటచేతనును, అతడిచేతనే రక్షించబడుటచేతనును, అతడికి నియామ్యముగా యుండుటచేతనును (అతడి నియమనమునకు లోబడియుండుటచేతనును), అతడిశరీరముగా యున్నందునను అంతటికిని (అన్ని చిత్పదార్థములకును, అన్ని అచిత్పదార్థములకును) అతడు ఆత్మ. కనుక అతడు నీకు ఆత్మ.

(ఇక్కడ 'సన్మూలాః' అన్న శ్రుతికి అర్థము చెప్పి, మొదట చెప్పబడిన "య ఆత్మని తిష్ఠన్" అను అన్తర్యామిబ్రాహ్మణశ్రుతికికూడ చేరిన అర్థమును చెప్పి పూర్తి చేయుచున్నారు. అందుచే, 'సన్మూలాః' అను శ్రుతిలో 'స త ఆత్మా' అన్న వాక్యము లేదే అని శంకించవలదు)

కనుక, ప్రత్యగాత్మకు తన శరీరమును గురించి 'దేవోహమ్, మనుష్యోహమ్– నేను దేవతను, నేను మనుష్యుడను' అని ఆత్మత్వానుసంధానము ఎట్లు కుదురుచున్నదో, ఆవిధముగనే పరమాత్మ ప్రత్యగాత్మకును ఆత్మయే గనుక, అతడును (ఉపాసకుడును–జీవుడును) 'అహమ్' అని అనుసంధానము చేయుట యుక్తమే అని ఉపపాదించుచున్నారు.

భాష్యములోనున్న "యుక్తమ్" అన్నపదము తరువాత 'ఉపపాదయతి' అని చేర్చుకొనవలెను.

ఈ విధముగా శాస్త్రములలో ఉపపాదించబడిన 'సర్వబుద్ధీనాం బ్రహ్మైకనిష్ఠత్వం సర్వశబ్దానాం బ్రహ్మైకనిష్ఠత్వమ్–అన్ని బుద్ధులును, అన్ని శబ్దములును బ్రహ్మమునే చెప్పును' అని అభ్యుపగమమును చేసినవారై, "త్వం వా అహమస్మి భగవో దేవతే అహం వై త్వమసి భగవో దేవతే" అని మార్చి చెప్పిరి.

"అథ యోఽన్యాం దేవతాముపాస్తే అన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద।(బృ. 3. 4. 10)– యః పుమాన్ ధారకత్వ–నియన్తృత్వాదినా స్వస్మాత్ ఆత్మత్వేన అన్యాం దేవతాం పరమాత్మరూపాం అసౌ దేవతా అన్యః– ధారకత్వ,నియన్తృత్వాదినా ఆత్మభూతాత్ అన్యః, అహం చ ధార్యత్వనియామ్యత్వాది–ప్రయుక్తతచ్ఛరీరత్వాశ్రయాత్ అన్యః భిన్నః ఇత్యుపాస్తే, న స వేద– సః అజ్ఞః ఇత్యర్థః।–– ఏ పురుషుడు ధారకత్వనియన్తృత్వాదులచే తనకంటెను ఆత్మత్వముచేత పరమాత్మరూపుడైన దేవతను 'ఈ దేవత వేరు– ధారకత్వ,నియన్తృత్వాదులచే తనకంటెను వేరైనవాడు. నేనును, ధార్యత్వము, నియామ్యత్వము

*'సర్వం తం పరాదాత్, యోఽన్యత్రాఽఽత్మనః సర్వం వేద' (బృ.6.5.7) ఇత్యాత్మత్వాననుసన్ధాననిషేధః, 'పృథగాత్మానం ప్రేరితారం చ మత్వా'(శ్వే.1.6) ఇతి పృథక్త్వానుసన్ధాన విధానం చావిరుద్ధమ్। అహమితి స్వాత్మతయాఽనుసన్ధానాదన్యత్వానుసన్ధాననిషేధో రక్షితః। స్వశరీరాత్ స్వాత్మనోఽధికత్వానుసన్ధానవత్ స్వాత్మనో(తో)ఽపి పరమాత్మనోఽధికత్వానుసన్ధానాత్ పృథక్త్వానుసన్ధానవిధానం చ రక్షితమ్। అధికస్య బ్రహ్మణః ప్రత్యగాత్మన ఆత్మత్వాత్ తస్య చ బ్రహ్మశరీరత్వాత్ నిషేధవాక్యే, "అకృత్స్నో హ్యేషః" ఇత్యుక్తమ్। అత ఉపాసితు రాత్మత్వేన బ్రహ్మ ఉపాస్యమితి స్థితమ్॥ 3 ॥*

*॥ ఇతి ఆత్మత్వోపాసనాధికరణమ్॥ 2 ॥*

---

మొదలైనవాటితో అతడి శరీరముగా ఉన్నందున అతడికంటెను ఇతరుడను. అనగా వేరైనవాడను' అని ఉపాసనము చేయుచున్నాడో, అతడు దేనినికూడ తెలియనివాడు – అజ్ఞుడు.

అకృత్స్నో హ్యేషః ఆత్మేత్యేవ ఉపాసీత। (బృ. 3. 4. 7) అథ బ్రహ్మణ ఏవ సర్వనామరూప–విశిష్టతయా సర్వాత్మత్వాత్ ఏకైకనామరూపేణ విశిష్టః ఏషః జీవః అకృత్స్నః– అపూర్ణో భవతీత్యర్థః– –సమస్తమైన నామరూపవిశిష్టుడుగనుక పరమాత్మను అన్నింటికిని ఆత్మగా చెప్పుట సాధ్యము. ఒక్కొక్కపేరును, రూపమును– అనగా శరీరమును గల ఈ జీవుడు అకృత్స్నుడు అనగా అపూర్ణుడు. కనుక, "ఏకైకనామరూపం జీవం విహాయ సర్వనామరూపభాజం పరమాత్మానం ఉపాసీత। – ఒక్కొక్క పేరును శరీరమును గల జీవాత్మను ఉపాసించక అన్ని నామములనుగల పరమాత్మనే ఉపాసించుడు.

సర్వం తం పరాదాత్ యోఽన్యత్ర ఆత్మనః సర్వం వేద (బృ. 6. 5. 7) ఆత్మకంటెను వేరుస్థానంలో అంతటనూ చూచినచో అతడిని సర్వమును, "పరాదాత్ అభిభవేత్"– నిందించును– తిరస్కారము చేయును అన్న శ్రుతులు, ఆత్మత్వేన అనుసంధానము చేయకుండుటను నిషేధించియుండుటయు, "పృథగాత్మానం ప్రేరితారం చ మత్వా" అని పృథక్త్వానుసంధానమును విరోధమున్నది కాదు. "అహమితి" –తనయొక్క ఆత్మగా అనుసంధానము చేయుటచే వేరైనదిగా అనుసంధానము చేయకూడదు అను నిషేధము సంరక్షింపబడినది. "తన శరీరముకంటెను తన ఆత్మ వేరైనది; రెండును ఒకటి కాదు" అను అనుసంధానమువలె "తనకంటెను పరమాత్మ అధికుడు, వేరైనవాడు" అను అనుసంధానముచేత పృథక్త్వానుసంధానము సంరక్షింపబడుచున్నది. అధికుడైన బ్రహ్మము ప్రత్యగాత్మకు– జీవునికి– ఆత్మగనుక, జీవుడు బ్రహ్మమునకు శరీరముగనుక నిషేధవాక్యములో "అకృత్స్నో హ్యేషః ఇత్యుక్తమ్" కనుక ఉపాసకుని ఆత్మత్వేన బ్రహ్మము ఉపాస్యము– అని చెప్పబడినది. శరీరాత్మభావమును చెప్పుచున్న సామానాధి–కరణ్యమునకు అప్రామాణికత్వమును అనుపపన్నత్వమును లేదు గనుక, మోక్షమును ఫలముగా చెప్పియుండుటచేతను దృష్టవిధికానేరదు అని చెప్పబడినది.

**ప్రశ్న–సమాధానములు – ప్రశ్న**– అంశాధికరణములో జీవేశ్వరులకు శరీరశరీరిభావము చెప్పబడియున్నది. శరీరవాచిశబ్దములకు శరీరిపర్యన్తము అర్థమును చెప్పవలెను అని నిర్ణయించబడినది. అందుచేత–యథావత్తుగా ఉపాసనము చెయ్యవలెనన్నచో ఆత్మత్వేనైవ ఉపాసనము చెయ్యవలెను. ఇది ఇట్లుండగా, అన్యత్వేన వా ఆత్మత్వేన వా ఎట్లు ఉపాసనము చేయుట? అను సంశయమెట్లు కలుగును?

సమాధానము– అహమర్థసమానాధికరణస్థలములోగాని, వైయధికరణస్థలములోగాని

## ప్రతీకాధికరణమ్ (4-1-3)

### ॥సి. సూ ॥ న ప్రతీకే న హి సః ॥ 4-1-4

'మనో బ్రహ్మేత్యుపాసీత' (ఛాం.3.18.1), 'స యో నామబ్రహ్మేత్యుపాస్తే'(ఛాం.7.1.5) ఇత్యాది ప్రతీకోపాసనేష్వప్యాత్మత్వానుసంధానం కార్యం, ఉత నేతి చిన్తాయాం, 'మనో బ్రహ్మేత్యుపాసీత'

---

బ్రహ్మోపాసనము విధించబడియున్నది. శాండిల్యవిద్యలో "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను సమానాధికరణ ఉపాసనములలోనును, "ఏష తే ఆత్మా" అను వైయధికరణ ఉపాసనములలోను, ఈ విచారము అర్థరహితమే! సామానాధికరణ్యస్థలములో ఎచ్చట దృష్టివిధిత్వశంక కలుగుచున్నదో, "యే అన్నం బ్రహ్మోపాసతే విజ్ఞానం బ్రహ్మ చేద్వేద" ఇత్యాది స్థలములలో జీవునియందు బ్రహ్మదృష్టి కనబడుటచేతను, "ఆత్మేత్యేవ" అను వాక్యములో ఇతికరణము కనబడుటచేతనున్ను, ఈ స్థలములలో దృష్టివిధిత్వశంకను తొలగించుటకు ఈ అధికరణము ఆరంభించవలసివచ్చినది.

ఆత్మత్వోపాసనాధికరణము ముగిసినది.

## ప్రతీకాధికరణము (4-1-3)

### ॥ సి. సూ ॥ న ప్రతీకే న హి సః ॥ 4-1-4 ॥

**సూత్రార్థము:-** **ప్రతీకే** = ప్రతీకోపాసనములో, **న**= (ఆత్మత్వానుసంధానము) చేయదగినది కాదు. **హి**= ఏలననగా, **సః**= ఆ ప్రతీకము, **న**= (ఉపాసకుని ఆత్మ) కాదు. (ప్రతీకములనగా, బ్రహ్మయొక్క అవయవమైన మనస్సు మొదలైనవి)

**సంగతి:-** వెనుకటి అధికరణములో పరబ్రహ్మవిద్యలో ఉపాస్యమైనదానికి పరబ్రహ్మో- పాసకుని గురించి ఆత్మ గనుక ఉపాసనము చేయుచున్నవానిచే స్వాత్మత్వేనైవ- తన ఆత్మ అనియే పరబ్రహ్మము ఉపాసించబడవలెనని చెప్పబడినది. ఈవిధముగా మనస్సు మొదలైన ప్రతీకోపాసనలలో కూడా ఆత్మత్వేన ఉపాసనం చెయ్యవలెనా? కాదా? అనే సందేహాన్ని తీర్చటానికి ఈ అధికరణం ఆరంభించబడుతున్నది.

**విషయం:-** "మనో బ్రహ్మేత్యుపాసీత" (ఛాం. 3. 18. 1), "స యో నామ బ్రహ్మేత్యుపాస్తే" (ఛాం. 7. 1. 5) ఇత్యాది ప్రతీకోపాసనవిషయములు.

**సంశయం:-** ప్రతీకోపాసనలలో ఆత్మత్వానుసంధానం చేయవలెనా లేక అక్కరలేదా?

**సంశయం రావటానికి కారణం:-** బ్రహ్మమునకు ప్రతీకమనేది దృష్టివిశేషణమా? ప్రతీకానికి బ్రహ్మము దృష్టివిశేషణమా? బ్రహ్మముపై మనస్సు మొదలైనవిగా దృష్టి పెట్టితే, బ్రహ్మాన్ని మనస్సు మొదలైనవిగా భావించి ఉపాసిస్తే స్వతంత్రంగా బ్రహ్మాన్ని ఉపాసించినట్లు అవుతుంది. ఇది బ్రహ్మోపాసనము గనుక, పూర్వాధికరణన్యాయేన ఆత్మత్వేన ఉపాసనం చెయ్యవలెను. ఇప్పుడు బ్రహ్మానికి ప్రతీకం దృష్టివిశేషణం మనస్సు మొదలైనవాటిలో బ్రహ్మదృష్టిపెట్టినట్లైతే మనస్సు మొదలైనవాటిని బ్రహ్మముగాభావించి ఉపాసిస్తే మనస్సు మొదలైనవాటినే ఉపాసించటం అవుతుంది. ఇది ప్రతీకోపాసనం.

*ఇతి బ్రహ్మోపాసనత్వసామ్యాత్ బ్రహ్మణశ్చోపాసితురాత్మత్వాదాత్మేత్యేవోపాసీతేత్యేవం ప్రాప్తేఽభిధీయతే - న ప్రతీకే ఇతి। ప్రతీకే న ఆత్మత్వానుసన్ధానం కార్యం। న హి సః-- న హ్యుపాసితురాత్మా ప్రతీకః। ప్రతీకోపాసనేషు ప్రతీక ఏవ ఉపాస్యః; న బ్రహ్మ। బ్రహ్మ తు తత్ర దృష్టివిశేషణమాత్రమ్। ప్రతీకోపాసనం హి నామ అబ్రహ్మణి బ్రహ్మదృష్ట్యా అనుసంధానమ్; తత్రోపాస్యస్య ప్రతీకస్యోపాసితురాత్మత్వాభావాన్న తథాఽనుసన్ధేయమ్ ॥ 4 ॥*

*నను- అత్రాపి బ్రహ్మైవోపాస్యమ్; బ్రహ్మణ ఉపాస్యత్వసంభవే మన ఆదీనామచేతనానా మల్ప-శక్తీనాం చ ఉపాస్యత్వాశ్రయణస్యాన్యాయ్యత్వాత్। అతో మన ఆదిదృష్ట్యా బ్రహ్మైవోపాస్యమితి; అత ఆహ-*

---

ప్రతీకం ఉపాసకుడికి ఆత్మకాదు. కనుక, పూర్వాధికరణన్యాయం ఇక్కడ ప్రవర్తించదు. ఇప్పుడు ప్రతీకానికి బ్రహ్మము దృష్టివిశేషణం. వీటిలో ఏ పక్షం యుక్తియుక్తము అని సందేహం వచ్చింది.

**పూర్వపక్షం**:– "మనో బ్రహ్మేత్యుపాసీత" అన్న ప్రతీకోపాసనంలోకూడా బ్రహ్మశబ్దం ఉన్నది గనుక ఈ ఉపాసనంకూడా బ్రహ్మోపాసనానికి తుల్యమౌతోంది. బ్రహ్మం ఉపాసకుడి ఆత్మ గనుక, ప్రతీకోపాసనంలోకూడా ఆత్మత్వేన ఉపాసనమే చెయ్యవలెను.

**సిద్ధాంతం**:– "న ప్రతీకే" ప్రతీకోపాసనంలో ఆత్మత్వేన అనుసంధానం చేయవలసిన అవసరం లేదు. "న హి సః" ప్రతీకమనేది ఉపాసకుడి ఆత్మకాదు. కనుక, ప్రతీకోపాసనములలో ఆత్మత్వానుసంధానం చెయ్యనక్కరలేదు.

ప్రతీకోపాసనములలోకూడ ఉపాస్యము బ్రహ్మమే. అది ఉపాసకుడికి ఆత్మగనుక, బ్రహ్మోపాసనత్వసామ్యం ఉన్నందున ఇక్కడకూడా ఆత్మత్వేన ఉపాసనం చెప్పబడింది అన్నట్లైతే, దానికి సమాధానం చెప్పబడుతున్నది –

ప్రతీకోపాసనంలో ప్రతీకమే ఉపాస్యం. బ్రహ్మము ఉపాస్యం కాదు. అక్కడ బ్రహ్మము దృష్టివిశేషణమాత్రమే. ప్రతీకోపాసనం అంటే బ్రహ్మం కానిదానిని బ్రహ్మంగా భావించి ఉపాసించటమే అవుతుంది. అక్కడ ఉపాసించబడేది మనస్సు, నామము మొదలైనవే. అవి ఉపాసకుడికి ఆత్మకావు. కనుక ఆత్మత్వేన ఉపాసనము చేయతగదు.

**ప్రతీకే – అబ్రహ్మణి మన ఆత్మా** – బ్రహ్మంకాని మనస్సు నామములలో ఆత్మత్వేన ఉపాసనము, **న కార్యమ్**– చెయ్యవద్దు. **హి** ఎందుకనగా, **సః**– మనస్సు మొదలైన ప్రతీకములు **న** – ఉపాసకునియొక్క ఆత్మ కాదుగదా!

ప్రతీకోపాసనంలోకూడా బ్రహ్మమే ఉపాస్యం. అల్పశక్తిగల మనస్సు మొదలైనవాటికి బ్రహ్మదృష్ట్యా ఉపాస్యత్వం చెప్పటం సరికాదు. కనుక మనస్సు మొదలైన వాటిదృష్ట్యా బ్రహ్మమే ఉపాస్యము అన్న ఆక్షేపానికి సమాధానం తరువాతి సూత్రంలో ప్రసాదిస్తున్నారు.

*॥ సి. సూ ॥ బ్రహ్మదృష్టిరుత్కర్షాత్ ॥ 4-1-5 ॥*

*మన ఆదిషు బ్రహ్మదృష్టిరేవ యుక్తా । న బ్రహ్మణి మన ఆదిదృష్టిః; బ్రహ్మణో మన ఆదిభ్య ఉత్కర్షాత్; తేషాం చ విపర్యయాత్ । ఉత్కృష్టే హి రాజని భృత్యదృష్టిః ప్రత్యవాయకరీ; భృత్యే తు రాజదృష్టి రభ్యుదయాయ॥ 5 ॥*

*ఇతి ప్రతీకాధికరణమ్ ॥ 3 ॥*

## *ఆదిత్యాదిమత్యధికరణమ్ (4-1-4)*

*॥ సి. సూ ॥ ఆదిత్యాదిమతయశ్చాఙ్గ ఉపపత్తేః 4-1-6 ॥*

*'య ఏవాసౌ తపతి తముద్గీథముపాసీత' (ఛాం.1-3-1) ఇత్యాదిషు కర్మాఙ్గాశ్రయేషు ఉపాసనేషు*

---

**॥ సి. సూ ॥ బ్రహ్మదృష్టిరుత్కర్షాత్ ॥ 4-1-5 ॥**

సూత్రార్థము:- **బ్రహ్మదృష్టిః** = మనస్సు మొదలైనవాటిలో బ్రహ్మదృష్టియే (తగినది) (బ్రహ్మమందు మనస్సు మొదలైన దృష్టి పెట్టుట(కలిగియుండుట) తగదు), **ఉత్కర్షాత్** = బ్రహ్మము, మనస్సు మొదలైనవాటికంటె గొప్పది గనుక.

మనస్సు మొదలైనవాటిలో బ్రహ్మదృష్టిని కలిగియుండుటయే యుక్తము. బ్రహ్మమునందు మనస్సు మొదలైనవాటిదృష్టిని పెట్టుట సరి కాదు. మనస్సు మొదలైనవాటికంటెను బ్రహ్మము ఉత్కృష్ట మైనది. మనస్సు మొదలైనవి అల్పమైనవి నికృష్టములు. కనుక అల్పములైనవాటిని ఉత్కృష్టమైనవాటినిగా భావించి ఉపాసన చేయుటయే యుక్తము. అంతే తప్ప ఉత్కృష్టమైన బ్రహ్మమునందు అల్పములు నికృష్టములు అయిన మనస్సు మొదలైనవాటిని భావించి ఉపాసించుట తగదు. దీనికొక ఉదాహరణమును చెప్పి స్పష్టతను కలిగించుచున్నారు - అధికుడైన రాజును అల్పుడైన రాజభటుని యందో లేక రాజకార్యనిర్వాహకపరిచారకులయందో భావించుట యుచితముగాని, అధికుడైన రాజుయందు అల్పుడైన రాజపరిచారకుని భావించుట తగదుగదా!

ప్రతీకాధికరణము ముగిసినది.

## ఆదిత్యాదిమత్యధికరణము (4-1-4)

**॥ సి. సూ ॥ ఆదిత్యాదిమతయశ్చాఙ్గ ఉపపత్తేః ॥ 4-1-6 ॥**

సూత్రార్థము:- **అఙ్గే** = యాగాంగములైన ఉద్గీథాదులలో **ఆదిత్యాదిమతయః చ** = ఆదిత్యుడు మొదలైన దృష్టి పెట్టబడవలెను. (ఎందులకనగా,) **ఉపపత్తేః** = (ఆదిత్యుడు మొదలైనవారికే ఉద్గీథము మొదలైనవాటికన్న ఆధిక్యత) కుదురును గనుక.

సంగతి:- వెనుకటి అధికరణములో దేవత అనునది ఆధిక్యతతో ఉత్కృష్టమైనది అని నిర్ణయించి నికృష్టములైన, మనస్సు మొదలైన వాటిలో ఉత్కృష్టమైన దేవతాబుద్ధిని పెట్టవలెను అని చెప్పబడినది. దానిని ఆక్షేపించి ఈ అధికరణము ఆరంభించబడుచున్నది.

విషయము:- "య ఏవాసౌ తపతి తం ఉద్గీథం ఉపాసీత"(ఛాం. 1-3-1)అను ఉపనిషద్వాక్యము.

*సంశయః- కిముద్గీథాదౌ కర్మాఙ్గే ఆదిత్యాదిదృష్టిః కర్తవ్యా, ఉత ఆదిత్యాదిషూద్గీథాదిదృష్టిః?- ఇతి। ఉత్కృష్టదృష్టిర్నికృష్టే కర్తవ్యేతి న్యాయాత్, ఉద్గీథాదీనాం చ ఫలసాధనభూతకర్మాఙ్గత్వేనాఫలేభ్య ఆదిత్యాదిభ్యః ఉత్కృష్టత్వాదిత్యాదిషూద్గీథాదిదృష్టిః ఇతి ప్రాప్తేఽభిధీయతే- ఆదిత్యాదిమతయశ్చాఙ్గే*

**సంశయము**:– కర్మాంగమైన ఉద్గీథములలో ఆదిత్యాదిదృష్టిని పెట్ట(కలిగించుకొన)వలెనా? లేక ఆదిత్యాదులలో ఉద్గీథదృష్టిని పెట్టవలెనా?

**సంశయము వచ్చుటకు కారణము**. పూర్వమీమాంసలో దేవతాధికరణమందు కర్మయే ప్రధానమని నిర్ణయించబడినది. శారీరకశాస్త్రమందు ఫలాధికరణములో కర్మలచే ఆరాధింపబడు భగవానుడు ఫలమును ప్రసాదించును గనుక, కర్మము ప్రధానము కాదు అని నిర్ధారించబడినది. అందుచే ఇచ్చట ఉద్గీథము గొప్పదా? ఆదిత్యాదులు గొప్పవారా? అను సందేహము వచ్చినది. అనగా – ఇచ్చట కర్మకు అంగముగా ఉపాసనమును చేయుటచే పూర్వమీమాంసాన్యాయమును అనుసరించ వలెనా? ఉపాసనమును చేయుటచే శారీరకశాస్త్రసిద్ధాంతము ప్రకారము ఆదిత్యుని ఉన్నతుడు, అధికుడు అని చెప్పవలెనా? ఆ తరువాత, ఆదిత్యునియందు ఉద్గీథాది దృష్టియా? ఉద్గీథమందు ఆదిత్యాది దృష్టియా? అని సందేహము కలుగుచున్నది.

**పూర్వపక్షము**:– నికృష్టునియందు ఉత్కృష్టదృష్టి పెట్టవలెను అను న్యాయముచే, ఆదిత్యునియందే ఉద్గీథాదిదృష్టిని పెట్టవలెను. ఫలసాధనభూతకర్మకు ఉద్గీథమనునది అంగముగనుక, అఫలమైన "న విద్యతే ఫలం ఏషాం తే ఇత్యేవం బహువ్రీహిణా అఫలతశబ్దః అఫలతసాధనవదతః ఇతి భావః॥ ఫలసాధనముకాని ఆదిత్యునికంటెను ఉద్గీథము గొప్పది. ఉత్కృష్టమైనది – అనగా "యదేవ విద్యయా కరోతి అని ఉద్గీథవిద్యకే ఫలసాధనత్వమును శ్రుతి చెప్పుచున్నది. కనుక ప్రధానఫలసాధనమైన ఉద్గీథా–ద్యపేక్షయా అప్రధానఫలసాధనమై ఉపాసనాన్వితమైన ఆదిత్యునికంటెను ఉద్గీథము ఉత్కృష్టమైనది.

అట్లైనచో, ఉద్గీథాదులు కర్మఅంగమై ఫలసాధనమైనట్లే ఆదిత్యాది దేవతలును కర్మశేషమై ఫలసాధనములగుచున్నవి. ఇట్లుండగా, పూర్వపక్షము ఎట్లు సిద్ధించును? అని పూర్వపక్షముపై ఆక్షేపము వచ్చుచున్నది. దానికి సమాధానము–

పూర్వపక్షియొక్క అభిప్రాయము ఏమనగా "మనో బ్రహ్మేత్యుపాసీత" అన్నప్పుడు మనస్సులో బ్రహ్మదృష్టిపెట్టవలెను అని చెప్పబడినది. అచ్చట ఉపాస్యమును మొదటను, దృష్టివిశేషణమును చివరను చెప్పబడియున్నది. అదేవిధముగా 'య ఏవాసౌ తపతి తం ఉద్గీథం ఉపాసీత' అన్నపుడుకూడ ఉద్గీథమును చివరగా చెప్పినందున ఉద్గీథము బ్రహ్మమువలె ఉన్నతమైనదిగా తీసుకొని దృష్టివిశేషణమగుచున్నది.

అంతేకాక, 'య ఏవాసౌ తపతి తం ఉద్గీథం ఉపాసీత– ఏ ఆదిత్యుడు ప్రకాశించుచున్నాడో, అతడిని ఉద్గీథముగా ఉపాసించుము" అని దేవతయందు "యద్వృద్ధయోగమ్" ఉన్నను, ఆదిత్యునియందు ఉద్గీథదృష్టి పెట్టవలెను అని వచ్చుచున్నది.

మొదట పూర్వపక్షి చెప్పిన పక్షములో అస్వారస్యము ఉన్నందుననే శ్రుతప్రకాశికాచార్యులవారు ఈ పక్షమును ప్రసాదించియున్నారు.

*ఇతి । చశబ్దోఽవధారణే। క్రత్వఙ్గే ఉద్గీథాదావాదిత్యాదిదృష్టయ ఏవ కార్యాః। కుతః; ఉపపత్తేః - ఆదిత్యాదీనామేవోత్కృష్టత్వోపపత్తేః; ఆదిత్యాదిదేవతారాధనద్వారేణ హి కర్మణామపి ఫలసాధనత్వమ్। అతస్తద్దృష్టిరుద్గీథాద్యఙ్గే ॥ 6 ॥*

*ఇతి ఆదిత్యాదిమత్యధికరణమ్ ॥ 4 ॥*

## *ఆసీనాధికరణమ్ (4-1-5)*

### *॥ సి. సూ ॥ ఆసీనః సంభవాత్ ॥ 4-1-7 ॥*

మోక్షసాధనతయా వేదాన్తశాస్త్రైర్విహితం జ్ఞానం ధ్యానోపాసనాదిశబ్దవాచ్యమసకృదావృత్తం

**సిద్ధాంతము:–** ఆదిత్యాదిమత్యః చ అంగ ఉపపత్తేః । 'చ'శబ్దము ఏవకారార్థమును చెప్పుచున్నది. క్రత్వంగమైన ఉద్గీథమందు ఆదిత్యాదిదృష్టియే పెట్టవలెను. ఎందులకనగా, ఉపపత్తేః – ఆదిత్యాదులకు ఉత్కృష్టత్వము ఉపపత్తిమత్తగుచున్నది. ఆదిత్యాది దేవతాద్వారకముగా కదా కర్మలు ఫలసాధనము లగుచున్నవి! అనగా, యాగాదికర్మలచే పూజించబడిన దేవతలు ప్రీతిచెందినవారై ఫలమును ఇచ్చుచున్నారు. కనుక, ఉత్కృష్టులైన దేవతలదృష్టియే ఉద్గీథాదులలో పెట్టవలెను.

**ప్రశ్న – సమాధానము.** ఫలసాధనత్వము దేవతకుగదా యున్నది. "స ఏవ ఏవం భూతిం గమయతి" అని ఫలాధికరణములో నిర్ణయించబడియున్నది. అట్లుండగా, ఉద్గీథమునకు ఫలసాధనత్వముము చెప్పి పూర్వపక్షము చేయుట ఎట్లు కుదురును? అను ప్రశ్న వచ్చుచున్నది.

దానికి సమాధానము చెప్పుచున్నాము – ఫలాధికరణములో దేవతకే ఫలసాధనత్వము చెప్పబడుట సత్యమే. పూర్వమీమాంసలో ఫలసాధనముగా చెప్పబడిన కర్మకు దేవతాప్రీతి అనునది కట్టెకు జ్వాల వలె అవాంతరవ్యాపారమాత్రమగుటచే దేవత అప్రధానమైనది అని పూర్వపక్షియొక్క అభిప్రాయము.

**సూచన:–** కర్మకాణ్డలో దేవతాధికరణములో కర్మకు ప్రాధాన్యము స్థాపించబడినది. ఫలాధికరణములో బ్రహ్మమునకు ప్రాధాన్యము నిర్ణయించబడినది. కనుక కర్మాంగమైన ఉద్గీథములో వివాదము. "బ్రహ్మదృష్టి వలె ఆదిత్యాదిదృష్టియు పెట్టవలెను" అనునది సూత్రమందున్న 'చ'కారమునకు అభిప్రాయము. "బ్రహ్మమతివత్ ఆదిత్యాదిమతయోపీతి చశబ్దార్థః" అని శ్రుతప్రకాశికలో ఉన్నది.

ఆదిత్యాదిమత్యధికరణము ముగిసినది.

## *ఆసీనాధికరణము (4–1–5)*

### *॥ సి. సూ ॥ ఆసీనః సంభవాత్ ॥ 4–1–7 ॥*

**సూత్రార్థము:–** **ఆసీనః** = (మృదువైన ఆసనముపై) కూర్చొని (ఉపాసనము చేయవలెను) ఎందులకనగా, **సమ్భవాత్** = (కూర్చొని ధ్యానము చేసిననే ఏకాగ్రత) కలుగును గనుక.

**సంగతి:–** ఆవృత్త్యధికరణములో "అసకృదావృత్తమైన భగవదుపాసనమే మోక్షసాధనము" అని నిర్ణయించబడినది. ఉపాసనానుష్ఠానములో ఆసననియమమును ఈ అధికరణములో ప్రసాదించు చున్నారు.

*సన్తతస్మృతిరూపమిత్యుక్తమ్। తదనుతిష్ఠన్ ఆసీనః శయానః తిష్ఠన్ గచ్ఛంశ్చ విశేషాభావా-దనియమేనానుతిష్ఠేత్ ఇతి ప్రాప్తే ఉచ్యతే - ఆసీనః ఇతి । ఆసీన ఉపాసనమనుతిష్ఠేత్ । కుతః? సంభవాత్ - ఆసీనస్యైవ హ్యేకాగ్రచిత్తతాసంభవః; స్థితిగత్యోః ప్రయత్నసాపేక్షత్వాత్, శయనే చ నిద్రాసంభవాత్ । పశ్చార్ధధారణప్రయత్ననివృత్తయే సాపాశ్రయే ఆసీనః కుర్యాత్ ॥ 7 ॥*

ఆవృత్త్యధికరణమునకు తరువాత ఆత్మత్వోపాసనాధికరణము, ప్రతీకాధికరణము, ఆదిత్యాది-మత్యధికరణము అనునవి ప్రసంగాత్ వచ్చినవియే. కనుక ఈ అధికరణమునకు ఆవృత్త్యధికరణముతోడనే సాక్షాత్తుగా సంగతి.

**విషయము**:- ఆసనమును గురించినది.

**సంశయము**:- ఉపాసనమును కూర్చొని చేయవలెనా లేక కూర్చొనిగాని, నిలచిగాని, పండుకొనిగాని ఏ నియమము లేకనే చేయవచ్చునా? దీనికి ఏదైన నియమము ఉన్నదా? లేదా?

**సంశయము కలుగుటకు కారణము**:- పూర్వమీమాంసలో అఙ్గావబద్ధోపాసనమును ఋత్విక్కులు వారి కార్యమును నిలచికూడ చేసి కార్యమును పూర్తిచేయుటను చూచుచున్నాము. సంధ్యోపాసనమును శాస్త్ర మందు చెప్పినప్రకారము ప్రాతఃకాలమున నిలిచియు, సాయంకాలమున కూర్చొనియు, మాధ్యాహ్నికములో సౌకర్యానుసారము నిలుచొనిగాని కూర్చొనిగాని చేయబడుచున్నది. కనుక, వారివారి ఇష్టప్రకారము చేయవచ్చునా? "ఉపవిశ్య ఆసనే" అన్న గీతావచనప్రకారము కూర్చొనియే చెయ్యవలెను అను నియమము ఉన్నదా? ఈ పక్షములలో ఏది యుక్తియుక్తమయినది? అని తెలియనందున సందేహము కలుగుచున్నది.

పూర్వపక్షము:- కూర్చొనే ఉపాసనం చెయ్యాలని శ్రుతుల్లో చెప్పబడలేదు. అందుచేత వారివారి ఇష్టప్రకారము కూర్చొనిగాని, నిలుచొనిగాని నడుస్తూగాని పడుక్కొనిగాని ఉపాసనాన్ని చెయ్యవచ్చు. "స ఖల్వేవం" అన్న శ్రుతి, "తద్రూపప్రత్యయే" అన్న స్మృతిన్నీ ఉపాసనని చివరదాకా విచ్ఛేదంలేకుండా చెయ్యవలెను అని చెప్పినవే తప్ప కూర్చొనే ఉపాసనం చెయ్యాలని చెప్పలేదు. "శుచౌ దేశే.... ఉపవిశ్య ఆసనే అన్న గీతాస్మృతి "కూర్చొనే చెయ్యవలెను" అని నియమం చెప్పిందని భావించవద్దు. "ఆసననియమం లేదు" అనే నాచేత చెప్పబడినది, కూర్చొని ఉపాసనం చెయ్యకూడదు అని నేను చెప్పలేదు. కూర్చొని ఉపాసనం చేసినప్పుడు "చేలాజినకుశోత్తరమ్" అన్న నియమంతో చెయ్యవలెను అని చెప్పలేదు కనుక వారివారి ఇష్టప్రకారము ఉపాసనము చెయ్యవచ్చును.

**సిద్ధాంతం:** -ఆసీనః ఇతి - కూర్చొని ఉపాసనము చెయ్యవలెను. ఎందుచేతనంటే, సమ్భవాత్- కూర్చొని ఉపాసనం చేస్తున్నవానికే ఏకాగ్రచిత్తత కలుగుతుంది. కనుక నిలుచొనిగాని, నడుస్తూనో ప్రయత్నసాపేక్షమైయుండే శరీరధారణార్థం చెయ్యబడే ఆ ప్రయత్నంచేత ఉపాసనకి తప్పకుండా కావలసిన ఏకాగ్రచిత్తత అన్న విశేషణాంశం నశించి ఉపాసనం నష్టమౌతుంది. పడుక్కొని ఉపాసనం చేస్తే నిద్ర వస్తుంది. అందుచేత విశేష్యాంశమైన ఉపాసనమే నశించిపోతుంది. "కూర్చొని చేసేదైనా పశ్చార్ధధారణకి ప్రయత్నం కావలసివచ్చిందే" అంటే, నిజమే, వీపుకి ఆశ్రయాన్ని వెతుకొనవలసిన అవసరం లేకుండా, చేలాజినకుశోత్తరమ్ అని గీతలో చెప్పబడినట్లుగా ఒక మృదువైన ఆసనం స్థిరపరుచుకొని దానిమీద కూర్చొని ఉపాసనం చెయ్యవలెను.

**॥ సి. సూ ॥ ధ్యానాచ్చ ॥ 4-1-8 ॥**

*"నిదిధ్యాసితవ్యః' (బృ.6-5-6) ఇతి ధ్యానరూపత్వాతుపాసనస్య, ఏకాగ్రచిత్తతా అవశ్యం-భావినీ । ధ్యానం హి విజాతీయచప్రత్యయాన్తరావ్యవహితమేకచిన్తనమిత్యుక్తమ్॥ 8 ॥*

**॥ సి. సూ ॥ అచలత్వం చాపేక్ష్య॥ 4-1-9 ॥**

*నిశ్చలత్వం చా(హ్యా)పేక్ష్య పృథివ్యన్తరిక్షాదిషు ధ్యానవాచోయుక్తిర్దృశ్యతే, "ధ్యాయతీవ పృథివీ, ధ్యాయతీవాన్తరిక్షమ్, ధ్యాయతీవ ద్యౌః, ధ్యాయన్తీవాపః, ధ్యాయన్తీవ పర్వతాః" (ఛాం.7-6- 1) ఇతి। అతః పృథివీపర్వతాదివత్ ఏకాగ్రచిత్తతయా నిశ్చలత్వముపాసకస్యాసీనస్యైవ సంభవేత్॥9॥*

---

**॥ సి. సూ ॥ ధ్యానాచ్చ ॥ 4-1-8 ॥**

**సూత్రార్థము:- ధ్యానాత్ చ** = (ఉపాసనము) ధ్యానరూపముగా ఉన్నందునను (దానికి ఏకాగ్రత కావలెను)

"నిదిధ్యాసితవ్యః"(బృ. 6-5-6) అని మోక్షసాధనముగా విధించబడిన ఉపాసనమునకు ధ్యానరూపత్వము చెప్పబడినందున ఏకాగ్రచిత్తత ఆవశ్యకమైయున్నది గనుక, ఆసీనుడైయే ఉపాసనము చేయవలెను. వేరుఆలోచన మధ్యన తోచకుండ విచ్ఛేదములేని సజాతీయప్రత్యయము -- ధ్యానమని ఇదివరలోనే చెప్పబడినది.

విజాతీయప్రత్యయాన్తరావ్యవహితసజాతీయ ప్రత్యయరూపమైన ఆన్తరవ్యాపారమందు మాత్రము ధ్యానశబ్దము ప్రయోగించబడినది అని ఎక్కడను లేదు. కదలకుండ, ఊగకుండ, బాహ్యమైన వేరొకవ్యాపారము చేయకుండ ఉండుటతో ధ్యానశబ్దము ప్రయోగించబడియున్నది అని ప్రసాదించు చున్నారు. 8

**॥ సి. సూ ॥ అచలత్వంచాపేక్ష్య ॥ 4-1-9 ॥**

**సూత్రార్థము:- అచలత్వం చ అపేక్ష్య** = చలనం లేకపోవుట అనెడి మనస్సునకు ఏకాగ్రతతో (భూమి మొదలగువాటియొక్క అచలత్వముతో ధ్యానశబ్దార్థమును వివరించుటకు ఉపయోగపడు చున్నది.

నిశ్చలత్వరూపమైన సాదృశ్యత్వముతో పృథ్వి, అంతరిక్షము మొదలగువాటిని చెప్పుటకు ధ్యానశబ్దప్రయోగము చేయబడుట చూచుచున్నాము. "ధ్యాయతీవ పృథివీ, ధ్యాయతీవాన్తరిక్షమ్, ధ్యాయతీవ ద్యౌః, ధ్యాయన్తీవ ఆపః, ధ్యాయన్తీవ పర్వతాః"(ఛాం. 7-6-1) ఇత్యాది ప్రయోగములు శ్రుతులలో చూచుచున్నాముగదా! కనుక ధ్యానము చేయుచున్నవానికి నిశ్చలత్వము తప్పక- అవశ్యముగా కావలసినది. కూర్చొని ఉపాసనము చేసినవానికే కదలకుండ ఉండుట సాధ్యము గనుక, కూర్చొనియే ఉపాసనము చేయవలెను. 9

**॥ సి. సూ ॥ స్మరన్తి చ ॥ 4-1-10 ॥**

స్మరన్తి చాసీనస్యైవ ధ్యానమ్, "శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాత్మనః। నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజినకుశోత్తరమ్॥ తత్రైకాగ్రమ్మనః కృత్వా యతచిత్తేన్ద్రియక్రియః। ఉపవిశ్యాఽఽసనే యుఞ్జ్యాత్ యోగమాత్మవిశుద్ధయే"(గీ.6.11,12) ఇతి ॥ 10 ॥

**॥ సి. సూ ॥ యత్రైకాగ్రతా తత్రావిశేషాత్ ॥ 4-1-11 ॥**

ఏకాగ్రతాతిరిక్తదేశకాలవిశేషాశ్రవణాత్ ఏకాగ్రతానుకూలో యో దేశః కాలశ్చ స ఏవోపాసనస్య దేశః కాలశ్చ। "సమే శుచౌ దేశే శర్కరావహ్నివాలుకావివర్జితే" (శ్వే.2-10) ఇతి వచనమేకాగ్రతైకాన్తదేశ

---

**॥ సి. సూ ॥ స్మరన్తి చ 4-1-10 ॥**

సూత్రార్థము:- **స్మరన్తి చ** = (ఈ విషయము గీత అను)స్మృతిలోకూడ చెప్పబడియున్నది.

"శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః। నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజిన కుశోత్తరమ్॥ తత్రైకాగ్రం మనఃకృత్వా యతచిత్తేన్ద్రియక్రియః। ఉపవిశ్యాసనే యుఞ్జ్యాత్ యోగమాత్మవిశుద్ధయే॥" (భ.గీ.6-11,12)- "కూర్చొనియే ఉపాసనము చేయవలె"నని స్మృతికూడ చెప్పుచున్నది. శుద్ధమైన ప్రదేశములో స్థిరమును, ఎక్కువ ఎత్తుగాని బాగుగా క్రిందుగా గాని కాకుండ ఉన్న ఆసనమునువేసికొని అందు దర్భలను పరచి, దానిమీదను అజినమును (జింకచర్మము లేదా పులిచర్మమును) పరచవలెను. ఆపైన మెత్తని వస్త్రమును వేసి, మనఃప్రసాదకరమై, సాపాశ్రయముగానున్న ఆ ఆసనమందు కూర్చొని ఏకాగ్రచిత్తుడై ఇంద్రియనియమములతో "ఆత్మవిశుద్ధయే" బంధనివృత్తికొఱకు "యుఞ్జ్యాత్- ఆత్మావలోకనం కుర్వీత- పరమాత్మావలోకనమును చేయవలెను. 10

**॥ సి. సూ ॥ యత్రైకాగ్రతా తత్రావిశేషాత్ ॥ 4-1-11 ॥**

సూత్రార్థము:- **యత్ర** = ఎచ్చట **ఏకాగ్రతా** = మనస్సునకు ఏకాగ్రత కలుగునో, **తత్ర** = అచ్చట (ఆసమయమందు ఉపాసన చేయవలెను) **అవిశేషాత్** = (దేశకాలములను) విశేషించి చెప్పనందున.

ఏకాగ్రచిత్తతకు కావలసినదితప్ప, అనుకూలమైయున్నది తప్ప, అతిరిక్తమైన దేశమో, కాలమో వీటిని విశేషించి విధించు వచనము లేదుగనుక, ఏకాగ్రచిత్తతకు అనుకూలమైనది ఏ ప్రదేశమో, ఏ సమయమో, ఆ దేశమును, ఆ కాలమును మాత్రమే ఉపాసనమునకు ప్రియమైన దేశము, కాలము అగును. "సమే శుచౌ దేశే- యోగానుష్ఠానయోగ్యదేశం విస్తరేణ ఆహ-సమేతి॥ నిమ్నోన్నతత్వాదిరహితే పరిశుద్ధే క్షుద్రపాషాణవహ్నిసికతారహితే వాయుధ్వనిజలాశయాద్యత్యన్తసామీప్యరహితే, చక్షుఃపీడాహేతు-భూత ఉల్కాదిరహితే, గుహాదిలక్షణనివాతదేశాశ్రయణేన యోగ అనుతిష్ఠేత్ ఇత్యర్థః॥"

ఎత్తుపల్లములు లేనిదియు, పరిశుద్ధమైనదియు, ఇసుక, గులకరాళ్లు, నిప్పు మొదలైనవి లేకుండను, కంటికిబాధ కలుగనిదిగను ఉన్న మనస్సునకు అనుకూలమైన దేశమందు యోగమును అనుష్ఠించవలెను" అని భాష్యమందు ఉట్టంకించబడిన శ్వేతాశ్వతరశ్రుతికి అర్థము.

ఈ శ్రుతిలో ఏకాగ్రచిత్తతకు అనుకూలమైన స్థలమును చెప్పుచున్నదే తప్ప, ఫలాన స్థలములోనే ఉపాసనము చేయవలెను అని దేశమును సూచించి చెప్పలేదు. అందుచేతనే "మనోనుకూలే" అని,

*మాహ; న తు దేశం నియచ్ఛన్తి; "మనోఽనుకూలే" ఇతి వాక్యశేషాత్ ॥ 11 ॥*

*ఇతి ఆసీనాధికరణమ్ ॥ 5 ॥*

## *ఆప్రయాణాధికరణమ్ (4-1-6 )*

### *॥ సి. సూ ॥ ఆప్రయాణాత్ తత్రాపి హి దృష్టమ్ ॥ 4-1-12 ॥*

*తదిదమపవర్గసాధనముక్తలక్షణముపాసనమేకాహ ఏవ సంపాద్యమ్, ఉత ఆప్రయాణాత్ ప్రత్యహమనువర్తనీయమితి విశయే - ఏకస్మిన్నేవాహని శాస్త్రార్థస్య కృతత్వాత్ తావతైవ*

---

వాక్యశేషములో మనస్సునకు అనుకూలమైన స్థలములో, అనగా ఏకాగ్రచిత్తమునకు అనుకూలమైన స్థలమున ఉపాసనము చేయవలెనని చెప్పబడియున్నది.

ఆసనసహపఠితమైన- ఆసనమునకు అంగముగా చెప్పబడిన దేశము మొదలైనవికూడ ఏకాత్రచిత్తతకు అనుకూలముగా ఉండవలెనన్నచో, ఆసననియమమును గురించి వేరుగా చెప్పవలెనా?

**"స్థితిగమనాదులలో ఏకాగ్రచిత్తత సంభవించదు. కూర్చొని ఉపాసనము చేయువానికే ఏకాగ్రచిత్తత సంభవించును"** అని ఈ సూత్రముయొక్క అభిప్రాయము. 11

ఆసీనాధికరణము ముగిసినది. (5)

## *ఆప్రయాణాధికరణము (4-1-6 )*

### *॥ సి. సూ ॥ ఆప్రయాణాత్ తత్రాపి హి దృష్టమ్ ॥ 4-1-12 ॥*

**సూత్రార్థము:-** **ఆప్రయాణాత్** = మరణసమయంవరకూ (ఉపాసనమును చేయుచుండవలెను) **హి** = ఎందులకనగా, **తత్రాపి దృష్టమ్** = మరణసమయంవరకూ ఉపాసనమును చేయవలెను అని శ్రుతి చెప్పుచున్నదిగనుక.

**సంగతి:-** "ఆసననియమమువలె ఆయుస్సున్నంతవరకును ఉపాసనమును వదలకుండ చేయు చుండవలెను అని నియమము ఉన్నదా?" అని ప్రశ్న రాగా, వెనుకటి అధికరణములో చివరి సూత్రములో దేశకాలనియమము లేదు అని నిర్ణయము చెయ్యబడియున్నందున, ఆ నిర్ణయము ప్రకారము ఉపాసన విషయములోకూడ నియమము లేదు అను పక్షము ఈ అధికరణములో నిరసింపబడుచున్నది.

**విషయము:-** బ్రహ్మోపాసనము

**సంశయము:-** బ్రహ్మోపాసనమును దర్శనసమాకారదశ వచ్చునంతవరకును చేసినచో సరిపోవునా? లేక మరణపర్యంతము ప్రతిదినమును చేయవలెనా?

**సంశయము వచ్చుటకు కారణము:-** "స ఖల్వేవం వర్తయన్ యావదాయుషం"అను శ్రుతిని ప్రమాణముగా తీసుకొని, జీవించియున్నంతకాలమును అనగా మరణించువరకును ఉపాసనము చేయుచునే యుండవలెను అనియే చెప్పవలెను. ఈ శ్రుతిలో "అభిసమావృత్య కుటుమ్బే శుచౌ దేశే" అని ఉన్న వాక్యమును అనుసరించి, ఆశ్రమధర్మములనే యావదాయుస్సు అనుష్ఠించుచుండవలెను అని చెప్పవలెనా? లేక "న చ పునరావర్తతే" అన్న వాక్యమును పరామర్శించి, ఉపాసనమును

*పరిసమాపనీయమితి ప్రాప్తే ఉచ్యతే - ఆప్రయాణాత్- ఇతి । ఆమరణాదనువర్తనీయమ్; కుతః;*

యావదాయుషం చేయుచునే ఉండవలెను అని చెప్పవలెనా? ఈ రెండు పక్షములలో ఏ పక్షము యుక్తియుక్తము అని నిర్ణయించలేక సంశయము కలుగుటకు కారణమగుచున్నది.

పూర్వపక్షము:- "ఏకస్మిన్నహని శాస్త్రార్థస్య కృతత్వాత్ తావతైవ పరిసమాపనీయమ్" ఒకరోజు ఉపాసనము చేసిననే, శాస్త్రములో విధించబడినదానిని అనుష్ఠించినట్లు అగునుగనుక, ఒకరోజు ఉపాసనమును చేసి పూర్తిచెయ్యవలెను.

ఏకస్మిన్నహని అని ఉపలక్షణము, అనగా ఒకనాడు ఉపాసనము చేసినచో సరిపోవును అనునది, ఉపాసనము చేయుట ఆరంభించి , అది పూర్తిచేసి, దర్శనసమానాకారమైన భక్తిరూపధ్యానమును పొందితే, ఆ తరువాత ఉపాసనమును చెయ్యనవసరములేదు అని తాత్పర్యము. ఈవిధంగా చెప్పకపోతే, ఆవృత్త్యధికరణంలో నిర్ణయించబడినదానికంటే వేరేమి ఈ అధికరణంలో పూర్వపక్షి చెప్పుతున్నారు? అని సందేహం వస్తుంది. కనుక, ఉపాసనం నిలిపి, దర్శనసమానాకారమైన ధ్యానం ఏర్పడిన మర్నాడే ఉపాసనమును చెయ్యకుండా నిలిపివేయవచ్చును అని పూర్వపక్షియొక్క అభిప్రాయము.

"స ఖల్వేవం వర్తయన్ యావదాయుషమ్"(ఛాం. 8-15-1) అన్న శ్రుతి, కర్మలను యావదాయుషము అనుష్ఠించవలెను అని చెప్పుతున్నది. దానికి ఫలముగానే ముక్తి చెప్పబడినది. విద్యను- ఉపాసనమును యావదాయుషము అనుష్ఠించవలెనని చెప్పలేదు.

సహకార్యన్తరవిధ్యధికరణం(3-4-12)లో "ఆయుస్సు ఉన్నంతవరకు గృహస్థాశ్రమధర్మాన్ని అనుష్ఠిస్తూండవలెను" అని "స ఖల్వేవం"(ఛాం. 8-15-1) అన్న ఛాందోగ్యశ్రుతిలో చెప్పబడినది ఎలా కుదురుతుంది? అని ప్రశ్న వేసుకొని, "కృత్స్నభావాత్ గృహిణోపసంహారః"(బ్ర.సూ. 3-4-47) అన్న సూత్రంలో అన్ని ఆశ్రమధర్మాలనూ ఉపలక్షణంగా చూపటానికి గృహస్థాశ్రమాన్ని ఉట్టంకించేరని నిర్ణయం చేసినందువలన "స ఖల్వేవం" అన్న శ్రుతి యావదాయుషం విద్యాంగమైన కర్మానుష్ఠానాన్నే చెయ్యవలెనని సిద్ధాంతం చెయ్యబడింది. కనుక ఒకరోజు ఉపాసనాన్ని అనుష్ఠిస్తే చాలును అని చెప్పటం పూర్వపక్షియొక్క యుక్తి.

అథవా- "యావదాయుషం" అన్న శ్రుతిలో విధిశబ్దం లేదుగనుక ఆ శ్రుతి విద్యాఫలమునే చెప్పుతున్నది అనవచ్చును. యావదాయుషం ఉపాసనం చేసేటట్లు విధించలేదు అని వేదాంతదీపంలో సాయించేరు.

సిద్ధాంతం- "ఆప్రయాణాత్"-మరణకాలపర్యన్తము ఉపాసనము అనుష్ఠించవలెను. ఎందుకనగా, "తత్రాపి హి దృష్టమ్"- ఉపాసన ఆరంభించినప్పటినుంచి, మరణపర్యంతము ఉన్న మధ్యకాలంలో కూడా ఉపాసనమును చేయవలెను అని శ్రుతి చెప్తున్నది. "స ఖల్వేవం" అన్న శ్రుతి "యావదాయుషం కర్మానుష్ఠానాన్ని చేయవలెను" అని చెప్తున్నది. దానికి ఫలం మోక్షమని పూర్వపక్షి చెప్పటం సరికాదు. కర్మానుష్ఠానమనేది విద్యకి ఉపకారకంగా, ఫలసాధనం అగుచున్నదనే చెప్పవలెను. ఈవిధంగా యావదాయుషమూ విద్యకి ఉపకారకమైన కర్మను అనుష్ఠించవలెను అని చెప్పటంచేత

తత్రాపి హి దృష్టమ్-ఉపాసనోద్యోగప్రభృతి ఆప్రయాణాన్మధ్యే యః కాలః, తత్ర సర్వత్రాపి దృష్టముపాసనమ్ "స ఖల్వేవం వర్తయన్ యావదాయుషం బ్రహ్మలోకమభిసంపద్యతే" (ఛాం.8-15-1)ఇతి ॥12 ॥

॥ ఇతి ఆప్రయాణాధికరణమ్ ॥ 6 ॥

## *తదధిగమాధికరణమ్ (4-1-7 )*

***॥ సి. సూ ॥ తదధిగమ ఉత్తరపూర్వాఘయోరశ్లేషవినాశౌ తద్వ్యపదేశాత్ ॥ 4-1-13 ॥***

*ఏవం విద్యాస్వరూపం విశోధ్య, విద్యాఫలం చిన్తయితు మారభతే; బ్రహ్మవిద్యాప్రాప్తౌ,*

---

విద్యనికూడా యావదాయుషమూ అనుష్ఠించవలెను అని చెప్పినట్లైనది. "ప్రాయణాన్తం ఓంకార మభిధ్యాయీత" – మరణపర్యంతము ఓంకారమును ధ్యానం చేయవలెను అని మరొక శ్రుతి స్పష్టంగా చెప్పటంచేత దర్శనసమానాకారానంతరముకూడా శ్రుతిలో చెప్పినట్లుగా యావదాయుషము బ్రహ్మోపాసనము చేయవలెను.

సహకార్యన్తరవిధ్యధికరణంలో, అన్ని ఆశ్రమములకు చెందినవారూ విద్యాసహకారిగా ఆశ్రమ ధర్మములను అనుష్ఠించవలెను. అవి బ్రహ్మప్రాప్తిసాధనములుగా చెప్పబడ్డాయి. మధ్యన, "గృహస్థాశ్రమ ధర్మమే కదా చెప్పబడింది" అన్న ప్రశ్న వస్తే "గృహస్థాశ్రమధర్మం" ఉపలక్షణం. అన్ని ఆశ్రమాలకి చెందినవారికీ విద్యయున్నది గనుక గృహస్థాశ్రమవాసులకీ ఉన్నది"అని "కృత్స్నభావాత్తు గృహిణోప-సంహారః"(బ్ర.సూ. 3-4-47)అనే బ్రహ్మసూత్రంలో చెప్పబడింది. ఈవిధంగా అప్పుడుకూడా విద్యాంగ మైన కర్మానుష్ఠానాన్ని యావదాయుషమూ చేయవలసినదే అనియే చెప్పవలెను. అంగియైన విద్యానుష్ఠానం లేకుండా అంగానుష్ఠానం వ్యర్థంగనుక అంగియైన విద్యానుష్ఠానమూ యావదాయుషయమూ చేయాలి.

వేదాంతదీపంలో "యావదాయుషం" అన్న శ్రుతిలో "విధి" శబ్దం లేదుగనుక, ఫలమును మాత్రమే చెప్పుతున్నది అనటం సరికాదు. "యావదాయుష"శ్రుతిలో విధిప్రత్యయం లేకపోయినా, ఉపాసనావృత్తి విధి అనేది ఈ ప్రకరణంలో లేదుగనుక అప్రాప్తంగనుక ఈ శ్రుతియే ఉపాసనావృత్తిని విధిస్తున్నదని ఒప్పుకోవాలని చెప్పబడింది. 12.

ఆప్రయాణాధికరణము ముగిసెను.

## *తదధిగమాధికరణము (4-1-7 )*

***॥ సి. సూ ॥ తదధిగమ ఉత్తరపూర్వాఘయోరశ్లేషవినాశౌ తద్వ్యపదేశాత్ 4-1-13 ॥***

సూత్రార్థము:– **తదధిగమే** = బ్రహ్మవిద్యని పొందగనే, **ఉత్తరపూర్వాఘయోః అశ్లేషవినాశౌ** = ఇకముందు కలిగే పాపాలు అంటకపోవుట, ఇదివరకే చేసిన పాపముల నాశమును (విద్యామాహాత్మ్యము చేత కలుగుచున్నవి) **తద్వ్యపదేశాత్** = వేదవాక్యములు ఆవిధముగా చెప్పుటచేత.

సంగతి– ఇంతవరకును ఉపాయభూతమైన ఉపాసనమునకు విషయమైన భగవానుడు నిరతిశయప్రియమైనవానిగా నుండుటచే ఉపాసనముకూడ ప్రీతిపరమై ప్రియమైనదిగా ఉండుటచే

*పురుషస్యోత్తరపూర్వాఘయోరశ్లేషవినాశౌ శ్రూయేతే, "తద్యథా పుష్కరపలాశ ఆపో న శ్లిష్యన్తే, ఏవమేవంవిది పాపం కర్మ న శ్లిష్యతే" (ఛాం.4.14.3), "తస్యైవాఽఽత్మా (వ స్యాత్) పదవిత్ తం విదిత్వా న కర్మణా లిప్యతే పాపకేన' (బృ.6.4.23) ఇత్యుత్తరాఘాశ్లేషః, "తద్యథేషీకతూలమగ్నౌ ప్రోతం ప్రదూయేత, ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయన్తే" (ఛాం.5.24.3), "క్షీయన్తే చాస్య*

---

ఉపేయత్వమును గలదు అని ఫలాధ్యాయములో విద్యనిగురించి విచారము చేయబడినది. "దశ్యమానో మహోరగైః న వివేద ఆత్మనో గాత్రం తత్స్మృత్యాహ్లాదిసంస్థితః"- భగవానుని ధ్యానము చేసి, దానిచే సంతోషపడియున్న ప్రహ్లాదుడు క్రూరమైన పాములచే తన శరీరము కరుచుటయు, తెలిసికొనలేదు' అని చెప్పుటచేత భగవద్ధ్యానము అత్యంతము ప్రియమై, ఇతరములను కప్పివేయును, మరిపించును అని పురాణము చెప్పుట చూడవచ్చును. దీనిచే భగవద్ధ్యానము అత్యంతప్రియమైనది అని స్పష్టమైనది.

వెనుక బ్రహ్మవిద్యాస్వరూపమును నిరూపణం చేసేరు. ఇక విద్యాఫలమైన అశ్లేషవినాశములు నిరూపించబడుతున్నాయి.

**విషయం:-** "తద్యథా పుష్కరపలాశ ఆపో న శ్లిష్యతే, ఏవమేవంవిది పాపం కర్మ న శ్లిష్యతే" (ఛాం. 4. 14. 3), "తద్యథా ఇషీకతూలం అగ్నౌ ప్రోతం ప్రదూయేతే ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయన్తే"(ఛాం. 5-24. 3)ఇత్యాది అశ్లేషవినాశశ్రుతులు.

మూలములోనున్న శ్రుతివాక్యములకు ఉపనిషద్భాష్యములో ఉన్నట్టుగా వ్రాయబడుచున్నది.

1. "పద్మపత్రజలాశ్లేషతుల్యసర్వపాపాశ్లేషాపాదకవిద్యావిషయభూతం బ్రహ్మ వక్ష్యామి ఇత్యర్థః" - తామరాకుమీదనున్న జలము (ఆ ఆకుమీద) ఏవిధముగా అంటకుండ ఉండునో అదేవిధముగా పాపకర్మలు అంటకపోవుటను కల్పించు విద్యకు విషయమైన పరబ్రహ్మను చెప్పుచున్నాను" అని అర్థము.

2. "తం బ్రహ్మవిన్మహిమానం విదిత్వా నరాః పాపకేన కర్మణా న లిప్యన్తే ఇత్యర్థః" - బ్రహ్మవేత్తయొక్క మహిమను తెలిసిన మనుష్యులు పాపముల పంబంధమును పొందుట లేదు.

3. "యథా ఇషీకాయాః ముంజాన్తర్వర్తితృణవిశేషస్య తూలం అగ్నౌ ప్రక్షిప్తం సద్యో దహ్యతే ఏవం సర్వాణి పాపాని ఏతాదృశవిద్యాపూర్వకప్రాణాగ్నిహోత్రానుష్ఠానేన దగ్ధా భవన్తీత్యర్థః" - నిప్పురవ్వ తగిలినప్పుడు బూరుగుదూది అంతయు వెంటనే దగ్ధమైనట్లు లేదా, అల్పమైన గడ్డిపోచకు నిప్పురవ్వ తగిలినప్పుడు అది అంతా కాలిపోయినట్లు ఉపాసకుడైన ఈ బ్రహ్మవేత్తయొక్క సమస్తమైన (పుణ్య) పాపములును ఉపాసనప్రభావముచే నశించిపోవును.

4. "అస్య ప్రారబ్ధాత్యతిరిక్తాని పూర్వాణి అనేకభవార్జితాని కర్మాణి చ నశ్యన్తి। ఏతత్ సర్వం కదా ఇత్యత్రాహ- తస్మిన్ దృష్టే పరావరే పరే అవరే యస్మాత్ సః పరావరః- సర్వోత్కృష్టా అపి బ్రహ్మాద్యాః యస్మాత్ నికృష్టాః ఇత్యర్థః। అథవా పరావరే పరావరశరీరకే సర్వాత్మభూత ఇత్యర్థః । తాదృశే తస్మిన్ దృష్టే- దర్శనసమానాకారజ్ఞానవిషయీకృత ఇత్యర్థః" - పురుషోత్తముని దర్శించిన వెంటనే ప్రాప్తముతప్ప అనేకజన్మములలో సంపాదించబడిన సంచితపాపములన్నియు నశించి

*కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే" (ముం.2-4-10) ఇతి పూర్వాఘవినాశః। ఏతావశ్లేషవినాశౌ విద్యాఫలభూతావుపపద్యేతే, నేతి సంశయః।*

*కిం యుక్తమ్? నోపపద్యేతే ఇతి । కుతః; "నాభుక్తం క్షీయతే కర్మ కల్పకోటిశతైరపి" (బ్ర.వై.పు.26.70) ఇత్యాదిశాస్త్రవిరోధాత్। అశ్లేషవినాశవ్యపదేశస్తు మోక్షసాధనభూత విద్యావిధాయి వాక్యశేషగతః కథఞ్చిద్విద్యాస్తుతిప్రతిపాదనేనాప్యుపపద్యతే । న చ విద్యా పూర్వోత్తరాఘయోః ప్రాయశ్చిత్తతయా విధీయతే; యేన ప్రాయశ్చిత్తేనాఘవినాశ ఉచ్యతే। విద్యాహి 'బ్రహ్మవిదాప్నోతి*

---

పోవుచున్నవి. పరావరః సర్వోత్కృష్టులైన బ్రహ్మాదులకంటెను భగవానుడు ఉత్కృష్టుడు గనుక, శ్రీమన్నారాయణుడు పరావరుడు. లేక, ఉన్నతమైనవాటియందును అధస్థమైనవాటియందును అంతర్యామిగా నుండుటచే -పరావరశరీరకుడయినందున పరావరుడు అనబడుచున్నాడు.

**సంశయము:-** బ్రహ్మవిద్యాఫలముగా పాపాశ్లేష,వినాశములు కలుగునా? కలుగవా?

**సంశయము వచ్చుటకు కారణము:-** వెనుక చెప్పబడిన శ్రుతులచే బ్రహ్మవిద్యాఫలముగా పాపములు అశ్లేషవినాశములను పొందునని తోచుచున్నది. "నా భుక్తం క్షీయతే కర్మ" అను బ్రహ్మవైవర్త పురాణవచనము ప్రకారము కర్మలను అనుభవించియే తీర్చుకొనవలెను అని వచ్చుచున్నది. ఇట్లు ఈ రెండును వ్యతిరేకమైన అర్థములతోనున్నట్లు కనబడుచున్నది. వీటిలో దేనిని ప్రమాణముగా తీసికొనవలెను. లేక ఈ రెండు అర్థములకును పరస్పరవ్యతిరేకత లేదా? ప్రాయశ్చిత్తముచే పాపములు నాశమును పొందుచున్నవని అంగీకరించినందున ప్రాయశ్చిత్తముచే నశించిన పాపములకంటే భిన్నమైన పాపానుభవవిషయము "నాభుక్తమ్" అన్న వచనము అని అర్థమా? అప్పుడు బ్రహ్మవిద్యను సర్వపాపములకును ప్రాయశ్చిత్తముగా తీసికొనవలెను. బ్రహ్మవిద్య ప్రాయశ్చిత్తముగ ఎచ్చటను విధించబడలేదే? అను సందేహములు కలుగుటచేత ఈ రెండు పక్షములలో ఏ పక్షము యుక్తియుక్తమైనది అని నిర్ణయించసాధ్యముగానివానికి సందేహము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** బ్రహ్మవిద్యాఫలముగా అశ్లేషవినాశములు కలుగవు. ఎందుచేతననగా, కల్పకోటికాలము గడచినను, అనుభవించక పాపము తొలగదు. మీరు చెప్పు అశ్లేషవినాశములు పాపఫలమును అనుభవించియే తీరవలెను అను శాస్త్రమునకు విరోధముగనున్నవిగనుక.

నా భుక్తం అన్నది సామాన్యశాస్త్రం. అది విద్యచేత నాశాన్ని పొందే పాపకర్మవ్యతిరిక్తవిషయం. అంటే ఉపాసనం చెయ్యనివాడి పాపవిషయం అని చెప్పి తప్పించుకొనటానికి కుదరదు. ఎందుచేతననగా, విద్య అనేది పాపాశ్లేషవినాశములను చేస్తుంది అని విధించిన శ్రుతి ఒక్కటికూడా కనబడదు.

'బ్రహ్మవిదాప్నోతి పరమ్" ఇత్యాది వాక్యాలు ఉన్నాయి. అటువంటి వాక్యములచేత విద్యకి బలంగా పాప- అశ్లేషవినాశాలు చెప్పబడుతున్నవని అనటం సరికాదు. ఒక విధికి ఒక ఫలమే చెప్పటం సాధ్యమౌతుందిగనుక "బ్రహ్మవిదాప్నోతి పరమ్" అన్న శ్రుతి బ్రహ్మప్రాప్తిని ఫలంగా చెప్పింది. దానివలన దానికే పాపాశ్లేషవినాశాలూ ఫలంకావు. అందువలన, విధివాక్యశేషమై, అశ్లేషవినాశ-శ్రుతులు స్తుతిపరమని ఎలా చెప్పగలం?

*పరమ్'(తై.2-1-1), 'బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి'(ము.3-2-8) ఇతి బ్రహ్మప్రాప్త్యుపాయతయా విధీయతే। అతో విద్యార్థవాదోఽయమఘవినాశాశ్లేషవ్యపదేశ ఇతి ॥*

*ఏవం ప్రాప్తేఽభిధీయతే--తదధిగమే-- ఇతి। విద్యాప్రాప్తౌ పురుషస్య విద్యామాహాత్మ్యాదుత్తర పూర్వాఘయోరశ్లేషవినాశావుపపద్యేతే । కుతః? ఏవంవిధం హి విద్యామాహాత్మ్యమవగమ్యతే, "ఏవంవిది పాపం కర్మ న శ్లిష్యతే", "ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయన్తే" ఇత్యాదివ్యపదేశాత్। న చ, "నా భుక్తం క్షీయతే కర్మ" ఇత్యనేన శాస్త్రేణాస్య విరోధః; భిన్నవిషయత్వాత్ । తద్ధి కర్మణాం ఫలజననసామర్థ్యద్రఢిమవిషయమ్; ఏతత్తు ఉత్పన్నాయా విద్యాయాః ప్రాక్కృతానాం పాప్మనాం ఫలజననశక్తివినాశసామర్థ్యం, ఉత్పత్స్యమానానాం చ ఫలజననశక్త్యుత్పత్తిప్రతిబన్ధకరణసామర్థ్యఞ్చ ప్రతిపాదయతీతి ద్వయోర్విషయో భిద్యతే యథా అగ్నిజలయోరౌష్ణ్యతన్నివారణసామర్థ్య విషయయోర్ద్వయోః ప్రమాణయోరపి విషయభేదాత్ ప్రామాణ్యమ్, ఏవమత్రాపీతి న కశ్చిద్విరోధః।*

---

ఉపాసనం చేసేవాడికి 'నాభుక్తం' అనే వచనంప్రకారం కర్మఫలాలను అనుభవించినతరువాతనే 'బ్రహ్మవిత్ ఆప్నోతి పరమ్' అన్న శ్రుతిప్రకారం, బ్రహ్మప్రాప్తి లభిస్తుంది. కనుక, విద్యాఫలంగా అశ్లేషవినాశాలు కలుగుతున్నాయని చెప్పటం కుదరదు.

**సిద్ధాంతం:** తదధిగమే– విద్యాప్రాప్తౌ– దర్శనసమానాకారజ్ఞానం కలగటం, ఉపాసకుడికి విద్యామాహాత్మ్యంచేత ఉత్తరపూర్వాఘముల అశ్లేషవినాశాలు కలుగుతాయి. ఎందుచేతనంటే, "తద్వ్యపదేశాత్" – 'పాపకర్మలు అంటవు. అన్ని పాపములును నశిస్తున్నాయి– ఇత్యాది వ్యపదేశాలచేత– శ్రుతులచేత. విద్యామాహాత్మ్యంచేత పాపాలకి అశ్లేషవినాశములు కలుగుతున్నవి అని చెప్పటం అయింది. "నాభుక్తం క్షీయతే" అన్న వచనంతో విరోధమూ లేదు. ఇవి వేరువేరు విషయాలు. "నాభుక్తమ్" అన్నమాట, "ప్రాయశ్చిత్తం చేయ్యబడని కర్మలు వాటి ఫలాన్ని ఇచ్చేతీరును" అని నిశ్చయం చేస్తున్నది. ప్రాయశ్చిత్తంచేత తొలగిపోయినకర్మలూ ఫలాన్ని ఇస్తాయి అని చెప్పలేదు.

పాపాశ్లేషవినాశశ్రుతులు విద్య అనేది విద్యోత్పత్తికి పూర్వం చెయ్యబడిన పాపాల ఫలాన్ని ఇయ్యగల శక్తిని నాశంచెయ్యగల సామర్థ్యం గలది అనిన్నీ, ఇకమీదట చెయ్యబోయే పాపాల ఫలాన్ని కలిగించే శక్తిని అడ్డుకొనే సామర్థ్యంగలవి అనిన్నీ చెప్తున్నాయి. పూర్వపక్షి చెప్పినట్లు అశ్లేషవినాశ శ్రుతులని స్తుతిపరంగా తీసుకున్నట్లైతే, మోక్షం అనేది ఎప్పుడూ లభించకనేపోతుంది. అంటే, "నాభుక్తం" అన్న శాస్త్రప్రకారం కర్మఫలాన్ని అనుభవించే తీర్చుకొనవలెను అన్నట్లైతే, కర్మఫలాన్ని అనుభవించటానికి శరీరం కావాలి. ఆ శరీరంతో కర్మఫలాన్ని అనుభవించటంతోబాటు మరికొన్ని పుణ్యాపాపకర్మలనీ ఆ శరీరంతోటే చేస్తాడు. వాటిని అనుభవించటానికి మరొక శరీరం కావాలి– ఈ రీతిలో అనిర్మోక్షప్రసంగం వస్తుంది. కనుక అశ్లేషవినాశశ్రుతులని స్తుతిపరమైనవిగా చెప్పకూడదు. అశ్లేషవినాశశ్రుతులూ, "నాభుక్తం" అన్న వాక్యమూ భిన్నభిన్న విషయాలని చెప్పేవి. నిప్పు రగులుతున్నది అనటమూ, నీరు మంటలని ఆర్పుతుంది అన్నవాక్యమూ వేరువేరు విషయాలని చెప్పుతున్నట్లే పరస్పరవిరోధంగలవి కాకుండా ఎలా ప్రమాణాలౌతున్నాయో అదేవిధంగా ఈ విషయంలోకూడా విరోధం లేదు.

*అఘస్యాశ్లేషకరణమ్- వైదికకర్మయోగ్యతా-వాసనా-ప్రత్యవాయ హేతుశక్త్యుత్పత్తి ప్రతిబన్ధకరణమ్ అఘాని హి కృతాని పురుషస్య వైదికకర్మాయోగ్యతాం, సజాతీయకర్మాన్తరారమ్భరుచిం, ప్రత్యవాయం చ కుర్వన్తి అఘస్య వినాశకరణం ఉత్పన్నాయాస్తచ్ఛక్తేర్వినాశకరణమ్। శక్తిరపి పరమపురుషాప్రీతిరేవ। తదేవం విద్యా వేదితుర్వేద్యాత్యర్థప్రియత్వేన స్వయమపి నిరతిశయప్రియా సతీ వేద్యభూత పరమపురుషారాధనస్వరూపా పూర్వకృతాఘసఞ్చయజనిత పరమపురుషాప్రీతిం వినాశయతి; సైవ విద్యా స్వోత్పత్త్యుత్తరకాలభావ్యఘనిమిత్తపరమపురుషాప్రీత్యుత్పత్తిం చ ప్రతిబధ్నాతి। తదిదమశ్లేషవచనం ప్రామాదికవిషయం మన్తవ్యమ్, 'నావిరతో దుశ్చరితాత్' (క. 2-24) ఇత్యాదిభిః శాస్త్రైరాప్రయాణా దహరహరుత్పద్యమానాయా ఉత్తరోత్తరాతిశయ భాగిన్యాః విద్యాయాః దుశ్చరితవిరతి-నిష్పాద్యత్వావగమాత్ ॥ 13 ॥*

*॥ ఇతి తదధిగమాధికరణమ్ ॥ 7 ॥*

---

అశ్లేషకరణము అంటే వైదికకర్మని చేసే యోగ్యతని పోగొట్టుకొనియుండటం. వాసన, ప్రత్యవాయము, వీటియొక్క హేతువుకి శక్తి లేకుండా చెయ్యటం. పాపం చేస్తే వైదికకర్మలను చెయ్యటానికి ఉండే యోగ్యతని పోగొట్టుకొంటున్నాడు. పాపమనేది వాసనావశంచేత అదేవిధంగా మరొక పాపాన్ని చెయ్యటంలో రుచిని కలిగిస్తుంది. పాపం దోషాన్ని కలిగిస్తున్నది.

అఘస్య వినాశకరణమ్– ఉన్న పాపశక్తిని నాశం చెయ్యటమన్నమాట. ఇక్కడ చెప్పబడిన 'శక్తి' అంటే పరమపురుషుడి అప్రీతి. విద్య అనేది ఉపాసకుడికి వేద్యుడైన పరమపురుషుడివలె అత్యంతము ప్రియమై, వేద్యపరమపురుషారాధనస్వరూపమై, ఇతడు పూర్వం చేసిన పాపరాసులవలన ఇతడిమీద పరమపురుషుడికి కలిగిన అప్రీతిని నాశం చేస్తున్నది. అదే విద్య సిద్ధించిన తరువాత ముమ్ముందు చెయ్యటానికి అవకాశమున్న పాపాలవలన కలగగల అప్రీతిని పరమపురుషుడికి కలుగకుండా నిరోధిస్తున్నది.

ఇక్కడ చెప్పబడిన అశ్లేషం అబుద్ధిపూర్వకమైన (తెలియక చేసిన) పాపముల విషయంగా గ్రహించవలెను. "నావిరతో దుశ్చరితాత్" – దుశ్చరితములనుండి విరక్తిని పొందనివాడికి విద్యసిద్ధించదు – అని శ్రుతి చెప్పింది గనుక బుద్ధిపూర్వకంగా పాపం చెయ్యకూడదు అని తేలిందన్నమాట.

**ప్రశ్నలు సమాధానాలు.**

**1. ప్రశ్న**– సూత్రంలో "ఉత్తరపూర్వాఘయోః" అని ఉండటం సరికాదు. "అల్పాచ్తరం పూర్వం" తక్కువ అచ్చులు గలదాన్ని మొదట ప్రయోగించాలి అన్న వ్యాకరణశాస్త్రంప్రకారం "పూర్వోత్తరాఘయోః" అని ఉండాలికదా! దానికి తగినట్లుగా అశ్లేషవినాశౌ అనే సమాసాన్ని కూడా మార్చవలెను.

**సమాధానం:**– "అభ్యర్హితం పూర్వం" అని ఒక న్యాయం ఉన్నది. "ఇతిహాసపురాణాభ్యాం" అన్నప్పుడు అల్పాచ్కమైన పురాణపదాన్ని ముందర చెప్పకుండా ఎక్కువదైన ఇతిహాసపదాన్ని మొదట చెప్పబడినట్లే రాబోయే పాపమున్ను సంబంధించదు అని ముఖ్యత్వాన్ని – అభ్యర్హితత్వాన్ని చూపటానికి "ఉత్తరపూర్వాఘయోః" అని సూత్రకారులు ప్రసాదించియున్నారని గ్రహించవలెను.

**2. ప్రశ్న**– సూత్రంలో తదధిగమే అని ఉన్నది. తదధిగమే అంటే విద్యయొక్క ఆరంభంలో అని అర్థం. కనుక విద్యని ఆరంభించేరోజునే అశ్లేషవినాశాలు సంభవిస్తున్నాయా? లేక శ్రుతిలో చెప్పినట్లుగా ఉపాసనమధ్యన అంటే దర్శనసమానాకారజ్ఞానం కలిగినతరువాత అవి కలుగుతున్నాయా? లేక సాంపరాయాధికరణంలో చెప్పబడినట్లు చివరన దేహావసానకాలంలో కలుగుతున్నాయా? అని సందేహాలు కలుగుతున్నాయి.

సమాధానం.– "క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే" అన్న శ్రుతిలో "తస్మిన్ దృష్టే పరావరే" అని ఉన్నదిగదా. అందుచేత ప్రత్యక్షసమానాకారదర్శనజ్ఞానం కలిగిన తరువాతనే అశ్లేషవినాశాలు కలుగుతాయని చెప్పాలి.

**3. ప్రశ్న**– బ్రహ్మోపాసనస్యప్రాయశ్చిత్తత్వం, వచ్చిన పాపాలను నాశంచేసినందువలన ఉపపన్న మౌతున్నది. ప్రాయశ్చిత్తత్వం అంటే చెయ్యబడిన పాపానికి ఉంటుందికాని చెయ్యబోతున్న దానికి ప్రాయశ్చిత్తం గురించిన మాటలే కుదరవు గదా! ఇలాంటప్పుడు, నిమిత్తంలేకుండానే ఉత్తరాఘానికి బ్రహ్మోపాసనం ఏవిధంగా ప్రాయశ్చిత్తమౌతుంది? అని ఆక్షేపణ.

సమాధానం– విద్య పూర్వాఘానికే ప్రాయశ్చిత్తమౌతుంది. అబుద్ధిపూర్వకంగా చెయ్యబడే ఉత్తరాఘం పాపమే కాదే! కనుక అశ్లేషవిషయంలో విద్యని ప్రాయశ్చిత్తంగా చెప్పే ప్రసక్తే లేదు. అంటే భగవానుడికి ఉపాసకుడిమీద కలిగిన ప్రీత్యతిశయంచేత, ఉత్తరాఘవిషయంలో నిగ్రహసంకల్పమేలేదే! భగవానుడి నిగ్రహసంకల్పమేకదా పాపంగా చెప్పబడుతున్నది! అందుచేత ఉత్తరాఘం పాపంకావటం లేదు అని బ్రహ్మవిద్య అనేది సర్వప్రాయశ్చితమని చెప్పేవారి అభిప్రాయం.

"ప్రాయశ్చిత్తం నిమిత్తే కథమనుదిత ఇత్యత్ర నైవానుయోజ్యం।
నాధర్మస్తత్ర తత్స్యాదితి ఖలు హృదయం గ్రాహ్యమశ్లేషవాచః॥ (అధికరణసారావళి–462)

ముఖ్యగమనిక– ఉపాసనం చేసేవారు తమకి ఏదైనా పాపం రాబోతోందే అని భయపడి చాలా జాగ్రత్తగా ఉంటూంటారు గనుక బుద్ధిపూర్వకంగా ఉత్తరాఘాన్ని చెయ్యటమనే ప్రసక్తి ఉండదు. దేశకాల వైగుణ్యనిమిత్తవిశేషంచేత బుద్ధిపూర్వకంగా పాపం వచ్చినా, ఆ పాపానికి తగినట్లుగా ప్రాయశ్చిత్తాన్ని చేసి ఆ పాపాన్ని పోగొట్టుకొంటారు. అంటే రహస్యంగా పాపం చేస్తే రహస్యప్రాయశ్చిత్తంచేతనున్నూ, చాలామందికి తెలిసేటట్లు చేసిన పాపాన్ని పరిషత్తును చేర్చి ప్రతిపదోక్త ప్రాయశ్చిత్తాన్ని చేసి, ప్రతిపదోక్తప్రాయశ్చిత్తం చెయ్యటానికి అశక్తులైనవారు భగవచ్ఛరణాగతిరూపప్రాయశ్చిత్తంచేసీ, పాపాన్ని తొలగించుకొంటారు. బుద్ధిపూర్వకంగా పాపాన్ని చేసి ప్రాయశ్చిత్తమూ చెయ్యకపోతే, కల్పకోటికాలం అనుభవించవలసిన కర్మఫలాన్ని బ్రహ్మవేత్త అల్పకాలంలో అనుభవించి తీర్చుకుంటాడు.

"లఘుర్దణ్డః ప్రపన్నస్య రాజపుత్రాపరాధవత్", "న ఖలు భాగవతా యమవిషయం గచ్ఛన్తి", "ఇహైవైషాం కేచిత్ ఉపప్లవా భవన్తి; కాణా భవన్తి కఞ్జా భవన్తి" అన్న ప్రమాణాలు హద్దుని ఏర్పరచి పొందవలసినవాటిలో అడ్డులనుపెట్టి, పొందవలసినదానిని లెక్కించి శిక్షిస్తాడు అంటున్నది. అంటే చిన్న చిన్న దండనలను తప్పకుండా అను భవించవలసినదే. బ్రహ్మవేత్తలకి చిన్న దండనలని ఇచ్చి పెద్దపెద్ద పాపాలను తొలగించటం వృత్రాసురుడు, శిశుపాలుడు మొదలైనవాళ్ళ విషయంలో చూస్తాం. వీరికి కూడా అదే జన్మలో మోక్షాన్ని ఇచ్చేడు అనేవిషయంకూడా గమనీయం.

"అపరాధశతాలని చేసికూడా ప్రాయశ్చిత్తాన్ని చేయకుండా ఉన్న శిశుపాలుడికి ఎలా బ్రహ్మప్రాప్తి కలిగింది అని అడగవచ్చు. అతడు పూర్వం చేసిన సుకృతవశంచేత అన్తిమకాలంలో అతడికి విష్ణువుయొక్క సేవ లభించింది. అది సర్వపాపప్రాయశ్చిత్తమై అన్ని పాపాలనీ తొలగించి మోక్షం పొందేటట్లు చేసింది. ఈ విషయాన్ని స్వామి దేశికులవారు యాదవాభ్యుదయంలో

"సుకృతేన పురాకృతేన చైద్యః ప్రతిపన్నప్రకృతిప్రలీనవైరః।

క్షణమద్భుతకృష్ణరూపదర్శీ శిథిలాకృష్టశిలీముఖోవతస్థే॥" (యాద. 15.126)

"వింటిని వంచి బాణాన్ని సంధించేడు శిశుపాలుడు. అప్పుడు పూర్వం చేసిన పుణ్యం ఫలాన్నిచ్చే కాలం వచ్చింది. సాత్త్వికభావాన్ని పొందేడు. దానివలన కృష్ణుడివిషయంలో పగ తొలగిపోయింది ఒక క్షణం అద్భుతమైన కృష్ణుడి దివ్యమంగళవిగ్రహాన్ని సేవించి ఆనందించేడు. దానివలన బాణంవెయ్యటంలో తడబడ్డాడు" అని సాదించేరు.

"బ్రహ్మవేత్తలు వారి ప్రాచీన కర్మానుసారేణ ఇదే జన్మంలోనో అనేక జన్మలు గడిచినతరువాతనో కాలనియమం లేకుండా మోక్షాన్ని పొందుతారు" అన్నది బాదరాయణుల అభిప్రాయమౌతుంది. ఈ విషయాలను స్వామి అధికరణసారావళిలో ధీపూర్వ ముత్తరాఘం న సృజతి(463)(ఉపాసకుడు ధ్యానం ప్రారంభమైనతరువాత పాపం చెయ్యడు) అనే శ్లోకంలో సాదించియున్నారు.

**4. ప్రశ్న**– ఈ అధికరణంలో "భక్తియే సర్వప్రాయశ్చిత్తము" అని చెప్పబడింది.

"శరణం త్వాం ప్రపన్నా యే ధ్యానయోగవివర్జితాః।

తేపి మృత్యుమతిక్రమ్య యాన్తి తద్వైష్ణవం పదమ్॥" (బ్రహ్మ.పు. 53)

(ఎవరు ధ్యానయోగమును వదలివేసి నిన్ను శరణుపొందేరో, వారు సంసారాన్ని దాటిపోయి శ్రీవైకుంఠాన్ని పొందుతున్నారు. ధ్యానయోగాన్ని చేసేవారూ పరమపదాన్ని పొందుతున్నారు) అన్న భావమున్న ఈ శ్లోకం శరణాగతిని సర్వపాపప్రాయశ్చిత్తంగా చెప్పుతున్నది. ఈవిధంగానున్నప్పుడు ధ్యానయోగం చేసేవాడికే మోక్షం అని ఎలా చెప్పగలము?

**సమాధానం**– భక్తి, ప్రపత్తి అనే రెండింటికీ సర్వప్రాయశ్చిత్తత్వం కుదురుతుంది. అంటే, శరణాగతికి కూడా మోక్షోపాయత్వం ఉన్నది. భక్తియోగానికీ మోక్షోపాయత్వం ఉన్నది అని ఈ శ్లోకంలోనే చెప్పబడియున్నది. "తేపి మృత్యుం అతిక్రమ్య" అన్నప్పుడు "అపి" శబ్దంచేత ఈవిధంగా చెప్పబడింది. శరణాగతి చేసినవారే మోక్షాన్ని పొందుతారని కాదు. అంటే ముకుందుడిని శరణుపొందినవారూ మోక్షాన్ని పొందుతున్నారు. అదేవిధంగా భక్తియోగాన్ని అనుష్ఠించినవారూ మోక్షాన్ని పొందుతున్నారని ఈ శ్లోకంలో చెప్పబడుతున్నది. కనుక ఈ అధికరణంలో భక్తియోగానికి మాత్రం చెప్పియున్నా దానిని ఉపలక్షణంగా తీసుకొని శరణాగతికికూడా సర్వపాపప్రాయశ్చిత్తత్వం చెప్పినట్లు గ్రహించాలి. ఈ అర్థాన్ని

"నన్వేవం యే ముకున్దం శరణముపగతా వర్జితా ధ్యానయోగైః।"

అనే అధికరణసారావళీ 442వశ్లోకంలో స్వామి దేశికులు సాదించియున్నారు. ఈ అధికరణంలో చెప్పబడినవిషయాన్ని క్రోడీకరించి దేశికులవారు తమ వేరొక సంప్రదాయరహస్యగ్రంథంలో

## ఇతరాధికరణమ్ (4-1-8 )

**॥ సి. సూ ॥ ఇతరస్యాప్యేవమసంశ్లేషః పాతే తు ॥ 4-1-14 ॥**

ఉత్తరపూర్వాఘయోర్విద్యయాశ్లేషవినాశావుక్తౌ, ఇతరస్య పుణ్యస్యాపి, ఏవమ్-ఉక్తేన-న్యాయేనాశ్లేషవినాశౌ విద్యయా స్యాతామ్, విద్యా ఫలవిరోధిత్వసామాన్యాత్; వ్యపదేశాచ్చ । భవతి చ వ్యపదేశః- ఉభే సుకృత దుష్కృతే నిర్దిశ్య, 'సర్వే పాప్మానోఽతో నివర్తన్తే' (ఛా. 8-4-1) ఇతి,

---

"ప్రారబ్ధేతరపూర్వపాపమఖిలం ప్రామాదికంచోత్తరం
న్యాసేన క్షపయన్ అనభ్యుపగతప్రారబ్ధఖండంచ నః।
ధీపూర్వోత్తరపాప్మనామజననాత్, జాతేపి తన్నిష్కృతేః
కౌటిల్యేసతి శిక్షయాప్యనఘయన్ క్రోడీకరోతి ప్రభుః" అని సాదించేరు.

తదధిగమాధికరణము ముగిసినది.

## ఇతరాధికరణము (4-1-8 )

**॥ సి. సూ ॥ ఇతరస్యాప్యేవమసంశ్లేషః పాతే తు ॥ 4-1-14 ॥**

**సూత్రార్థము:-** **ఇతరస్య అపి** = పాపముకన్న వేరైన పుణ్యకర్మకును, **ఏవం అసంశ్లేషః** = వెనుక చెప్పిన విధముగా అశ్లేషవినాశములు (కలుగును), **పాతే తు** = శరీరపాతసమయమున (పుణ్యములు నశించును)

**సంగతి:-** వెనకటి అధికరణములో పూర్వోత్తరపాపములకు క్రమముగా వినాశమును అశ్లేషమును చెప్పబడినవి. ఈ అధికరణములో సుకృతమునకును అశ్లేషవినాశములు చెప్పబడుచున్నవి అని అతిదేశసంగతి.

**విషయము:-** ఉపాసకుని సుకృతమును గురించినది.

**సంశయము:-** విద్యానిష్పత్తికి పూర్వమును తరువాతను చెయ్యబడిన సుకృతములు వినాశ, అశ్లేషములకు విషయములగునా, కావా?

**సంశయము వచ్చుటకు కారణము:-** "పాపం కర్మ న శ్లిష్యతే", "సర్వే పాప్మానః ప్రదూయన్తే"- "పాపకర్మలు అంటుకొనుట లేదు", "అన్ని పాపములును నాశమును పొందుచున్నవి" అన్న శ్రుతులు పాపమునకు మాత్రము అశ్లేషవినాశములను చెప్పుచున్నవి. "న సుకృతం నాపి దుష్కృతం సర్వే పాప్మానః అతో నివర్తన్తే"-సుకృతమో, దుష్కృతమో ఏదియును ఉండదు. ఉపాసనము చేసినచో అన్ని పాపములును తొలగిపోవును" అను శ్రుతి సుకృతము, దుష్కృతము- రెండును పోవును అని చెప్పుచున్నది. రెండవదిగా ఉదహరించిన శ్రుతితో మొదట సామాన్యముగా చెప్పబడిన పాపశబ్దమునకు సుకృతదుష్కృతసాధారణముగా అర్థము చెప్పవలెనా? లేక అన్నిస్థలములయందును పాపశబ్దమును కేవలదుష్కృతమాత్రపరముగా చెప్పవలెనా? వీటిలో ఏ పక్షము యుక్తియుక్తము అని తెలియుటలేదు గనుక సంశయము కలుగుచున్నది.

'తత్సుకృతదుష్కృతే ధూనుతే' (కౌ. 1-4) ఇతి చ ముముక్షోరనిష్టఫలత్వాత్సుకృతస్యాపి పాప్మశబ్దేన వ్యపదేశః। సుకృతస్యాపి శాస్త్రీయత్వాత్ తత్ఫలస్య కేషాఞ్చిదిష్టత్వదర్శనాచ్చ విద్యయా అవిరోధశఙ్కాం

**పూర్వపక్షము:** "పాపం కర్మ న శ్లిష్యతే", "సర్వే పాప్మానః ప్రదూయన్తే" అను శ్రుతులలో దురితవాచకముగా పాపశబ్దమునుమాత్రము ప్రయోగించియున్నందున పుణ్యములు తొలగవు. ఇచ్చట "న జరా, న మృత్యుః, న శోకః, న సుకృతం, నాపి దుష్కృతం, సర్వే పాప్మానః అతో నివర్తన్తే" అన్న శ్రుతిలో సుకృతము, దుష్కృతము అను రెండును తొలగిపోవునని కనబడుటచే, కేవల పాపశబ్దము చెప్పబడియున్నను, దానిని పుణ్యపాపసాధారణపరముగా గ్రహించవలెను. కనుక సుకృతమును తొలగిపోవుచున్నది అని చెప్పుట కుదరదు. ఎందుకనగా "అపహతపాప్మా విజరో విమృత్యుః" అను శ్రుతిలో అపహతపాప్మా అనుటచేత జరామృత్యువులు లేవు అని వచ్చినప్పుడు "విజరో విమృత్యుః" అని వీటిని ప్రత్యేకముగా చెప్పుటచేత, సుకృతమును కలుపుకొని "సర్వే పాప్మానః" అని చెప్పుట కుదరదని చెప్పవలెను. అంతేకాక, విద్యోపకారియైన సుకృతములు పోవుచున్నవని ఎవరిచేతనుకూడ చెప్పుట కుదరదు.

మీ అభిప్రాయము ప్రకారము సుకృతముకూడ పోవుచున్నదన్నచో, కామ్యఫలములనిచ్చు సుకృతములు పోవుచున్నవనియే చెప్పవలెను. స్వర్గరూపకామ్యఫలమును ఉద్దేశించి చెయ్యబడు జ్యోతిష్టోమాది యాగములను పాపమని చెప్పుట సాహసమేయగును. కామ్యకర్మలను అనుష్ఠించువారిని పాపులు అని ఎవరును అనుట లేదు. సర్వలోకవిదితమైన ధర్మమునకు పాపత్వము సంభవించదు. మీరు చెప్పుచున్నప్రకారము అంగీకరించినచో పుణ్యపాపవ్యవస్థయే లేకపోవును.

సుకృతము పోవుట లేదు అన్నచో, ప్రారబ్ధపాపకర్మ నాశానంతరముకూడ, సుకృతముండుటచే, సుకృతపుణ్యవశముచే మరుజన్మము కలుగునని చెప్పుట కుదరదు. అంతిమకాలమందు విద్యామాహాత్మ్యముచే "సుకృతదుష్కృతే ధూనుతే" అన్న శ్రుతిప్రకారము ధూననమందు చేరినదై జన్మాంతరమును కలిగించకుండ అన్ని సుకృతములును నశించుచున్నవని చెప్పవలెను. అందుచే సుకృతములకు అశ్లేషము చెప్పుట కుదరదు.

**సిద్ధాంతము:**– "ఇతరస్యాపి" పాపేతరమైన పుణ్యమునకును, "ఏవం అసంశ్లేషః"– వెనుకటి అధికరణములో చెప్పబడిన న్యాయము ప్రకారము అశ్లేషవినాశములు విద్యామాహాత్మ్యముచేత కలుగుచున్నవి. పుణ్యములును, విద్యాఫలవిరోధిగా నుండుటచేతనును, సుకృతదుష్కృతములను గురించి, "సర్వే పాప్మానః అతో నివర్తన్తే" అన్న వ్యపదేశము ఉండుటచేతనును, పుణ్యములుకూడ పోవుచున్నవి.

కామ్య కర్మలలోకూడ, అధికారిభేదములచేతను, కాలభేదముచేతను, అవస్థాభేదముచేతను, పుణ్యమే పాపమగుచున్నది. పాపమే పుణ్యమగుచున్నది– గొప్పదగుచున్నది అనునది లోకములో ప్రసిద్ధి చెందినదే. స్వర్గరూపఫలమును కోరినవానికి జ్యోతిష్టోమాది యాగములు పుణ్యమగుచున్నవి. అదే జ్యోతిష్టోమయాగము బ్రహ్మోపాసకునికి బ్రహ్మమును ఆలస్యముగా పొందుటకు కారణమగుటచే పాపమగుచున్నది. ఉపాసకునికి పాపమనునది బ్రహ్మప్రాప్తికి విరోధిగా ఉన్నదే యగును.

నివర్తయితు మతిదేశః । నను విదుషోఽపి సేతికర్తవ్యతాకోపాసననివృత్తయే వృష్ట్యన్నాదిఫలానీష్టాన్యేవ;

ముముక్షుత్వాముముక్షుత్వదశాభేదేన కర్మిణః।
కర్మైకం పాపపుణ్యత్వే సాధ్యక్యేపి సమశ్నుతే॥
శ్యేనాదేశ్చోదితస్యైవ ద్వైరూప్యం ద్వివిధశ్రుతేః।
ఏకస్యైవైకదైవాస్తి కాలభేదే తు కిం పునః॥

బ్రహ్మప్రాప్తివిరోధిత్వము అను లక్షణము దుష్కృతమునకువలె సుకృతమునకును ఉండుటచే అదియును పాపమగుచున్నది. పాపమనునది దుఃఖమును ఇచ్చి వైరాగ్యమును కలిగించుచున్నది. సుకృతమనునది సుఖమునిచ్చి ఇంకను ఇంకను ఆశను పెంచి సంసారానువృత్తినే చేయుచున్నది. కనుక, ఉపాసకునికి సుకృతములను దుష్కృతముకంటెను క్రూరమైనవే. అందుచే సుకృతమును కూడ పోగొట్టుకొనవలసినదే. కారాగృహమందు – చెరసాలలో– బంగారు గొలుసులతో బంధించినను ఏమి, ఇనుపగొలుసులతో బంధించిన ఏమి? బంధకవిషయములో రెండును ఒకటియే గదా! అదేవిధముగా, బ్రహ్మప్రాప్తి విరోధియైన పుణ్యమును తొలగవలసినదే. "ఏతే వై నిరయాస్తాత స్థానస్య పరమాత్మనః" అనినట్లు బ్రహ్మస్థానాపేక్షయా స్వర్గాదులును నరకములే యగును.

పాపశబ్దమునకు వెనుక చెప్పబడిన లక్షణము సుకృతమునకును చెందునుగనుక, "సర్వే పాప్మనః" అని సుకృతమునుకూడ చేర్చియే చెప్పుచున్నది. ఇతరశ్రుతులలో కేవలపాపశబ్దము ప్రయోగించబడినను, వాటిని కూడ ఈ శ్రుతిలో చెప్పినట్లుగా పుణ్యాపుణ్యసాధారణముగనే గ్రహించవలెను. కనుక, పుణ్యములును తొలగుచున్నవి.

వెనుకటి అధికరణములో చెప్పిన న్యాయముతో సుకృతములుకూడ తొలగుచున్నవన్నచో, వెనకటి అధికరణములోనే చేర్చి చెప్పియుండవచ్చునుగదా! వేరుగా ఒక సూత్రము– అధికరణము ఎందుకు చెప్పవలసివచ్చినది? అంతేకాక, వేదాంతశాస్త్రములో సుకృతమునుకూడ బ్రహ్మప్రాప్తికి విరోధిగన చెప్పుటచే దానిని పాపకోటిలో చేర్చుట సుప్రసిద్ధము గనుక వేరు అధికరణము అవసరమే లేదు అను ఆక్షేపము వచ్చుచున్నది.

'సుకృతము శాస్త్రసమ్మతమైనది దానియొక్క ఫలము కొంతమందికి ఇష్టమైనదే. కనుక సుకృతమనునది విరోధికాదు" అని వెనుకటి అధికరణములో చెప్పబడుటకంటె, అధికమైన ఆశంక– అధికమైన సందేహము– వచ్చుచున్నది. దానిని నివర్తించుటకే న్యాయాతిదేశము చేసి వేరుగా అధికరణము చెప్పబడినది.

"తత్ సుకృతదుష్కృతే ధూనుతే" అను శ్రుతియనునది సుకృతమునుకూడ వదలుచున్నాడు అని స్పష్టముగా చెప్పియున్నపుడు అధిక ఆశంక ఎట్లు కలుగును? అని ప్రశ్నించవచ్చును. శరీరమునకు తరువాతపోవు సుకృతవిషయము ఇది అని అనుమానించువాని అభిప్రాయము.

ఉపాసకుడు ఉపాసనము చేసి పూర్తిచేయుటకు వృష్టి, అన్నాదులు కావలసివచ్చుచున్నవి. అవి ఇతడి సుకృతముచేత లభించునవి. సుకృతములును విద్యావిరోధులు గనుక విద్యామాహాత్మ్యముచే

కథం తేషాం విరోధాద్వినాశ ఉచ్యతే । తత్రాహ- పాతే తు- ఇతి । శరీరపాతే తు తేషాం వినాశః, శరీర-పాతాదూర్ధ్వం తు విద్యానుగుణదృష్టఫలాని సుకృతాని నశ్యన్తీత్యర్థః ॥ 14॥

॥ ఇతి ఇతరాధికరణమ్ ॥ 8 ॥

నశించుచున్నవన్నచో, వృష్ట్యన్నాదులను ఇచ్చు సుకృతములును నశించిపోవచ్చును. విద్యానుగుణమైన వృష్ట్యన్నాదులను ఇయ్యగల సుకృతములను విద్యావిరోధి అని ఎట్లు చెప్పగలము? వృష్ట్యన్నాదులు లేక ఉపాసకులు ఉపవాసముండి ఉపాసనము చేయుట సాధ్యమా?

ఈ ప్రశ్నకు సమాధానము "పాతే తు ఇతి" అని సమాధానమును ప్రసాదించుచున్నారు. విద్యానుగుణసుకృతములు విద్యయొక్క నిష్పత్త్యర్థము ఉన్నవి. వాటికి నాశము చెప్పబడుట లేదు. శరీరము నశించిన పిదప- మరణమునకు తరువాత విద్యకు అనుగుణముగా వృష్టి, అన్నాదులను ఇయ్యగల సుకృతములు శరీరపతనానన్తరము నశించుచున్నవి.

ప్రశ్న :- ఆ పైన మరియొక ఆక్షేపము వచ్చుచున్నది. అదేమనగా, బ్రహ్మవిత్తుకు శరీరపతనానన్తరము తొలగునట్టి సుకృతమే యుండదు. దీనిని వివరించుచున్నాము-

వేదాంతి విరక్తుడు గనుక కామ్యకర్మమును చేయడు, చేయలేడు. అందుచే, కామ్యకర్మ శరీరపాతసమయమున పోవుచున్నది అని చెప్పుట కుదరదు. విరక్తుడైనను, వాసనావశముచేత కామ్యకర్మలను చేసినను, అది ఫలమును ఇచ్చియే తీరును. ఫలమును అనుభవించుటచేత వాసనావశముచే చెయ్యబడిన కామ్యకర్మ తొలగిపోవుచున్నది. కనుక, ఆ కామ్యకర్మయును లేదు.

అబుద్ధిపూర్వకమైన కామ్యకర్మ ఉన్నట్లు చెప్పుట కుదరదు. కామ్యకర్మ అంటేనే ఫలాన్ని ఉద్దేశించి బుద్ధిపూర్వకంగా చెయ్యబడేదే అవుతుంది. అబుద్ధిపూర్వకమైన కామ్యకర్మ అన్నదే ఉండదు. అబుద్ధిపూర్వకంగా చేస్తే అది కామ్యకర్మ కాదుగదా! కనుక శరీరపాతాదూర్ధ్వం పోయే సుకృతమే ఉండదు.

విద్యానిష్పత్త్యర్థం ఉన్న సుకృతాలు శరీరపతనాననంతరం నశిస్తున్నవని చెప్పటానికీ సాధ్యం కాదు. అవి విద్యానుగుణమైన వృష్టి, అన్నాదులను ఇచ్చి నశిస్తున్నవి. కనుక వేరు కర్మలు లేవు. "పాతే తు" అని దేనితో చెప్పబడింది?

**సమాధానం:-** విద్యానిష్పత్త్యర్థం అనుష్ఠించబడిన కర్మలు ఫలాన్ని ఇయ్యకుండా ఉండేవి ఎన్నో ఉండవచ్చు. వైరాగ్యశాలిగా ఉన్నప్పటికీ, వాసనావశంచేత- మోహంచేత- అనుష్ఠించబడిన కర్మలు కూడా ఫలాన్ని ఇయ్యకుండా ఉండనూ వచ్చు. ఉపాసకుడిమీద ఉన్న ప్రీతిచేత ఉపాసకుడికి ఆనుకూల్యం కలగటానికి అతడి బంధువులు చేసిన సుకృతకర్మలు చాలా ఉండవచ్చు. ఆ సుకృతాలు అన్నీ విద్యావిరోధులు గనుక అనుతాపాదులు ఉన్న విద్వాంసుడికి ఇవి సంబంధించకుండా శరీరపాత కాలంలో నశిస్తున్నాయి. ఈ ఆక్షేపసమాధానాలు "కామ్యం నేచ్ఛేద్విరక్తః" అని మొదలయ్యే అధికరణసారావళి 466వ శ్లోకంలో చెప్పబడి ఉన్నాయి.

ఇతరాధికరణము ముగిసెను.

## అనారబ్ధకార్యాధికరణమ్ (4-1-9 )

### ॥ సి. సూ ॥ అనారబ్ధకార్యే ఏవ తు పూర్వే తదవధేః ॥ 4-1-15 ॥

*బ్రహ్మవిద్యోత్పత్తేః పూర్వోత్తరభావినోః సుకృతదుష్కృతయో రశ్లేషవినాశావుక్తౌ; తతః పూర్వభావినోః సుకృతదుష్కృతయోః కిమవిశేషేణ వినాశః? ఉతానారబ్ధకార్యయోరేవేతి విశయే 'సర్వే పాప్మానః ప్రదూయన్తే' (ఛా. 5-24-3) ఇతి విద్యాఫలస్యావిశేష శ్రవణా ద్విద్యోత్పత్త్యుత్తరకాల-భావిన్యాశ్చ శరీరస్థితేః కులాలచక్రభ్రమణాదివ త్సంస్కారవశాదప్యుపపత్తే రవిశేషేణ ఇతి ప్రాప్తే ఉచ్యతే- అనారబ్ధకార్యే ఏవ తు పూర్వే ఇతి। విద్యోత్పత్తేః పూర్వే సుకృతదుష్కృతే అనారబ్ధకార్యే అప్రవృత్తఫలే*

---

## అనారబ్ధకార్యాధికరణము (4-1-9 )

### ॥ సి. సూ ॥ అనారబ్ధకార్యే ఏవ తు పూర్వే తదవధేః ॥ 4-1-15 ॥

సూత్రార్థము:- **పూర్వే అనారబ్ధకార్యే ఏవ తు** = వెనుక చేసిన పుణ్యపాపములలో ఫలమును ఇచ్చుట ఆరంభించని పుణ్యపాపములే (నశించుచున్నవి) **తదవధేః** = ప్రారబ్ధకర్మము, నశించు శరీరముయొక్క చివరివరకును (బ్రహ్మప్రాప్తికి) కాలవిలంబమును (వేదవాక్యము) చెప్పుటచేత.

సంగతి:- వెనుకటి అధికరణములలో బ్రహ్మవిద్యోత్పత్తికి పూర్వము చెయ్యబడిన సుకృతదుష్కృతములకు నాశము చెప్పబడినది. అచ్చట చెప్పబడిన పాపములే నశించిపోవును అని విశేషించి చెప్పనందున, అన్ని సుకృతదుష్కృతములును నశించుచున్నవి అను శంకకు పరిహారము కొఱకు ఈ అధికరణము చెప్పబడుచున్నది.

విషయము:- ప్రారబ్ధకర్మని గురించినది

సంశయము:- పూర్వము చేయబడిన సుకృతదుష్కృతములన్నియు నశించుచున్నవా? లేక అనారబ్ధకార్యమైన సంచితములు మాత్రము నశించుచున్నవా?

సంశయము వచ్చుటకు కారణము:- ఒక శ్రుతి "సర్వే పాప్మానః ప్రదూయన్తే" (ఛాం. 5-2-13) అని అన్ని పాపములుపోవునని చెప్పుచున్నది. మరియొక శ్రుతి, "తస్య తావదేవ చిరమ్" అని శరీరావసానపర్యన్తము కర్మ ఉన్నట్టుగనే విలంబమును చెప్పుచున్నది. వీటిలో ఏది యుక్తిమంతమైనది అని తెలియనందున సంశయము కలుగుచున్నది.

పూర్వపక్షము:- "సర్వే పాప్మానః ప్రదూయన్తే"(ఛాం. 5-2-13) అను శ్రుతి, విద్యామాహాత్మ్యముచే అన్ని సుకృతదుష్కృతములకును దర్శనసమానాకారవిద్యానిష్పత్తివేళలో నశించునని చెప్పుచున్నది.

శరీరమనునది కర్మకృతము. అన్ని కర్మలును నశించినచో శరీరము ఎట్లుండును అని శంకించవలదు. కులాలుడు చక్రమును త్రిప్పి వదలివేసినపిదపకూడ చక్రము తిరుగుచున్నట్లే అన్ని కర్మలును నశించిన తరువాతకూడ సంస్కారవశముచేత ఈ శరీరము ఇంకను ఉంటున్నది. ఇదియే "తస్య తావదేవ చిరం" అన్న శ్రుతి చెప్పుచున్నది. కనుక అన్నికర్మలును నశించుచున్నవి.

సిద్ధాంతము:- విద్యోత్పత్తికి పూర్వము చెయ్యబడిన సుకృతదుష్కృతములలో, "అనారబ్ధ-

*ఏవ విద్యయా వినశ్యతః; కుతః? తదవధేః - "తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే; అథ సంపత్స్యే"(ఛాం. 6-14-2) ఇతి శరీరపాతవిలంబావధిశ్రుతేః। న చ పుణ్యాపుణ్యకర్మజన్య భగవత్ప్రీత్యప్రీతి వ్యతిరేకేణ శరీరస్థితిహేతుభూత సంస్కారసద్భావే ప్రమాణమస్తి ॥ 15 ॥*

*॥ ఇతి అనారబ్ధకార్యాధికరణమ్ ॥ 9 ॥*

కార్యే- అప్రవృత్తఫలే ఏవ" - ఫలమును ఇచ్చుట ఆరంభించని కర్మలే అనగా సంచితములే- విద్యచే నాశమును పొందుచున్నవి. ప్రారబ్ధకర్మలు నాశమును పొందుట లేదు. ఎందులకనగా, "తదవధేః - తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే(ఛాం. 6-14-3)- తస్య - ఆ బ్రహ్మవేత్తయొక్క, (ఉపాసకునికి) తావదేవ- ప్రారబ్ధకర్మావసాన- శరీరావసానపర్యంతమే, చిరమ్- ఆలస్యము, విలంబము." అని చెప్పబడియున్నది. కనుక, విద్యారంభమునకు పూర్వమున్న సమస్తపాపములును తొలగిపోవును అనగా ప్రత్యక్ష, అనుమాన, శాస్త్రబాధకములు కలుగుచున్నవి. అనగా, విద్యావంతుడు సుకృతదుష్కృతఫలములను అనుభవించుటను మనము ప్రత్యక్షముగా చూచుచున్నాముగదా! దానికి బాధము వచ్చును. "ప్రారబ్ధకర్మలు లేనిచో తదనుకూల ప్రవృత్తినివృత్తులు కలుగవచ్చును" అని అనుమానబాధము కూడ వచ్చును. శ్రుతివిరోధమునుకూడ ఉపపాదించితిమి. కనుక ప్రారబ్ధము కంటె ఇతరమైన పాపములే నశించుచున్నవి.

పుణ్యాపుణ్యములచే కలుగు భగవత్ప్రీత్యప్రీతులకంటే వేరుగా శరీరము ఉండుటకు కారణమైన సంస్కారమొకటి ఉన్నదనుటకు ప్రమాణము లేదు. కనుక ప్రారబ్ధకర్మఫలమును అనుభవించియే తీరవలెను.

ప్రశ్న:- ప్రారబ్ధకర్మమైన పుణ్యాపుణ్యఫలమైన సుఖదుఃఖములను అనుభవించుటచేత ఆ కర్మలు నశించుచున్నవని చెప్పబడినది. ఇది యుక్తము తోచుట లేదు.

జన్మాన్తరకృతం పాపం వ్యాధిరూపేణ బాధతే।
తచ్ఛాన్తిరౌషధైర్దానైః జపహోమార్చనాదిభిః॥

"జన్మాంతరములలో చేసిన కర్మ- పాపమనునది వ్యాధిగా వచ్చి మనలను హింసించుచున్నది. ఔషధము తిననందువలనను, దానము చేయుటచేతను, జపహోమార్చనాదులను చేయుటచేతను కొన్ని కర్మలు అనుభవించకనే నశించు"నని తెలియుచున్నది.

జన్మకర్మ చ మే దివ్యమేవం యో వేత్తి తత్త్వతః ।
త్యక్త్వా దేహం పునర్జన్మ నైవ మామేతి సోర్జున॥

"అవతారరహస్యచిన్తనము చేయువానికి ప్రారబ్ధకర్మ అంతయు తొలగిపోయి ఆలస్యము లేకుండ ఆ శరీరావసానమునందే మోక్షము లభించును - నన్ను పొందుదుడు" అని కృష్ణుడు గీతలో ప్రసాదించెను గదా! అట్లు ప్రారబ్ధకర్మ అంతయు అనుభవించకనే తొలగిపోయి నశించుచున్నది. ఈ రెండు ప్రమాణములకును విరుద్ధముగా ప్రారబ్ధకర్మను అనుభవించియే తీరవలెను అని ఈ అధికరణములో ఎట్లు సిద్ధాంతము చెయ్యబడినది? అను ఆక్షేపము వచ్చుచున్నది.

## అగ్ని హోత్రాద్యధికరణమ్ (4-1-10 )

**॥ సి. సూ ॥ అగ్ని హోత్రాది తు తత్కార్యాయైవ తద్దర్శనాత్ ॥ 4-1-16 ॥**

'ఇతరస్యాప్యేవమసంశ్లేషః' ఇతి విద్యాబలాత్సుకృతస్యాప్యసంశ్లేష ఉక్తః, అగ్నిహోత్రాదీనాం

---

సమాధానము:- వెనుక మీరు చెప్పిన ప్రాయశ్చిత్తములచేత తొలగని ప్రారబ్ధములనే అనుభవించి తొలగించుకొనవలెను అని చెప్పబడినది. ఇదియే సూత్రకారులయు, స్మృతి, ఇతిహాస పురాణములయొక్కయు, ఇతరఋషులయు అభిప్రాయము. కనుక ఏ విరోధమును లేదు. దీనిని ప్రాయశ్చిత్తోజ్ఝితానాం నను ఫలనియతిః సూత్రకారాద్యభీష్టా॥ అని 468వ అధికరణసారావళి శ్లోకములో దేశికులు స్పష్టము చేసిరి. ఇదే విషయమును శ్రీభాష్యసింహాసనాధిపతులైన నడాదూర్ వరదదేశికులును "ప్రారబ్ధం పరిభుజ్య కర్మశకలం" అను పరమార్థశ్లోకద్వయములో ప్రసాదించిరి.

అనారబ్ధకార్యాధికరణము ముగిసినది.

## అగ్నిహోత్రాద్యధికరణము (4-1-10 )

**॥ సి. సూ ॥ అగ్నిహోత్రాది తు తత్కార్యాయైవ తద్దర్శనాత్ ॥ 4-1-16 ॥**

సూత్రార్థము:- **అగ్నిహోత్రాది తు** = అగ్నిహోత్రము మొదలైన ఆశ్రమధర్మములలో అంటే, (వాటి ఫలము అంటకపోవుట కుదరదు గనుక) అనుష్ఠించదగినవే. **తత్కార్యాయైవ** = బ్రహ్మవిద్య అనే కార్యముకొఱకేగదా (వాటిని అనుష్ఠించుట) **తద్దర్శనాత్** = ఆ విధముగా వేదము చెప్పుచున్నది గనుక.

సంగతి:- "ఇతరస్యాప్యేవం అసంశ్లేషః"(4-1-14) అను సూత్రములో విద్యా-మాహాత్మ్యముచే సుకృతమునకును అశ్లేషము చెప్పబడినది. నిత్యనైమిత్తికములైన అగ్నిహోత్రము మొదలైన తన ఆశ్రమధర్మములును, సుకృతసామాన్యాంతర్గతములుగనుక, దాని ఫలములకును అశ్లేషము చెప్పబడినట్లయినది. కనుక కోరికలేనివారు అగ్నిహోత్రాది ఆశ్రమకర్మలను అనుష్ఠించ నవసరము లేదను శంకను తొలగించుటకు ఈ అధికరణమును ప్రసాదించిరి.

విషయము:- అగ్నిహోత్రాది ఆశ్రమధర్మములు.

సంశయము:- అగ్నిహోత్రాది ఆశ్రమకర్మములను చెయ్యవలెనా లేక అవసరము లేదా?

సంశయము వచ్చుటకు కారణము:- ఇతరాధికరణములో అన్ని సుకృతములకును నాశము చెప్పబడినది. "తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసా అనాశకేన" (బృ. 6-4-22)అన్న శ్రుతి ఉపాసనాంగంగా యజ్ఞాదికర్మలను చెయ్యవలెను అని చెప్పుతున్నది. జీవితకాలపర్యంతము యావదాయుషం ఉపాసనం చేయాలి అన్నచో ఉపాసనాంగంగా అగ్నిహోత్రాది కర్మలనికూడా యావదాయుషమూ చెయ్యవలెననియేగదా! కనుక అగ్నిహోత్రాదికర్మలను సుకృతములకు అశ్లేషము లేదు అని చెప్పవలెను గనుక అగ్నిహోత్రాది ఆశ్రమకర్మలను వదలకుండ అనుష్ఠించవలెనని

*నిత్యనైమిత్తికానాం స్వాశ్రమధర్మాణామపి సుకృతత్వ సామాన్యేన తత్ఫలస్యాశ్లేషాదనిచ్ఛతోఽననుష్ఠానే ప్రాప్తే ఉచ్యతే- అగ్నిహోత్రాది తు- ఇతి। తుశబ్దః సుకృతాన్తరేభ్యో విశేషణార్థః, అగ్నిహోత్రాద్యాశ్రమధర్మాః ఫలాశ్లేషాసమ్భవాదనుష్ఠేయా ఏవ, తదసమ్భవశ్చ తత్కార్యార్థత్వాత్తేషామ్; విద్యాఖ్యకార్యాయైవ హి విదుషోఽగ్నిహోత్రాద్యనుష్ఠానమ్, కథమిదమవగమ్యతే? తద్దర్శనాత్, దృశ్యతే హి 'తమేతం*

చెప్పవలెను. లేదా, "తమేతం వేదానువచనేన" అను శ్రుతి, ఉపాసననిష్పత్తికి పూర్వము ఉపాసనము స్థిరపడుటకు పూర్వము అనుష్ఠించవలసినవాటిని చెప్పుచున్నదని భావించి దర్శన- సమానాకారమైన ఉపాసననిష్పత్త్యనన్తరము నిత్యకర్మానుష్ఠానములను చేయనవసరము లేదు" అని చెప్పవలెనా? ఇందులో ఏ పక్షము యుక్తియుక్తమో అని నిశ్చయించలేనందున సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** అగ్నిహోత్రాది నిత్యనైమిత్తికకర్మలును సుకృతమందు చేరినవే. దానివలన వాటి ఫలములకును అశ్లేషము చెప్పవలెను. ప్రయోజనము లేని కర్మలను చేయుటకు ఎవరికిని కోరిక ఉండదు. అందుచేత ఇష్టములేనివారు అగ్నిహోత్రాది ఆశ్రమకర్మలను అనుష్ఠించనక్కరలేదు.

ఈ విధముగా చెప్పిన పూర్వపక్షి అభిప్రాయమును వివరించి చెప్పుచున్నాము. నిత్యనైమిత్తిక కర్మలకు ఫలము ఉండును అన్నచో, అశ్లేషవచనమునకు విషయము లేకపోవును. అందుకని ఇతర విషయములను కల్పించుకొని వాటిని అశ్లేషవిషయముగా చేసినను, వాటికిని ఫలము ఉండునని చెప్పుట కుదరదు.

ప్రతిరోజును విచ్ఛేదములేకుండ ఉపాసనమును అనుష్ఠించుటయే- ఉపాసనానువృత్తియే- ఫలమనియు చెప్పుట కుదరదు కర్మను అనుష్ఠించినట్లు ఉపాసనమును అనుష్ఠించుటచేతనే విద్యయొక్క అనువృత్తి అవిచ్ఛిన్నముగా నుండును. అందుచే నిత్యకర్మానుష్ఠానమువలననే విద్యానువృత్తి కలుగును అని చెప్పుట కుదరదు.

విద్యానువృత్తికి ప్రతిబంధకమైన పాపనివృత్తియే కర్మానుష్ఠానమునకు ఫలమనియు చెప్పుట కుదరదు. విద్యారంభమునకు పూర్వము చెయ్యబడిన పాపము విద్యచే నశించిపోయినది. విద్య సిద్ధించినపిదప విద్వానుడికి బుద్ధిపూర్వకమైన పాపమునకు ప్రసక్తియే లేదు. బుద్ధిపూర్వకముగా చెయ్యబడిన- ప్రామాదికమైన పాపము విద్యామాహాత్మ్యముచే సంబంధించదు అని చెప్పబడినది. కనుక ప్రతిబంధక పాపమే ఉండదు గనుక విద్యాప్రతిబంధకపాపనివృత్తియే ఫలమని చెప్పుట కుదరదు.

నిత్యనైమిత్తికములను వదలకూడదు. వాటిని వదలినచో పాపము వచ్చును. కర్మభ్రష్టుడు కాకపోవుటకు ఆశ్రమధర్మములను అనుష్ఠించవలెను అని శ్రమించి సమర్థించవచ్చును. అయినను, విద్యకొఱకు వాటి అనుష్ఠానము అనునది సిద్ధించదు. కనుక విద్యానిష్పత్త్యర్థము ఆశ్రమకర్మములను అనుష్ఠించవలెననుట సరికాదు.

"తమేతం వేదానువచనేన"(బృ.6-4-22) అను శ్రుతి, దర్శనసమానాకారమైన ఉపాసన నిష్పత్త్యర్థము యజ్ఞాదులను చేయవలెనని చెప్పుచున్నదే తప్ప ప్రతిదినము చేయవలెనని చెప్పుట లేదు అని గమనించవలెను.

*వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసాऽనాశకేన'(బృ.6-4-22) ఇత్యాదినా ऽగ్నిహోత్రాదీనాం విద్యాసాధనత్వమ్। విద్యాయాశ్చాప్రయాణాదభ్యాసాధేయాతిశయాయా అహరహ రుత్పాద్యత్వాత్తదుత్పత్త్యర్థమాత్రమకర్మాప్యహరహరనుష్ఠేయమేవ, అన్యథాऽऽశ్రమకర్మలోపే దూషితాన్తఃకరణస్య విద్యోత్పత్తిరేవ న స్యాత్ ॥ 16 ॥*

**సిద్ధాంతము:**– "అగ్నిహోత్రాదితు" ఇతి తుశబ్దము ఇతరసుకృతములకంటె వైలక్షణ్యమును చూపుచున్నది. అగ్నిహోత్రాదికర్మలఫలములకు అశ్లేషము కలుగుటలేదుగనుక ఆశ్రమధర్మములను అనుష్ఠించుటయే కావలెను. విద్యానిష్పత్త్యర్థము ఆశ్రమధర్మములను అనుష్ఠించుటచేత వాటికి అశ్లేషము చెప్పబడలేదు. విద్యయను కార్యసిద్ధికే ఆశ్రమధర్మములు అనుష్ఠించబడుచున్నవి. దేనిచే ఈ విధముగా చెప్పబడుచున్నది అన్నచో, తద్దర్శనాత్– "తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసానాశకేన" (బృ. 6. 4. 22) అనే శ్రుతిలో యజ్ఞాదులను విద్యకి అంగముగా చెప్పియున్నది. విద్యమాత్రము మరణపర్యన్తము అనుష్ఠించబడవలెను. ప్రతిదినమును కర్మానుష్ఠానమును చేయనిచో, కలుగు పాపము మనస్సుయొక్క స్థితిని పాడుచేయును దానిచే ఉపాసనము చేయుట కుదరక పోయి, దానివలన మనశ్శుద్ధి కలుగుటకు (మనోనైర్మల్యమును పొందుటకు) నిత్యనైమిత్తికకర్మలను అనుష్ఠించుచునే యుండవలెను. యజ్ఞాది శ్రుతి యావదాయుషము విద్యాంగముగా కర్మలను అనుష్ఠించవలెననియే చెప్పుచున్నది. దర్శనసమానాకారమైన విద్యానిష్పత్తిపర్యన్తము కర్మలను చేసినచో చాలును అని సంకోచించుటకు కారణము ఏదియును లేదు. ప్రత్యుత "స ఖల్వేవం వర్తయన్ యావదాయుషమ్" (ఛాం. 8–15–1)అను శ్రుతి కర్మములను జీవించియున్నంతకాలమునుచేయవలెను అని స్పష్టముగనే చెప్పియున్నది. కనుక, యజ్ఞాదిశ్రుతికూడ యావదాయుషము కర్మములను చెయ్యవలెను అని చెప్పినట్లే నిర్ణయించవలెను.

నిత్యకర్మానుష్ఠానమును ఫలములేనిదిగా చెప్పుటకు కుదరదు. విద్యను అనుష్ఠించుచున్నంత వరకును విద్యాసహకారియైన ఆశ్రమకర్మలతో కలిపియే అనుష్ఠించవలెను. అట్లు కాక విద్యాసహకారి యైన నిత్యకర్మలకు ఉపాసనమధ్యమున బుద్ధిపూర్వకముగా త్యాగము కలిగినచో– తెలిసియే నిత్యకర్మానుష్ఠానములను వదలివేసినచో శాస్త్రవిరుద్ధముగా చేసినందువలన కలుగు ప్రత్యవాయముచే మనసు కలతచెంది దోషయుక్తమై విద్యానువృత్తిని అడ్డుకొనుచున్నది. ఎప్పుడును ఉపాసనకు విచ్ఛేదములేకుండ చేయవలెను అను ఆశయే చిత్తదోషముచేత నశించును. అంతిమప్రత్యయమునకు విరోధియైన నిషిద్ధానుష్ఠానమందు రుచియు కలుగవచ్చును. కనుక దర్శనసమానాకార ప్రత్యయానన్తరమును యావజ్జీవము విద్యకొఱకు అగ్నిహోత్రాది ఆశ్రమకర్మలను అనుష్ఠించుచునే ఉండవలెను. 16

అగ్నిహోత్రాది సాధుకృత్యములను ఉపాసనార్థము చేయవలెను గనుక, విద్యను చేసినందువలన ఆ సుకృతములు తొలగిపోవుచున్నవి. విద్యోత్పత్తికి పూర్వము చెయ్యబడినవియును "యావత్సంపాతం ఉషిత్వా" (ఛాం. 5. 10. 5) "సంపతతి అనేనేతి సంపాతః కర్మశేషః। యావత్ కర్మశేషం ఉషితేత్యర్థః–

*యది అగ్నిహోత్రాదిసాధుకృత్యా విద్యోత్పత్త్యర్థాః, విద్యోత్పత్తేః ప్రాచీనం చ సుకృతం 'యావత్సమ్పాతముషిత్వా' (ఛా.5-10-5) 'ప్రాప్యాన్తం కర్మణః' (బృ. 6-4-6) ఇత్యనుభవేన నష్టమ్। భుక్తశిష్టం చ ప్రారబ్ధఫలమ్ 'సుహృదః సాధుకృత్యామ్' ఇత్యస్య కో విషయః? తత్రాహ-*

**॥ సి. సూ ॥ అతోऽన్యాపి హ్యేకేషాముభయోః ॥ 4-1-17 ॥**

*అతోऽగ్నిహోత్రాదిసాధుకృత్యాయా విద్యోత్పత్త్యర్థాయా అన్యాపి విద్యాధిగమాత్ పూర్వోత్తరయో రుభయోరపి పుణ్యకర్మణోః ప్రబలకర్మ ప్రతిబద్ధఫలాసాధుకృత్యాऽనన్తా సమ్భవత్యేవ, తద్విషయమిదమేకేషాం శాఖినామ్ వచనమ్ 'తస్య పుత్రా దాయముపయన్తి సుహృదస్సాధుకృత్యా' మితి । విద్యయాऽశ్లేషవినాశశ్రుతిశ్చ తద్విషయా। ॥17 ॥*

*అనుష్ఠితస్యాపి కర్మణః ఫలప్రతిబన్ధసమ్భవం పూర్వోక్తం స్మారయతి-*

**॥ సి. సూ. ॥ యదేవ విద్యయేతి హి ॥ 4-1-18 ॥**

---

సంపాతమనగా కర్మశేషము అని అర్థము. కర్మశేషమున్నంతవరకును ఉండి, "ప్రాప్యాన్తం కర్మణః" (బృ. 6.4.6) కర్మణః అన్తం భోగేన అవసానం ప్రాప్య కృత్స్నఫలం భుక్త్వేతి యావత్ – కర్మఫలమును పూర్తిగాఅనుభవించి చివరికివచ్చి అని శ్రుతులలో చెప్పినట్లుగా ఫలానుభవంచేత నాశాన్ని పొందుతున్నది. ప్రారబ్ధంకూడా అనుభవించే తొలగేది. ఇట్లా ఒక్క సుకృతమైనా లేకుండా ఉండగా, "సుహృదః సాధుకృత్యాం– స్నేహితులు ఉపాసకుడి మరణానంతరం ఉపాసకుడు చేసిప పుణ్యకర్మల ఫలాన్ని పొందుతారు" అని అనటానికి ఏది విషయం? అంటే సుకృతం ఎక్కడున్నది? అని ప్రశ్న వస్తున్నది.

దీనికి సమాధానం చెప్తున్నారు తరువాతి సూత్రంలో.

## ॥ సి. సూ ॥ అతోऽన్యాపి హ్యేకేషాముభయోః ॥ 4-1-17 ॥

సూత్రార్థము:– **అతః** = అగ్నిహోత్రం మొదలైన పుణ్యములకంటె **అన్యా అపి** = (ప్రబలమైన కర్మలవలన అడ్డుకొనబడిన) ఇతరపుణ్యములును, **ఉభయోః** = విద్యోత్పత్తికి పూర్వము, తరువాతను వచ్చినట్టి పుణ్యములలోనున్న **ఏకేషాం హి** = వాటిని విషయంగా "సుహృదః సాధుకృత్యామ్" అనే శాట్యాయనవాక్యము కలిగినదిగదా!

విద్యోత్పత్త్యర్థము చెయ్యబడిన అగ్నిహోత్రాదిసాధుకృత్యములకంటే ఇతరమైన, విద్యానిష్పత్తికి పూర్వమూ, తరువాతా చెయ్యబడిన పుణ్యకర్మలును, వాటికంటె ప్రబలమైన కర్మముచేతఅడ్డుకొనబడి, ఫలము ఇవ్వకుండా ఉన్నటువంటి సాధుకృత్యములు లెక్కలేనన్ని ఉన్నవి. వాటిని విషయంగా తీసికొని "తస్య పుత్రా దాయముపయన్తి సుహృదః సాధుకృత్యామ్"(శాట్యాయన) – ఉపాసకుడు మరణించిన తరువాత ఉపాసకుని పుత్రులు ఉపాసకుని సొత్తును పొందుచున్నారు. సుహృత్తులు– స్నేహితులు సాధుకృత్యములను పొందుచున్నారు." అని చెప్పబడింది, 17

## ॥ సి. సూ ॥ యదేవ విద్యయేతి హి ॥ 4-1-18 ॥

**యదేవ విద్యయా ఇతి హి** = "యదేవ విద్యయా కరోతి తదేవ వీర్యవత్తరమ్ (ఛాం. 1-1-10)– ఉద్గీథవిద్యతో చేర్చి అనుష్ఠించబడిన కర్మయొక్క ఫలము నిరాటంకమైనది యగును." అని చెప్పినందున

*'యదేవ విద్యయా కరోతి తదేవ వీర్యవత్తరమ్ (ఛా.1-1-10) ఇత్యుద్గీథవిద్యాయాః క్రతుఫలాప్రతిబన్ధఫలత్వవచనేనానుష్ఠితస్యాపి కర్మణః ఫలప్రతిబన్ధ సూచ్యతే హి । అతో విదుషోఽనుష్ఠితప్రతిబద్ధఫలవిషయం 'సుహృదః సాధుకృత్యామ్' ఇతి శాట్యాయనికమ్ ॥ 18 ॥*

॥ అగ్నిహోత్రాద్యధికరణం సమాప్తమ్ ॥ 10 ॥

"కొన్ని ఆటంకములచేత కొన్నికర్మల ఫలము అడ్డుకొనబడి ఉంటుంది" అని తెలుస్తున్నదిగదా! (యదేవ కర్మేత్యర్థః విద్యా ఉపాసనమ్। కర్మణాం వీర్యవత్తరత్వం నామ, ప్రబలకర్మాన్తర అప్రతిబద్ధఫలకత్వమ్) యదేవ- ఏ కర్మని, విద్యయా- ఉద్గీథవిద్యతో చేరినదై, కరోతి చేయుచున్నాడో, తదేవ అదియే వీర్యవత్తరం భవతి- ఫలమును సాధించి ఇచ్చునదిగా అగుచున్నది. కర్మకి వీర్యవత్తరమగుట అనినచో, ప్రబలమైన కర్మాన్తరముచే అడ్డుకొనబడని ఫలమును గలదియై యుండుట. ఉద్గీథవిద్యకు ఆటంకములేని క్రతుఫలము చెప్పబడియుండుటచే- అనగా, క్రత్వంగముగా - యాగమునకు అంగముగా ఉద్గీథో-పాసనమును చేసి యాగమును చేసినచో, ఆ యాగము ప్రతిహతములేని క్రతుఫలమును గలదిగా నుండును అని చెప్పుటచేత, అనుష్ఠించబడిన కర్మయొక్క ఫలమునకు ప్రతిబంధకము ఉన్నదని తెలియుచున్నదిగదా! కనుక, విద్వాంసునిచే అనుష్ఠించబడి ప్రబల ప్రతిబంధకములచే అడ్డుకొనబడిన ఫలవిషయము సుహృదః సాధుకృత్యామ్ అనునది.

### ప్రశ్న-సమాధానము:-

ప్రశ్న: మూడవ అధ్యాయము నాలుగవ పాదమందు "సర్వాపేక్షాచ యజ్ఞాదిశ్రుతేః అశ్వవత్" (3-4-26)అను సూత్రమందు విద్యయనునది, సర్వకర్మాపేక్ష గలది అని స్థాపించబడినది. "సహకారిత్వేన చ"(3-4-33) అను సూత్రమందును "తమేతం వేదానువచనేన" ఇత్యాది శ్రుతివాక్యముచే విద్యాసహకారిగా కర్మను అనుష్ఠించవలెను అని చెప్పబడినది. అగ్నిహోత్రాద్యధికరణములోకూడ విద్యానిష్పత్త్యర్థము అగ్నిహోత్రాది ఆశ్రమకర్మలను అనుష్ఠించవలెనని మరల నిర్ధారించబడినదిగదా! ఇది పునరుక్తికాదా?

సమాధానము- సర్వాపేక్షాధికరణమునకు ముందరి అధికరణములో ఊర్ధ్వరేతస్సులైన సన్యాసులు విద్యాంగముగా అగ్న్యాధానములను చేయనవసరములేదని నిర్ణయించేరు. తరువాత విద్య అనేది యజ్ఞాదికర్మాపేక్షలేకుండా మోక్షాన్ని ఇస్తుంది అంటే గృహస్థుడుకూడా యజ్ఞాదికర్మలు చెయ్య వలసిన అవసరం లేదా అనేసందేహము వచ్చినప్పుడు దాని పరిహారార్థం సర్వాపేక్షాధికరణం వచ్చింది.

విహితత్వాధికరణంలో యజ్ఞాదులకు కేవల ఆశ్రమాంగకత్వమూ, విద్యాంగకత్వము ఎట్లు కూడును? వాటికి నిత్యఫలసాధనత్వంకూడా ఉన్నది అనిత్యఫలసాధనత్వమూ ఉన్నది అని చెప్పినట్లు అయినది. అందుచేత పరస్పరవిరోధమైన ఫలములకు సాధనమగుచున్నది అనే విరోధం వస్తుంది గనుక కేవల ఆశ్రమాంగత్వం సంభవించదు అన్న ఆక్షేపం వస్తే, వినియోగపృథక్త్వంచేత- వాటి ఉపయోగం వేరు వేరుగా ఉన్నందున- రెండింటినీ ఉద్దేశించి చెయ్యాలి గనుక విరోధం లేదు అని "సహకారిత్వేన చ" (3-4-33) అన్న సూత్రంలో విద్యాసహకారిగాకూడా కర్మానుష్ఠానం చెయ్యవలెను అన్నారు.

## ఇతరక్షపణాధికరణమ్ (4-1-11 )

**॥ సి. సూ ॥ భోగేన త్వితరే క్షపయిత్వాऽథ సంపద్యతే ॥ 4-1-19 ॥**

యయోః పుణ్యపాపయోర్శ్లేషవినాశావుక్తౌ తాభ్యామితరే ఆరబ్ధకార్యే పుణ్యపాపే కిం విద్యాయోనిశరీరావసానే? ఉత తచ్ఛరీరావసానే? శరీరాన్తరావసానే వేత్యనియమః? ఇతి సంశయే

అగ్నిహోత్రాద్యధికరణంలో "సుకృతానికీ అశ్లేషమూ ఉన్నది అని వెనుకటి అధికరణంలో నిర్ణయం చెయ్యబడటంచేత" సుకృతంలో చేరిన అగ్నిహోత్రాదికర్మలను అనుష్ఠించనక్కరలేదు అనే ఆక్షేపం వస్తే ఉపాసనార్థం కర్మలను అనుష్ఠించవలెను అని చెప్పబడింది. అందుచేత వెనుక చెప్పినదానినే చెప్పుతున్నట్లు చెప్పబడే దోషానికి ప్రసక్తే లేదు.

అగ్నిహోత్రాధికరణం ముగిసినది.

## ఇతరక్షపణాధికరణము (4-1-11 )

**॥ సి. సూ ॥ భోగేనతు ఇతరే క్షపయిత్వాऽథ సంపద్యతే ॥ 4-1-19 ॥**

**సూత్రార్థము:-** **ఇతరే** = (సంచితకర్మముకంటె)ఇతరమైన ప్రారబ్ధపుణ్యపాపములను **భోగేన** = సుఖదుఃఖానుభవముచే, **క్షపయిత్వా** = నశింపచేసి **అథ** = వాటి ఫలములను అనుభవించినపిదప **సంపద్యతే** =ఉపాసకుడు బ్రహ్మమును పొందుచున్నాడు.

**సంగతి:-** అనారబ్ధకార్యములైన - ఫలములను ఇచ్చుటకు ఆరంభించని సంచిత-పుణ్యపాపములకు వినాశము వెనుక చెప్పబడినది. ఆరబ్ధకార్యములైన - ఫలములను ఇచ్చుటకు ఆరంభించిన ప్రారబ్ధపుణ్యపాపముల వినాశవిషయమున విశేషము ఈ అధికరణములో చెప్పబడుచున్నది.

**విషయము:-** ప్రారబ్ధకర్మ.

**సంశయము:-** ప్రారబ్ధపుణ్యపాపములు విద్య ఆరంభించబడిన శరీరముయొక్క అంతమున నాశమును పొందుచున్నవా? లేక ఉపాసనము ఆరంభించిన శరీరముయొక్క అవసానమున - నశించిననే వేరు శరీరావసానముననే అను నియమము చెప్పుట కుదరదు గనుక, అనియమేన (ఎల్లప్పుడును) వినాశము చెప్పబడుచున్నదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** "తస్య తావదేవ చిరమ్..."(ఛాం.6-14-3) అను శ్రుతిలో "తస్య తావత్" అని యుండుటచే ప్రారబ్ధకర్మఫలభోగావసాన శరీరావసానము వరకును (ప్రారబ్ధకర్మఫలమును అనుభవించి నశించిన శరీరముయొక్క నాశమువరకును) ప్రారబ్ధకర్మను అనుభవించి మోక్షమును పొందుచున్నాడు అని చెప్పబడుచున్నదా? లేక "అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరఞ్జ్యోతిరుపసంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే।" (ఛాం.8-3-4) అను శ్రుతిప్రకారము, విద్యాయోనిశరీరావసానమందే మోక్షమా? శ్రుతి విప్రతిపత్యా- శ్రుతులలో మారిన భావములు చెప్పబడుటచేత సంశయము కలుగుచున్నది. వీటిలో ఏ పక్షము యుక్తియుక్తముగా నున్నదో నిశ్చయము చేయలేనందున సంశయము కలుగుచున్నది.

*'తస్య తావదేవచిరం యావన్నవిమోక్ష్యే అథ సంపత్స్యే'(ఛాం.6-14-2) ఇతి తచ్ఛరీరవిమోక్షావసానత్వ-శ్రవణాత్తదవసానే-*

*ఇతి ప్రాప్త ఉచ్యతే- భోగేన తు- ఇతి। తుశబ్దః పక్షవ్యావృత్త్యర్థః, ఇతరే ఆరబ్ధకార్యే పుణ్యపాపే స్వారబ్ధఫలభోగేన క్షపయిత్వా(అథ) తత్ఫలభోగ సమాప్త్యనన్తరం బ్రహ్మ సంపద్యతే। తే చ పుణ్యపాపే*

---

**పూర్వపక్షము:-** "అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య" అను శ్రుతి "మరణమానాల్ వైకున్ఠమ్- మరణమైనచో వైకుంఠము" అని సందేహమునకు అవకాశము లేకుండ స్పష్టముగా చెప్పియుండుటచే విద్యాయోనిశరీరావసానమందు ప్రారబ్ధపుణ్యపాపములు పోవుచున్నవి అనియే చెప్పవలెను. "ధూత్వా శరీరం అకృతం కృతాత్మా" అను శ్రుతిలో 'శరీరమును వదలి' అని (శరీరమని ఏకవచనముగా చెప్పబడుటచే) చెప్పియున్నదేతప్ప, "శరీరములను వదలి" అని చెప్పలేదు. అందుచేత కూడ, ఉపాసనము చేయుటకు ఆరంభించిన దేహముయొక్క అవసానమందు అని చెప్పుటయే యుక్తియుక్తమగును. "తస్య తావదేవ చిరమ్"(ఛాం. 6-14-3) అను శ్రుతి ప్రారబ్ధకర్మావసానమును చెప్పుచున్నట్లు కనబడినను, "ఏష సంప్రసాదః అస్మాత్ శరీరాత్ సముత్థాయ"(ఛాం. 8-3-4) అను శ్రుతి ఏతద్దేహావసానమును స్పష్టముగా చెప్పియుండుటను అనుసరించి, ఆ శ్రుతికూడ విద్యాయోని శరీరావసానమునే చెప్పుచున్నదని గ్రహించవలెను.

**సిద్ధాంతము:-** భోగేన తు ఇతరే క్షపయిత్వా ఇతి అని సూత్రాన్వయము. "తు" శబ్దము పూర్వపక్షమును వ్యావృత్తి చేయుచున్నది. ఇతరే- ఆరబ్ధకార్యములైన పుణ్యపాపములు. భోగేన- తాను ఇచ్చుటకు ఆరంభించిన) ఫలభోగములచేత అనగా వాటివలన కలిగిన సుఖదుఃఖానుభవములచే నశించునట్లు చేసి. అథ-వాటి ఫలములను అనుభవించిన తరువాత, సంపద్యతే-బ్రహ్మమును పొందుచున్నాడు. అనేకశరీరములలో అనుభవించదగినవిగా నున్నచో, వాటి చివరన బ్రహ్మమును పొందుచున్నాడు. ప్రారబ్ధకర్మయొక్క ఫలములను అనుభవించియే తీర్చుకొనవలెను గనుక, అనియమము చెప్పబడుచున్నది. "తస్య తావదేవ చిరమ్" అను శ్రుతిలో దేహమును గురించిగాని, అవధినిగురించిగాని చెప్పలేదు. "యావత్ న విమోక్ష్యే" అను వాక్యముచేత, ప్రారబ్ధకర్మ ఎంతకాలము ఉన్నదో, అంతకాలమువరకును మోక్షము లభించదు అనియే చెప్పుచున్నది. "అస్మాత్ శరీరాత్" అనుట బుద్ధిస్థమైన (మనకి తెలిసిన) ప్రారబ్ధ శరీరావసానకాలంగా తీసుకొనవలెను. "ధూత్వా శరీరం" అని ఏకవచనప్రయోగం ఉన్నప్పటికిని దానిని జాత్యేకవచనముగా గ్రమించవలెను. అదే శ్రుతిలో "అశ్వ ఇవ రోమాణి విధూయ పాపమ్"(ఛాం. 8-13-1) అని ఉండుట గమనించవలెను. పాపము అని ఏకవచనముగా చెప్పబడియుండుటచే ఒక పాపము మాత్రము పోవునదిగా చెప్పుట కుదురునా? దృష్టాంతములో "రోమాణి అని బహువచనము ఉన్నది. అందుచే 'పాపం' అను పదమును జాత్యేకవచనముగా చెప్పవలెను. కనుకనే దేహావధి నియమమును చెప్పు వాక్యమేదియును లేదు గనుక అనియమేన అనియే చెప్పవలెను.

*ఏకశరీరోపభోగ్యఫలే చేత్, తచ్ఛరీరావసానే సమ్పద్యతే, అనేకశరీరోపభోగ్యఫలే చేత్ తదవసానే సమ్పద్యతే, భోగేనైవ చ క్షపయితవ్యత్వాత్ ఆరబ్ధఫలయోః కర్మణోః । 'తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే' (ఛా.6-14-2) ఇతి చ భోగేన తయోః కర్మణోర్విమోక్ష ఉచ్యతే, దేహావధినియమశ్రవణాత్ । తదేవం బ్రహ్మవిద్యాయాః ప్రాగనుష్ఠితం అభుక్తఫల మనారబ్ధఫలం పుణ్యపాపరూపం కర్మానాదికాలసఞ్చితమనన్తం విద్యామాహాత్మ్యాద్వినశ్యతి । విద్యారమ్భోత్తర కాల మనుష్ఠితం చ నశ్లిష్యతి । తత్ర పుణ్యరూపంసర్వం విదుషః సుహృదో గృహ్ణన్తి, పాపం చ ద్విషన్త ఇతి నిరవద్యమ్॥*

*॥ ఇతరక్షపణాద్యధికరణం సమాప్తమ్ ॥11॥*

*॥ ఇతి శ్రీభగవద్రామానుజవిరచితే శారీరకమీమాంసాభాష్యే చతుర్థాధ్యాయస్య ప్రథమః పాదః ॥*

అస్మాత్ శరీరాత్ అను శ్రుతియొక్క ముఖ్యార్థస్వారస్యమును వదలి బుద్ధిస్థమైన శరీరము అని తీసికొని ఇదే శరీరావసానమందో, వేరు శరీరావసానమందో అని అస్వారస్యమైన అర్థమును ఎందుకు కల్పించుకొనవలెను? అని ప్రశ్నించవచ్చును.

జడభరతులు, ధర్మదేవతయైన విదురులు, గాంగేయులు మొదలైన బ్రహ్మనిష్ఠకు అనేకజన్మ(శరీర)సంబంధముండుట మహాభారతాదులలో చూచుచున్నాము. కనుక ప్రారబ్ధకర్మావసాన శరీరావసానముననే మోక్షము అని నిర్ణయించవలెను. మహర్షుల చరిత్రలతో ఈవిధముగా అర్థమును చెప్పుటచే అస్వారస్యమేదియు లేదు.

## ప్రశ్న-సమాధానములు

**ప్రశ్న:-** "అస్మాత్ శరీరాత్" అను శ్రుతిలో "అస్మాత్" అనునది (ఇప్పుడున్న) శరీరమునకు విశేషణముగా వ్యక్తముగా ప్రయోగించబడియున్నది. అట్టి ప్రయోగమునకు ఏదోఒక ప్రయోజనమును చెప్పవలెను. ఏ ప్రయోజనమును ఉద్దేశించి ఆవిధముగా చెప్పబడినది?

**సమాధానము:-** అనంతగరుడవిష్వక్సేనాదులవలె అనవరతభగవదనుభవయోగ్యతను గల ఇతనికి కారాగృహమువంటిది- హేయమైనది ఈ శరీరము అని తెలుపుటకే 'అస్మాత్' అను పదప్రయోగమున్నది. ఈవిధముగా తెలుపుటయే శరీరమునకు విశేషణముగా చెప్పుటయొక్క ప్రయోజనము.

కృష్ణుడు భగవద్గీతలో "అనిత్యం అసుఖం లోకం ఇమం ప్రాప్య భజస్వ మామ్" (9-33) అను శ్లోకములో అనిత్యమును, అసుఖవత్తును అయి యున్న ఈ శరీరమనుదానిని ఇమం అని వ్రేలితో చూపుచున్నాడు. ఈ శరీరమనునది మలమూత్రాదులను గలది అను దోషమును చూపుటకే "ఇమం" అని కృష్ణుడు చూపుటవలె "అస్మాత్" అని ఉపనిషత్తులో చెప్పబడియున్నది.

శరీరము అసహ్యించుకొనదగినది, దూరము చేసికొనదగును అని స్వాయంభువమనువు చెప్పి యున్నారు-

అస్థూణం స్నాయు బన్ధం మాంసశోణితలేపనం,
చర్మావనద్ధం దుర్గన్ధిపూర్ణం మూత్రపురీషయోః।

జరా శోకసమావిష్టం రోగాయతనమాతురం,
రజస్వలమనిత్యఞ్చ భూతావాసమిమం త్యజేత్॥

(ఎముకలు, నరములు చిన్నచిన్న నరాలు, వీటన్నింటితో కట్టబడినదై, మాంసరక్తములచేత పూయబడినదీ, చర్మంచేత కప్పబడినదీ, దుర్గంధంగలదిన్నీ, మూత్రపురీషములతో నిండియున్నదిన్నీ ముసలితనము, దుఃఖము అనేవాటితో నున్నదీ, వ్యాధికి స్థానమై, ఆతురతగలదీ రజస్వలత్వం గలదిన్నీ అయియున్న పాంచభౌతికమైన ఈ శరీరాన్ని త్యజించుము) అని భూతావేశశబ్దవాచ్యమైన ఈ శరీరంలోనున్న దోషాలని చెప్పి, తిరిగి సంగ్రహంగా చెప్పబడని దోషాలనీ ఆవర్తనంచేసి చూపించే పద్ధతిలో "ఇమం" అని వ్రేలితో చూపించటంచేత శరీరము అత్యన్తహేయమైనది అనేవిషయం స్పష్టముగా తెలియుచున్నది. అదేవిధంగా ఈ శ్రుతిలోకూడా చెప్పబడటాన్ని గ్రహించవలెను.

**ప్రశ్న**- సమస్తజీవాత్మలున్నూ స్వరూపంచేత సమమైనవి. స్వరూపంలో వ్యత్యాసం లేదు. ఆ జీవులు చేసిన పుణ్యపాపములు అనాదిగా చెయ్యబడినవి. ఉపాసనం చేసేవారికి మోక్షరూపఫలమును ఇచ్చు భగవానుడు మాత్రము వైషమ్యనైర్ఘృణ్యదోషములు లేనివాడు. ఈవిధముగానుండగా, ముక్తివిషయములో కొందరికి జన్మాంతరాలస్యం లేకుండా అదే జన్మలో మోక్షం అనేదీ, కొంతమందికి జన్మాంతరాలలో ఆలస్యంగా మోక్షం అనేదీ ఏవిధంగా సమర్థనీయం?

**సమాధానం**- ఇది అసారమైన ప్రశ్న. జీవుడి కర్మప్రవాహవైచిత్ర్యముచేత ఫలమును పొందు కాలభేదము అందరు సిద్ధాంతులచేతను అంగీకరించబడియున్నది. కనుక కొంతమందికి ఆలస్యంగా ఫలం లభించటం అనేది ఒప్పుకొని తీరవలసినదే. అంటే, ఉపాసకుడి ప్రారబ్ధకర్మ అనేది ఒకడికి ఒకశరీరంలో నశించేదీ, మరొకడికి ఎన్నో శరీరాలు గడిచిన తరువాత పూర్తి అయేదిగా కర్మవైచిత్ర్యం ఉన్నది గనుక నియమం చెప్పటానికి సాధ్యం కాదు. అందుచేత కాలభేదేన, ఉపాసకులు మోక్షాన్ని పొందుతున్నారు అని చెప్పటం తగియున్నదే.

ఇతరక్షపణాధికరణము ముగిసినది.

చతుర్థాధ్యాయములో మొదటి పాదము సమాప్తము.

శ్రీరస్తు
శ్రీః ॥ శ్రీమతే రామానుజాయ నమః ॥

## శ్రీ భగవద్రామానుజవిరచితే
## శ్రీ శారీరకమీమాంసా భాష్యే
## చతుర్థాధ్యాయే
## ద్వితీయః పాదః (ఉత్క్రాన్తిపాదః)
## *వాగధికరణమ్ (4-2-1 )*

***॥ సి. సూ ॥ వాఙ్మనసి దర్శనాత్ శబ్దాచ్చ ॥ 4-2-1 ॥***

ఇదానీం విదుషో గతిప్రకారం చిన్తయితు మారభతే। ప్రథమన్తావదుత్క్రాన్తి శ్చిన్త్యతే ।

---

శ్రీరస్తు
శ్రీః శ్రీమతే రామానుజాయ నమః

## శ్రీ భగవద్రామానుజవిరచితమైన శ్రీ శారీరకమీమాంసా భాష్యము సుఖబోధినిలో
## నాలుగవ అధ్యాయము రెండవ పాదము (ఉత్క్రాన్తిపాదము)
## *వాగధికరణము (4-2-1 )*

***॥ సి. సూ ॥ వాఙ్మనసి దర్శనాచ్ఛబ్దాచ్చ ॥ 4-2-1 ॥***

సూత్రార్థము:- **వాక్** = (మరణం పొందే జీవుని) వాగింద్రియము, **మనసి** = మనసులో (చేరును) **దర్శనాత్** = (వాక్కు విధేయమైయున్నపుడు మనసు క్రియను చేయుట)కనబడుటచేతనను, **శబ్దాత్ చ** = వేదము అట్లు చెప్పుటచేతను.

సంగతి:- వెనుకటి పాదములో, ఈ స్థూలశరీరమందుండునపుడు వచ్చు పాపాశ్లేషవినాశరూపమైన విద్యాఫలము చెప్పబడినది. ఈ పాదములో అర్చిరాదిగతికి ఉపక్రమమై వినశ్యదవస్థమైన- నశించగల దశలోనున్న స్థూలదేహమునుండి బ్రహ్మనాడిద్వారా ఉత్క్రాన్తి- బహిర్గతమగుట అను విద్యాఫలము చెప్పబడుచున్నదని పాదసంగతి.

వెనుకటి అధికరణములో బ్రహ్మవేత్త ప్రాప్తకర్మావసానమందు బ్రహ్మమును పొందుచున్నాడు అని చెప్పబడినది. ఈ అధికరణములో గతికి ఉపక్రమమైన ఉత్క్రాన్తి చెప్పబడుచున్నది అని అధికరణసంగతి.

కృతకృత్యాః ప్రతీక్షన్తే మృత్యుం ప్రియమివాతిథిమ్- చేయవలసినదానిని చేసి పూర్తిచేసినవారు (భక్తియోగమును అనుష్ఠించువారును, శరణాగతి చేసినవారును) మృత్యువును - మరణమును, ప్రియుడైన అతిథి వచ్చునని ఎదురుచూచునట్లుగా ఎదురుచూతురు' అనుటచే మరణముకూడ విద్వాంసులకు ప్రియమైనది. అందుచే బ్రహ్మనాడియందు ప్రవేశించుటను విద్యాఫలముగా గ్రహించి ఫలాధ్యాయమందు చెప్పబడినది.

*తత్రేదమామ్నాయతే "అస్యసోమ్య పురుషస్య ప్రయతః వాఙ్మనసి సమ్పద్యతే; మనః ప్రాణే; ప్రాణః తేజసి; తేజః పరస్యాం దేవతాయామ్" (ఛా.6-8-6) ఇతి । అత్ర "వాఙ్మనసి సమ్పద్యతే" ఇతి వాచో మనసి సంపత్తిశ్రుతిః కిం వాగ్వృత్తిమాత్రవిషయా? ఉత వాగ్విషయేతి విశయే-వృత్తిమాత్ర విషయేతి యుక్తమ్। కుతః? మనసో వాక్ ప్రకృతిత్వాభావాత్, తత్ర వాక్-స్వరూపసంపత్త్యసంభవాత్ । వాగాదివృత్తీనాం మనోఽధీనత్వేన వృత్తిసంపత్తి శ్రుతిః కథఞ్చిదుపపద్యత ఇతి ।*

---

**విషయము:-** "అస్య సోమ్య పురుషస్య ప్రయతః వాఙ్మనసి సమ్పద్యతే, మనః ప్రాణే, ప్రాణః తేజసి, తేజః పరస్యాం దేవతాయామ్" (ఛాం. 6. 8. 6) అను శ్రుతిలో, వాఙ్మనసి సమ్పద్యతే' అను వాక్యముయొక్క అర్థవిచారము చేయబడుచున్నది.

**సంశయము:-** వాఙ్మనసి సంపద్యతే అన్నపుడు వాక్కుయొక్క వ్యాపారమునకు మనస్సులో సంపత్తియా? వాగింద్రియమునకు సంపత్తియా?

**సంశయము వచ్చుటకు కారణము:-** కారణములోనే లయము చెప్పబడవలెను. వాగింద్రియమునకు మనస్సు కారణము కాదుగనుక, మనస్సులో వాగింద్రియమునకు లయము చెప్పుట కుదరదు. అయినను, మనస్సు సంబంధముచేత వాగ్వ్యాపారము ఉండుటచే (చెప్పుటచేత) వాగ్వృత్తికి మనసులో లయము చెప్పవచ్చు. అందుచే ఇచ్చట వాక్ అని వాగింద్రియమును చెప్పినను, వాగ్వృత్తి పర్యంతము అర్థము చెప్పుట ఉచితమా? అనగా, వాగ్వ్యాపారమునకు మనస్సులో లయము చెప్పుట ఉచితమా? వాగింద్రియమునకు మనసులో లయమును చెప్పుట ఉచితమా? పైగా, "సంపద్యతే" అనుపదమునకు లయించుచున్నది అని అర్థమా? సంయుజ్యతే- చేరుచున్నది అని అర్థమా?. వీటిని గురించి నిర్ణయించలేక పోవుటయే సంశయమునకు కారణమగుచున్నది.

**పూర్వపక్షము:-** వాగ్వృత్తియే సంపద్యతే అని చెప్పవలెను. ఎందుకనగా, మనస్సనునది వాగింద్రియమునకు ప్రకృతి కాదు. అనగా – ఉపాదానకారణము కాదు. కారణమందేగదా లయమును చెప్పుట సాధ్యమగును! అందుచే వాక్కుయొక్క వృత్తియే –వ్యాపారమే లయమును పొందునని చెప్పవలెను. "సమ్పద్యతే" అనుపదమునకు "సంపూజ్యతే" అని అర్థము చెప్పుటకు వీలులేదు. 'సదా సంపన్నో భవతి" అనినప్పుడు సంపత్తికి లయము అను అర్థము ఇదివరకే చెప్పబడినది. కనుక మనస్సులో లయమును పొందుచున్నది అనియే అర్థము చెప్పవలెను.

అయ్యా! ఈవిధముగానైనను వాగ్వృత్తికి వాగింద్రియమేగదా కారణమగుచున్నది మనస్సు కారణము కాదే! వాగ్వృత్తికి ఏవిధముగా లయమును చెప్పుచున్నారు?

అయ్యా మీరు చెప్పునది సరియే. అయినను, జలములలో పడవేయబడిన నిప్పుయొక్క ప్రకాశాదివృత్తుల లయమువలె ప్రకృతిభిన్నములలోకూడ లయమును కష్టపడి చెప్పవచ్చును. అనగా మనస్సంబంధముచేతనేగదా వాగ్వృత్తి– అనగా మాటలాడుట సాధ్యము గనుక, మనస్సును కారణముగా చేసి దానిలో లయమును చెప్పుచున్నాము.

*ఏవం ప్రాప్తేఽభిధీయతే-వాఙ్మనసి ఇతి వాక్స్వరూపమేవ మనసి సంపద్యతే । కుతః? దర్శనాత్। దృశ్యతే హి వాగిన్ద్రియే ఉపరతేఽపి మనఃప్రవృత్తిః । వృత్తిమాత్రసమ్పత్త్యాపి తదుపపద్యత ఇతి చేత్తత్రాహ- శబ్దాచ్చ-ఇతి । 'వాఙ్మనసి సమ్పద్యతే' ఇతి వాక్స్వరూపసంపత్తావేవ హి శబ్దో న వృత్తిమాత్రసమ్పత్తౌ। న హి తదానీం వృత్త్యుపరమే వాగిన్ద్రియం ప్రమాణాన్తరేణోపలభ్యతే, యేన వృత్తిమాత్రమేవ సమ్పద్యత ఇత్యుచ్యేత। యదుక్తం మనసో వాక్ప్రకృతిత్వాభావాత్ వాచో మనసి సంపత్తిర్నోపపద్యతేతి తత్ 'వాఙ్మనసి సమ్పద్యతే' ఇతి వచనాన్మనసా వాక్ సంయుజ్యతే న తు తత్ర లీయత ఇతి పరిహర్తవ్యమ్॥ 1 ॥*

---

**సిద్ధాంతము:** – వాఙ్మనసి ఇతి. వాక్కుయొక్క స్వరూపమే మనస్సులో సంపద్యతే– ఎందుచేత అనగా దర్శనాత్. వాగింద్రియము ఉపరతిని పొందినపిదపగూడ ప్రవృత్తిని చూచుచున్నాముగదా! మనోవ్యాపారాధీనముగా వాగ్వ్యాపారము ఉండుట జీవితకాలమందు చూచుచున్నాము. వాగ్వ్యాపారము లేకపోయినను, మనోవ్యాపారముండుట చూచుచున్నాము. మౌనవ్రతము ఉన్నవానివిషయమందును మూగివాని విషయమందును వాగ్వ్యాపారము లేదు. మనోవ్యాపారము ఉన్నట్లుగా మనకు తెలియు చున్నది. అంతే కాక, ప్రవృత్తకార్యమైన మనస్సులో నివృత్తకార్యమైన వాగింద్రియము అంతర్గతమై యుండవచ్చును. ప్రవృత్తకార్యమైన దారువులో – అరణికట్టెలో నివృత్తకార్యమైన అగ్ని యున్నట్లే.

వాగ్వృత్తికి సంపత్తిని చెప్పినను ఇది సంభవించును అన్నచో, చెప్పుచున్నారు శబ్దాచ్చ అని. "వాఙ్మనసి సంపద్యతే" అన్నప్పుడు వాక్స్వరూపసంపత్తినేగదా శబ్దము చెప్పుచున్నది. వృత్తిమాత్రమును చెప్పలేదు. వృత్తిమాత్రమునకు ఉపరతి చెప్పినచో, తరువాత వాగింద్రియము ఉన్నట్లుగా ఏ ప్రమాణముచేతను తెలిసికొనుటకు సాధ్యముకాలేదు. వృత్తిమాత్రమునకు ఉపరతి చెప్పినచో, వాగింద్రియము ఉండవలెనుగదా! వాగింద్రియమునకు మనసు ఉపాదానకారణముకాదు గనుక అందులో లయము చెప్పుటకు కుదరదను పూర్వపక్షయుక్తి సరికాదు. వాక్కునకు మనసు ఉపాదాన కారణము కాదు అనినట్లే వాగ్వృత్తికిని మనసు ఉపాదానకారణము కాదు. వాక్కే తద్వృత్తికి ఉపాదాన కారణము. మనస్సు సంబంధముచేతనే మాటాడుచున్నాడు అన్నచో, దానిచే మనస్సు నిమిత్తకారణమే యగును. కనుక దోషము రెండింటికిని సమమేయగును. మా పక్షమందు 'వాక్' అన్నపదమునకు వాగింద్రియము అని శబ్దముచే సాక్షాత్తుగా అర్థము చెప్పవచ్చును. పూర్వపక్షియొక్క పక్షములో "వాక్" అనుదానికి "దాని వృత్తి" అని లక్షణయా అర్థమును చెప్పవలెను. అదియే దోషము.

పైగా, సంపత్తి శబ్దమునకు లయార్థము చెప్పినచోగదాప్రకృతి భిన్నమందు లయమును చెప్పుట కుదరదు అను ఆక్షేపము వచ్చుచున్నది? సంపత్తిశబ్దమునకు లయార్థము సంయోగార్థము అను రెండును ఉన్నవి. లయార్థమందు ప్రసిద్ధి అధికముగా నున్నందున సంయోగార్థముచెప్పుట అస్వరసమన్నచో, పూర్వపక్షికిని ఆ ప్రకృతిలో లయమును చెప్పుటయు కూడకపోవునుగనుక, లయార్థము చెప్పుట అస్వరసమే అగుచున్నది. సిద్ధాంతినైన నేనుసంపత్తి శబ్దమునకు మాత్రము లక్షణయా సంయోగార్థమును చెప్పవలెను. పూర్వపక్షియైన మీరు వాక్ శబ్దమునకు లక్షణయా దాని వృత్తిని, సంపత్తిశబ్దమునకు లక్షణతో సంయోగార్థమును చెప్పవలెను. ఇట్లు ఈరెండింటియందును లక్షణను చెప్పుటయే గౌరవము. కనుక "వాక్ మనసి సంయుజ్యతే అనియే అర్థము చెప్పవలెను.

**॥ సి. సూ ॥ అత ఏవ సర్వాణ్యను ॥ 4-2-2 ॥**

యతో వాచో మనసా సంయోగమాత్రం సమ్పత్తిర్న తు లయః అత ఏవ వాచమను సర్వేషామిన్ద్రియాణాం మనసి సమ్పత్తిశ్రుతిరుపపద్యతే, 'తస్మాదుపశాన్తతేజాః, అపునర్భవమిన్ద్రియై ర్మనసి సమ్పద్యమానైః' (ప్ర. 3-8) ఇతి ॥ 2 ॥

ఇతి వాగధికరణమ్॥ 1 ॥

---

**॥ సి. సూ ॥ అత ఏవ సర్వాణ్యను ॥ 4-2-2 ॥**

సూత్రార్థము:- **అత ఏవ** = వెనుక చెప్పిన కారణమువలననే **అను** = (వాక్యమును) అనుసరించి **సర్వాణి** = అన్ని ఇంద్రియములును (మనసుతో చేరునని చెప్పట తగియున్నది)

వాగింద్రియమునకు మనసుతో సంయోగమాత్రము, లయముకాదు అని చెప్పుటచేత, 'వాచమను'- వాక్కుతోకూడ, లేక వాక్కును అనుసరించి, అన్ని ఇంద్రియములకును మనసులో సంపత్తి చెప్పుటయు ఉపపన్నమగుచున్నది.

"తస్మాత్ ఉపశాన్తతేజాః పునర్భవమింద్రియైః మనసి సంపద్యమానైః యచ్చిత్తః తేనైష ప్రాణమాయాతి" ఇతి । ఉపశాన్తతేజాః- ఉపశాన్తోష్ణః, పునర్భవం- పునర్జన్మ ఉద్దిశ్య, మనసి సమ్పద్యమానైః - ఇంద్రియైస్సహ ప్రాణమాయాతీతి॥" (ప్రశ్నో. 3-9,10) - ఆ కారణముచేతనే మరణించునపుడు ఉష్ణము పోయి మరుజన్మను ఉద్దేశించి మనసులో సంపత్తిని పొందిన(మనసుతో చేరిన) ఇంద్రియములతో ఏ ప్రయోజనాన్ని కోరెనో, అదే కారణముగా పునర్జన్మను పొందుటకు మనసు ప్రాణమును పొందుచున్నది" అని ఈ శ్రుతికి అర్థము.

అత ఏవ- వాక్ మనసుతో సంయుజ్యతే అని అర్థమును చెప్పుటచేత, సర్వాణి- అన్ని ఇంద్రియములును, అను- వాక్కును అనుసరించి మనసుతో సంపద్యతే అని చెప్పుట ఉపపన్నమగు చున్నది అనియే ఈ సూత్రమునకు అర్థము.

ప్రశ్న:- ఇంద్రియాంతర సంపత్తి వాక్ సంపత్తి వచనములలో విశేషము ఏదియు కనబడలేదు. అనగా, "వాఙ్మనసి సంపద్యతే" అన్నపుడుకూడ, "ఇంద్రియైః సంపద్యమానైః" అనినపుడు కూడ, "సంపద్యతే" అనియే ఉన్నది. అట్లుండగా, "అత ఏవ సర్వాణ్యను" అను సూత్రమందు వాక్ సంపత్తికి చెప్పబడిన అర్థమునే-న్యాయమునే ఇంద్రియాంతరసంపత్తియందును గ్రహించవలెనని అతిదేశము చేయుట ఎట్లు తగును? అనగా, ఇంద్రియాంతరవచనమును ఉపపాదకకోటిలో ఎట్లు చేర్చగలరు?" అని ఆక్షేపము.

సమాధానము:- "తస్మాత్ ఉపశాన్త తేజాః' అను శ్రుతికి తిరిగి జన్మించుటకు మనస్సులో ఇంద్రియములు లయమును పొందుచున్నవి అని సంపద్యమానైః అను పదమునకు అర్థము చెప్పకూడదు. ఇంద్రియములు మనస్సులో లయించినచో తిరిగి సృష్టించబడవు కనుక, సంపత్తి శబ్దమునకు సంయోగము అనియే అర్థమును చెప్పవలెను. ఇట్లు వాక్ సంపత్తి విషయమందును ఒకే విధముగా అర్థమును చెప్పవలెను గనుక ఇంద్రియాంతరసంపత్తి అనునది ఉపపాదకకోటిలో చేర్చబడినది.

ప్రశ్న:- "వాఙ్మనసి సమ్పద్యతే" అన్నప్పుడు మనసులో వాగింద్రియమునకు మాత్రము ఉపరతి చెప్పవలెనా? లేక అది సర్వేంద్రియములకును ఉపలక్షణమనియు, అన్ని ఇంద్రియములకును మనస్సులో ఉపరతిని శ్రుతి వేరుగా చెప్పలేదుగనుక, "అత ఏవ సర్వాణ్యను" అను సూత్రములోనున్న "అను" అను శబ్దమును అనుసరించి వాక్ శబ్దమునకు లక్షణయా సర్వేంద్రియపరత్వముగా అర్థము చెప్పవలెను. అపుడు, "దృశ్యతే హి వాగిన్ద్రియోపరతేపి మనఃప్రవృత్తిః" - వాగింద్రియము ఉపరతమైనను మనస్సు ప్రవృత్తిగలదిగా నున్నదని తెలియుచున్నది- అనుట కుదరదు. వాగింద్రియోపరతినిమాత్రము చెప్పినచో ఇతరేంద్రియముల చేష్టచే మనఃప్రవృత్తిని తెలిసికొనవచ్చును. అన్ని ఇంద్రియములును ఉపరతిని పొందినవని చెప్పినచో మనఃప్రవృత్తిని తెలిసికొనుట ఎట్లు సాధ్యమగును?

సమాధానము:- "దృశ్యతే హి...." అను శ్రీభాష్యపంక్తికి శ్రీమద్రహస్యత్రయసారములో నిర్యాణాధికారములో అంతిమస్మృతి ప్రకరణములో స్వామి దేశికులు ప్రసాదించిన వివరణమును, దానికి ఇంజిమేడు శ్రీమదళకియశింగర్ ప్రసాదించిన వ్యాఖ్యానమును ఇచ్చట వ్రాయుచున్నాము.

అంతిమస్మృతియనునది వాగాదులు ఉపరతమైనచో మనసు ఉపశాంతమగుటకు ముందు కలిగిన ఒక స్మృతి. ఇది దగ్గరగానున్నవారికి తెలియదు. 'దృశ్యతే హి వాగింద్రియ ఉపరతేపి మనఃప్రవృత్తిః' అను భాష్యమును ఏదో ఒక లింగముచే ఒక మనఃప్రవృత్తి ఇతడికి కలుగును అని తెలిసినంతవరకును చెప్పుచున్నది. తనకు కొన్ని వ్యాధ్యాద్యవస్థలలో కనబడినట్లు చెప్పినట్లగును.

శ్రీసారబోధిని- ఈ భాష్యవాక్యము దశేంద్రియోపరతి విషయమైనది కాదు. కాని వాగింద్రియ మాత్రమునకు మనస్సులో ఉపరతి వచ్చునపుడు ఇతరేంద్రియములచే మనఃప్రవృత్తి అనుమేయము కావచ్చును అని చెప్పుచున్నదిగనుక విరోధములేదని భావము. లోకములో ఒక వ్యాధిచే మాట రాకపోయినపుడు హస్తచేష్టలతో మనఃప్రవృత్తిని అనుమానించుట చూచుచున్నాముగదా! అటులైనచో "దృశ్యతే హి" అని ప్రత్యక్షవాచిశబ్దమును చెప్పవచ్చునా? అనుమీయతే అనిగదా చెప్పవలెను? అని సాదించిరి. "తనకు ఏవో వ్యాధ్యాద్యవస్థలలో కనబడినవిధమును చెప్పుచున్నదనవచ్చు. ఎవరికైనను వ్యాధిచే వాగింద్రియమాత్రమునకు ఉపరతి కలిగినప్పుడు వచ్చు మనఃప్రవృత్తి అతడికి సాక్షాత్కార- విషయముగనుక "దృశ్యతే హి" అని "దృశ" ధాతుప్రయోగము చెయ్యబడెను. అపుడు అతడికి మనఃప్రవృత్తి ప్రత్యక్షమైనదని ఆ వ్యాధి తొలగి స్వస్థత చేకూరినపిదప, "నేను మనసులో అనుకొనియుంటిని. నోటితో చెప్పలేకపోతిని" అని వ్యవహరించుటచేత అనుపలబ్ధి పరాహతముగాక ప్రసిద్ధమగును అని భావము. దీనిచే ఈ భాష్యవచనము ఇంద్రియసామాన్యమైన ఉపరతిదశలో మనోమాత్రముచే కలుగు అంతిమస్మృతి విషయము కాదని జ్ఞప్తికి తేబడినది.

వాగధికరణము ముగిసినది.

## *మనోధికరణమ్ (4-2-2 )*

### *॥ సి. సూ ॥ తన్మనః ప్రాణ ఉత్తరాత్ 4-2-3 ॥*

*తత్సర్వేన్ద్రియసంయుక్తం మనః ప్రాణే సమ్పద్యతే -ప్రాణేన సంయుజ్యతే న మనోవృత్తిమాత్రమ్ । కుతః? ఉత్తరాత్ 'మనః ప్రాణే' (ఛాం.6-9-6) ఇతి వాక్యాత్।*

*అధికాశఙ్కా తు 'అన్నమయం హి సోమ్య మనః' (ఛాం.6-6-5) ఇతి వచనాన్మనసో ऽన్నప్రకృతితత్త్వ మవగమ్యతే, అన్నస్య చ 'తా అన్నమసృజన్త' (ఛాం.6-2-4)ఇత్యమ్మయత్వం సిద్ధమ్ । 'ఆపోమయః ప్రాణః'(ఛాం. 6-6-5) ఇతిచాప్ప్రకృతిత్వం ప్రాణస్యావగమ్యతే । అతో మనః ప్రాణే సమ్పద్యతే' ఇత్యత్ర*

## *మనోధికరణము (4-2-2 )*

### *॥ సి. సూ ॥ తన్మనః ప్రాణ ఉత్తరాత్ ॥ 4-2-3 ॥*

**సూత్రార్థము:-** **తత్ మనః** = (అన్ని ఇంద్రియములతోనున్న)ఆ మనసు, **ప్రాణే** = ప్రాణముతో (చేరుచున్నది) **ఉత్తరాత్** = 'మనః ప్రాణే' అను మీది వాక్యముచే.

**సంగతి:-** 'వాఙ్మనసి సమ్పద్యతే మనః ప్రాణే' అను శ్రుతిక్రమమును అనుసరించి ఈ అధికరణము ఆరంభించబడుతున్నది.

**విషయము:-** "మనః ప్రాణే' అను వాక్యమును గురించినది.

**సంశయము:-** 'మనః ప్రాణే సమ్పద్యతే' అనునపుడు మనసుకు ప్రాణమందు లయము చెప్పబడుచున్నదా లేక సంయోగము చెప్పబడుచున్నదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** ప్రాణశబ్దమునకు "ప్రాణము" అనియే అర్థమా? 'ఆపోమయః ప్రాణ' అను శ్రుతితో ప్రాణశబ్దమునకు లక్షణయా 'అప్' అను అర్థమును చెప్పవలెనా? ప్రాణశబ్దముచే అప్పులే చెప్పబడుచున్నవన్నచో,సంపత్తిశబ్దమునకు లయార్థము తగియుండును. ప్రాణశబ్దమునకు ప్రాణము అనియే అర్థమును చెప్పినచో సంపత్తిశబ్దమునకు సంయోగార్థమును చెప్పవలెను. ఇందు యుక్తియుక్తమైన పక్షము ఏదియో తెలియనందున సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** "అన్నమయం హి సోమ్య మనః' అను శ్రుతిచే పృథివీవికారమైన అన్నముయొక్క వికారము మనస్సు అని వచ్చుచున్నది. దీనిచే, మనసునకు అన్నము ప్రకృతి' అని వచ్చుచున్నది. 'తా అన్నమసృజత' అనుటచే అప్ అనునది అన్నమును - అనగా పృథివిని సృష్టించినది అని సిద్ధము. దీనిచే పృథివికి అప్అనునది ప్రకృతి అని చెప్పబడనట్లైనది. "ఆపోమయః ప్రాణః" అనుటచే ప్రాణము అప్పుల వికారము అని వచ్చుచున్నది.

కనుక, మనః ప్రాణో సంపద్యతే అన్నప్పుడు ప్రాణశబ్దముచే ప్రాణమునకు ప్రకృతిభూతమైన - కారణమైన అప్పులనుచెప్పి , అందులో మనసు సంపత్తిని చెప్పుటచే పరంపరగా స్వకారణమందు లయము చెప్పినట్లు అయినది. అందుచే సంపత్తి వచనమునకు చెప్పబడు ముఖ్యార్థముకూడ ఉపపన్న మగుచున్నది.

**సిద్ధాంతము:-** మనః ప్రాణే ఇతి "అన్నమయం హి సోమ్య మనః। ఆపోమయః ప్రాణః' అను శ్రుతి మనసునకును, ప్రాణమునకును అన్నముచేతను, అప్పులచేతను ఆప్యాయనము చెప్పబడినది. అనగా, అన్నము మనసును పెంచుచున్నది. అప్ ప్రాణమును పెంచుచున్నది అని అర్థము. ఇచ్చట

*ప్రాణశబ్దేన ప్రాణప్రకృతిభూతా అపోనిర్దిశ్య తాసు మనస్సమ్పత్తి ప్రతిపాదనే పరమ్పరయా స్వకారణే లయ ఇతి సమ్పత్తివచన ముపపన్నం భవతి-ఇతి । పరిహారస్తు 'అన్నమయం హి సోమ్య మనః, ఆపోమయః ప్రాణః' ఇతి మనఃప్రాణయోరన్నేనాద్భి శ్చాప్యాయనముచ్యతే , న తత్ప్రకృతిత్వమ్, ఆహఙ్కారికత్వాత్ మనసః ఆకాశవికారత్వాత్ చ ప్రాణస్య। ప్రాణశబ్దేన అపాం లక్షణా చ స్యాదితి ॥*

*॥ ఇతి మనోధికరణమ్ ॥ 2 ॥*

---

కార్యకారణభావము చెప్పబడలేదు. కనుక మనసునకు అన్నము ప్రకృతి కానేరదు. అట్లే ప్రాణమునకును అప్పులు ప్రకృతికాదు. మనసు అహంకారమునుండి పుట్టినది. కనుక అహంకారమే మనస్సుకు ప్రకృతి. "ప్రాణము" అనునది వాయువు (ఊపిరిగాలి) అది ఆకాశమునుండి పుట్టుచున్నది. ఆకాశమే ప్రాణమునకు ప్రకృతి. ప్రాణశబ్దముచే లక్షణయా అప్పులను చెప్పవలెను. ముఖ్యార్థమును వదలి లక్షణయా అర్థము చెప్పుట దోషముగదా! కనుక సంపద్యతే అనుపదమునకు 'సంయుజ్యతే" అని వెనుక చెప్పినట్లుగనే అర్థమును చెప్పవలెను. లయార్థమును చెప్పుట కుదరదు.

ప్రశ్న-సమాధానము- శ్రీభాష్యమందు "తత్ సర్వేంద్రియసంయుక్తం మనః ప్రాణే సంపద్యతే- ప్రాణేన సంయుజ్యతే. న మనోవృత్తిమాత్రమ్" అని యున్నది. శ్రుతప్రకాశిక, అధికరణసారావళి మొదలగు (వ్యాఖ్యాన)గ్రంథములలో) మనస్ ప్రాణమందు లయమును పొందుచున్నదా? ప్రాణముతో చేరుచున్నదా? అనగా- 'సంపద్యతే' అనుపదమునకు 'లీయతే' అని అర్థమును చెప్పవలెనా? "సంయుజ్యతే" అని అర్థమును చెప్పవలెనా? అనియే సంశయమును చెప్పుచున్నారు. వెనుకటి అధికరణములో చెప్పినట్లు "మనోవృత్తి అనునది సంపద్యతే అని చెప్పవలెనా? మన ఇంద్రియము సంపద్యతే అని చెప్పవలెనా? అని సంశయకోటిని ఎందుకు చెప్పలేదనినచో, వెనుకటి అధికరణములో వాగింద్రియమునకు ప్రకృతికాని మనసులో ఏవిధముగను లయము చెప్పుట సాధ్యము కాదుగనుక, కష్టపడి – యథాకథఞ్చిత్ వాగ్వృత్తికి లయము చెప్పవచ్చునని పూర్వపక్షియొక్క అభిప్రాయము. ఇచ్చట వెనుటి అధికరణములో సిద్ధాంతి చెప్పినప్రకారము సంపత్తి శబ్దమునకు లయపరత్వము చెప్పుట కుదరకపోయినను, ఈ అధికరణములో మనసుకు పరంపరయా ప్రకృతియైన ప్రాణమందు లయము చెప్పుట కుదరదుగనుక సంపత్తి శబ్దమునకు లయపరముగనే అర్థమును చెప్పవలెనని పూర్వపక్షి అభిప్రాయము. మనసునకు అహంకారము ప్రకృతి. ప్రాణమునకు ఆకాశము ప్రకృతి కనుక, 'లీయతే' అని అర్థము చెప్పుట కుదరదు. 'సంయుజ్యతే' అనియే అర్థమును చెప్పవలెనని సిద్ధాంతము చెప్పబడినది. ఈవిధముగానుండగా, శ్రీభాష్యమందు 'న మనోవృత్తిమాత్రమ్' అని యుండుటకు తాత్పర్యమేమి?

సమాధానము. – సర్వేంద్రియ సంయుక్తం మనః స్వవ్యాపారోపరమపూర్వకం ప్రాణే సంయుజ్యతే- ప్రాణేన సంయుజ్యతే' అని అర్థం చెప్పవలెను. మనసులో సంపద్యమానములైన సర్వేంద్రియములునూ వాటి వృత్త్యుపరతిపూర్వకముగా కదా సంపద్యములౌతున్నాయి? వాటివలెనే "మనోవృత్త్యుపరతిపూర్వముగానే మనసనునది "ప్రాణేన సంయుజ్యతే" అని చెప్పవలెను. ఈవిధముగా అర్థము చెప్పేటప్పుడు వెనుకటి అధికరణన్యాయంతో "మనోవృత్తిమాత్రం సంపద్యతే" అని అర్థం చెప్పటం కుదరదు అనే విషయాన్ని చెప్తున్నారు- "న మనోవృత్తిమాత్రమ్" అని.

మనోధికరణము సమాప్తము.

## అధ్యక్షాధికరణమ్ (4-2-3 )

**॥ సి. సూ ॥ సోఽధ్యక్షే తదుపగమాదిభ్యః ॥ 4-2-4 ॥**

యథా 'వాఙ్మనసి సమ్పద్యతే మనః ప్రాణే'(ఛాం.6-6-5) ఇతి వచనానురోధేన మనఃప్రాణయోరేవ వాఙ్మనసయోః సమ్పత్తిః తథా ప్రాణస్తేజసీతి వచనాత్ తేజస్యేవ ప్రాణః సమ్పద్యతే-

ఇతి ప్రాప్తే ఉచ్యతే-సోఽధ్యక్షే-ఇతి । స ప్రాణోఽధ్యక్షే కరణాధిపే జీవే సమ్పద్యతే । కుతః? తదుపగమాదిభ్యః, ప్రాణస్య జీవోపగమస్తావ చ్ఛ్రూయతే 'ఏవమేవేమమాత్మానమన్తకాలే సర్వే ప్రాణా అభిసమాయన్తి (బృ. 6-3-38) ఇతి, తథా జీవేనసహ ప్రాణస్యోత్క్రాన్తిః శ్రూయతే 'తముత్క్రామన్తం

---

## అధ్యక్షాధికరణము (4-2-3 )

**॥ సి. సూ ॥ సోధ్యక్షే తదుపగమాదిభ్యః 4-2-4 ॥**

**సూత్రార్థము:-** **సః** = (అన్ని ఇంద్రియములు, మనస్సులతో చేరియున్న) ప్రాణము **అధ్యక్షే** = అధిపతియైన జీవునివద్దకు (చేరుచున్నది) **తదుపగమాదిభ్యః** = (ప్రాణమునకు) జీవసంబంధము మొదలైనవి చెప్పబడుటచే.

**సంగతి:-** "మనః ప్రాణే, ప్రాణ స్తేజసి అనే శ్రుతిక్రమాన్ని అనుసరించి ఈ అధికరణం ఆరంభించబడుతున్నది.

**విషయము:-** "ప్రాణస్తేజసి' అనే వాక్యాన్ని గురించినది.

**సంశయము:-** ప్రాణము నేరుగా తేజస్సులో సంశ్లేషిస్తున్నదా? లేక జీవుడిలో సంశ్లేషిస్తున్నదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** ప్రాణము తేజస్సులో సంశ్లేషిస్తున్నది అంటే "ప్రాణస్తేజసి" అనే వాక్యానికి స్వరసంగా అర్థం చెప్పబడుతున్నది. జీవసంపత్తిపూర్వకంగా తేజస్సంపత్తిని చెప్పితే "ప్రాణస్తేజసి" అనే వాక్యార్థస్వారస్యభంగం కలుగుతుంది. ఇతరశ్రుతులను అనుసరించి స్వారస్యభంగం లేకుండా అర్థం చెప్పటం కుదురుతుందా? కుదరదా? అనే సంశయానికి కారణం.

**పూర్వపక్షము:-** "వాఙ్మనసి సంపద్యతే, మనః ప్రాణే" అన్నప్పుడు వాక్కు మనస్సులోన, మనసు ప్రాణాల్లోనూ ఏవిధంగా సంయోగం పొందుతున్నవని అర్థం చెప్పబడిందో, అదేవిధంగా "ప్రాణస్తేజసి" అన్నప్పుడు కూడా ఆ వాక్యంలో చెప్పినట్లుగనే తేజస్సులోనే ప్రాణం సంపత్తిని పొందుతున్నది. శ్రుతిలో చెప్పినవిధంగా అర్థం చెప్పటమే న్యాయం. లేకపోతే వాక్యార్థస్వారస్యభంగం వస్తుంది. కనుక మధ్యన ఆత్మసంపత్తిని చెప్పటం కుదరదు.

**సిద్ధాంతము:-**సః- సర్వేంద్రియసంయుక్తమైన మనస్సుతో సంయుక్తమైన ప్రాణం, అధ్యక్షే-ఇంద్రియాలకి అధిపతియైన జీవుడిలో, సంశ్లేషాన్ని పొందుతున్నది. ఎందుచేతనంటే, ప్రాణానికి జీవసంబంధం శ్రుతిలో చెప్పబడియున్నది గనుక. "ఏవమేవ ఇమం ఆత్మానం అన్తకాలే సర్వే ప్రాణా అభిసమాయన్తి" (బృ.6-3-38) "జయశీలుడై వెళ్ళిన రాజుని, అతనిని అనుసరించి జీవించేవారు అతడి ఆజ్ఞలేకుండా అతడిని ఏవిధంగా అనుసరిస్తారో అదేవిధంగా ఆత్మను – భోక్తను అంతకాలంలో–

*ప్రాణోऽనూత్క్రామతి' (బృ. 6-4-2) ఇతి, ప్రతిష్ఠా చ జీవేన సహ శ్రూయతే 'కస్మిన్నుత్క్రాన్త ఉత్క్రాన్తో భవిష్యామి కస్మిన్ వా ప్రతిష్ఠితే ప్రతిష్ఠాస్యామి(ప్ర. 6-3) ఇతి । ఏవం జీవేన సంయుజ్య తేన సహ తేజస్సమ్పత్తిరిహ ప్రాణస్తేజసీ త్యుచ్యతే, యథా యమునాయా గఙ్గయా సంయుజ్య సాగరగమనేపి యమునా సాగరం గచ్ఛతీతి వచో న విరుధ్యతే, తద్వత్ ॥ 4 ॥*

*॥ ఇతి అధ్యక్షాధికరణమ్ ॥ 3 ॥*

## భూతాధికరణమ్ (4-2-4 )

### ॥ సి. సూ ॥ భూతేషు తచ్ఛ్రుతేః ॥ 4-2-5 ॥

*"ప్రాణస్తేజసి" (బృ. 6-8-6) ఇతి జీవసంయుక్తస్య ప్రాణస్య తేజసి సమ్పత్తిరుక్తా, సా సమ్పత్తిః*

---

మరణకాలంలో, ప్రాణాలు పొందుతున్నాయి" అని బృహదారణ్యకశ్రుతి చెప్పుతున్నది. తదుపగమాదిభ్యః అన్నప్పుడు "ఆది"శబ్దంచేత "తముత్క్రామన్తం ప్రాణో అనూత్క్రామతి– ఉత్క్రాంతిని పొందే జీవుడిని అనుసరించి ముఖ్యప్రాణం ఉత్క్రాన్తిని పొందుతున్నది" అనే శ్రుతిలో చెప్పబడినదాన్నికూడా తీసుకోవాలి. అనగా, ఆ విధంగానే (వెనుకచూపబడిన శ్రుతిలో చెప్పినవిధంగానే) జీవుడితోబాటు ముఖ్యప్రాణానికి ఉత్క్రాన్తి అనేది ఈ శ్రుతిలోకూడా చెప్పబడింది అన్నమాట. ప్రాణానికి జీవుడితో కలిపి ఉత్క్రాన్తి చెప్పినట్లుగా, ఉత్క్రాన్తికి ముందు జీవుడి అధీనంగా ప్రాణానికి ప్రతిష్ఠాదులును (జీవుడుంటే ప్రాణం ఉంటుంది జీవుడు లేకపోతే ప్రాణం ఉండదు అని దశకూడా) శ్రుతిలో చెప్పబడియున్నది. "కస్మిన్ ఉత్క్రాన్తే ఉత్క్రాన్తో భవిష్యామి; కస్మిన్ వా ప్రతిష్ఠితే ప్రతిష్ఠాస్యామి ఇతి (ప్ర. 6–3) అని. కనుక ఈ శ్రుతులకు విరోధం లేకుండా ప్రాణస్తేజసి అనటానికి అర్థం చెప్పాలి. అంటే మొదట జీవుడితో ప్రాణానికి సంపత్తిని చెప్పి, ఆ తరువాత ప్రాణంతో కూడిన జీవుడికి తేజస్సులో సంపత్తిని చెప్పాలి. "అయ్యా! ఒకదానితో సంబంధించినదానికి మరొకదానితో సంబంధం కలగటం సాక్షాత్తుగా సంబంధించినట్లుగా లోకంలో ఎక్కడేనా ఉన్నదా?" అంటే యమునా సాగరం గచ్ఛతి– యమున సముద్రాన్ని పొందుతున్నది అని లోకంలో చెప్పటం ఉన్నది. యమున అనేది గంగలో కలిసిపోతున్నది. యమునతోచేరిన గంగ సముద్రాన్ని పొందుతున్నది. అయినా, యమునా సాగరం గచ్ఛతి అనే ప్రయోగాన్ని సాధువుగా దోషరహితమైన ప్రయోగంగా అంగీకరిస్తున్నట్లే ప్రాణంతోబాటు జీవుడు తేజస్సులో సంబంధించుతున్నాడు అని ప్రాణస్తేజసి అని చెప్పటంకూడా ఉపపన్నమే. ఇందులో ఏవిధమైన విరోధమూ లేదు.

అధ్యక్షాధికరణం ముగిసినది.

## భూతాధికరణము (4-2-4 )

### ॥ సి. సూ ॥ భూతేషు తచ్ఛ్రుతేః ॥ 4-2-5 ॥

సూత్రార్థము:– **భూతేషు** = అన్ని భూతములయందును (ప్రాణము చేరుచున్నది) **తచ్ఛ్రుతేః** = శ్రుతి అట్లు చెప్పుటచే.

సంగతి:– జీవసంయుక్తమైన ప్రాణమునకు తేజస్సులో సంపత్తి అనునది వెనుకటి అధికరణములో చెప్పబడినది. ఆ సంపత్తియనునది కేవలము తేజస్సులోనేనా? భూతాంతరములతో

*కిం తేజోమాత్రే? ఉత సంహతేషు సర్వేషు భూతేష్వితి విశయే తేజోమాత్రశ్రవణాత్తేజసి- ఇతి ప్రాప్త ఉచ్యతే - భూతేషు ఇతి । భూతేషు సమ్పద్యతే, కుతః? తచ్ఛ్రుతేః 'పృథివీమయ*

చేరిన తేజస్సులోనా అని విచారించబడుచున్నది.

**విషయము:-** ప్రాణస్తేజసి అను వాక్యమును గురించినది.

**సంశయము:-** జీవునితో కూడిన ప్రాణము కేవల తేజస్సులో సంయుక్తమగుచున్నదా? భూతాంతరములతో చేరిన తేజస్సులో సంయుక్తమగుచున్నదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** శ్రుతి "ప్రాణస్తేజసి" అని చెప్పుచున్నది. ఇచ్చట తేజస్ శబ్దమునకు "భూతాంతరములతో కూడిన తేజస్సని అర్థము చెప్పుటకు లేదు. "పృథివీమయః, ఆపోమయః, తేజోమయః" అను శ్రుతివాక్యములు శరీరమునకు ఒకే సమయమందు అనేకములైన భూతములతో సంబంధమును చూపుచున్నవి. అందుచే భూతాంతర సంసృష్టతేజస్సులోనే సంశ్లేషమును పొందుచున్నది అని చెప్పవలెను అని తోచుచున్నది. వీటిలో ఏ పక్షము యుక్తియుక్తమో నిర్ణయించలేక పోవుటచే సంశయము వచ్చుచున్నది.

**పూర్వపక్షము:-** "ప్రాణస్తేజసి" అను శ్రుతిలో తేజస్ అనియే చెప్పియుండుటచే కేవల తేజస్సులోనే సంయోగము అని చెప్పవలెను. ఇచ్చట ఛత్రిన్యాయముతో భూతాంతరములను కూడ చేర్చవలెనని చెప్పుట యుక్తము కాదు.

(ఛత్రిన్యాయమనగా గొడుగును పట్టుకొని గుంపుగా చాలమంది వెళ్ళుచున్నారు. వారిలో కొంతమంది గొడుగులు పట్టుకొనకనే పోవుచున్నారు. గుంపుగా పోవుచున్నవారిని చూచి ఒకడు "ఛత్రిణో గచ్ఛన్తి" – గొడుగును పట్టుకొనినవారు పోవుచున్నారు – అన్నాడు. అప్పుడు అతడు గొడుగు పట్టినవారిని, లక్షణచేత గొడుగుపట్టుకొననివారినికూడ కలిపియే "ఛత్రణో గచ్ఛన్తి" అని చెప్పుచున్నాడు. "గొడుగును పట్టుకొనినవారు పోవుచున్నారు అని చెప్పుట జరిగినది. ఇదియే ఛత్రిన్యాయము అనబడుచున్నది.

అనగా ఛత్రిన్యాయము ప్రకారము "తేజసి" అని చెప్పినను, భూతాంతరములనుకూడ లక్షణచే చెప్పినట్లు తీసికొనవలెను అని చెప్పుట యుక్తము కాదని తాత్పర్యము. ఎందులకనగా, "ఛత్రిణో గచ్ఛన్తి" అన్నప్పుడు గొడుగును పట్టుకొనినవారును, గొడుగును పట్టుకొననివారును అందరును కంటికి తెలియుచున్నారు. అందుచే, గొడుగును పట్టుకొననివారినికూడ చేర్చి చెప్పుటకు లక్షణావృత్తిని చెప్పుట యుక్తమే. ఇచ్చట తేజస్ వ్యతిరిక్తమైన (తేజస్సుతప్ప మిగత) భూతాంతరములు ఉండటంలో ప్రమాణం ఏదీ లేదు గనుక కంటికి కనబడలేదు గనుక– ఇక్కడ ఛత్రిన్యాయాన్నా చెప్పటం కుదరదు. కనుక కేవలతేజస్సులోనే సంశ్లేషం పొందుతున్నది.

**సిద్ధాంతము:-** భూతేషు ఇతి– భూతేషు సంపద్యతే ఎందుచేతనంటే, తచ్ఛ్రుతేః– "పృథివీమయః, ఆపోమయః తేజోమయః"(బృ. 6-4-5) అని ఈ లోకంలోనూ పరలోకంలోనూ సంచరించే జీవుడికి సర్వభూతమయత్వం అంటే సర్వభూతసంసర్గము శ్రుతిలో చెప్పబడింది.

*ఆపోమయః తేజోమయః' (బృ. 6-4-5) ఇతి జీవస్య సఞ్చరతః సర్వభూతమయత్వశ్రుతేః ॥ 5 ॥*

*నను తేజఃప్రభృతిష్వేకైకస్మిన్ క్రమేణ సమ్పత్తావపి 'పృథివీమయః' ఇత్యాదికా శ్రుతిరుపపద్యతే, అత ఆహ-*

## *॥ సి. సూ ॥ నైకస్మిన్దర్శయతో హి ॥ 4-2-6 ॥*

*నైకస్మిన్-ఏకైకస్య కార్యాక్షమత్వాత్। దర్శయతో హ్యక్షమత్వం శ్రుతిస్మృతీ 'అనేన జీవేనాత్మనా ఽనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి తాసాం త్రివృతం త్రివృతమేకైకాం కరవాణి (ఛాం.6-3-23) ఇతి నామరూపవ్యాకరణయోగ్యత్వాయ త్రివృత్కరణ ముపదిశ్యతే । 'నానావీర్యాః పృథగ్భూతాస్తతస్తే*

---

"పృథివీమయః - పృథివి ఉపకరణము అని అర్థం) శరీరమనేది ఇరువదినాలుగు తత్త్వములతో నున్నది గనుక ఇక్కడ చెప్పబడనిది అంతాకూడా తేజోమయశబ్దంచేత సంగ్రహంగా చెప్పబడింది. కనుక జీవసంయుక్తమైన ప్రాణం సర్వభూతసంసృష్టమైన తేజస్సులోనే సంశ్లేషాన్ని పొందుతున్నది.

తేజస్సు మొదలైన వాటిలో ప్రతిదానిలోనూ క్రమంగా సంశ్లేషాన్ని పొందుతున్నదని చెప్పినా పృథివీమయత్వాది శ్రుతులు చరితార్థాలవుతున్నాయి. కనుక "ప్రాణస్తేజసి" అనే వాక్యాన్ననుసరించి "తేజస్సులోనే సంశ్లేషాన్ని పొందుతున్నది' అని చెప్పాలనే ఆక్షేపానికి సమాధానం సాదిస్తున్నారు.

## *॥ సి. సూ ॥ నైకస్మిన్ దర్శయతో హి ॥ 4-2-6 ॥*

సూత్రార్థము:- **న ఏకస్మిన్** = ఒక్కొక్క భూతములోనును (వరుసగా ప్రాణము చేరుచున్నది) అని చెప్పరాదు. **దర్శయతః హి** = (భూతములు వేరువేరుగా ఏ కార్యమును చేయలేవని శ్రుతి, స్మృతి కూడ చెప్పుచున్నది గదా!

త్రివృత్కృతముగనో పంచీకృతముగనో చేయబడిన భూతములే కార్యములగుచున్నవి. "ఆపః పురుషవచసో భవన్తి॥" అన్నప్పుడు, త్రివృత్కరణం చేయబడిన అప్పుయే(జలమే) కార్యకరమగుచున్నది అని ఉండటం చూస్తున్నాం. కరణము చేయబడిన అప్పుయే -జలమే-కార్యకరమైనది అని చూచుచున్నాము. ప్రతి ఒక్కటియు వేరువేరుగా భూతమందు క్రమముగా సంశ్లేషించుచున్నదని చెప్పకూడదు. ఎందులకనగా, దర్శతో హి- వేరువేరుగా ఒక్కొక్కటియు కార్యక్షమమగుటలేదు అని శ్రుతిస్మృతులుచెప్పుచున్నవి. "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి; తాసాం త్రివృతం త్రివృతం ఏకైకాం కరవాణి"(జీవశరీరకుడనైన నాచేత లోపల ప్రవేశించబడి నామ(పేరు)రూప-(శరీరము)వ్యాకరణము చేయబడుచున్నది. ఆ మూడింటిని చేర్చి ఒక్కొక్కదానిగా చేయబడుచున్నది) అని శ్రుతి చెప్పుచున్నది. (త్రివృత్కరణమనునది పంచీకరణమునకును ఉపలక్షణము) సమష్టి కాలమందు వీటిని- పంచభూతములను- తెలిసికొనుట సాధ్యము గాదు. పంచీకరణము చేసిన తరువాతనే వాటి రూపము, పేరును తెలియును. నామరూపవ్యాకరణము చేసినతరువాతనే త్రివృత్కరణము (పంచీకరణము) అను భ్రమము ఉండకూడదని చెప్పుటకు "నామరూపవ్యాకరణయోగ్యత్వాయ త్రివృత్కరణం ఉపదిశ్యతే" అని భాష్యమందు ప్రసాదించబడినది.

*సంహతిం వినా । నాశక్నువన్ప్రజాః స్రష్టుమసమాగమ్య కృత్స్నశః । సమేత్యాన్యోన్యసంయోగం పరస్పర సమాశ్రయాః। మహదాద్యాః విశేషాన్తా హ్యణ్డముత్పాదయన్తి తే (వి.పు 1-2-52/53)ఇతి। అతః ప్రాణ స్తేజసి' ఇతి తేజశ్శబ్దేన భూతాన్తరసంసృష్టమేవ తేజోఽభిధీయతే । అతో భూతేష్వేవ సమ్పత్తిః ॥ 6 ॥*

*॥ ఇతి భూతాధికరణమ్ ॥ 4 ॥*

## *ఆసృత్యుపక్రమాధికరణమ్ (4-2-5 )*

### *॥ సి. సూ ॥ సమానా చాఽఽసృత్యుపక్రమాదమృతత్వం చానుపోష్య ॥ 4-2-7 ॥*

*ఇయముత్క్రాన్తిః కిం విద్వదవిదుషోః సమానా? ఉతావిదుష ఏవేతి చిన్తాయాం- అవిదుష*

---

"నానావీర్యాః పృథగ్భూతాస్తతస్తే సంహతిం వినా ।
నాశక్నువన్ప్రజాః స్రష్టుమసమాగమ్య కృత్స్నశః ॥
సమేత్యాన్యోన్యసంయోగం పరస్పరసమాశ్రయాః ।
మహదాద్యా విశేషాన్తా హ్యణ్డముత్పాదయన్తి తే॥ (వి.పు. 1. 2. 52. 53)

అండోత్పత్త్యర్థం పరస్పరాత్మకత్వం ఇత్యాహ। నానావీర్యా ఇతి। నానావీర్యత్వం–అతిద్రవత్వ కఠినత్వాదికమ్। సంహతిం వినా -మేలనం వినా। అత ఏవ అసమాగమ్య-సమీత్యైకీభావే- ఏకత్వం అప్రాప్య। ప్రజాగ్రహణం అణ్డస్యాప్యుపలక్షణార్థమ్। సమేత్యేతి- సమేత్య పరస్పరసమాశ్రయాః- అన్యోన్యసంయోగః- సంశ్లేషః । సమేత్య। అనన్తరం అశేషత ఐక్యం ప్రాప్య। (శ్రీవిష్ణుచిత్తీయమ్)

మిక్కిలి ద్రవమైనదియును చాల కఠినముగానున్నదియు వేరువేరుగా ఒకదానితోనొకటి కలవకనే బ్రహ్మాండమున సృష్టించుటకు సమర్థములుకావు. కనుక, మహత్ మొదలు విశేషాన్తములు ఒకదానితో నొకటి చేరినవిగా గ్రహించి అండమును సృష్టించుచున్నది అని స్మృతి చెప్పుచున్నది.

కనుక, "ప్రాణ స్తేజసి" అన్నప్పుడు తేజశ్శబ్దముచే భూతాన్తరసంసృష్టమైన తేజస్ చెప్పబడుతున్నది. అందుచే జీవసంయుక్తప్రాణము పృథివ్యాది భూతసూక్ష్మములలోనే చేరుచున్నది అని నిర్ణయింప బడుచున్నది.

భూతాధికరణము ముగిసినది.

## *ఆసృత్యుపక్రమాధికరణము (4-2-5 )*

### *॥ సి. సూ ॥ సమానా చాఽఽసృత్యుపక్రమాదమృతత్వం చానుపోష్య 4-2-7 ॥*

**సూత్రార్థము:-** **ఆసృత్యుపక్రమాత్** = బ్రహ్మనాడిలో ప్రవేశించుటకు పూర్వమువరకు, **సమానా చ** = (బ్రహ్మోపాసకునికిని. ఇతరులకును ఉత్క్రాన్తి) సమానమైనదియే. **అమృతత్వం** = (అతడికి చెప్పబడు) అమృతత్వముకూడ **అనుపోష్య చ** = (శరీరేంద్రియములు)నశించకుండనున్నపుడు కలుగునదియే యగును.

**సంగతి:-** ఇంతవరకు ఉత్క్రాన్తిప్రకారము నిరూపితము. ఈ ఉత్క్రాన్తి విద్వాంసునికిని అవిద్వాంసునికిని సమానమా లేక అవిద్వాంసునికి మాత్రమేనా అని విచారించబడుచున్నది.

*ఏవేతి ప్రాప్తమ్ । కుతః? విదుషోఽత్రైవామృతత్వవచనాదుత్క్రాన్త్యభావాత్॥ విదుషో హ్యత్రైవామృతత్వం శ్రావ్యతే 'యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృది స్థితాః। అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే'(కఠ. 2-6-14)ఇతి ।*

*ఏవం ప్రాప్తేఽభిధీయతే- సమానా చాఽఽసృత్యుపక్రమాత్- ఇతి, విదుషోఽప్యాసృత్యుపక్రమా దుత్క్రాన్తిః సమానా। ఆసృత్యుపక్రమాత్ - ఆగత్యుపక్రమాత్, నాడీప్రవేశాత్ ప్రాగిత్యర్థః । విదుషోఽపి హి నాడీవిశేషేణోత్క్రమ్య గతిః శ్రూయతే "శతం చైకా చ హృదయస్య నాడ్యస్తాసాం మూర్ధాన*

**విషయము:-** ఉత్క్రాన్తిని గురించినది.

**సంశయము:-** ఉత్క్రాన్తి అనునది విద్వాంసుడు, అవిద్వాంసుడు- ఇద్దరికిని ఉన్నదా, అది ఇరువురికిని సమానమా? లేక అవిద్వాంసునికిమాత్రమేనా?

**సంశయము వచ్చుటకు కారణము:-** "శతం చ ఏకా చ హృదయస్య నాడ్యః (కఠ. 2. 6. 16) అను శ్రుతియందు "తయోర్ధ్వమాయన్ అమృతత్వమేతి" అని విద్వాంసునికి మూర్ధన్యనాడిద్వారా ఉత్క్రాన్తి చెప్పబడియున్నది. "అమృత ఇహ భవతి", "అత్ర బ్రహ్మ సమశ్నుతే"(కఠ. 2. 6. 14). ఇచ్చటనే అమృతుడగుచున్నాడు- ముక్తుడగుచున్నాడు. ఇచ్చటనే బ్రహ్మమును పొందుచున్నాడు అనియును శ్రుతి చెప్పుచున్నది. కనుక ఈ విధముగా శ్రుతులలో వేరువేరు తాత్పర్యములు కనబడుటచే సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** అవిద్వాంసునికే ఉత్క్రాన్తి యున్నది, ఎందుచేతననగా,

"యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృదిస్థితాః ।
అథ మర్త్యో అమృతో భవతి అత్ర బ్రహ్మ సమశ్నుతే॥ (కఠ. 2. 6. 14), (బృ 6. 4. 7)

అని విద్వాంసునికి ఇచ్చటనే అమృతత్వమును బ్రహ్మప్రాప్తియు స్పష్టముగా చెప్పబడియున్నందున విద్వాంసునికి ఉత్క్రాన్తి లేదు.

"తేన ప్రద్యోతేన ఏష ఆత్మా నిష్క్రామతి చక్షుషా వా మూర్ధ్నోవా అన్యేభ్యో వా శరీరదేశేభ్యః" (బృ. 6. 4. 2) ఉత్క్రాన్తిని పొందు జీవుడు కంటిద్వారానో మూర్ధన్యనాడిద్వారానో లేక శరీరములోని ఇతరద్వారములలమూలముగనో బయటికి వెళ్ళుచున్నాడు అని. అవిద్వాంసుడు చాల అవయవములద్వారా శరీరమునుండి బయటికి బయలుదేరి వెళ్ళుచున్నాడు అని సాధారణముగా చెప్పుటచే అవిద్వాంసుడు మూర్ధన్యనాడిద్వారాకూడ వెళ్ళుచున్నాడు అనియే చెప్పవలెను. కనుక "శతంచ ఏకా చ" అను శ్రుతికూడ అవిద్వాంసునిగురించినదే.

**సిద్ధాంతము:-** సమానా చ ఆసృత్యుపక్రమాత్ ఇతి। విద్వాంసునికి ఆసృత్యుపక్రమము వరకును ఉత్క్రాన్తి అనునది భేదము లేనిదే. అనగా సమానమే. ఆసృత్యుపక్రమాత్- బ్రహ్మనాడియందు ప్రవేశించుటకు ముందువరకని అర్థము. విద్వాంసునికి నాడీవిశేషముచే ఉత్క్రాన్తిని శ్రుతి చెప్పుచున్నది.

"శతంచ ఏకా చ హృదయస్య నాడ్యః తాసాం మూర్ధానం అపినిసృతైకా।
తయోర్ధ్వమాయన్ అమృతత్వమేతి విష్వఙ్ అన్యా ఉత్క్రమణే భవన్తి॥ (కఠ. 2. 6. 16)

*మభినిఃసృతైకా । తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి విష్వఙ్జన్యా ఉత్క్రమణే భవన్తి (కఠ. 2-6-16) ఇతి । ఏవం నాడీవిశేషేణ గతిశ్రవణా ద్విదుషోఽప్యుత్క్రాన్తిరవర్జనీయా । సా చ నాడీప్రవేశాత్ ప్రాగ్విశేషాశ్రవణా త్సమానా। తత్ప్రవేశదశాయాం చ విశేషః శ్రూయతే "తేనప్రద్యోతేనైష ఆత్మా నిష్క్రామతి చక్షుషోవా మూర్ధ్నో వా అన్యేభ్యో వా శరీరదేశేభ్యః" (బృ.6-4-2) ఇతి । "శతం చైకా చ హృదయస్య" ఇత్యనయా శ్రుత్యైకార్థ్యాత్ మూర్ధ్నో నిష్క్రమణం విద్వద్విషయమ్, ఇతరదవిద్వద్విషయమ్।*

*యదుక్తం విదుష్యత్రైవామృతత్వం శ్రావ్యతే ఇతి, తత్రోచ్యతే-అమృతత్వం చానుపోష్య- ఇతి। చశబ్దోఽవధారణే। అనుపోష్య శరీరేన్ద్రియాదిసంబన్ధమదగ్ధ్వైవ, యదమృతత్వమ్-ఉత్తర పూర్వాఘయో రశ్లేషవినాశరూపం ప్రాప్యతే, తదుచ్యతే "యదాసర్వే ప్రముచ్యన్తే" ఇత్యాదికయా శ్రుత్యేత్యర్థః । "అత్ర*

హృదయమునకు నూటొక్క ప్రధాననాడులు ఉన్నవి. వాటిలో సుషుమ్న అని పేరుగల బ్రహ్మనాడి శిరస్సువైపు వెళ్లుచున్నది. ఆ నాడిద్వారా మీది(బ్రహ్మ)లోకమునకు వెళ్ళువాడు దేశవిశేషమందు- శ్రీవైకుంఠలోకమందు బ్రహ్మమును పొంది స్వస్వరూపావిర్భావలక్షణమైన ముక్తిని పొందుచున్నాడు. ఇతరనాడులు అన్నియును కుంచించుకొని పోవుటలో- అనేకవిధములైన సంసారమార్గములందు ఉత్క్రమణముకొరకు ఉపయోగపడుచున్నవి అని మీది శ్రుతికి అర్థము.

ఈ విధముగా నాడీవిశేషముచే విద్వాంసునికి గతి చెప్పియుండుటచే, విద్వాంసునికిని ఉత్క్రాన్తి అనునది తప్పనిదే అగును. నాడీవిశేషప్రవేశమునకు పూర్వము విద్వాంసుని ఉత్క్రాన్తిలో విశేషించి ఏమియును చెప్పబడనందున విద్వాంసునికిని, అవిద్వాంసునికిని- ఉపాసనము చేసినవానికిని, ఉపాసించని వానికిని నాడీప్రవేశమువరకును చెప్పబడిన ఉత్క్రాన్తి సమమైనది. అనగా ఒకే విధమైనది. నాడీప్రవేశవేళ యందు విద్వాంసుడు మూర్ధన్యనాడీవిశేషమందు ప్రవేశించుచున్నాడు అని శ్రుతి చెప్పుచున్నది.

"తేన ప్రద్యోతేన.." అను శ్రుతి సామాన్యముగ చెప్పియున్నను, "శతంచైకా చ" అను శ్రుతితో చేర్చి అర్థమును చెప్పవలెను. "శతం చ" అను శ్రుతి విద్వాంసుడు మూర్ధన్యనాడిద్వారా వెళ్ళి బ్రహ్మమును పొందుచున్నాడనియు, అవిద్వాంసుడైనవాడు చక్షురాదిమార్గములద్వారా వెళ్ళుచున్నా డనియు స్పష్టముగా చెప్పుచున్నది. ఈ శ్రుతిని అనుసరించియే "తేన ప్రద్యోతేన" అను శ్రుతికి అర్థము చెప్పవలెను గనుక, మూర్ధన్యనాడిద్వారా ఉత్క్రమణము విద్వద్విషయము. ఇతరద్వారములద్వారా ఉత్క్రమణము అవిద్వద్విషయము అని నిశ్చయించవలెను. కనుక విద్వాంసునికిని ఉత్క్రాన్తి యున్నది.

ఇక "అమృత ఇహ భవతి" విద్వాంసుడు ఇచ్చటనే ముక్తుడగుచున్నాడు అని చెప్పినదానికి సమాధానము చెప్పబడుచున్నది. "అమృతత్వం చ అనుపోష్య ఇతి". "చ" శబ్దమునకు "ఏవ" అనుదానికున్న అర్థమును గ్రహించవలెను. అనుపోష్య, - అనుపోష్య ఏవ. శరీర, ఇంద్రియ సంబంధము ఉన్నపుడే చెప్పబడు అమృతత్వము ఉత్తర,పూర్వాఘ అశ్లేషవినాశరూపము. అనగా ఉత్తరమందు చేయు పాపము సంబంధించక పోవుటయు, పూర్వము చేసిన పాపము నాశమును పొందుటయు- ఇవే అమృతత్వము-ముక్తి అని చెప్పబడుచున్నది. ఈ అర్థమునే "యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేస్య హృదిస్థితాః। అథ మర్త్యోమృతో భవతి"(బృ.6-4-7), కఠ.2.6.14) - ఇచ్చట ఉపాసనము చేయునపుడు, సమశ్నుతే- బ్రహ్మమును అనుభవించుచున్నాడు అనియే అర్థమును చెప్పవలెను.

*బ్రహ్మ సమశ్నుతే" ఇతి చోపాసనవేలాయాం యో బ్రహ్మానుభవస్తద్విషయ మిత్యభిప్రాయః ॥ 7 ॥*

**॥ సి. సూ ॥ తదాపీతేః సంసారవ్యపదేశాత్ ॥ 4-2-8 ॥**

*అవశ్యం చ తత్ అమృతత్వమదగ్ధదేహసమ్బన్ధస్యైవేతి విజ్ఞేయమ్, కుతః? అపీతేః సంసార వ్యపదేశాత్, అపీతిః అప్యయః బ్రహ్మ ప్రాప్తిః । సా చార్చిరాదినా మార్గేణ దేశవిశేషం గత్వేతి వక్ష్యతే, ఆ తదవస్థాప్రాప్తేః సంసారో దేహసమ్బన్ధలక్షణో హి వ్యపదిశ్యతే, 'తస్య తావదేవ చిరం యావన్న*

ఎందుకనగా, "శతం చ ఏకా చ" అను శ్రుతిలో మూర్ధన్యనాడీవిశేషముతో విద్వాంసునికిని, ఇతరద్వారములతో ఇతరులకును ఉత్క్రమణము స్పష్టముగా - వివరముగా చెప్పియుండుటచే ఈ శ్రుతిని అనుసరించియే ఇతర శ్రుతులకు అర్థమును చెప్పుట ఉచితమగును. 7

## ॥ సి. సూ ॥ తదాపీతేస్సంసారవ్యపదేశాత్ ॥ 4-2-8 ॥

సూత్రార్థము:- **తత్ ఆ అపీతేః సంసారవ్యపదేశాత్** అని పదములను విడదీసుకొనవలెను. **తత్** = (ఈ లోకములో లభించునదిగా చెప్పబడిన) ఆ అమృతత్వమునెడి మోక్షము, (శరీరముతో సంసారమందున్నవానికి చెప్పబడినదిగనే చెప్పవలెను) (ఎందులకనగా) **ఆ అపీతేః** = బ్రహ్మమును పొందువరకును (అపీతిః అనగా అప్యయః- బ్రహ్మప్రాప్తి), **సంసారవ్యపదేశాత్** = (దేహసంబంధముతో నుండుట అనెడి) సంసారము (అతడికి) చెప్పబడుట చేత.

"ఉత్క్రాన్తస్యాపి గచ్ఛతః సూక్ష్మశరీరసంబన్ధాత్ ఆ అపీతేః సంసారః ఇత్యభిప్రాయః" (శ్రుత ప్రకాశిక) శరీరమునుండి బయలుదేరి పోవుచున్నవానికిని సూక్ష్మశరీరసంబంధమున్నది గనుక, బ్రహ్మప్రాప్తి పర్యన్తము అతడు సంసారియే. "అయ్యా! బ్రహ్మము అంతటను వ్యాపించియున్నదిగనుక ఇచ్చటనే బ్రహ్మమును పొందుచున్నాడు అని చెప్పవచ్చును గదా! అను ఆక్షేపమునకు సమాధానమును ప్రసాదించుచున్నారు.

బ్రహ్మప్రాప్తియనునది అర్చిరాదిమార్గముద్వారా దేశవిశేషమైన శ్రీవైకుంఠలోకమును చేరిన పిదపనే అని తరువాతి పాదమునందు చెప్పబోవుచున్నారు. "సా చ అర్చిరాదినా మార్గేణ దేశవిశేషం గత్వా ఇతి వక్ష్యతే" అను ఈ భాష్యశ్రీసూక్తికి వేరువిధముగాకూడ అర్థము చెప్పవచ్చు. అనగా - "యదా సర్వే ప్రముచ్యన్తే"(బృ. 6. 4. 7) అను శ్రుతికి తరువాతి శ్రుతిలో

"అణుః పన్థా వితతః పురాణః మాం స్పృష్టోనువిత్తో మయైవ।
తేన ధీరా అపియాన్తి బ్రహ్మవిదః స్వర్గం లోకం ఇత ఊర్ధ్వ విముక్తాః॥ (బృ. 6. 4. 8)

("అర్చిరాదిమార్గముద్వారా బ్రహ్మవేత్తలు ఈ శరీరమునుండి విడివడినవారై అన్ని లోకములకంటెను మీదనున్న భగవల్లోకమును పొందుచున్నారు") అని చెప్పబడియుండుటను "వక్ష్యతి చ" అనుటచే చెప్పుచున్నారనియు చెప్పవచ్చును. అనగా శ్రీభాష్యశ్రీసూక్తికి తరువాతి పాదములో సూత్రకారులు

*విమోక్ష్యేऽథ సంపత్స్యే*'(ఛాం. 6-14-2)ఇతి। '*అశ్వ ఇవ రోమాణివిధూయ పాపం చన్ద్రఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య। ధూత్వా శరీర మకృతం కృతాత్మా బ్రహ్మలోకమభిసంభవామి*'(ఛాం. 8-13-1) ఇతిచ॥ 8 ॥

చెప్పబోవుచున్నారనియు ఉపనిషత్తులో "యదా సర్వే ప్రముచ్యన్తే" అను శ్రుతికి తరువాతిశ్రుతిలో చెప్పబడుచున్నది అనియు రెండు విధములుగను అర్థమును చెప్పవచ్చును.

అర్చిరాదిమార్గములో వెళ్ళి దేశవిశేషమును పొందినపిదపనే బ్రహ్మప్రాప్తి- బ్రహ్మమును పొందుట సాధ్యము అని శ్రుతియు, సూత్రకారులును చెప్పుటచే బ్రహ్మప్రాప్తిపర్యన్తము దేహసంబంధ ప్రయుక్తమైన జ్ఞానసంకోచము ఉండుటకు కారణమైన సూక్ష్మకర్మ ఉండునని చెప్పబడుచున్నది. "తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే – ప్రారబ్ధశరీరపతనము వరకును ఆలస్యము. ఆ శరీరమునుండి విడివడినచో వెంటనే బ్రహ్మమును పొందుచున్నాడు" అని శ్రుతి చెప్పుటచే దర్శనసమానాకారమైన జ్ఞానముకలుగగనే బ్రహ్మమును పొందుచున్నాడని చెప్పుటకు కుదరదు.

అంతేకాక, "అశ్వ ఇవ రోమాణి విధూయ పాపం చంద్ర ఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య ధూత్వా శరీరం అకృతం కృతాత్మా బ్రహ్మలోకం అభిసంభవామి" (గుఱ్ఱము ఎట్లు తన శరీరమునకున్న రోమములను- రోమములకంటిన ధూళిని వదలించుకొనునో, అదే విధముగా పాపములను వదలి, రాహుముఖమునుండి విడిపడిన చంద్రునివలె కృతాత్మయైన నేను శరీరమును వదలి, నిత్యమైన బ్రహ్మలోకమును పొందబోవుచున్నాను" అని ఉపాసకుడు అనుసంధించునట్లు చెప్పుటచేతను, శరీరసంబంధముతో చెప్పబడిన అమృతత్వమనునది పాపముల అశ్లేష, వినాశరూపమేనని తప్పక అంగీకరించవలెను. దీనితో అద్వైతుల జీవన్ముక్తివాదముకూడ నిరసించబడినది 8

వెనుకటి సూత్రమందు సూక్ష్మశరీరము ఉన్నట్లు చెప్పినదానికి ప్రమాణమును తరువాతి సూత్రములో చూపుచున్నారు

మరియొక విధముగా కూడ సంగతి చెప్పబడుచున్నది- అదేమనగా, అయ్యా! "శరీరేంద్రియ సంబంధము ఉన్నంతవరకు బ్రహ్మప్రాప్తియనునది లభించదు- అని "అమృతత్వం చ అనుపోష్య" అను వాక్యఖండముచే చెప్పబడినది. ఇప్పుడు స్థూలశరీరమునుండి బయలువెడలుటయు శరీరమునుండి విడిపడుటచేత (బ్రహ్మము అన్నిచోట్లను వ్యాపించియున్నదిగనుక) ఇచ్చటనే (స్థూలశరీరవియోగానన్తరము మరుక్షణమే) బ్రహ్మమును పొందుచున్నాడు అని ఎందుకు చెప్పకూడదు?

అయ్యా "అనుపోష్య" అనుటలో ఉపోషణమునకు కర్మముగా అభిమతమైన శరీరము స్థూలశరీరము మాత్రము కాదు. సూక్ష్మశరీరముకూడ అట్టిదే అగును. కనుక, సూక్ష్మశరీరసంబంధముకూడ తొలగిననే బ్రహ్మమును పొందుట సాధ్యము. సూక్ష్మశరీరము లేదు అను చెప్పుట కుదరదు. ప్రమాణముచేత సూక్ష్మశరీరము ఉన్నదని తెలియుచున్నదని ప్రసాదించుచున్నారు-

**॥ సి. సూ ॥ సూక్ష్మం ప్రమాణతశ్చ తథోపలబ్ధేః ॥ 4-2-9 ॥**

*ఇతశ్చ విదుషోऽపి బన్ధో నాత్ర దగ్ధః, యతః సూక్ష్మం శరీరమనువర్తతే । కుత ఇదమవగమ్యతే । ప్రమాణతస్తథోపలబ్ధేః । ఉపలభ్యతే హి దేవయానేన పథా గచ్ఛతో విదుషః, "తం ప్రతిబ్రూయాత్ సత్యం బ్రూయాత్" (కౌ.1-2) ఇతి చన్ద్రమసాసంవాదవచనేన శరీరసద్భావః । అతః సూక్ష్మశరీరమనువర్తతే। అతశ్చ బన్ధో న దగ్ధః ॥ 9 ॥*

**॥ సి. సూ ॥ సూక్ష్మం ప్రమాణతశ్చ తథోపలబ్ధేః ॥ 4-2-9 ॥**

సూత్రార్థము:- **సూక్ష్మం** = (అర్చిరాదిగతి పూర్తి అగునంతవరకును) సూక్ష్మశరీరము (అనుసరించుటచేత) అంతవరకును ఉపాసకునికి సంసారబంధము (తొలగుట లేదు), **ప్రమాణతశ్చ** = వేదవాక్యముచేతకూడ, **తథా** = ఆ విధముగనే **ఉపలబ్ధేః** = తెలియుటచేత.

సూక్ష్మశరీరము అనువర్తించుటచే విద్వాంసుడు స్థూలశరీరమునుండి బయటపడినను అతడికిని ఇచ్చట బంధము నివర్తించుటలేదు. విద్వాంసుడు అర్చిరాదిమార్గములో వెళ్ళుటచే **అగత్యా**-వేరుమార్గము లేదు గనుక అతడికి సూక్ష్మశరీరమును అంగీకరించవలెను అని వెనుక చెప్పియున్నాము. అంతమాత్రమే కాదు, **ప్రమాణతశ్చ తథా ఉపలబ్ధేః** - ప్రమాణముచేతకూడ సూక్ష్మశరీరముండునని (కనబడుటచేత) తెలియుచున్నది. ప్రమాణతో జీవస్య తథా సూక్ష్మదేహవత్త్వేన ఉపలబ్ధేః ఇతి సూత్రార్థః- అర్చిరాదిమార్గములో పోవు విద్వాంసునికి 'తం ప్రతిబ్రూయాత్…సత్యం బ్రూయాత్' అని చంద్రునితో సంవాదము చెప్పబడియున్నది. శరీరములేనిచో మాటాడుట సాధ్యము గాదు. కనుక సూక్ష్మశరీరము ఉన్నదని ప్రమాణముచేతకూడ నిశ్చయించబడుతున్నది. అందుచే బంధము తొలగలేదు.

విద్వాంసుడు చంద్రుని పొంది అతడితో మాటాడుటనుగురించి కౌషీతక్యుపనిషత్తులో నున్నదానిని ఇచ్చట ఉదహరించుచున్నాము.

"ఏతద్వై స్వర్గస్య లోకస్య ద్వారం యశ్చన్ద్రమాః తం యః ప్రత్యాహతం అతిసృజతే" (కౌ. 1-11-12) ఇది భగవల్లోకమునకు -అనగా శ్రీవైకుంఠలోకమును ప్రవేశించు ద్వారమువంటిది. చంద్రుడు ద్వారపాలకుడువంటివాడు. అతడు అడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానములను చెప్పువానినే పరమాత్మ శ్రీమన్నారాయణుడు వేంచేసియుండు లోకమునకు వెళ్లుటకు అనుమతినిచ్చుచున్నాడు. ఉపాసనము చేసి చంద్రుని పొందినవానిని చంద్రుడు అడుగుచున్నాడు- "కోసి-నీవెవరు" అని "తం ప్రతిబ్రూయాత్" అతడితో ఇక చెప్పబోవు రీతిలో ఎవడు సమాధానము చెప్పునో అట్టివానిని బ్రహ్మలోకమునకు వెళ్ళుటకు అనుమతించుచున్నాడు- "తేన సత్యేన తపసా ఋతురస్మి, ఆర్తవోస్మి, కోస్మి, త్వమస్మి ఇతి॥" అని సమాధానమును చెప్పవలెను. తస్మాత్ న్యాసమేషాం తపసామతిరిక్తమాహుః అనినట్లుగా, భగవానుని శరణుపొందిన ఉన్నతమైన తపస్సుచేత ప్రసన్నుడైన , తేన సత్యేన- ఆ పరమపురుషునిచే అనుగ్రహించబడినవాడై, మాస, ఋతు, సంవత్సరాదికాలరూపియై నేను ఉన్నాను, ఆయా కాలములలోనున్న పదార్థములై నేను ఉన్నాను, చతుర్ముఖునిగాకూడ నేను ఉన్నాను. నీవుగను నేను ఉన్నాను అని "అహం మనురభవం కక్షవాన్, సూర్యశ్చ" అని సర్వాన్తరాత్మగా భగవానుడు ఉన్నాడు

అని తెలిసికొనిన వామదేవులు అనుసంధించుకొనినట్లు ఎవడు సమాధానమును చెప్పుచున్నాడో అతడిని భగవల్లోకమునకు పోవుటకు అనుమతించుచున్నాడు అని యున్నది. 9.

## ॥ సి. సూ ॥ నోపమర్దేనాతః ॥ 4-2-10 ॥

సూత్రార్థము:- **అతః** = వెనుక చెప్పిన కారణములచే, అనగా అర్చిరాది మార్గముద్వారా వెళ్ళి దేశవిశేషమందు బ్రహ్మమును పొందునంతవరకు సంసారవ్యపదేశము ఉన్నందున, **న ఉపమర్దేన** = "యదా సర్వే ప్రముచ్యన్తే... అత్ర బ్రహ్మ సమశ్నుతే" అను శ్రుతివాక్యము కర్మ(సంసార) బంధము తొలగినపిదప కలుగు అమృతత్వము-మోక్షమును చెప్పలేదు. కాని ఉపాసనకాలమందు దర్శనసమానాకారమైన దశలో కలుగు పాపాశ్లేషవినాశమునే చెప్పుచున్నది.

జీవన్ముక్తివాదమును నిరసించుటకు ఈ సూత్రమును ప్రసాదించియున్నారు. అనగా నిదిధ్యాసితవ్యః- ఉపాసనము చేయవలెను అని విధించియుండుటచే, ఆ ఉపాసనమును "ఏవం వర్తయన్ యావదాయుషం' 'ప్రాయణాన్తమోఙ్కారమభిధ్యాయీత" అను శ్రుతులు మరణకాలపర్యన్తము ఉపాసనమును వదలకుండ చేయుచునే యుండవలెనని విధించుటచేతను, "వాఙ్మనసి సంపద్యతే.. తేజః పరస్పరస్యాం దేవతాయాం" అను క్రమములో చేరి మూర్ధన్యనాడిద్వారా జీవునికి ఈ స్థూలదేహము నుండి ఉత్క్రాన్తి చెప్పబడియుండుటచేతను, అర్చిరాదిమార్గములో పోవుచున్నాడని చెప్పియుండుటచేతను, "పరంజ్యోతిరుపసంపద్య స్వేన రూపేణ అభినిష్పద్యతే" అని పరమాకాశమందు- పరమపదమందు పరమపురుషుని పొందిన పిదప (సర్వబంధములనుండి విడివడి) స్వస్వరూపమును- అపహతపాప్మత్వాది గుణములను పొందుచున్నాడు అని శ్రుతి చెప్పియున్నందునను, వీటన్నింటికిని పాతకము వచ్చునుగనుకను, ప్రత్యక్షవిరోధముచేతను జీవన్ముక్తియనునది ఉపపన్నముకానేరదని సూత్రకారుల మనోగతము. 10

విద్వాంసుడు అర్చిరాది మార్గములో పోవుచున్నాడు అని చెప్పియున్నందున, చంద్రునితో సంవాదము చెప్పియుండుటచేతను సూక్ష్మశరీరము ఉన్నదని అంగీకరించవలెను అని చెప్పుట సరికాదు. సుఖదుఃఖములను ఇయ్యగల - భోగహేతువులైన కర్మలు స్థూలదేహమునుండి బయలువెడలునపుడు విద్వాంసునికి నిశ్శేషముగా తొలగిపోవుచున్నది. కనుక, ఇంకను అనుభవించవలసిన భోగములు లేవు. దానిచే భూతసూక్ష్మములతో- సూక్ష్మశరీరముతో పోవుచున్నాడు అని చెప్పుట ఉచితముకాదు.

అయ్యా! శరీరము లేనిచో అర్చిరాది గమనము, చంద్రసంవాదమును ఎట్లు సంభవమగును? సమాధానము చెప్పుచున్నాను- అణుస్వరూపుడైన జీవునికి శరీరము లేకపోయినను అర్చిరాదిగమనము సంభవించును. అణుస్వరూపుడైన జీవుడు స్వభావముచేతనే క్రియావానుగనుక శరీరములేకుండ గమనము సంభవించును. అందుచే సూక్ష్మశరీరము అవసరము లేదు. అర్చిరాదిమార్గమధ్యమున చంద్రునితో సంవాదమును శ్రుతి చెప్పియుండుటచే ఆ సమయమున మాత్రము ఒక శరీరమును

బ్రహ్మ సమశ్నుతే" (బృ. 4-4-7) ఇతి వచనం న బన్ధోపమర్దేనామృతత్వం వదతి ॥ 10 ॥

॥ సి. సూ ॥ అస్యైవ చోపపత్తేరూష్మా ॥ 4-2-11 ॥

అస్య సూక్ష్మశరీరస్య క్వచిద్విద్యమానత్వోపపత్తేర్విదుషః ప్రక్రాన్తమరణస్య మరణాత్ప్రాగూష్మా స్థూలే శరీరే క్వాచిత్క ఉపలభ్యతే । న చ స్థూలస్యైవ శరీరస్యాయమూష్మా అన్యత్రానుపలబ్ధేః, తతశ్చోష్మణః క్వచిదుపలబ్ధిర్విదుషః సూక్ష్మశరీరస్యోత్క్రాన్తినిబన్ధనేతి గమ్యతే, తస్మాద్విదుషో-ఽప్యాసృత్యుపక్రమా త్పమానోత్క్రాన్తిరితి సుష్ఠూక్తమ్॥ 11 ॥

పునరపి విదుష ఉత్క్రాన్తిర్న సమ్భవతీత్యాశఙ్క్య పరిహ్రియతే -

॥ సి. సూ ॥ ప్రతిషేధాదితి చేన్న శారీరాత్ప్రష్టో హ్యేకేషామ్ ॥ 4-2-12 ॥

---

గ్రహించుచున్నాడు అని చెప్పుచున్నాము. కనుక, సూక్ష్మశరీరము అవసరము లేదు. (అధికరణసారావళి–485శ్లో) అను ఆక్షేపమునకు సమాధానమును చెప్పుచున్నారు–

॥ సి. సూ ॥ అస్యైవ చ ఉపపత్తేరూష్మా ॥ 4-2-11 ॥

సూత్రార్థము:– **అస్య ఏవ** = సూక్ష్మశరీరమునకు స్థూలశరీరములోని ఏకదేశమందు ఉండుట **ఉపపత్తేః చ** = యుక్తిచేతను, స్థాపించబడుచున్నది. **ఊష్మా** = మరణమును పొందుసమయములో నున్న విద్వాంసునికి మరణమునకు పూర్వము స్థూలశరీరములో ఒకచోట ఉష్ణము ఉండుటను చూచుచున్నాము ఆ ఉష్ణము సూక్ష్మశరీరమునకు చెందినది అని గ్రహించవలెను. అది స్థూలశరీరమునకు చెందినది అని చెప్పుటకు సాధ్యము కాదు. స్థూలశరీరమునకు చెందినదే అయినచో "సన్తాపయతి స్వం దేహం ఆపాదతలమస్తకమ్" అని చెప్పినట్లు అరిపాదమునుండి శిరస్సుమీదిమస్తకము వరకును ఆ ఉష్ణము ఉండి తీరవలయును. కాని అట్లు లేదే! స్థూలశరీరములో ఏదో ఒకస్థలములోగదా ఉష్ణము ఉండుట చూచుచున్నాము! కనుక, విద్వాంసునికిని సూక్ష్మశరీరమనునది ఉత్క్రాన్తిచే కలుగుచున్నదని స్పష్టమగుచున్నది. కనుక, నాడీప్రవేశమునకు ముందువరకును ఉత్క్రాన్తి అనునది విద్వాంసునికిని అవిద్వాంసునికిని సమానమని బాగుగా వివరించబడినది. 11.

విద్వాంసునికి ఉత్క్రాన్తి అనునది సంభవించదు అని తిరిగి ఆక్షేపించి దానికి పరిహారమును ప్రసాదించుచున్నారు. అనగా– వెనక "అమృత ఇహా భవతి' 'అత్ర బ్రహ్మ సమశ్నుతే' అని శ్రుతి చెప్పి యుండుటచే విద్వాంసునికి ఉత్క్రాన్తి అనునది లేదు అని ఆక్షేపించుకొని, దానికి పరిహారమును సాదించియున్నారు. ఇప్పుడు విద్వాంసునికి ఉత్క్రాన్తి లభించదని శ్రుతి నిషేధించియుండుటచే అతడికి ఉత్క్రాన్తి యుండదని తిరిగి ఆక్షేపించిదానికి మరియొక పరిహారమును ప్రసాదించుచున్నారని తాత్పర్యము.

॥సి. సూ॥ ప్రతిషేధాదితి చేన్న శారీరాత్ప్రష్టో హ్యేకేషామ్ ॥ 4-2-12 ॥

సూత్రార్థము:– **ప్రతిషేధాత్** = (ఉపాసకునికి) ఉత్క్రాన్తి లేదని చెప్పియున్నందున (అతడికిని ఉత్క్రాన్తి యుండునని చెప్పుట తప్పు) **ఇతిచేత్** = అనినచో, **న** = అది సరికాదు. (ఎందులకనగా,) **శారీరాత్** = (అచ్చట) జీవునినుంచి ప్రాణము బయటికి పోవుట లేదు అనియే చెప్పబడెను. **ఏకేషాం**

*యదుక్తం విదుషోప్యుత్క్రాన్తిః సమానేతి, తన్నోపపద్యతే, విదుష ఉత్క్రాన్తిప్రతిషేధాత్, తథా హి "స ఏతాస్తేజోమాత్రాఃసమభ్యాదదానో హృదయమేవాన్వపక్రామతి" (బృ. 6-4-1) ఇత్యుపక్రమ్య, "తేన ప్రద్యోతేనైష ఆత్మా నిష్క్రామతి తముత్క్రామన్తం ప్రాణోऽనూత్క్రామతి" ఇత్యవిదుష ఉత్క్రాన్తి ప్రకారమభిధాయ "అన్యన్నవతరం కల్యాణతరం రూపం కురుతే" ఇతి దేహాన్తరపరిగ్రహం చాభిధాయ "ప్రాప్యాన్తం కర్మణస్తస్య యత్కించేహ కరోత్యయమ్ । తస్మాల్లోకాత్పునరేత్యస్మై లోకాయ కర్మణే*

---

= మాధ్యందినశాఖయందు **స్పష్టః హి** = (జీవునినుండియే ప్రాణము బయటికి పోవుట లేదు అని) స్పష్టముగా తెలియుచున్నది గదా!

విద్వాంసునికి ఉత్క్రాన్తి అనునది ఉన్నదని మీచే చెప్పబడినది ఉపపత్తిగలది కాదు, విద్వాంసునికి ఉత్క్రాన్తిని శ్రుతి నిషేధించియున్నది గనుక. దీనిని వివరించి చెప్పుచున్నాను. "స ఏతాః తేజోమాత్రాః సమభ్యాదదానో హృదయమేవ అన్వక్రామతి" (బృ. 6. 4. 1). ఈ ఆత్మ ఏ కాలంలో బలహీనుడై ఇంద్రియముల క్షోభచేత మోహమును పొందుతున్నాడో, (మోహమనగా- మైకం. మరణంలో సగం దశ. మోహో నామ మరణాయ అర్ధసంపత్తిః) అప్పుడువాగాదులు ఈ ఆత్మని పొందుతున్నవి. ఆ ఆత్మ ఇంద్రియములచే సవాసనముగా - వాసనతో చేరినదై, పుండరీకాకారమైన హృదయమును పొందును" అని ఆరంభించి, "తేన ప్రద్యోతేనాత్మా నిష్క్రామతి, తముత్క్రామన్తం ప్రాణోనూత్క్రామతి" -మరణించినవాని హృదయముయొక్క అగ్రమనగా- నాడీమార్గమున వెలువడే ద్వారము ప్రకాశించును. బ్రహ్మముచేతప్రకాశింపచేయబడిన ద్వారము గలవాడై ఈ ఆత్మయనబడుజీవుడు చక్షురాది ద్వారాలద్వారా - కన్ను, చెవి, ముక్కు మొదలైనవాటిద్వారా- బయటికి వెళ్తున్నాడు- అని అవిద్వాంసుడికి ఉత్క్రాన్తిని చెప్పి, "అన్యత్ నవతరం కల్యాణతరం రూపం కురుతే- కంసాలివాడు పాత బంగారు ఆభరణాన్ని తీసికొని కొత్తగా మంచి ఆభరణాన్ని చేస్తాడో, అదే విధంగా ఈ ఆత్మ ఈ శరీరాన్ని వదలి వేసి మరొక కొత్త, అందమైన శరీరాన్ని పొందుతున్నాడని చెప్పి, "ప్రాప్యాన్తం కర్మణః తస్య యత్కిఞ్చ ఇహ కరోత్యయం। తస్మాత్‌లోకాత్ పునః ఏతి అస్మై లోకాయ కర్మణే ఇతి తు కామయమానః" (బృ. 6. 4. 6)

ఈ సంసారిజీవుడు ఈ లోకంలో స్వర్గాదిఫలాలను ఉద్దేశించి యజ్ఞయాగాదికర్మలను చేస్తున్నాడు. ఆ కర్మలయొక్క ఫలంగా స్వర్గాది భోగాలను అనుభవించుచున్నాడు. ఆ పుణ్యకర్మలు ఇతడికి ఫలమును ఇచ్చి ఆ ఫలం అనుభవం పూర్తిఅయి తొలగిపోవగనే స్వర్గాదిలోకాలనుండి తిరిగి యజ్ఞయాగాది కర్మలను చేయటానికి ఈ లోకాన్ని పొందుతున్నాడు." అని అవిద్వాంసుడిని గురించి చెప్పవలసిన విషయాలను చెప్పిపూర్తిచేసి, 'అథ అకామయమానః" అని విద్వాంసుడికి అవిద్వాంసుడికంటె వైలక్షణ్యాన్ని చెప్పటం ఆరంభించేరు. యో అకామః నిష్కామ ఆప్తకామః, ఆత్మకామః న తస్య ప్రాణాః ఉత్క్రామన్తి, బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి (బృ. 6. 4. 6)

ఇక, ఫలాంతరములో ఆశలేనివారైన ఉపాసకులను గురించి చెప్పుతున్నది. "ఎవడు నిష్కాముడో - ఆశలేనివాడో, అతడు అకాముడు" అంటే విద్వాంసుడిని "అకాముడు-ఆశలేనివాడు" అన్నది శ్రుతి. అతడు ఎందుచేత అకాముడు అని చెప్పబడుతున్నాడు? అంటే, నిష్కాముడు గనుక. పూర్వమున్న

*ఇతి తు కామయమానః” ఇత్యవిద్వద్విషయం పరిసమాప్య “అథాకామయమానః- యోఽకామో నిష్కామ ఆప్తకామ ఆత్మకామో న తస్య ప్రాణా ఉత్క్రామన్తి; బ్రహ్మైవ సన్బ్రహ్మాప్యేతి” ఇతి విదుష ఉత్క్రాన్తిః ప్రతిషిధ్యతే। తథా పూర్వత్ర ఆర్తభాగప్రశ్నేఽపి విదుష ఉత్క్రాన్తిప్రతిషేధో దృశ్యతే “అపపునర్మృత్యుం జయతి” (బృ. 5-2-10) ఇతి విద్వాంసం ప్రస్తుత్య ‘యాజ్ఞవల్క్యేతి హోవాచ యత్రాయం పురుషో మ్రియతే ఉదస్మాత్ప్రాణాః క్రామన్తి, ఆహో న” ఇతి (బృ. 3-2-11) పృష్టః “నేతిహోవాచ యాజ్ఞవల్క్యోఽత్రైవ సమవలీయన్తే స ఉచ్ఛ్వయత్యాధ్మాయతి ఆధ్మాతో మృతః శేతే” ఇతి । అతో*

ఆశలన్నీ అతడిలోనుండి తొలగిపోయినాయి గనుక అతడిని అకాముడు అన్నది. పూర్వమున్న ఆశలు పోయినా, మళ్ళీ మరొకసారి వేరు ఆశలు కలగవచ్చుగదా! ఆవిధంగా వేరు ఆశలు కలుగుతే అతడిని నిష్కాముడు అని చెప్పగలమా? అంటే, అతడు “ఆప్తకాముడు” అంటే అతడికి అన్ని ఆశలును తీరిపోయి(పొందబడి)నాయి గనుక అతడికి ఇంక ఆశలు కలుగవు. కనుక నిష్కాముడు. అతడు అన్ని ఆశలన్నీ తీరి(పొంది)యున్నవాడని ఎలా అంటున్నారు? అంటే “ఆత్మకామః” ఆత్మని తప్ప ఆశించటానికి మరొక వస్తువు లేదుగనుక ఆప్తకాముడు అయినాడు, కనుకనే అకామత్వాదులును సిద్ధిస్తున్నాయి. ఇటువంటివాడు “బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి” అని వెనకటి వాక్యంతో చేర్చి అర్థం చెప్పుకోవాలి. బ్రహ్మైవ సన్- అపహతపాప్మత్వాది గుణాష్టకరూపమైన బ్రహ్మస్వరూపాన్ని పొంది, బ్రహ్మాప్యేతి- పరమాత్మవద్ద లీనుడవుతున్నాడు.) అనే శ్రుతిలో ఉపాసకుడికి ఉత్క్రాన్తిఅనేది నిషేధించబడుతున్నది.

ఈ విధంగా దీనికి ముందు (ముందరి ప్రపాఠకంలో) ఆర్తభాగప్రశ్నంలోకూడా విద్వానుడికి ఉత్క్రాన్తి లేదని నిషేధించబడింది. “అపపునర్మృత్యుం జయతి” (బృ. 5. 2. 10) జరత్కారుగోత్రంలో పుట్టిన ఋతభాగుల పుత్రుడైన ఆర్తభాగులు యాజ్ఞవల్క్యులని చూచి, “మహర్షీ! గ్రహములు ఎన్ని, అతిగ్రహములు ఎన్ని” అని ప్రశ్నించేరు. దానికి యాజ్ఞవల్క్యులు సమాధానం చెప్పినతరువాత మళ్ళీ అడిగేరు- మహర్షీ! ఏ మృత్యువుకి కంటితో చూడబడే ఈ ప్రపంచం అంతా అన్నమౌతున్నది? ఆమృత్యువూ ఏ దేవతకి అన్నమౌతున్నదో, ఆ దేవతని చెప్పండి” అని. దానికి యాజ్ఞవల్క్యులు సమాధానం చెప్తున్నారు - నిప్పు అంతటినీ కాల్చివేస్తున్నది కనుక అగ్నికి సర్వము అన్నమౌతున్నది. అందుచేత అగ్ని మృత్యువు. ఆ అగ్నికూడా జలముచేత అణగార్చబడుతున్నది- నాశం పొందుతున్నది. అందుచేత అప్పులకు - జలములకు అగ్ని అన్నమగుచున్నది. అప్పులకు అగ్ని అనేది అన్నమౌతున్నదని తలుచుకొనేవాడు- ఉపాసించేవాడు మృత్యువుని జయిస్తున్నాడు - సంసారంనుండి విడిపడుతున్నాడు అని ఉపాసకుడిని ప్రస్తావించి “యాజ్ఞవల్క్యేతి హెూవాచ యత్ర అయమ్ పురుషః మ్రియతే ఉతస్మాత్ ప్రాణః క్రామన్తి? ఆహెూ న?” మరల ప్రశ్న అడుగుతున్నారు.-“మహర్షీ! ఈ పురుషుడు- జీవుడు ఎప్పుడు మరణాన్ని పొందుతున్నాడో అప్పుడు ఇతడినుండి ప్రాణాలు అవి వచ్చిన ప్రకారం అక్కడక్కడ పోతున్నాయా లేదా?” అని ప్రశ్న అడిగేరు దానికి “న ఇతి హెూవాచ హెూవాచ యాజ్ఞవల్క్యః అత్రైవ సమవనీయన్తే. స ఉచ్ఛ్వయతి ఆధ్మాయతి ఆధ్మాతః మృతః శేతే ఇతి ॥”(బృ. 5-2-11)ప్రాణాలు పోవటం లేదు. అని సమాధానం చెప్పేరు. అవి వెళ్ళటం లేదు అంటే ఏమౌతున్నాయి?

*విద్వానిహైవామృతత్వం ప్రాప్నోతీతి చేత్-*

*తన్న, శారీరాత్ ప్రత్యగాత్మనః ప్రాణానుత్క్రాన్తిర్హ్యత్ర ప్రతిషిధ్యతే, న శరీరాత్ "నతస్య ప్రాణా ఉత్క్రామన్తీ"త్యత్ర తచ్ఛబ్దేన 'అథాకామయమానః' ఇతి ప్రకృతః శారీర ఏవ పరామృశ్యతే; నాశ్రుతం శరీరమ్। తస్యేతి షష్ఠ్యా ప్రాణానాం సమ్బన్ధిత్వేన శారీరో నిర్దిష్టః న తూత్క్రాన్త్యపాదానత్వేన। ఉత్క్రాన్త్య-*

"అయం పురుషః– ఈ దేహమనేది, మ్రియతే– మరణాన్ని పొందుతున్నది. అస్మాత్ – ఈ దేహంనుండి అత్రైవ– శరీరంలోనే, సమవలీయన్తే–చేర్చబడుతున్నవి. అందుచేత సః దేహమనేది ఉచ్ఛ్వయతి– ఉబ్బి పెద్దదగుచున్నది. ఆధ్మాయతి– బైటిగాలిచేత నిండినదగుచున్నది. అంటే ఆ బయటి గాలితో నిండిన ఆ శరీరం ఉబ్బిపోయింది అని అర్థం అని పూర్వపక్షి ఈ శ్రుతికి అర్థం చెప్పేడు.

**సిద్ధాంతి**– పురుషః– జీవుడు, మ్రియతే– దేహసంబంధాన్ని వదలుతున్నాడో, అస్మాత్– జీవుడినుండి. అత్రైవ–జీవుడివద్దనే, సమవలీయన్తే– జీవుడితో ఉత్క్రాన్తిని పొందటానికి చేరుతున్నవి. సః జీవుడు మృతః ఉచ్ఛ్వయతి–ఉత్క్రాన్తప్రాణస్సన్ ఉబ్బిపోతున్నాడు అని అర్థం చెప్పుతున్నారు.

పూర్వపక్షియొక్క అభిప్రాయం –– ప్రాణం లేకుండా ఉన్నది దేహం ఉబ్బిపోయినది మొదలైనవి విశేష్యమైన దేహికి సంభవించినవి కాదుగనుక విశేషణమైన శరీరంతోనే ప్రాణాలు చేరిపోతున్నాయి అని అర్థం చెప్పుకోవాలి. ఇట్లు విద్వాంసుడికి (శరీరంనుండి)ఉత్క్రాన్తి లేదని నిషేధించబడింది ఉత్క్రాన్తి నిషేధించబడిన ఇక్కడనే బ్రహ్మమును పొంది అనుభవిస్తున్నాడు అని చెప్పవలెను.

విద్వాంసుడికి ఉత్క్రాన్తి నిషేధించబడిందిగనుక విద్వాంసుడికి ఉత్క్రాన్తి లేదు అనే పక్షాన్ని ఖండిస్తున్నారు. "తత్ న'అనే సూత్రఖండంచేత "న తస్య ప్రాణాః ఉత్క్రామన్తి– జీవుడినుండి ప్రాణాలు ఉత్క్రాన్తిని పొందటంలేదు అనే శ్రుతి శారీరుడైన ప్రత్యగాత్మనుండి ప్రాణాలు ఉత్క్రాన్తిని పొందటంలేదు అని చెప్పుతున్నది తప్ప, శరీరంనుండి ప్రాణాలు పోవటంలేదు – ఉత్క్రాన్తిని పొందటం లేదు అని చెప్పలేదు. న తస్య అనే శ్రుతిలోఉన్న తత్ శబ్దం జీవుడినే పరామర్శిస్తుంది– ఇతఃపూర్వం చెప్పబడిన దానిని గురించే చెప్తుంది. ఈవాక్యానికి "అథాకామయమానః" అని విద్వాంసుడైన జీవుడిని గురించి ఆరంభించి చెప్తూన్నందున "తస్య" అన్న తచ్ఛబ్దం జీవుడినే పరామర్శిస్తుంది – చెప్పుతుంది, ఈ ప్రకరణంలో చెప్పబడని శరీరాన్ని చెప్పదు.

నను, అయ్యా! 'తస్య' అనేటప్పుడున్న షష్ఠీవిభక్తి సంబంధసామాన్యాన్ని చెప్పేది. కనుక, ప్రాణాలకు సంబంధిగా జీవుడు చెప్పబడుతున్నాడు. అంటే షష్ఠ్యంతమైన తచ్ఛబ్దంచేత శారీరుడు చెప్పబడుతున్నాడని తాత్పర్యం. అది ఆవిధంగానే ఉంటుంది. జీవుడిని చేరిన ప్రాణాల ఉత్క్రాన్తికి అపాదానం శరీరమే. అంటే జీవసంబంధియైన ప్రాణాలు శరీరాన్ని వదలి పోవటం లేదు అనే అర్థంచెప్పుకోవాలి. 'న తస్య' అని ఉన్నదే తప్ప, "న తస్మాత్" అని లేదు. తస్మాత్ అని ఉండి ఉంటే, జీవుడినుండి అని చెప్పవచ్చు. తస్య అని ఉన్నది గనుక జీవసంబంధియైన ప్రాణములు 'న ఉత్క్రామంతి' – దేనినుండి ఉత్క్రాంతిని పొందటం లేదు? అనే ప్రశ్న వస్తే శరీరంనుండి పోవటం లేదుఅనే సమాధానం చెప్పాలి.

*పాదానంతు శరీరమేవేతి చేన్న, అపాదానాపేక్షాయామశ్రుతాచ్ఛరీరాత్ సమ్బన్ధితయా శ్రుతస్యాఽఽత్మన ఏవ సన్నిహితత్వేన అపాదానతయాపి గ్రాహ్యత్వాత్ కిఞ్చ, ప్రాణానాం జీవసమ్బన్ధితయైవ ప్రజ్ఞాతానాం తత్సమ్బన్ధకథనే ప్రయోజనాభావాత్ సమ్బన్ధమాత్రవాచిన్యా షష్ఠ్యా అపాదానమేవ విశేష ఇతి నిశ్చీయతే, యథా నటస్య శృణోతీతి, న చాత్ర వివదితవ్యం, స్పష్టోహ్యేకేషాం మాధ్యన్దినానా మామ్నాయే శారీరో జీవ ఏవాపాదానమితి, "యోకామో నిష్కామ ఆప్తకామ ఆత్మకామో న తస్మాత్ప్రాణా ఉత్క్రామన్తీ"తి*

---

అయ్యా! మీరు ఈ విధంగా చెప్పటం సరికాదండీ! దేనినుండి ఉత్క్రాన్తిని పొందుతున్నది అని అపాదానాపేక్ష కలిగినప్పుడు ఆ ప్రకరణంలో చెప్పబడని శరీరాన్ని ఎత్తిచూపటంకంటె, ప్రాణసంబంధిగా ఇక్కడే చెప్పబడిన జీవాత్మనే అపాదానంగా తీసుకోవాలి. అంటే చెప్పబడని ధర్మిని(శరీరాన్నీ) దానికి అపాదానత్వాన్నీ – ఈవిధంగా రెండింటినీ కల్పించటంకంటే, ఇక్కడ చెప్పబడిన ధర్మికి– శారీరుడికి (జీవుడికి) అపాదానత్వాన్ని మాత్రం కల్పించటం యుక్తమని తాత్పర్యం. ఇంకాచెప్తాను విను– "న తస్య ప్రాణాః ఉత్క్రామన్తి' అన్నప్పుడు చెప్పబడిన 'తస్య' అన్నపదానికి "తస్మాత్ అన్నదాని అర్థాన్నే గ్రహించాలి. ఎందుకంటే, ప్రాణాలు జీవుడితో కలిసే ఉంటాయి అనేవిషయం అందరికిని తెలుసును. కనుక, "ప్రాణసంబంధి జీవుడు" అని చెప్పటంలో ప్రయోజనం ఏమీ లేదు. కనుక, సంబంధమాత్రాన్ని చెప్పే షష్ఠీవిభక్తికి 'తస్మాత్' అనే అపాదానార్థాన్ని విశేషించి చెప్పవలెనని నిశ్చయించబడుతున్నది. "నటస్య శృణోతి" అన్నప్పుడు నటాత్ శృణోతి అని అర్థం చెప్పినట్లే ఇక్కడకూడా 'తస్య' అన్నపదానికి 'తస్మాత్' అన్నపదంతాలూకు అర్థమే చెప్పాలి. అప్పుడు శారీరుడే అపాదానం అవుతున్నాడు. అక్కడినుండి ఉత్క్రాన్తి నిషేధించబడుతున్నదేతప్ప, శరీరంనుండి ఉత్క్రాన్తి లేదు అని నిషేధించబడలేదు. కనుక, విద్వాంసుడికి ఉత్క్రాన్తి ఉన్నది అని నిశ్చయించబడుతున్నది.

"అయ్యా నేను చెప్పే ఈ అర్థం నా భావానికి తగినట్లు కష్టపడి సమర్థించబడుతున్నదని అనుకోవద్దు"అంటున్నారు. స్పష్టో హి ఏకేషాం – మాధ్యందినుల శాఖలో శారీరుడు – జీవుడే అపాదానంగా చెప్పబడ్డాడు. (సూత్రంలో ఉన్న "ఏకేషాం" అనేపదానికి "మాధ్యందినానాం" అని అర్థం. శారీరః అనేది స్పష్టః అన్నదానికి విశేష్యం. స్పష్టః– అపాదానం అని స్పష్టంగా చెప్పబడింది. "శారీరః అపాదానత్వేన స్పష్టః ఇత్యర్థః అని సూత్రఖండానికి అర్థం) దీనివల్ల తచ్ఛబ్దానికి కూడా షష్ఠీవిభక్తికి శ్రుతిని చూపి అర్థంచెప్పాలి అన్నమాట. మాధ్యందినశాఖలో చెప్పబడిన శ్రుతిని విను. "యో అకామః, నిష్కామః, ఆప్తకామః, ఆత్మకామః న తస్మాత్ ప్రాణా ఉత్క్రామన్తి ఇతి।" ఎవడు అకాముడో, నిష్కాముడో, ఆప్తకాముడో, ఆత్మకాముడో అతడినుండి ప్రాణాలు ఉత్క్రాన్తిని పొందటం లేదు అని విద్వాంసుడైన జీవుడిని చెప్పి, 'తస్మాత్' అని పఞ్చమ్యన్తంగానే– అతడినే అపాదానంగానే శ్రుతి స్పష్టంగానే చెప్పియున్నది గనుక బృహదారణ్యకంలో చెప్పబడిన 'తస్య' అనేపదాన్ని తస్మాత్ అన్నపదంగానే తీసుకోవాలి. అంటే యో విజ్ఞానే తిష్ఠన్ అన్నప్పుడున్న విజ్ఞానశబ్దానికి సమానప్రకరణంలోనున్న "య ఆత్మని తిష్ఠన్" అన్న ఆత్మశబ్దంచేత ఆత్మపరంగా అర్థం చెప్పినట్లుగా, 'తస్య' అనేపదానికి సమానప్రకరణంలో ఉన్న 'తస్మాత్' అనే అర్థాన్ని తీసుకొనటమే ఉచితమౌతుంది.

*(మాధ్యం. 6-1)। శారీరా త్ప్రాణానాముత్క్రాన్తిప్రసఙ్గాభావాత్ తన్నిషేధో నోపపద్యతే ఇతి చేన్న, తస్య తావదేవ చిరమితి విదుషః శరీరవియోగకాలే బ్రహ్మసమ్పత్తివచనేన ప్రాణానామపి తస్మిన్ కాలే శారీరాద్విదుషో వియోగః ప్రసజ్యతే, తతశ్చ దేవయానేన పథా బ్రహ్మసమ్పత్తిర్నోపపద్యత ఇతి, న*

అయ్యా! ప్రసక్తస్య హి ప్రతిషేధః – ప్రతిషేధించటానికి తగినస్థలంలోనే – ప్రసక్తి ఉన్న చోటనే ప్రతిషేధం చెయ్యవలెను అనే న్యాయంప్రకారం శారీరుడినుండి ప్రాణాలు వదలి విడిపోవటానికి ప్రసక్తి వచ్చింది కనుక "న తస్మాత్ ప్రాణా ఉత్క్రామన్తి" అని నిషేధించవచ్చు. ప్రాణాలు ఎప్పుడూ జీవుడిని వదలి ఉండవుకదా! కనుక శారీరుడిని అపాదానంచేసి అతడినుండి ప్రాణాలు ఉత్క్రాన్తిని పొందటం లేదు అని చెప్పటం సరికాదు. శరీరంనుండి ప్రాణాలు పోవటంలేదు అనే చెప్పాలి.

అయ్యా మీ ఆక్షేపం సరికాదు. "తస్య తావదేవ చిరమ్"– ప్రారబ్ధశరీరావసానపర్యన్తమే ఆలస్యము. ప్రారబ్ధశరీరం తొలగిపోయినవెంటనే మరుక్షణమే విద్వాంసుడు బ్రహ్మమును పొందుతాడని శ్రుతి చెప్పుతున్నదిగనుక శరీరమును వదలి పోవు సమయమందు బ్రహ్మసంపత్తినిచెప్పియుండుటచే ప్రాణములకుకూడ ఆసమయమందు జీవునినుండి ఉత్క్రాన్తికి ప్రసక్తి యున్నది. అందుచే నిషేధించబడినది.

అయ్యా ప్రసక్తియుండవచ్చు. దానిచేనేమి? ప్రారబ్ధదేహవియోగకాలమందు ప్రాణములును శరీరమును వదలిపోవుటచే ఏదైన అనిష్టము కలిగినగదా! దానిని నిషేధించవలెను? అన్నచో, దీనిచే వచ్చు అనిష్టమును చెప్పుచున్నాను వినుము. శారీరుడిని విడచిప్రాణములు పోయినచో, అర్చిరాది మార్గములో పోయి బ్రహ్మమునుపొందుచున్నాడు అనునది సంభవించదు. కనుకనే 'న తస్య ప్రాణా ఉత్క్రామన్తి – అర్చిరాదిమార్గములో పోయి బ్రహ్మమును పొందుటకు ముందు విద్వాంసుడైన జీవునినుండి ప్రాణములు వేరుపడుట లేదు అని నిషేధించబడినది. ఆర్తభాగప్రశ్నమందుకూడ విద్వద్విషయముగా నున్నచో, ఇప్పుడు చెప్పబడిన పరిహారమునే అక్కడకూడ గ్రహించవలెను. అనగా, దేవయానగతి నిర్వాహముకొఱకు విద్వాంసునికి ప్రాణములతో విశ్లేషము లేదని చెప్పబడిన పరిహారమే అచ్చటకూడ చెప్పబడవలెనని తాత్పర్యము.

బాగు! పరామర్శించి చూచినచో ఆర్తభాగులు అవిద్వాంసునిగురించియే ప్రశ్నించిరని స్పష్టమగును. అనగా, అచ్చట అడిగిన ప్రశ్నను, సమాధానమును పరామర్శించినచో బ్రహ్మవిద్యాప్రసక్తియే లేదని చాల చక్కగా తెలిసివచ్చుచున్నదని తాత్పర్యము. ఆర్తభాగుల ప్రశ్నను, యాజ్ఞవల్క్యుల ప్రతివచనమును – సమాధానమును ఉపనిషత్తులో ఉన్నట్లుగా (సంగ్రహముగా) ఇచ్చట చెప్పుచున్నాము

జరత్కారుగోత్రమునకు చెందిన ఋతభాగుల కుమారులు ఆర్తభాగులు అనువారు యాజ్ఞవల్క్యమహర్షిని కొన్ని ప్రశ్నలు అడిగిరి.

**ఆర్తభాగులు** – యాజ్ఞవల్క్యమునీ! గ్రహములు ఎన్ని? అతిగ్రహములు ఎన్ని? అని రెండు ప్రశ్నలను అడుగగా. యాజ్ఞవల్క్యులు మహర్షీ! ముక్కు, వాగింద్రియము, నాలుక, కన్ను, చెవి, మనస్సు, చేయి, చర్మము అని ఎనిమిదిఇంద్రియములు ఎనిమిది గ్రహములు. వాటి విషయమైన గంధము, వాక్కులు (నామములు), రసము, రూపము, శబ్దము కామములు గ్రహించబడుచున్నవి. స్పర్శించు

*తస్య ప్రాణా ఉత్క్రామన్తి దేవయానేన పథా బ్రహ్మప్రాప్తేః ప్రాక్ జీవాద్విదుషోఽపి ప్రాణా న విశ్లిష్యన్తీత్యుచ్యతే । ఆర్తభాగప్రశ్నేఽపి యదా విద్వద్విషయః తదాఽయమేవ పరిహారః, స త్వవిద్వద్విషయః।*

చున్నది ఇట్లు అతిగ్రహములు ఎనిమిది. విషయములు తమతమ విషయియైన ఇంద్రియములను తమవశము చేసికొనుటచే అతిగ్రహమని చెప్పబడుచున్నవి.

**ఆర్తభాగులు**– యాజ్ఞవల్క్యమహర్షీ! ఏ మృత్యువునకు కంటితో చూడబడు ఈ వస్తువులన్నియు అన్నమగుచున్నవి అనియును ఆ దేవత ఏ మృత్యువునకు అన్నమగుచున్నదో చెప్పవలెను.

**యాజ్ఞవల్క్యులు**– ఆర్తభాగా! అగ్ని అనునది అన్ని వస్తువులను కాల్చివేయుచున్నది. అందుచే అంతయును అగ్నికి అన్నమగుచున్నది. కనుక అగ్ని మృత్యువు. ఆ అగ్నినికూడ అప్– జలములు నాశం చేస్తున్నదిగనుక అప్పులకు అగ్ని అన్నమగుచున్నది. ఇట్లు మృత్యువైన అగ్నికి జలము మృత్యువైనది. ఈ విషయమును తెలిసికొనినవాడు అగ్నియను మృత్యువును జయించుచున్నాడు.

**ఆర్తభాగులు** –యాజ్ఞవల్క్యమహర్షీ! ఈ జీవుడు మరణమును పొందునపుడు అతడినుండి ప్రాణములు పోవుచున్నవా లేదా?

**యాజ్ఞవల్క్యులు**– జీవునినుండి ప్రాణములు పోవుటలేదు.

**ఆర్తభాగులు**– మరణించినవాని ప్రాణములుతప్ప ఇతరములైనవి పోవుచున్నవా లేదా?

**యాజ్ఞవల్క్యులు**– మహర్షీ! నామధేయము పోవుటలేదు. శరీరము పోయినను యుధిష్ఠిరాది నామధేయములు పోకనే యుండుటను చూచుచున్నాము. అనువృత్తమైన నామముచే శాశ్వతమైన పుణ్యలోకమును జయించుచున్నాను– పొందుచున్నాను. అందువలననే గదా లోకములో తమపేరు శాశ్వతముగానుండుటకు ప్రతివారును ప్రయత్నించుచున్నారు. మంచికార్యములను చేయుచున్నారు.

**ఆర్తభాగులు**– యాజ్ఞవల్క్యా! మరణమును పొందినవాని వాగాదులు వాటి అభిమానిదేవతలను పొందుచున్నవి. 'అగ్నిం వాక్ అప్యేతి, వాతం ప్రాణాః చక్షుః ఆదిత్యం, మనః చంద్రం, దిశః శ్రోత్రం, పృథివీం శరీరమ్....' అను రీతిలో. ఇట్లున్నచో ఈ శారీరుడు– అనగా జీవుడు అప్పుడు దేనిని ఆశ్రయించుచున్నాడు?

ఈవిధముగా ఆర్తభాగులు ప్రశ్నించుటయు దానికి సమాధానము అందరికిని తెలియునట్లుగా చెప్పకూడదని భావించిన యాజ్ఞవల్క్యులు ఆర్తభాగుల చేతిని చాపమని చెప్పి వారి చేతిని పట్టుకొని దీని అర్థమును మనమిద్దరము కలసి పూర్తిచేతుము అని చెప్పి, వారిని పిలిచికొని ఎవరును లేని ప్రదేశమునకు పోయి, ఇద్దరుగా ఈ విషయమును– పుణ్యకర్మచే పుణ్యశరీరముతో చేరువాడగు చున్నాడనియు. పాపకర్మచే పాపశరీరమును పొందుచున్నాడనియు నిర్ధారణము చేసిరి. ఈ చివరి ప్రశ్నకును యాజ్ఞవల్క్యులే సమాధానమును చెప్పినను, మనమిద్దరము పూర్తిచేతుము అని చెప్పినది వారిరువురును ఖ్యాతిలో ఆశలేని మహాపురుషులు అని చూపుచున్నది. ఆపైన ఆర్తభాగులు ప్రశ్నించక నుండిపోయిరి.

ఇక భాష్యముయొక్క అర్థము చెప్పబడుచున్నది– ఆర్తభాగప్రశ్నమందు ఏమి చెప్పబడినది? గ్రహ, అతిగ్రహరూపేణ ఇంద్రియ అర్థస్వభావము, ఆ తరువాత అగ్నియొక్క అన్నత్వము, మరణమును

*తత్ర ప్రశ్నప్రతివచనయోర్బ్రహ్మవిద్యాప్రసఙ్గాదర్శనాత్, తత్ర హి గ్రహాతిగ్రహరూపేణేన్ద్రియేన్ద్రియార్థస్వభావో ఽపామగ్న్యన్నత్వం మ్రియమాణస్య జీవస్య ప్రాణాపరిత్యాగో మృతస్య నామవాచ్యకీర్త్యనువృత్తిస్తస్య చ పుణ్యపాపానుగుణగతిప్రాప్తిరిత్యేతేఽర్థాః ప్రశ్నపూర్వకం ప్రత్యుక్తాః। తత్ర చ, 'అప పునర్మృత్యుం జయతి' ఇతి అపామగ్న్యన్నత్వజ్ఞానాదగ్నిజయ ఏవ మృత్యుజయ ఉచ్యతే । అతో నాత్ర విదుషః ప్రసఙ్గః। అవిదుషస్తు ప్రాణానుత్క్రాన్తివచనం స్థూలదేహవత్ప్రాణా న ముఞ్చన్తి, అపి తు భూతసూక్ష్మవ జ్జీవం పరిష్వజ్య గచ్ఛన్తీతి ప్రతిపాదయతీతి నిరవద్యమ్ ॥ 12 ॥*

**॥ సి. సూ ॥ స్మర్యతే చ ॥ 4-2-13 ॥**

*మూలము: స్మర్యతే చ విదుషోఽపి మూర్ధన్యనాడ్యోత్క్రాన్తిః । 'ఊర్ధ్వమేకః స్థితస్తేషాం యో*

---

పొందు జీవునినుండి ప్రాణములు పోవుటలేదనియు, మరణమును పొందిన తరువాతకూడ అతడి నామము ప్రకాశించుచునే యుండుననియు, అతడికి పుణ్యపాపానురూపమైన శరీరప్రాప్తి – ఇవిగదా ప్రశ్నపూర్వకము– ప్రశ్నలు అడిగి సమాధానము చెప్పబడినవి. ఇచ్చట విద్వాంసుడిని గురించిన ప్రస్తావమే లేదే అంతాకూడా అవిద్వాంసుదుని గురించేకదా!

అయ్యా, అట్లే కానిండు, "అపపున ర్మృత్యుం జయతి" అనే శ్రుతి, జలములకు అగ్నియనునది అన్నమగుచున్నదను విషయమును తెలిసినవాడే అయినచో అతడు సంసారబంధమునుండి విడిపడుతున్నాడని గదా అర్థము? ఈ వాక్యము యాజ్ఞవల్క్యులను ఇచ్చట చెప్పినదే గదా! దీనికి సమాధానమేమి చెప్పుదురు?

అయ్యా ఇచ్చట జలములకు అగ్ని అన్నమగుచున్నదను జ్ఞానముచే అగ్నిజయము కలుగుటయే మృత్యుజయమున్నట్లు చెప్పబడినది. అనగా ఈ విధముగా తెలిసికొనినవానికి అగ్ని మృత్యువుకాలేదని అర్థము. కనుక ఇచ్చటకూడ విద్వాంసునిగురించిన మాటయే లేదుగదా! అవిద్వాంసునికి ప్రాణము పోవుట లేదు అనుట ఎట్లు కుదురును? అన్నచో, అతడి స్థూలశరీరము పోయినట్లే విద్వాంసుడుకాని వానికి ప్రాణములు పోవుటలేదు కాని భూతసూక్ష్మములు – సూక్ష్మశరీరమువలె జీవునితో చేరియేపోవు చున్నవని శ్రుతులు చెప్పుచున్నవి. ఈ అర్థమే దోషములేనిదగును. ఈవిధముగా పూర్వపక్షి చెప్పిన మూడుకారణములను ఖండించి, విద్వాంసుడు మూర్ధన్యనాడిద్వారా పోవుచున్నాడు అని శ్రుతి చెప్పుటచేత విద్వాంసునికిని ఉత్క్రాన్తి యున్నదని స్థాపించబడినది. ఈ విషయములో స్మృతియు ప్రమాణమని చూపుచున్నారు తరువాతి సూత్రముతో.

**॥ సి. సూ ॥ స్మర్యతే చ ॥ 4-2-13 ॥**

**సూత్రార్థము**:– **స్మర్యతే చ** =(ఈ విషయము) స్మృతిలోకూడ చెప్పబడుచున్నది.

***'ఊర్ధ్వమేకః స్థితస్తేషాం యో భిత్త్వా సూర్యమణ్డలమ్ ।***
***బ్రహ్మలోకమతిక్రమ్య తేన యాతి పరాం గతిమ్॥ (యాజ్ఞ. 3-167)***

(తేషాం–నాడీవిశేషములయందు, యః–ఏ నాడీవిశేషము, ఊర్ధ్వం– మీదివైపువెళ్ళుచు, స్థితః–ఉన్నదో,

*భిత్త్వా సూర్యమణ్డలమ్ । బ్రహ్మలోకమతిక్రమ్య తేన యాతి పరాం గతిమ్' (యాజ్ఞ. 3-167) ఇతి ।13॥*

*॥ ఇతి అసృత్యుపక్రమాధికరణమ్ ॥ 5 ॥*

## *పరసంపత్త్యధికరణమ్ (4-2-6 )*

### *॥ సి. సూ ॥ తాని పరే తథా హ్యాహ ॥ 4-2-14 ॥*

*సకరణగ్రామః సప్రాణః కరణాధ్యక్షః ప్రత్యగాత్మా ఉత్క్రాన్తివేలాయాం తేజఃప్రభృతి భూతసూక్ష్మేషు సమ్పద్యత ఇత్యుక్తమ్ । సైషా సమ్పత్తి ర్విదుషో న విద్యత ఇత్యాశఙ్క్య పరిహృతమ్।*

---

తేన-దానిద్వారా, సూర్యమండలం- సూర్యమండలమును, భిత్త్వా-బ్రద్దలు చేసికొని, బ్రహ్మలోక మతిక్రమ్య- చతుర్ముఖబ్రహ్మయొక్క లోకమును దాటి, పరాం గతిం- పరమప్రాప్యమైన శ్రీవైకుంఠ లోకమును, యాతి-పొందుచున్నాడు) అను స్మృతినుండికూడ విద్వాంసునకును(బ్రహ్మోపాసకునకును) మూర్ధన్యనాడిద్వారా ఉత్క్రాన్తి ఉన్నదని నిశ్చయించబడినది. కనుక బ్రహ్మవేత్తకు లోకాన్తరగమనములేదని ఇచటనే పరబ్రహ్మైక్యమును పొందుననిచెప్పిన పూర్వపక్షి అభిప్రాయము శ్రుతిస్మృతిరూపప్రమాణవిరుద్ధము.

ఆసృత్యుపక్రమాధికరణము సమాప్తము.

## *పరసంపత్త్యధికరణము (4-2-6 )*

### *॥సి. సూ॥ తాని పరే తథా హ్యాహ ॥ 4-2-14 ॥*

**సూత్రార్థము:-** **తాని** = (జీవునితో చేరిన) ఆ భూతసూక్ష్మములు, **పరే** = పరమాత్మయందు (చేరుచున్నవి). **తథా ఆహ హి** = (శ్రుతి)అట్లు చెప్పుచున్నది గదా!

**సంగతి:-** ఉత్క్రాన్తిసమయమందు ఇంద్రియములతో ప్రాణములతో కూడిన జీవునికి భూతములతో సంపత్తి అనునది భూతాధికరణ(4-2-4)మందు చెప్పబడినది. అట్టి సంపత్తి బ్రహ్మోపాసకులకు ఉండదని ఆసృత్యుపక్రమాధికరణము(4-2-5)లో శంకించి బ్రహ్మోపాసకులకును ఉత్క్రాన్తి గలదని అని సిద్ధాన్తీకరించబడినది. ఈవిధముగా నిర్ణయించుట సరికాదని ఆక్షేపించి, ఈ అధికరణము ప్రాప్తమయినది. వెనుకటి అధికరణమునకును, ఈ అధికరణమునకును ఆక్షేపసంగతి- ఏమనగా "తేజః పరస్యాం దేవతాయాం" అని సర్వేంద్రియములతోడను, ప్రాణములతోడను చేరియున్న జీవుడు భూతసూక్ష్మములతో కలసి, అన్నింటికిని ప్రకృతిభూతమైన-కారణభూతమైన పరమాత్మతో చేరుచున్నాడని చెప్పబడియుండుటచే, ఉత్క్రాన్తి అనునది ఉపాసకునికిని అవిద్వాంసునికిని సమానమని చెప్పుట సరికాదని పూర్వాధికరణమును ఆక్షేపించి ఇక రాబోవు రెండు అధికరణములును ప్రవృత్తము లగుచున్నవనియే సంగతి.

**విషయము:-** "తేజః పరస్యాం దేవతాయామ్"(ఛాం. 6-8-6) అను వాక్యము.

**సంశయము:-** భూతసూక్ష్మములు వారివారి పుణ్యపాపములకు తగినట్లుగా బ్రహ్మవిద్యయొక్క మహిమకు తగినట్లు స్వర్గాదిలోకములకుగాని పరమపదమునకు గాని పోవుచున్నవా? లేక పరమాత్మను చేరుచున్నవా? అని సందేహము.

*తాని పునర్జీవపరిష్వక్తాని భూతసూక్ష్మాణి కిం యథాకర్మ యథావిద్యం చ స్వకార్యాయ గచ్ఛన్తి? ఉత పరమాత్మని సమ్పద్యన్త ఇతి విశయే-మధ్యే పరమాత్మసమ్పత్తౌ సుఖదుఃఖోపభోగ రూపకార్యాదర్శనాత్, తదుపభోగానుగుణ్యేన యథాకర్మ యథావిద్యం చ గచ్ఛన్తి ఇతి*

**సంశయము వచ్చుటకు కారణము:-** ఈ శ్రుతివాక్యములోనున్న పరదేవతాశబ్దము దేశవిశేషమందు చేరవలసిన పరదేవత- సర్వాధారుడైన పరదేవతయందు లయమును చెప్పుతున్నదా? లేక వారివారి శరీరములలోనున్నఅంతర్యామితో సంపత్తిని- చేరటాన్ని చెప్పుతున్నదా? దేశవిశేషంలో సర్వాధారుడైన పరమాత్ముడియందు లయాన్నిచెప్పున్నదంటే నాడీప్రవేశానికి పూర్వమే పరసంపత్తి చెప్పి యుండటం కుదరదు. హార్దుడితో ఎల్లప్పుడు చేరే ఉన్నందున ఇప్పుడు కొత్తగా అన్తర్యామితో సంపత్తి చెప్పటం కుదరదే! అంతర్యామితో ఉత్క్రాన్తిసమయంలో చేరటంచేత ఏ ప్రయోజనమూ లేదు. కనుక ఈ పక్షాల్లో ఏపక్షం యుక్తియుక్తమైనది? అని నిర్ణయించటం సాధ్యంకానందున సంశయం కలుగుతున్నది.

**పూర్వపక్షము:-** నాడీప్రవేశమునకు పూర్వము - ఉత్క్రాన్తికాలంలో హార్దుడిని పొంది అనుభవించవలసిన సుఖదుఃఖాలు ఏమీ లేవు గనుక ప్రయోజనాభావాత్ యథాకర్మ యథావిద్యం గచ్ఛన్తి అనియే చెప్పవలెను.

అట్లైనచో, తేజః పరస్యాం దేవతాయాం అనే శ్రుతిలో పరదేవతాసంపత్తి చెప్పియున్నందుకు ఉపపత్తి ఎట్లు చెప్పబడుచున్నది? అన్నచో, సమస్తవస్తువులును పరదేవతయొక్క కార్యముగనుక వాటిలో పరమాత్మ అంతర్యామిగా నుండుటచేత గన్తవ్యములైన స్థానములును పరమాత్మాత్మకములేగనుక, పరస్యాం దేవతాయాం అని చెప్పుట ఉపపత్తిమత్తేనని పూర్వపక్షియొక్క అభిప్రాయము. లేదా, పరమాత్మసంశ్లేష మనునది ఎల్లప్పుడును ఉన్నను, "తేజః పరస్యాం" అను వచనము పూర్వము సిద్ధమైనదానిని అనువదించుటయే తప్ప ఇప్పుడు అపూర్వమైన ఒక సంశ్లేషమును చెప్పుటలేదని అభిప్రాయము కావచ్చును.

**సిద్ధాంతము:-** తాని - జీవపరిష్వక్తములైన భూతసూక్ష్మములు, పరే- పరమాత్మయందు సంపత్తిని పొందుచున్నవి. తేజః పరస్యాం దేవతాయాం అని గదా శ్రుతి చెప్పుచున్నది. శ్రుతి చెప్పినట్లే, అర్థమును చెప్పవలెను. అనగా, శ్రుత్యర్థానుగుణముగ కార్యమును కల్పించుచున్నామని అర్థము. భూతపరిష్వంగమునకు పిదప, నాడీప్రవేశమునకు పూర్వము (మధ్యన) పరమాత్మసంపత్తిచేత ఎట్టి ప్రయోజనమును లేదని పూర్వపక్షి చెప్పుట సరికాదు. స్వాపదశలో – నిదురించే సమయంలో పరసంపత్తిచే అంతర్యామితో చేరియుండుటచే ఆయాసమును తీర్చుకొనినట్లే మరణకాలమందు త్రిస్థూణమును (వెన్నెముక)ను దాటి ముందుకు పోవునపుడు కలిగిన శ్రమము పరసంపత్తిచేతనే నివృత్తమగుచున్నది. హృదయగుహలో ఎల్లప్పుడును చేరియున్నను, ఇప్పుడు చేరుట అలసటను తీర్చుకొనుటకు. ఇది ఒక విలక్షణమైన చేరిక. దీనినే "తేజః పరస్యాం దేవతాయాం " అను శ్రుతి చెప్పుచున్నది. ఇట్లు అలసట తీరుటయే ప్రయోజనము. దీనిని శాస్త్రముచే తెలిసికొనుచున్నాము.

*ప్రాప్త ఉచ్యతే- తాని పరే- ఇతి । తాని పరస్మిన్నాత్మని సమ్పద్యన్తే కుతః? తథాహ్యాహ శ్రుతిః "తేజః పరస్యాం దేవతాయాం"(ఛాం. 6-8-6) ఇతి । యథాఽఽహ శ్రుతిః తదనుగుణం కార్యం కల్ప్యమిత్యర్థః। సుషుప్తిప్రలయయోర్యథా పరమాత్మసమ్పత్త్యా సుఖదుఃఖభోగాయాసవిశ్రమః తద్వదిహాపి ॥ 14 ॥*

*॥ ఇతి పరసమ్పత్త్యధికరణమ్ ॥ 6 ॥*

---

**ప్రశ్న-సమాధానము.**

ప్రశ్న- వాఙ్మనసి సంపద్యతే, మనః ప్రాణే, ప్రాణః తేజసి అను మూడు వాక్యముల అర్థములును మూడు అధికరణములలో వరుసగా విచారింపబడినవి. "తేజః పరస్యాం దేవతాయాం అను నాలుగవ వాక్యముయొక్క అర్థవిచారము తరువాతి అధికరణములో చెయ్యవలెను. అనగా, పరసంపత్త్యధికరణము అవిభాగాధికరణము ఈ రెండు అధికరణములకును తరువాత ఆసృత్త్యుపక్రమాధికరణమును చెప్పియుండవలసినది. అంతేకాక, నాడీప్రవేశాత్- పూర్వమైన పరసంపత్తియు, ఉపాసకులకును విద్వాంసులుకానివారికిని సమానమని చెప్పవలెను గనుక, ఆరెండు అధికరణములకు తరువాతనే ఆసృత్త్యుపక్రమాధికరణమును చెప్పవలసి యుండగా, సూత్రకారులు ఆసృత్త్యుపక్రమాధికరణ సూత్రములను మొదట ఎందుకు చెప్పిరి?

**సమాధానము:**-ఆసృత్త్యుపక్రమాధికరణము మొదటిదిగా, చెప్పబడియున్నను, ఆ అధికరణములో నాడీప్రవేశమునకు ముందువరకును చెప్పబడు ఉత్క్రాన్తి విద్వాంసులకును అవిద్వాంసులకును సమానమని నిర్ణయించుటచే తరువాత చెప్పబడిన పరసంపత్తియు అవిభాగమును ఇరువురికిని సమానమనుటలో ఎట్టి వివాదముగాని విప్రతిపత్తిగాని ఉండుటకు అవకాశములేదు. కాని ఉపనిషద్వాక్యములో ఉన్నప్రకారము వరుసగా (నాలుగవదిగా) "తేజః పరస్యాం దేవతాయాం" అను వాక్యములను మొదట విచారించకపోవుటకు సూత్రకారుల మనోగతము ఆసృత్త్యుపక్రమాధికరణ సిద్ధాంతమును ఆక్షేపించి, పరసంపత్త్యధికరణమును అవిభాగాధికరణమును చెప్పియుండవలెననియే.

మొదట సామాన్యముగా జీవోత్క్రాన్తిని చెప్పి, తరువాత జీవవిశేషమైన విద్వాంసునికి ఉత్క్రాన్తిని ఆక్షేపించి వారికిని ఉత్క్రాన్తియుండునని చెప్పుట సంగతముగా- తగినదే. భూతసూక్ష్మోత్క్రాన్తికి తరువాత విద్వాంసుని ఉత్క్రాన్తినిగురించి విచారించుటలో సంగతి కష్టపడి సంపాదించవలసి యుండును. కనుక సూత్రకారులు ఆసృత్త్యుపక్రమాధికరణమును మొదటిదానిదిగా చెప్పిరి.

"జీవోత్క్రాన్త్యుక్తికాలే విదుషి తు ఘటతే తత్ప్రతిక్షేపభఙ్గో ।
భూతోత్క్రాన్తేస్తు పశ్చాత్ తదుపనిపతనే సఙ్గతిస్స్యాత్ కథఞ్చిత్ ॥ (అధికరణసారావళి-489)

పరసంపత్త్యధికరణము సమాప్తము.

## అవిభాగాధికరణమ్ (4-2-7 )

**॥సి. సూ॥ అవిభాగో వచనాత్ ॥ 4-2-15 ॥**

## అవిభాగాధికరణము (4-2-7 )

**॥ సి. సూ ॥ అవిభాగో వచనాత్ ॥ 4-2-15 ॥**

**సూత్రార్థము:–** **అవిభాగః** = (పరమాత్మతో సంపత్తి అంటే) విడదీయటానికి సాధ్యముగాని కలయికయే. **వచనాత్** = (సంపద్యతే అనే వచనం వలన).

**సంగతి:–** వెనుకటి అధికరణంలో చెప్పిన పరమాత్మసంపత్తి అనేది ప్రాకృతలయము వలె కారణాపత్తిరూపమా? లేక "వాఙ్మనసి సంపద్యతే' అన్నప్పుడు చెప్పినట్లు అవిభాగరూపమా? అని చింతించబడుతున్నది.

**విషయము:–** పరసంపత్తిని గురించినది.

**సంశయము:–** సంగతిలో చెప్పినట్లే సంశయము.

**సంశయము వచ్చుటకు కారణము:–** ఇక్కడ పరమాత్మలో సంపత్తి చెప్పబడటంచేత అది కారణాపత్తిరూపంగా ఉండవలెను అని తోస్తున్నది. "తేజః పరస్యాం దేవతాయామ్" అనే వాక్యంలో 'సంపద్యతే' అన్న పదాన్ని అనుషంగం చేయవలెను. అంటే చేర్చుకొనవలెను. అనుషక్తమైన పదమునకు వాఙ్మనసి సంపద్యతే అన్నప్పుడు చెప్పబడినట్లు అవిభాగార్థమే చెప్పబడియుండాలి. లయార్థం చెప్పకూడదు అని అనిపించుచున్నది. కనుక ఈ రెండు పక్షములలో ఏది యుక్తియుక్తమైనది? అనే నిర్ణయం చేయలేకపోవటంచేత సంశయం కలుగుతున్నది.

**పూర్వపక్షము:–** పరమాత్మ అన్నింటికీ కారణభూతుడుగనుక ఆయనయందు కార్యానికి చెప్పబడే సంపత్తి అనేది లయరూపమే. కేవలసంశ్లేషరూపము కాదు. "వాఙ్మనసి సంపద్యతే" అన్నప్పుడు అప్రకృతిలో లయం చెప్పటం సాధ్యంకాదుగనుక సంపత్తి శబ్దానికి లయం అని అర్థం చెప్పటం కుదరలేదు. ఇక్కడ సర్వప్రకృతియైన పరమాత్మయందు లయం కుదురుతుంది గనుక సంపత్తిశబ్దానికి లయార్థకత్వము చెప్పుచున్నాము. లయించుచున్నది అనటం భూతసూక్ష్మవిశ్లేషరూపము. అనగా సూక్ష్మశరీరమునుండి విడివడి పరమాత్మయందు లయించుచున్నాడు అని అర్థము. ఈవిధమైనచో అర్చిరాదిమార్గములో పోవుచున్నాడు, ధూమాది మార్గములో పోవుచున్నాడు అని చెప్పుట కుదరదే? అని ప్రశ్నించవచ్చు. దానికి సమాధానము చెప్పుచున్నాము వినుడు– సర్వశక్తిమంతుడైన పరమాత్మ ఆయా మార్గాలలో పోవుటకు తగినవిధముగా శరీరమును ఆయా జీవులకు సృష్టించుచున్నాడు. ఆ తరువాత జీవుడు ఆయామార్గాలలో పోయి ఆయా ఫలములను అనుభవించుచున్నాడు అని చెప్పు చున్నాము. కనుక ఇచ్చట చెప్పబడు పరసంపత్తి అనునది కారణాపత్తిరూపమే. అనగా లయమే.

**సిద్ధాంతము:–** ఇచ్చట చెప్పబడు సంపత్తియనునది పృథక్సిద్ధ్యనర్హమైన సంసర్గము. అనగా విడదీయుటకు వీలులేని ఒక చేరికయే. కారణాపత్తిరూపమైన లయము కాదు. దేనిచే ఈ విధముగా

*సేయం పరమాత్మని సమ్పత్తిః కిం ప్రాకృతలయవత్ కారణాపత్తిరూపా? ఉత 'వాఙ్మనసి' ఇత్యాదివదవిభాగరూపేతి చిన్తాయాం - పరమాత్మనః సర్వేషాంయోనిభూతత్వాత్కారణాపత్తిరూప- ఇతి - ప్రాప్తే ఉచ్యతే-అవిభాగః-ఇతి। అపృథగ్భావః=పృథగ్వ్యవహారానర్హ సంసర్గ ఇత్యర్థః। కుతః? వచనాత్।'తేజః పరస్యాం దేవతాయా'మిత్యత్రాపి 'వాఙ్మనసిసమ్పద్యతే'(ఛాం. 6-8-6) ఇత్యతః సమ్పద్యత ఇతి వచనస్యానుషఙ్గాత్,తస్యచ సంసర్గవిశేషవాచిత్వాత్; అనుషక్తస్య అభిధానవైరూప్యే ప్రమాణాభావాత్। ఉత్క్రాన్తివేలాయాం కారణాపత్తిప్రయోజనాభావాత్ । పునస్తత్రావ్యక్తాదిసృష్ట్యవచనాచ్చ ॥ 15 ॥*

*॥ అవిభాగాధికరణం సమాప్తమ్ ॥ 7 ॥*

చెప్పుచున్నావు అన్నచో, 'వచనాత్'. 'తేజః పరస్యాం దేవతాయామ్' అన్నప్పుడుకూడ 'వాఙ్మనసి సమ్పద్యతే' అన్నప్పుడు ఉన్న "సంపద్యతే" అనే పదం చేర్చబడియున్నది. ఈ పదమునకు విడదీయలేని సంసర్గమును అనగా చేరిక గలది అని వాఙ్మనసి సంపద్యతే అన్నప్పుడున్న అర్థం చెప్పబడింది. అనుషక్తమైన పదమునకు వైరూప్యమైన అర్థముచెప్పుటకు ప్రమాణమేమియును లేదు. అనగా, అనుషక్తమైన పదమునకు అచ్చట ఒక విధమైన అర్థమును, ఇచ్చట వేరు విధమైన అర్థమును చెప్పుటకు ప్రమాణ మేమియు లేదు. కనుక పరమాత్మయందు చెప్పబడు సంపత్తియనునది అవిభాగరూపమే. విడదీయలేని (అపృథక్సిద్ధమైన)సంబంధమే. ఇతరస్థలములలో లయముచెప్పుటకు సాధ్యముకాదుగనుక సంపత్తి శబ్దమునకు సంశ్లేషము అని అర్థము చెప్పవలసివచ్చింది. ఇచ్చట సర్వప్రకృతియైన పరమాత్మయందు – కారణమందు– లయము చెప్పసాధ్యము గనుక సంపద్యతే అనుపదమునకు లయార్థము చెప్పుటయే ఉచితమని పూర్వపక్షి చెప్పుట ఉచితము కాదు. ఉత్క్రాన్తిప్రకరణములో లయమును ఎందుకు చెప్పవలెను? దానివలన ప్రయోజనమేమి? ఆవశ్యకత లేనిది. పైగా, లయము పొందుచున్నది అన్నచో నాశమును పొందుచున్నది అని అర్థము. అనగా భూతసూక్ష్మమును వదలివేయుట యగును. అప్పుడు అర్చిరాదిగమన మెట్లు సిద్ధించును? అని ప్రశ్నించినచో సర్వశక్తిమంతుడైన భగవానుడు సృష్టించుచున్నాడు అని చెప్పబడు చున్నది. ఇచ్చట ఒక ప్రశ్న – భగవానుడు సశరీరునిగా జీవుని సృష్టించుచున్నాడా? శరీరముతో సృష్టించుచున్నాడన్నచో పూర్వమున్న శరీరమునే సూక్ష్మశరీరమును వదలి యుండవచ్చును గదా! కొత్తగా ఒకశరీరమును సృష్టించుట గౌరవమగును. అనగా అధికమైన కార్యమగును. కల్పనాగౌరవమును శాస్త్రజ్ఞులు ఒప్పుకొనరు. శరీరమును సృష్టించలేదు. అణుస్వరూపుడైన జీవుడుమాత్రము (క్రియావంతుడు గనుక) ఆయా మార్గములలో పోవుచున్నాడన్నను అదియును కుదరదు. అర్చిరాదిమార్గమందు మధ్య మధ్యను భోగమును పొందుచున్నాడనియు, చంద్రసంవాదమును చెప్పియుండుటచేకూడ ధూమాదిమార్గ మందు పోవువారు భూతపరిష్వక్తులుగనే రంహతి –గచ్ఛతి –యాతి– పోవుచున్నారు అని సూత్రకారులును శ్రుతియు చెప్పుచున్నందునకూడ స్వరూపేణ పోవుచున్నాడు అని చెప్పుట కుదరదు. అంతేకాక, అవ్యక్తాది సృష్టియు ఇచ్చట చెప్పబడలేదు. ఈ కారణములన్నింటిచేతను పృథక్సిద్ధ్యనర్హమైన అవిభాగమే సంపత్తి శబ్దమునకు అర్థమని నిర్ణయము చేయబడవలెను.

అవిభాగాధికరణము సమాప్తము.

## తదోకోధికరణమ్ (4-2-8 )

**॥ సి. సూ ॥ తదోకోగ్రజ్వలనం తత్ప్రకాశితద్వారో విద్యాసామర్థ్యాత్ తచ్ఛేషగత్యనుస్మృతి-యోగాచ్చ హార్దానుగృహీతః శతాధికయా ॥ 4-2-16 ॥**

*ఏవం గత్యుపక్రమావధి విద్వదవిదుషోః సమానాకార ఉత్క్రాన్తిప్రకార ఉక్తః, ఇదానీం విదుషో విశేష ఉచ్యతే। తత్రేదమామ్నాయతే- 'శతం చైకా చ హృదయస్య నాడ్యస్తాసాం మూర్ధానమభినిఃసృతైకా। తయోర్ధ్వ మాయన్నమృతత్వమేతి విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవన్తి'(కఠ-2-6-16)ఇతి। అనయా నాడీనాం శతాధికయా మూర్ధన్యనాడ్యైవ విదుషో గమనమ్। అన్యాభిరేవ చావిదుషో గమనమిత్యయం నియమ*

---

## తదోకోధికరణము (4-2-8 )

**॥ సి.సూ ॥ తదోకోగ్రజ్వలనం తత్ప్రకాశితద్వారో విద్యాసామర్థ్యాత్ తచ్ఛేషగత్యనుస్మృతి-యోగాచ్చ హార్దానుగృహీతః శతాధికయా ॥ 4-2-16 ॥**

**సూత్రార్థము:**–(బ్రహ్మజ్ఞానియైనవాడు)**విద్యాసామర్థ్యాత్** = పరవిద్యయొక్క (సర్వేశ్వరుడియందు సాటిలేని ప్రీతిగలవాడుగనుక)సామర్థ్యముచేతను, **తచ్ఛేషగత్యనుస్మృతియోగాత్ చ** = ఆ విద్యకు అంగమైన అర్చిరాదిమార్గచిన్తనరూపమైన యోగముచేతను, **హార్దానుగృహీతః** = (సంతోషమును పొందిన) హృదయపుణ్డరీకమునందున్న సర్వేశ్వరునిచే కటాక్షించబడినాడు. (అట్టి కటాక్షముచేత అతడికి) **తత్ ఓకః** = (అంతర్యామియొక్క)స్థానమైన ఆ హృదయము, **అగ్రజ్వలనం** = మంగళకరమైన ప్రకాశమును గలదియైనది. **తత్ప్రకాశితద్వారః** = దానివలన బహిర్గతమైన నాడీప్రవేశమార్గముగలవాడై, **శతాధికయా** = నూటొక్కటవదైన నాడియగు సుషుమ్నానాడిద్వారా (బయటికి వెళ్ళుచున్నాడు).

**సంగతి:**– ఇంతవరకు బ్రహ్మసంపత్తివరకును ఉపాసనము చేసినవారికిని, అట్టి ఉపాసనము చేయనివారికిని ఉత్క్రాన్తి ఒకే విధముగానుండునని చెప్పబడినది. ఈ అధికరణములో తన స్థూలదేహము నుండి బయటికి పోవునపుడు విద్వాంసునికి విద్యాఫలభూత ఉత్క్రాన్తివిశేషము చెప్పబడుచున్నది.

**విషయము:**– విద్వాంసుడు బ్రహ్మనాడిద్వారా స్థూలదేహమునుండి బయటికి పోవుటను గురించినది.– "శతం చ ఏకా చ హృదయస్య నాడ్యః" అను శ్రుతిని గురించినది.

**సంశయము:**– విద్వాంసునికి సుషుమ్నానాడిద్వారానే గమనము(ఉత్క్రాన్తి) చెప్పబడుచున్నది అని నియమమును చెప్పవలెనా? నియమములేకుండ, చక్షురాది నాడులలో దేనిద్వారానైనను గమనము సంభవించునా? అని సంశయము.

**సంశయము వచ్చుటకు కారణము:**– "శతం చ ఏకా చ హృదయస్య నాడ్యః... తయా ఊర్ధ్వమాయన్ అమృతత్వమేతి విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవన్తి" అను కఠశ్రుతి మూర్ధన్యనాడిద్వారానే విద్వాంసుడు బయటికి పోవుచున్నాడు. ఇతరులు కన్ను మొదలగుద్వారముల ద్వారానే పోవుచున్నారని

*ఉపపద్యతే, నేతి సంశయః । కిం యుక్తమ్? నియమో నోపపద్యత ఇతి । కుతః? నాడీనాం భూయస్త్వా- దతి సూక్ష్మత్వాచ్చ దుర్వివేచతయా పురుషేణోపాదాతుమశక్యత్వాత్ । 'తయోర్ధ్వ మాయన్నమృతత్వమేతి విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవన్తి' ఇతి యాదృచ్ఛికీ ముత్క్రాన్తిమనువదతీతి యుక్తమితి -*

*ఏవం ప్రాప్తే ప్రచక్ష్మహే- శతాధికయా-ఇతి । విద్వాన్ శతాధికయా మూర్ధన్యయైవ నాడ్యోత్క్రామతి । న చాస్యాఃవిదుషో దుర్వివేచత్వం విద్వాన్ హి పరమపురుషారాధనభూతాత్యర్థప్రియ విద్యాసామర్థ్యాత్ విద్యాశేషభూతతయా ఆత్మనోత్యర్థప్రియగత్యనుస్మరణయోగాచ్చ ప్రసన్నేన హార్దేన పరమపురుషేణానుగృహీతో భవతి । తతశ్చ తదోకః- తస్య జీవస్య స్థానం హృదయమ్, అగ్ర-జ్వలనం*

---

స్పష్టముగా చెప్పుచున్నది. అయినను, నాడులు చాల సన్ననివిగా నుండుటచే ఉత్రాన్తిని పొందు జీవులచే వాటిని తెలిసికొనుట సాధ్యము కాదుగనుక, నియమము చెప్పవీలుగాదనునట్లు కనబడుచున్నది. వీటిలో ఏ పక్షము యుక్తియుక్తముగా నున్నదో తెలియక సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:–** నూటొక్కనాడులలో మూర్ధన్యనాడిలోనే విద్వాంసుడు పోవుచున్నాడు. మిగతావాటిలో ఇతరులు పోవుచున్నారని ఒక నియమమును చెప్పుటకు వీలులేదు. ఎందుకనగా, నూటొక్కనాడులున్నను అవి అత్యంతము సూక్ష్మముగా– చాల చిన్నవిగా ఉన్నందున సుషుమ్నానాడిని తెలిసికొనుటయే సాధ్యము కాదు. కనుక, ఉపాసనము చేసిన జీవుడు మూర్ధన్యనాడిద్వారానే పోవును అని చెప్పుటకు సాధ్యము కాదు.

నను– ఉపాసకుడు ఉపాసనం చేసే సమయంలోనే మూర్ధన్యనాడిద్వారా ఈ స్థూలశరీరంనుండి బయటికి బయలుదేరు అర్చిరాదిమార్గములో పోయి బ్రహ్మమును పొందబోవుచున్నాడు అని ప్రతిదినమును అనుసంధానము చేయుటచే కలిగిన అభ్యాసపాటవముచే తాను బయలుదేరి వెళ్ళవలసిన నాడీవిశేషమును బాగుగా తెలిసినవాడు. అంతేకాక ఉత్క్రాన్తిదశలో కలిగిన పరిశ్రమము బ్రహ్మసంపత్తిచే తొలగిపోయినను, జీవుడిచేత మూర్ధన్యనాడిని వేరుగా తెలిసికొనగలడని చెప్పవచ్చు. దీనికి సమాధానము చెప్పుచున్నాము వినుడు– మీరు చెప్పునది సత్యమే! అయినను, అభ్యాసాదులు ఉన్నను చీకటి చుట్టుముట్టిన హృదయగుహలో నిబిడముగా కలసియున్న నాడులమధ్యన మూర్ధన్యనాడిని వేరుగాతెలిసికొనుట అనునది సాధ్యము కాదు. నేను "తయోర్ధ్వమాయన్ అమృతత్వమేతి" అను శ్రుతికి విరోధముగా అర్థమును చెప్పుచున్నానని భావించవలదు. ఆ శ్రుతి మూర్ధన్యనాడిద్వారా వెళ్ళవచ్చు అని అనుచున్నది. అనగా ఎదురుచూడక అట్లుకూడ పోవచ్చును అని అనువదించుచున్నదని చెప్పుటయే యుక్తమగును. కనుక నియమమును చెప్పుట కుదరదు.

**సిద్ధాంతము:–** ఉపాసకుడు నూటొక్కటవ నాడిద్వారానే స్థూలశరీరమునుండి బయటికి పోవుచున్నాడు. అతిసూక్ష్మముగా నున్నందున ఆ నాడిని విద్వాంసునిచే తెలిసికొనుట(గుర్తించుట) సాధ్యముకాదని చెప్పుట కుదరదు. ఉపాసకుడు మాత్రము పరమపురుషారాధనభూతాత్యన్తప్రియమైన విద్యయొక్క సామర్థ్యముచేతను, మహిమచేతను, ఉపాసనమునకు శేషభూతమగుటచే తనకు

*భవతి,- అగ్రే జ్వలనం ప్రకాశనం యస్య తదిదమగ్రజ్వలనమ్ । పరమపురుషప్రసాదా- త్ప్రకాశితద్వారో విద్వాన్ తాం నాడీం విజానాతీతి తయా విదుషో గతిరుపపద్యతే ॥ 16 ॥*

*॥ ఇతి తదోకోధికరణమ్ ॥ 8 ॥*

అత్యంతప్రియమైయున్న అర్చిరాదిగతి చింతనచేతను ప్రసన్నుడును హార్దుడును అగు పరమపురుషునిచే అనుగ్రహించబడిన వాడగుచున్నాడు. దానిచేత "తదోకః"- ఉపాసకజీవుని స్థానము- వాసస్థానమైన హృదయము అగ్రజ్వలనమును పొందుచున్నది. అగ్రభాగమందు- దానికి ఎదురుగా నాడీద్వారము ఉన్నచోట ప్రకాశించుచున్నది. అగ్రే జ్వలనమ్- ప్రకాశనం యస్య తదిదం అగ్రజ్వలనమ్. పరమపురుషుని అనుగ్రహముచే ప్రకాశించు ద్వారమును చూచి, విద్వాంసుడు అతిసూక్ష్మముగానున్న (నాడులమధ్యలో) నూటొకటవదైన ఆ సుషుమ్ననాడిని తెలిసికొని దానిద్వారా బయటకు పోవుచున్నాడు. కనుక సుషుమ్ననాడిద్వారానే పోవుచున్నాడు. ఈ నియమమునే 'తయోర్ధ్వమాయన్' అను శ్రుతి చెప్పుచున్నది.

అగ్రే జ్వలనమ్ అనునది మెరుపుయొక్క ప్రకాశమువంటి ప్రకాశము గలది అని కపిస్థలం స్వామి అధికరణరత్నమాలలో సాదించియున్నారు. అనగా, "జ్వలనమ్- విద్యుత్స్ఫురణసదృశస్ఫురణం యస్య తత్ తాదృశం భవతి" అని.

### ప్రశ్న సమాధానము-

ప్రశ్న- ఉపాసనచే ప్రీతిచెందిన భగవానుని అనుగ్రహముచేతనే ప్రకాశితమైన నూటొకటవదైన మూర్ధన్యనాడి ద్వారా విద్వాంసుడు స్థూలశరీరమునుండి బయటికి బయలుదేరి పోవుచున్నాడని ఈ సూత్రముయొక్క తాత్పర్యము. నాడీద్వారము భగవదనుగ్రహముచే ప్రకాశించుచున్నదనుటకు ప్రమాణముగా "తస్య హైతస్య హృదయస్య అగ్రం ప్రద్యోతతే తేన ప్రద్యోతేన ఏష ఆత్మా నిష్క్రామతి చక్షుషో వా మూర్ధ్నో వా అన్యేభ్యో వా శరీరదేశేభ్యః" (బృ.6-4-2) అను శ్రుతి చూపబడుచున్నది (తస్య హైతస్య మ్రియమాణస్య సంబంధి యత్ హృదయం తస్య అగ్రం నాడీముఖాత్ నిర్గమనద్వారం ప్రద్యోతత- ఉపసంహృతకరణతేజః ప్రజ్వలితం సత్ ప్రదీప్తం భవతి। తత్ప్రకాశితద్వారస్సన్ ఏష ఆత్మా నిష్క్రామతి చక్షురాదిద్వారేభ్యః ఇత్యర్థః) (మరణము పొందువాని హృదయముయొక్క అగ్రం- నాడియొక్క ముఖమునుండి బయటికివెళ్ళు ద్వారము ప్రకాశించుచున్నది. ఆ ప్రకాశమునుగల ద్వారముగలవాడై ఈ ఆత్మ చక్షురాది- నేత్రము మొదలైన ప్రవేశద్వారమార్గమున బయటికి పోవుచున్నాడని వెనుక ప్రమాణముగా చూపబడిన శ్రుతి యొక్క అర్థము.

ఈ శ్రుతియొక్క అర్థమును బాగుగా పరామర్శించినచో నాడిద్వారా ప్రకాశమనునది ఉపాసకునికిని ఉపాసనము చేయనివాడికిని సమానము అని తెలియుచున్నది. కనుక, "తదోకోగ్రజ్వలనమ్" అనునది విద్వాంసునికిమాత్రమేకాదు. ఇట్లుండగా, "ఉపాసనచే ప్రీతుడైన హార్దానుగ్రహముచే బ్రహ్మనాడీద్వారము ప్రకాశించుచున్నది. దానిద్వారా విద్వాంసుడు పోవుచున్నాడు అని విశేషించి చెప్పుట యుక్తము కాదు.

అంతేకాక, హృదయస్య అగ్రం నాడీ ముఖం ప్రకాశిస్తున్నది అని చెప్పబడుతున్నది. కన్ను,

చెవి, ముక్కు, మొదలైన ఇంద్రియములతో సంబంధమున్న నాడులు హృదయమునుండి వెళ్ళుటచే ఆయా నాడులద్వారములు ప్రకాశించుచున్నవని చెప్పుటయు, వాటిలో ఏదో ఒకదానిద్వారా పోవుచున్నాడు అని చెప్పుటయు ఒప్పుకొనదగినవే. కాని మూర్ధన్యనాడి అనునది నాభినుండి శిరఃపర్యంతము ఉన్నది. దాని నాడీముఖము నాభిలోనున్నది. "హృదయస్య అగ్రం ప్రద్యోతతే" అనుటచే నాభి హృదయస్య అగ్రము కాదు. హృదయస్య అగ్రభాగమందున్న సుషుమ్న– మూర్ధన్యనాడిలో నాడీముఖము– ద్వారము లేదు. అందుచే తదోకోగ్రజ్వలనముచే ప్రయోజనము లేదు.

**సమాధానము**– సప్తలోకీగృహస్థుడైన శరణ్యుడు– హార్దుడు – అన్తర్యామి అందరికిని నాడీప్రకాశమును చేయుచున్నాడనుటలో వివాదము లేదు. కాని ఉపాసకుని విషయములో హార్దుడు చేయు అనుగ్రహము విలక్షణమైనది. అనగా– ఉపాసకుని విషయములో అతడి హృదయమునకు ముందున్న మూర్ధన్యనాడిని చూపుతున్నాడు– ప్రకాశింపజేయుచున్నాడు. ఉపనిషత్తులోనున్న "హృదయస్య అగ్రం ప్రద్యోతతే" అన్నదానికి నాడీముఖము– బయటికి పోవు ద్వారము ప్రకాశించుచున్నది అని అర్థము ఉపనిషద్భాష్యకారులచే చెప్పబడినది. సూత్రమందున్న "అగ్రజ్వలనమ్" అన్నపదమునకు "అగ్రే జ్వలనం యస్య తత్ అగ్రజ్వలనమ్" అని భాష్యకారులు అర్థమును చెప్పియున్నారు. అనగా, హృదయమునకు ఎదురుగానున్న భాగములో పూర్వభాగములోనున్న మూర్ధన్యనాడియందు ద్వారమున్న ప్రదేశమును ప్రకాశించునట్లు చేయుచున్నాడు అని అర్థము. కాని అచ్చటనున్న ద్వారము మూసుకొనియున్నది. ఆ ద్వారము ఉన్నస్థలము ఇతరులకు –ఉపాసనము చేయనివారికి తెలియదు. ప్రతిదినమును గతిచింతనము చేయుచుండుటచే ఉపాసకునికి మాత్రము తెలియును. చక్షురాది నాడీముఖములవలె మూర్ధన్యనాడీముఖము (నాడియొక్క ఆరంభములోనున్న ద్వారము) ప్రకాశించుటలేదు. అయినను, తచ్ఛేషగత్యనుస్మృతియోగాత్ ద్వారం మూసియుండు మూర్ధన్యనాడియొక్క సమీపమునకు పోవుచున్నాడు. అప్పుడు లక్ష్మ్యాసహ హృషీకేశుడు సేవసాదించి ఆ మూర్ధన్యనాడిని బ్రద్దలుచేసి అనగా మూసుకొనియున్న ద్వారమును త్రోసి తెరచి(మూర్ధన్యనాడియొక్క మధ్యభాగమందున్న ద్వారము లోపలికి త్రోయు తలుపువలె ఉన్న తలుపుచేత మూసివేయబడియున్నదని తోచుచున్నది). ఆ ద్వారమును త్రోసివేసి, అతిశీఘ్రముగ పరమపదమునకు పిలచుకొని పోవుచున్నాడు

స్వాధీనో హార్దసంజ్ఞ స్స్వయం అవికలయా సంపదా సాక మేకః,
స్థిత్వా హృత్పద్మమధ్యే స్థగిత నిజతను స్సప్తలోకీగృహస్థః।
నాడీచక్రే సుషుమ్నాం నిఖిలధృతికరీం నాభిమూర్ధాన్తరూపాం,
భిత్వా తన్మధ్యరన్ధ్రప్రహితమిషుమివోత్క్షిప్య నేతా ముముక్షుమ్॥

(సప్తలోకములకును రక్షకుడై, లక్ష్మీదేవితోకూడియున్న పరమాత్మ, హృదయపద్మంలో వేంచేసియుంటాడు. అందుచేత హార్దుడనబడుతాడు. ఆయన ముముక్షువునకు శరీరవిశ్లేషసమయంలో తననుతాను దర్శింపచేసుకుంటాడు. పరమకరుణామయుడైన ఆయన హృదయంతో చేరియున్న నాడులలో నున్నదీ, నాభివద్ద ప్రారంభమై మీదికి వెళ్ళే సుషుమ్నానాడిని హృదయానికి ఎదురుగా నున్న మూసుకొనియున్న ద్వారాన్ని బ్రద్దలుకొట్టి, ముముక్షుజీవుడిని ఆ ద్వారరంధ్రంలో ప్రవేశపెట్టి బాణంవదిలితే ఎంతవేగంగా వెళు

## ॥ రశ్మ్యనుసారాధికరణమ్ 4-2-9 ॥

### ॥ సి. సూ ॥ రశ్మ్యనుసారీ ॥ 4-2-17 ॥

విదుషో హృదయాచ్ఛతాధికయా మూర్ధన్యనాడ్యా నిర్గతస్యాఽఽదిత్యరశ్మీననుసృత్యాఽఽదిత్య-మణ్డలగతిః శ్రూయతే - 'అథ యత్రైతదస్మాచ్ఛరీరాదుత్క్రామతి అథైతైరేవ రశ్మిభిరూర్ధ్వమాక్రమతే'

తుందో అంతవేగంగా వైకుంఠానికి తీసుకొని పోవును) అని స్వామి దేశికులు అధికరణసారావళి (493) లో సాదించియున్నారు. (నాభిమూర్ధాన్తరూపామ్- నాభిప్రభృతి మూర్ధాపర్యన్తస్థితామ్.) సుషుమ్న అనే పేరుగల నాడిని, భిత్వా- అనావృతముఖీం కృత్వా- పదయోజన) ఇటువంటి విలక్షణమైన అనుగ్రహమును ఉపాసకుని విషయమందు చేయుచున్నాడు. ఉపాసనము చేయని వారి విషయములో కేవల ప్రకాశమును మాత్రము చేయుచున్నాడన్నమాట.

తదోకోధికరణము సమాప్తము.

## రశ్మ్యనుసారాధికరణము (4-2-9 )

### ॥సి. సూ ॥ రశ్మ్యనుసారీ ॥ 4-2-17 ॥

**సూత్రార్థము:-** **రశ్మ్యనుసారీ** = (ఉపాసకుడు శరీరమును వదలి బయటికి వచ్చినవెంటనే) సూర్యకిరణములద్వారానే ముందుకు పోవును.

**సంగతి:-** విద్వాంసుడు మరణమును పొందునపుడు స్థూలశరీరమునుండి మూర్ధన్య నాడిద్వారా బయటికి పోవుచున్నాడు- ఉత్క్రాన్తిని పొందుచున్నాడని వెనుకటి అధికరణములో చెప్పబడినది. ఈ అధికరణములో స్థూలశరీరమునుండి బయటికి పోయిన జీవుడు ఆదిత్యకిరణములను అనుసరించి - అనగా సూర్యకిరణముద్వారా ముందుకు పోవుచున్నాడని చెప్పబడుచున్నది.

**విషయము:-** 'అథ యత్ర ఏతదస్మాత్ శరీరాత్ సముత్క్రామతి, అథ ఏతైరేవ రశ్మిభిః ఊర్ధ్వమాక్రమతే"(ఛాం. 8-6-5) అను శ్రుతిని గురించినది.

**సంశయము:-** విద్వాంసుడు సూర్యకిరణముద్వారానే సూర్యమండలమునకు పోవుచున్నాడు అని నియమము చెప్పుట సాధ్యమా? కాదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** శ్రుతిలో "ఏతైరేవ రశ్మిభిః" అని నియమము చెప్పబడియున్నది. రాత్రివేళయందు సూర్యకిరణము లేదుగనుక, రాత్రివేళలో మరణించు ఉపాసకుడు సూర్యకిరణముద్వారానే పోవలెను అని చెప్పుటకు వీలుకాదు. వీటిలో ఏ పక్షము యుక్తియుక్తమో నిశ్చయించలేక సంశయము వచ్చుచున్నది.

**పూర్వపక్షము:-** రాత్రి వేళలో మరణించు విద్వాంసుడు సూర్యకిరణముద్వారానే ఆదిత్య మండలమునకు పోవుచున్నాడు అని నియమము చెప్పుటకు వీలుకాదు. రాత్రివేళలో సూర్యకిరణములు ఉండవుగనుక, శ్రుతిలో "ఏతైరేవ రశ్మిభిః" అని 'ఏవ'కారం ఉన్నందున, నియమాన్ని చెప్పుతున్నట్లు

*(ఛాం.8-6-5) ఇతి। తత్ర రశ్మ్యనుసారేణైవేత్యయం గతినియమః సమ్భవతి, నేతి చిన్తాయాం-నిశి మృతస్య విదుషో రశ్మ్యనుసారాసమ్భవాదనియమః । వచనం తు పక్షప్రాప్తవిషయమ్ -*

*ఇతి ప్రాప్తే ఉచ్యతే - రశ్మ్యనుసారీ -ఇతి । రశ్మ్యనుసార్యేవవిద్వానూర్ధ్వం గచ్ఛతి । కుతః? "అథైతైరేవ రశ్మిభిః" (ఛాం. 8-6-5)ఇత్యవధారణాత్ ; పాక్షికత్వే హ్యేవకారోऽనర్థకః స్యాత్ । యదుక్తం నిశిమృతస్య రశ్మ్యసమ్భవాత్ రశ్మీననుసృత్య గమనం నోపపద్యత ఇతి, తన్న, నిశ్యపి సూర్యరశ్మ్యనుసారః సమ్భవతి, లక్ష్యతే హి నిశ్యపి నిదాఘసమయే ఊష్మోపలబ్ధ్యా రశ్మిసద్భావః, హేమన్తాదౌ తు హిమాభిభవాద్దుర్దిన ఇవోష్మానుపలమ్భః, శ్రూయతే చ నాడీ రశ్మీనాం*

భావించవద్దు. సూర్యకిరణాలుండే పగటివేళలో మరణించినవాడు సూర్యరశ్మిద్వారానే పోవుచున్నాడని చెప్పెను. పాక్షికత్వాభిప్రాయేణ అనువాదః- అనగా, ఈ శ్రుతియనునది నియమమును చెప్పుట లేదు. విద్వాంసుడు పగలు మరణించినచో సూర్యరశ్మిద్వారా పోవుచున్నాడని అనువదించుచున్నదని తాత్పర్యము. అయ్యా! ఈ శ్రుతి నియమించుటనే చెప్పుచున్నది. రాత్రిమరణించినవాడు మరునాడు ఉదయము సూర్యుడు ఉదయించినతరువాత రశ్మిద్వారా పోవుచున్నాడని చెప్పటకు వీలు లేదు. 'స యావత్ క్షిప్యేన మనః తావదాదిత్యం గచ్ఛతి- మరణించినవాడు మనోవేగముతో ఆదిత్యుని పొందుచున్నాడు అని చెప్పియుండుటచే ఆలసింపజేయుటకు కారణము లేదు గనుక, పాక్షికత్వాభి-ప్రాయమే తీసికొనవలెను

**సిద్ధాంతము:-** సూర్యరశ్మిని అనుసరించియే పోవుచున్నాడను నియమమును చెప్పవలెను. ఎందుకనగా, "అథ ఏతైరేవ రశ్మిభిః" అని శ్రుతిలో అవధారణము ఉన్నందున నియమము చెప్పబడుచున్నది. పాక్షికత్వే - పగటివేళలో పోయినచో సూర్యకిరణద్వారా పోవుచున్నాడు. రాత్రి వేరువిధముగా పోవుచున్నాడను పక్షములో 'ఏవ'కారము అర్థం లేనిదగును. అంతేకాక, రాత్రివేళయందు పోవు మార్గమును చెప్పలేదు. మార్గాంతరమును చెప్పియున్నచో దానిని ఏవకారమునునది నిషేధించుచున్నదని చెప్పవచ్చును. అట్లు చెప్పలేదు కనుక ఏవకారము వ్యర్థమే అగును.

'అయ్యా రాత్రియందు సూర్యకిరణము లేదుగనుక, రాత్రివేళపోవువాడు సూర్యకిరణముద్వారా ఆదిత్యుని పొందుచున్నాడు అని చెప్పుట ఉపపన్నము కాదు.' అని మీచే చెప్పబడిన యుక్తి సరికాదు. రాత్రివేళలోకూడ, సూర్యకిరణములద్వారా గమనము సంభవించును. ఎట్లు అన్నచో, గ్రీష్మఋతువులో రాత్రివేళ ఉష్ణముండుటచే దానికి ఆశ్రయభూతమైన సూర్యరశ్మి ఉన్నది అని ఊహించ బడుతున్నది. లక్ష్యతే- అనుమీయతే ఇత్యర్థః. రాత్రివేళలో తమస్సు చీకటి ఎక్కువగా నుండుటచేత స్వల్పముగా నుండు సూర్యకిరణమును కప్పివేయుచున్నది.

హేమంతఋతువులో - మార్గశీర్ష,పుష్యమాసములలో రాత్రివేళలో ఉష్టము- అనగా తాపము లేదు. (చల్లగా నుండును చలివేయును.) అప్పుడు సూర్యకిరణము ఉన్నదని చెప్పగలమా? అన్నచో, మేఘముచే సూర్యుడు పూర్తిగా కప్పివేయబడిన దుర్దినములలో పగటివేళలోకూడ సూర్యకిరణములు లేవు అని చెప్పగలమా? దుర్దినములలో సూర్యకిరణము మేఘముచే కప్పబడిపోయినట్లు,

*సర్వదాన్యోఽన్యాన్వయః, 'తద్యథా మహాపథ ఆతత ఉభౌ గ్రామౌ చ గచ్ఛతీమం చాముం చ । ఏవమేవైతం ఆదిత్యస్య రశ్మయ ఉభౌ లోకౌ గచ్ఛన్తీమం చాముఞ్చ। అముష్మాదాదిత్యాత్ప్రతాయన్తే తాః ఆసు నాడీషు సృప్తాః। ఆభ్యో నాడీభ్యః ప్రతాయన్తే తేముష్మిన్నాదిత్యే సృప్తాః' (ఛాం. 8-6-2)ఇతి । తస్మాన్నిశ్యపి రశ్మిసమ్బన్ధాన్నిశి మృతానామపి విదుషాం రశ్మ్యనుసారేణైవ బ్రహ్మప్రాప్తిరస్త్యేవ ॥ 17 ॥*

*॥ ఇతి రశ్మ్యనుసారాధికరణమ్ ॥ 9 ॥*

హేమంతఋతువులో రాత్రివేళలో మిక్కిలిగా మంచు సూర్యకిరణముల ఉష్ణము తెలియకుండునట్లు చేయుచున్నది. దానిచే సూర్యకిరణములు లేవని చెప్పుట లేదుగదా! నాడులకును సూర్యకిరణములకును ఎప్పుడును సంబంధ మున్నదిగనే శ్రుతి చెప్పుచున్నది.

"తద్యథా మహాపథ ఆతతః" (రెండు మహానగరములను కలుపు పెద్ద మార్గము (ట్రంకురోడ్డు) ఎట్లున్నదో అట్లే ఆదిత్యకిరణము రెండు లోకములను ప్రవేశించియున్నది. రెండు లోకములయందును ప్రవేశించిన రీతిని వివరించి చెప్పుచున్నారు– ఈ ఆదిత్యునినుండి ప్రసరించుచున్న కిరణములు ఈ నాడులలో ప్రవేశించుచున్నవి– సంబంధించుచున్నవి. ఈ నాడులలో వ్యాపించియున్న కిరణములు ఆదిత్యునితో సంబంధమును కలిగియున్నవి – ప్రవిష్టములుగా నున్నవి. చేరుతున్నవి అని నాడులకును సూర్యకిరణములకును ఎల్లప్పుడును సంబంధము ఉన్నదని శ్రుతి చెప్పుచున్నది.

"తాః ఆసు నాడీషు సృప్తాః" అని స్త్రీలింగముగానున్ను, "తేముష్మిన్నాదిత్యే" అని పుంలింగమునూ చెప్పియుండుట రశ్మిశబ్దము రెండు లింగములలోనూ ఉన్నందున "తాః– తే" అని రెండు లింగములలో చెప్పబడినది.

భాష్యమందు "నిశి మృతానామపి విదుషాం రశ్మ్యనుసారేణైవ బ్రహ్మప్రాప్తిః అస్త్యేవ" అని పూర్తిచేయబడియున్నది. ఇందులో రశ్మిని అనుసరించే – రశ్మ్యనుసారేణైవ బ్రహ్మప్రాప్తిః– బ్రహ్మమును పొందుచున్నాడని చెప్పినచో సరిపోవునే, "అస్త్యేవ" అను పదమెందుకు? అన్నచో, ఉపనిషత్తులో "ఏతైరేవ రశ్మిభిః" అనిఏవకారమున్నందున, రశ్మ్యభావే– రశ్మిలేకపోయినచో బ్రహ్మప్రాప్తి లేదు అనే సందేహము కలుగవచ్చు. "అస్త్యేవ" అను పదము. దానిని నివర్తింపజేయుచున్నది – దీనిచే, బ్రహ్మప్రాప్తి నిశ్చయముగా నున్నది అని చెప్పుటచే, సూర్యకిరణము రాత్రివేళయందును తప్పక ఉన్నదని నిర్ణయించ బడినది.

## ప్రశ్న, సమాధానము

ప్రశ్న– శ్రీ న్యాయసిద్ధాంజనములో తేజోద్రవ్యనిరూపణప్రకరణములో "తేజస్సు అనునది ప్రభ, ప్రభావంతుడు అని రెండు విధములు. ప్రభ అనునది ప్రభావంతునితో కలసియే ఉండును ప్రభావత్ నాశమును పొందినచో ప్రభయు నశించును. రెండును అవినాభూతములే." అని శ్రీదేశికులు సాదించిరి. ఆ తరువాత గ్రీష్మఋతువులో సూర్యుడు అస్తమించిన తరువాతకూడ వేడి అనేది ఉన్నది గనుక ఉష్ణానికి ఆశ్రయభూతమైన ప్రభకూడా ఉన్నట్టుగానే గ్రహించాలి. అందుచేత ప్రభావానైన సూర్యుడు లేకపోయినా ప్రభ ఉన్నట్టుగా తెలుస్తున్నది. కనుక, ప్రభ, ప్రభావత్ రెండూ విడివిడిగా

ఉండవు అని చెప్పటం కుదరదన్నమాట. ఇది ఆక్షేపం. దీనికి "గ్రీష్మనిశాదిషు ఔష్ణ్యోపలమ్భేపి ప్రభాత్మకం స్వరూపం నాస్త్యేవ" (గ్రీష్మఋతువులో ఉష్ణం ఉన్నప్పటికీ, ప్రభ- సూర్యకిరణం లేదు) అని సమాధానం సాదించేరు. దానివలన, ప్రభా, ప్రభావాన్ రెండూకూడా అవినాభూతములేనని స్థాపించబడిందన్నమాట.

ఈ వాక్యానికి ఉపనిషద్భాష్యకారులు గ్రీష్మఋతువులో రాత్రి ఉండే ఉష్ణానికి ఆశ్రయమైనది సూర్యకిరణం కాదు, ప్రభకాదు, వేరొకద్రవ్యం. అందుచేత అవి విడివిడిగా ఉండనివి అని చెప్పటంలో దోషమేమీ లేదని సాదించేరు. లేక, గ్రీష్మఋతువులో రాత్రివేళలో తేజస్సుయొక్క అవయవాలు వంగి ఉంటాయి. అవి ఉష్ణానికి ఆశ్రయాలుగా ఉంటున్నాయి. అందుచేత అవినాభూతంగా ఉండటానికి బాధకం లేదు అనిన్నీ చెప్పవచ్చునని సాయించుతున్నారు.

శ్రీన్యాయసిద్ధాంజనానికి రత్నపేటిక అనే వ్యాఖ్యానాన్ని మహామహోపాధ్యాయ తిరుప్పుట్కుఴి స్వామి గ్రీష్మఋతువులో రాత్రితెలిసేవేడికి ఆశ్రయమైనద్రవ్యం ప్రభకాదు, ప్రభకంటే – సూర్యకిరణంకంటే వేరైనది. సూర్యకిరణంచేత వదలివేయబడిన అగ్నియొక్క అవయవరూపం అని సాయించేరు.

వసన్తే గ్రీష్మకే రశ్మిశతైస్సన్తపతి త్రిభిః। శరద్యపి చ వర్షాసు చతుర్భిః సంప్రవర్షతి।
హేమన్తే శిశిరే చైవ హిమముత్సృజతే త్రిభిః॥

వసన్తఋతువులోనూ, గ్రీష్మఋతువులోనూ (సూర్యుడు) మూడువందల కిరణాలతో అగ్ని అవయవాలని వదులుతున్నాడు. (సన్తప్యతీత్యస్య అగ్ని అవయవాన్ ఉత్సృజతీత్యర్థః) వర్షఋతువులోనూ, శరదృతువులోనూ నాలుగువందల కిరణాలతో బాగా వర్షిస్తున్నాడు. హేమంతఋతువులోనూ శిశిర-ఋతువులోనూ మూడువందల కిరణాలతో మంచుని వదులుతున్నాడు అని మాత్స్యపురాణంలో చెప్పబడియున్నదని చూడవచ్చు అని సాయించేరు. కనుక రాత్రివేళలో సూర్యకిరణం లేదని నిశ్చయించ వలసియున్నది. అలా అయితే, "లక్ష్యతే హి నిశ్యపి నిదాఘసమయే ఊష్మోపలబ్ధ్యా రశ్మిసంభవః"- వేసవికాలంలో రాత్రివేళల్లో వేడి- తాపం ఉన్నందువల్ల రాత్రివేళలోకూడా సూర్యకిరణం ఉన్నదని ఊహించబడుతున్నది అన్న శ్రీభాష్యకారుల శ్రీసూక్తికి, ఎల్లప్పుడూ ప్రసరిస్తూండే సూర్యకిరణానికీ సంబంధం ఉన్నదని చెప్పే "తద్యథా మహాపథ ఆతతః ఉభౌ గ్రామౌ గచ్ఛతి ఇమం చ అముఇఞ్చ, ఏవమేవైతం ఆదిత్యస్య రశ్మయ ఉభౌ లోకౌ గచ్ఛన్తి ఇమం చ అముమ్, అముష్మాదాదిత్యాత్ ప్రతాయన్తే, తాః ఆసు నాడీషు సృప్తాః ఆభ్యో నాడీభ్యః ప్రతాయన్తే తేముష్మిన్ ఆదిత్యే సృప్తాః"(ఛాం. 8. 6. 2) [రెండు గ్రామాలనీ జోడించే మహాపథం ఎలా రెండు చివరలన ఉన్న రెండు గ్రామాలకీ వెళ్ళుతున్నదో, అదే విధంగా సూర్యకిరణాలుఈ లోకం, ఆలోకం అనే రెండులోకాలకీ వెళ్ళుతున్నాయి. ఆ కిరణాలు ఆ సూర్యుడినుంచి వ్యాపించి ఈ నాడులలో ప్రవేశిస్తున్నవి. ఈ నాడులలోంచి వ్యాపించి ఆ సూర్యుడిలో ప్రవేశిస్తున్నాయి] అనే శ్రుతివాక్యానికి దేశికశ్రీసూక్తితో విరోధం వస్తున్నది కదా!

సమాధానం:- రాత్రివేళలో కూడా సూర్యకిరణం ఉన్నది. సాయంకాలం సూర్యుడు అస్తమిస్తున్నాడు. ప్రాతఃకాలంలో సూర్యుడు ఉదయిస్తున్నాడు అనే అర్థాన్ని మనం బాగా పరామర్శించాలి. సూర్యుడు అస్తమించేడు అని చెప్పేవాడు ఉన్న ప్రదేశంనుండి చాలా దూరదేశంలో సూర్యుడున్నందున,

అతడికి సూర్యుడు తెలియదుగనుక సూర్యుడు అస్తమించేడు అంటున్నాడు దానివల్ల రాత్రివేళలో సూర్యుడు లేడు అని కాదు. చాలా దూరంలో ఉన్నాడనే అర్థం. మనకి రాత్రివేళగా ఉన్నప్పుడు కొన్ని విదేశాల్లో పగటివేళఅంటున్నారు. మనం ప్రత్యక్షంగా దాన్ని చూస్తున్నాం. అందుచేత సూర్యుడు ఎప్పుడూ ఉంటూనే ఉన్నాడు. అతడి కిరణమూ ఎప్పుడూ ఉన్నది. "కాలస్య సాయం ప్రాతర్భావో రవివిప్రకృష్ట సన్నికృష్ట తత్తత్ దేశవిశేషవృత్తిపురుషాపేక్షయా" అనే శ్రుతప్రకాశికావాక్యంవలన శ్రీభాష్యకారుల శ్రీసూక్తికూడా ఎప్పుడూ సూర్యకిరణానికి విఘడియలకీ సంబంధం ఉన్నట్లు చెప్పిన శ్రుతీ, ఉపపన్నాలవుతున్నాయి.

అయ్యా ఇలాగైతే, శ్రీదేశికులు మరోవిధంగా చెప్పటానికి కారణమేమిటి?

సమాధానం:- శ్రీస్వామి దేశికులు రాత్రివేళలో సూర్యకిరణం లేదని చెప్పలేదు. ఉష్ణానికి ఆశ్రయమైనది సూర్యకిరణంకాదు సూర్యుడికిరణంచేత విడువబడిన అగ్నియొక్క అవయవాలే. అగ్నియొక్క అవయవములచేతనే ఉష్ణం వస్తున్నది.

"అగ్నిం వా వ ఆదిత్యః సాయం ప్రవిశతి। ఉద్యన్తం వావ ఆదిత్యం అగ్నిః అనుసమారోహతి॥"

దీని అర్థం ఏమిటంటే- రాత్రివేళలో ఆదిత్యుడు అగ్నిలో ప్రవేశిస్తాడు అన్నదానికి, చాలా దూరంలో ఉన్న ఆదిత్యుడు అగ్నిలో ప్రవేశించటం కుదరదు గనుక, కిరణములద్వారా ప్రవేశిస్తున్నాడని అర్థం. పగటివేళలోఆదిత్యుడిని అగ్ని అనేది పొందుతున్నది అంటే, ఆదిత్యుడు సన్నిహితుడిగా ఉండటంచేత అగ్నికి తేజోమాంద్యం( ప్రకాశించకుండా ఉండే లక్షణం)చెప్పబడుతున్నది. ఈ విధంగా అర్థం చెప్పకపోతే సాయంప్రాతఃకాలాలు ఎప్పుడూకూడా ఉంటాయి గనుక అగ్నికీ, ఆదిత్యుడికీ ఎప్పుడూ స్థానవినిమయం- పరివర్తనం చెప్పబడుతున్నట్లు అవుతుంది. ఆవిధంగా చెప్పటం ఇతరప్రమాణాలకి విరుద్ధమౌతుంది. కనుక ఆదిత్యుడికి అగ్నిలో కిరణాలద్వారా వ్యాప్తియున్నూ(ప్రవేశమున్నూ), ఆదిత్యకిరణాలవలన అగ్నియొక్క అవయవాలగ్రహణమున్నూ ఈ రెండు శ్రుతివాక్యాలవలన చెప్పబడింది.

శ్రీ విష్ణుపురాణంలో వెనుక చెప్పినశ్రుతివాక్యాల అర్థాన్ని వివరిస్తూ చెప్పబడింది.-

ప్రభావావివస్వతో రాత్రావస్తం గచ్ఛతి భాస్కరే। విశత్యగ్నిమతో రాత్రౌ అగ్నిర్దూరాత్ప్రకాశతే॥
వహ్నేః ప్రభా తథాభానుం దినేష్వావిశతి ద్విజ। అతీవ వహ్నిసంయోగాత్ తతస్సూర్యః ప్రకాశతే॥

"సూర్యుడు అస్తమించిన తరువాత సూర్యుడి ప్రభ అగ్నిని పొందుతున్నది. దానిచేత అగ్ని అనునది దూరంనుండి ప్రకాశిస్తున్నది" అని దీనిఅర్థం. రాత్రివేళలో భూమిమీద అగ్నికణాలు ఉండటం పక్షులకి తెలుస్తుంది. అందుచేతనే పక్షులు రాత్రివేళలో భూమిమీద సంచరించవు" అని శ్రుతి చెప్పు తున్నది.

"సర్వా వా ఇయం వయోభ్యో నక్తం దృశే దీప్యతే తస్మాదిమాం వయాంసి నక్తం నాధ్యాస్యతే" (తై. కాణ్-5, ప్ర-6, అను-4). ఈ విధంగా శ్రుతిస్మృతులు రాత్రివేళల్లో ఆదిత్యకిరణాలచేత విడువబడిన అగ్ని అవయవాలచేతనే ఉష్ణం ఉంటోంది అని చెప్తున్నవి. కనుక ప్రభచేత ఉష్టం కలుగలేదు అని అభిప్రాయంతో "గ్రీష్మాదౌ నిశాదిషు ఔష్ణ్యోపలమ్భేపి ప్రభాత్మకం స్వరూపం నాస్త్యేవ" అని సాదించేరు.

శ్రీభాష్యకారులు "లక్ష్యతే హి నిశ్యపి నిదాఘసమయే ఊష్మోపలబ్ధ్యా రశ్మిసంభవః" అని రశ్మిచేతనే ఉష్ణం కలుగుతున్నదని చెప్పటానికి తాత్పర్యమేమిటి? అంటే ఉద్ధృతాగ్నిప్రదేశపు సమీపంలో వేడి ఉన్నట్లు – అంటే, కుంపటిలోంచి నిప్పుని మరోచోటికి ఎత్తి తీసుకువెళితే అతిసూక్ష్మమైన అగ్నికణాలు కుంపటిలో ఉన్నందున కుంపటిదగ్గరగా వేడిగా ఉన్నట్లు రాత్రివేళలో సూర్యకిరణాలు అగ్నిని వదలి వేసినప్పటికీ, (ఉద్ధృతాగ్ని ప్రదేశంలోవలె) కిరణాలలోకూడా ఉష్ణం ఉన్నది. అందుచేతనే నిదాఘ సమయంలో ఉష్ణం – తాపం ఉంటోంది అని భావం. సూర్యకిరణం తేజోద్రవ్యమైనా, తేజోద్రవ్యానికి ఉష్ణస్పర్శవత్వం స్వతః ప్రాప్తమైనా, పగటిపూటల్లో ఆ కిరణాలు అగ్నిసంబంధంచేతనే అధికోష్ణమును ఇస్తున్నాయని అంగీకరించాలి. "వసన్తే గ్రీష్మకే రశ్మిశతైః సన్తపతి– అగ్ని అవయవాన్ ఉత్సృజతీత్యర్థః" అని రత్నపేటికాకారులు సాదించియున్నారు. ఇట్లు పగటిసమయంలోనూ అగ్నివిశిష్టరశ్మియే తాపాన్ని కలిగిస్తున్నది. పగటివేళకంటే రాత్రివేళలో తాపం తగ్గి కనబడుతున్నందున ఉద్ధృతాగ్ని స్థలంలోవలె సూక్ష్మమైన అగ్నివిశిష్టకిరణాలు తాపాన్ని కలిగిస్తున్నాయని శ్రీభాష్యకారుల శ్రీసూక్తికి అర్థం చెప్పాలి అని తెలుస్తున్నది.

ఈ విషయాన్నే ఈ క్రింది అధికరణసారావళి 494వ శ్లోకంలో దేశికులు చెప్పటం గమనీయం.

> "ఏతైరేవ" ఇతి వాక్యే దినకరకిరణాలమ్బనేన ఊర్ధ్వయానం
> యత్ ప్రోక్తం యోగినః తత్ దినమృతినియతం నిత్యయుక్త్యా ఇతిచేత్ న।
> అహ్నిచ్ఛాయాసు రాత్రిష్వపి చ లఘుతరా రశ్మయ స్సన్తి లిఙ్గైః
> తాపో వర్షాదిరాత్రౌ న యది హిమదినన్యాయతో నేయమేతత్॥

"ఏతైరేవ" అని ఆరంభమయే ఛాందోగ్యోపనిషత్(8.6.5) వాక్యంలో యోగులు సూర్యకిరణాలద్వారా ఊర్ధ్వగమనం పొందుతారని చెప్పబడింది. దీనినిబట్టి రాత్రిపూట సూర్యుడుగాని, సూర్యకిరణాలుగాని లేవుగనుక, పరమపదానికి పోవటం అనేది పగటిపూట మరణించేవారికే తప్ప రాత్రి మరణించేవారికి కాదని అనిపించవచ్చు. కాని అది సరికాదు. ఎందుచేతనంటే రాత్రికూడా సూర్యకిరణాలు సూక్ష్మరూపంలో ఉంటాయి. పగటిపూటకూడా చెట్లు,తుప్పలు, మొదలైనవాటి దట్టమైననీడల క్రిందనుండి సూర్య కిరణాలని చూడలేకపోయినా, అక్కడివేడివలన కిరణాలున్నట్లు మనకి తెలుస్తుంది. అలాగనే రాత్రిపూట కూడా సూర్యకిరణాలు చాలా సూక్ష్మరూపంలో నున్నట్లు వేడివలననే తెలుస్తున్నది. మంచుపడే కాలంలో పగటిపూట వేడి తెలియకపోయినా, అది దట్టమైనమంచుతాలూకు చల్లదనంచేతనే తప్ప సూర్యకిరణాలు లేకకాదు. అదేవిధంగా వర్షకాలంలో రాత్రిపూట వేడిగా లేకపోవటం, బాగా చల్లగా వర్షాలు పడటంచేతనేకాని సూర్యకిరణాలు లేకకాదు. సూర్యకిరణాలు ఎప్పుడూ ఉంటాయి. అందుచేత స్వామి దేశికులు శ్రీభాష్యకారుల శ్రీసూక్తిప్రకారమే అర్థాన్ని సాదించేరని గమనించవచ్చు. ప్రాజ్ఞులైన పండితశ్రేష్ఠులు వేరువిధంగా సరియైన అర్థం చెప్పినా, దాన్ని శిరసావహిస్తున్నాను.

రశ్మ్యనుసారాధికరణం ముగిసినది.

## నిశాధికరణమ్ (4-2-10 )

**॥ సి. సూ ॥ నిశి నేతి చేన్న సమ్బన్ధస్య యావద్దేహభావిత్వాద్దర్శయతి చ ॥ 4-2-18 ॥**

ఇదమిదానీం చిన్త్యతే- విదుషో నిశి మృతస్య బ్రహ్మప్రాప్తి రస్తి, నేతి । యద్యపి నిశాయాం సూర్యరశ్మిసమ్భవాత్ రశ్మ్యనుసారేణ గతిర్నిశాయామపి సమ్భవతి, తథాఽపి నిశామరణస్య శాస్త్రేషు గర్హితత్వాత్ పరమపురుషార్థలక్షణబ్రహ్మప్రాప్తిర్నిశామృతస్య న సమ్భవతి । శాస్త్రేషు దివామరణం ప్రశస్తం, విపరీతం నిశామరణం, 'దివా చ శుక్లపక్షశ్చ ఉత్తరాయణమేవ చ । ముమూర్షతాం ప్రశస్తాని

---

## నిశాధికరణము (4-2-10 )

**॥ సి.సూ ॥ నిశి నేతిచేన్న సంబంధస్య యావద్దేహభావిత్వాత్ దర్శయతి చ ॥4-2-18॥**

**సూత్రార్థము:-** **నిశి న** = రాత్రిమరణంచెందినవానికి మోక్షం లేదు, **ఇతి చేత్** = అన్నట్లైతే **న** = అది సరిగాదు. **సమ్బన్ధస్య** = (జ్ఞానికి కర్మతోనున్న) సంబంధం, **యావద్దేహభావిత్వాత్** = దేహం ఉన్నంతవరకే గనుక, (రాత్రి మరణించిన జ్ఞానికికూడా మోక్షం ఉన్నది), **దర్శయతి చ** = (దేహసంబంధం పోవుటతో జ్ఞాని బ్రహ్మమును పొందుచున్నాడని) వేదవాక్యముకూడ చెప్పుచున్నది.

**సంగతి:-** రాత్రివేళలో మృతుడు రశ్మిద్వారా పోవుచున్నాడా? లేదా? అను విచారము వద్దు. రశ్మిద్వారా పోవుచున్నాడు అనియే అంగీకరించినచో, "రాత్రివేళలో పోవువానికి అర్చిరాదిగతి లభించదు" అని నిషేధించబడినది గనుక రాత్రివేళలో మరణించువానికి బ్రహ్మప్రాప్తి లేదు అని ఆక్షేపించి, ఈ అధికరణము ఆరంభించబడుచున్నది.

**విషయము:-** నిశిలో మృతులని గురించినది

**సంశయము:-** రాత్రివేళలో మరణించినవాడు అర్చిరాదిమార్గములో పోయి బ్రహ్మమును పొందుచున్నాడా లేదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** 'రాత్రి మరణించినవాడు అధోగతిని పొందుతాడు' అని నిందించబడియున్నది గనుక, నిశిమృతుడికి బ్రహ్మప్రాప్తి లేదు అని తెలుతున్నది. రశ్మ్యనుసారాధి-కరణంలో రాత్రి వేళలోకూడా రశ్మిద్వారా ఆదిత్యుడిని పొందుతాడని నిర్ధారణం చెయ్యబడిందిగనక అర్చిరాదిమార్గంద్వారా బ్రహ్మమును పొందుతున్నాడని తెలుతున్నది. ఈ రెండుపక్షములలోనూ ఏది యుక్తియుక్తమైనదో నిర్ణయించుకొనలేక సందేహం కలుగుతున్నది.

**పూర్వపక్షము:-** వెనుకటి అధికరణంలో "రాత్రివేళలోకూడ సూర్యకిరణములున్నవిగనుక రాత్రివేళలోకూడా సూర్యకిరణములద్వారా అర్చిరాదిమార్గంద్వారా బ్రహ్మమును పొందుచున్నాడు' అని నిర్ణయించబడటం ఒప్పుకున్నా, నిశామరణాన్ని శాస్త్రంలో నిందించియున్నందువల్ల, రాత్రివేళలో మరణించేవాడికి పరమపురుషార్థమైన బ్రహ్మప్రాప్తి లభించదు.

"దివా చ శుక్లపక్షః చ ఉత్తరాయణమేవ చ। ముమూర్షతాం ప్రశస్తాని విపరీతంతు గర్హితమ్॥"

*విపరీతం తు గర్హితమ్' ఇతి । దివామరణనిశామరణయోః ప్రశస్తత్వవిపరీతత్వే చోత్తమాధమగతి-హేతుత్వేన స్యాతామ్ । అతో నిశిమరణమధోగతిహేతుత్వాన్న బ్రహ్మప్రాప్తిహేతురితి చేత్-*

*తన్న। విదుషః కర్మసమ్బన్ధస్య యావద్దేహభావిత్వాత్ । ఏతదుక్తం భవతి- అనారబ్ధకార్యాణాం అధోగతిహేతుభూతానాం కర్మణాం విద్యాసంబంధేనైవ వినాశాదుత్తరేషాం చాశ్లేషాత్ప్రారబ్ధకార్యస్య చ చరమదేహావధిత్వాత్ బన్ధహేత్వభావాద్విదుషో నిశామృతస్యాపి బ్రహ్మప్రాప్తిః సిద్ధైవ । దర్శయతి చ*

(పగటివేళ, శుక్లపక్షం, ఉత్తరాయణం అనేవి మోక్షాన్ని పొందేవానికి- విశేషమైనవి. వీటికి వ్యతిరేకమైన కాలమైన రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయనం ఇవి నిందితములు) అని ప్రమాణం చెప్పుతున్నది. భాష్యంలో "శాస్త్రేషు దివామరణం ప్రశస్తం విపరీతం నిశామరణం" అని ఉన్నది. ఈ వాక్యంలోనున్న "విపరీతం" అనేపదానికి "గర్హితం-నిందింపదగినది"అని అర్థం. ప్రశస్తం అనేపదానికి వ్యతిరేకం గర్హితం. పగటివేళలో మరణిస్తే ఆసమయం మంచిగతిని పొందటానికి కారణమౌతున్నది. రాత్రివేళలో మరణిస్తే నిశి అధమమైన గతిని పొందటానికి కారణమగుతున్నది. కనుక నిశిలో మరణించినవాడికి బ్రహ్మప్రాప్తి లభించదు.

**సిద్ధాంతము:**- "తత్ న". నిశిలో మరణించినవాడికి బ్రహ్మప్రాప్తి అనేది లభించదు అన్న పక్షం సరికాదు. సంబంధస్య యావత్ దేహభావిత్వాత్ - విద్వాంసుడికి కర్మసంబంధమనేది శరీరసంబంధం ఉన్నంతవరకే గనుక - అంటే బ్రహ్మోపాసకుడికి శరీరవియోగం కలిగినతరువాత అనుభవించవలసిన కర్మ ఏదీ లేదు గనుక రాత్రివేళలో మరణించినా అతడు బ్రహ్మమును పొందే తీరుతాడని తాత్పర్యము.

ఆక్షేపం:-అయ్యా! ప్రారబ్ధకర్మ అనేకదేహసంబంధాన్ని ఇచ్చేది గనుక కర్మసంబంధమనేది యావద్దేహభావి అని మీరు ఎలా చెప్పుతారు? కథం కర్మసంబంధస్య యావద్దేహభావిత్వమ్? ఈ శరీరంతో ప్రారబ్ధకర్మ తొలగిపోతుందని అనుకున్నా, అనుభవించని పూర్వకర్మలు ఉన్నవిగదా! అందుచేతకూడా, కర్మసంబంధస్య యావద్దేహభావిత్వాత్ అని మీరు చెప్పటం కుదరదు. పైగా, కర్మలకి యావద్దేహభావిత్వం చెప్పటంచేత నిశామరణానికి అధోగతి హేతుత్వం చెప్పటానికి పరిహారమేమిటి చెప్పబడింది? పరిహారం చెప్పబడినదని భావిస్తే నిశామరణనిందావచనానికి ప్రయోజనం ఏమిటి?

ఏతదుక్తం భవతి- అయ్యా! మీరు అడిగిన ప్రశ్నలకి సమాధానం చెప్తున్నాం వినండి. ఫలమును ఇయ్యటం ఆరంభించని, అధోగతులని కల్పించేవీ అయిన సంచితములైన కర్మలు విద్యామాహాత్మ్యంచేత దర్శనసమానాకారమైన స్మృతికలిగిన దశలో నశించిపోతున్నాయి. ఆ తరువాత అబుద్ధిపూర్వకమైన పాపాలు విద్యామాహాత్మ్యంచేత అంటవు- సంబంధించటం లేదు. ( ఈ విషయం తదధిగమాధికరణంలో చెప్పబడింది) ప్రారబ్ధకర్మ- ఫలాన్నియ్యటం ఆరంభించినకర్మ చివరిదేహమున్నంతవరకే ఉంటుంది. ఆ తరువాత సంసారబంధానికి కారణం(పుణ్యపాపరూపకర్మ) లేదు గనుక రాత్రి మరణించినా బ్రహ్మోపాసకుడికి బ్రహ్మప్రాప్తి నిశ్చయంగా ఉన్నది. దీన్ని శ్రుతియే చెప్తున్నది. "దర్శయతి చ శ్రుతిః- "తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే అథ సంపత్స్యే" (బ్రహ్మోపాసకునికి ప్రారబ్ధదేహావసానపర్యన్తమే ఆలస్యము. ఆ తరువాత, మరుక్షణమే బ్రహ్మమును పొందుతున్నాడు.అని) అంటే, రాత్రిపగలు అనే

*శ్రుతిః 'తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యేఽథ సమ్పత్స్యే' (ఛాం.6-14-2)ఇతి। 'దివా చ శుక్లపక్షశ్చ' ఇత్యాది వచన మవిద్వద్విషయమ్ ॥18॥*

*॥ ఇతి నిశాధికరణమ్ ॥ 10 ॥*

---

విభాగనిరపేక్షంగా ప్రారబ్ధకర్మావసానంలో బ్రహ్మమును పొందుచున్నాడు అని శ్రుతి చెప్పుచున్నది. "దివా చ శుక్లపక్షః చ..." అనే శ్రుతివచనం విద్వాంసుడు కానివానినిగురించి చెప్పుతున్నది.

**ప్రశ్న-సమాధానము**

ప్రశ్న- అయ్యా, నిశిమరణాన్ని నిందించియున్నందున విద్వాంసుడు నిశిలో మరణిస్తే అతడి ఆ శరీరం చివరి శరీరం కాదు అని చెప్పవచ్చుకదా! చరమశరీరావసానంగా ఉంటేనే బ్రహ్మప్రాప్తియా? బ్రహ్మని పొందుతాడా? అది కాదే.

సమాధానం:- "అథ యో దక్షిణే ప్రమీయతే పితౄణామేవ మహిమానం గత్వా" అని ఆరంభించి "తస్మాత్ బ్రహ్మణో మహిమానమాప్నోతి" అని అప్రశస్తకాలమైన దక్షిణాయనంలో మరణించినవాడికి బ్రహ్మప్రాప్తిని చెప్పటంచేత అప్రశస్తకాలంలో మరణించటంచేతనే అది చరమశరీరంకానేరదని చెప్పకూడదని చెప్పటంకుదరదు. కనుక, విద్వాంసుడు కానివాడు రాత్రి మరణించినా అతడికి సంచితకర్మ ఉండటంచేతనే ఆ కర్మలఫలాన్ని ఇవ్వటం ఆరంభిస్తున్నవి అని నిందావచనంతాలూకు తాత్పర్యం.

ప్రశ్న:- " "తస్య తావదేవ చిరం యావన్నవిమోక్ష్యే అథ సంపత్స్యే" అనే దానికి శరీరపతన-మాత్రాన్తరాయః బ్రహ్మసంపత్తి మోక్షలక్షణాభిప్రాయః- బ్రహ్మమును పొందుటకు (ప్రారబ్ధ)శరీరపతనమే విలంబము అని శ్రీభాష్యకారులు అర్థం సాయించేరు. ఈ శ్రుతిలో "యావన్న విమోక్ష్యే" అనేకదా ఉన్నది? దానికి శరీరంలోనుండి విడిపడేంతవరకే ఆలస్యము అని ఎలా అర్థం చెప్పబడుతున్నది?" అంటే శరీరపతనం ఈ శ్రుతివాక్యంలో లేదుగదా! అని ప్రశ్నతాలూకు తాత్పర్యం.

సమాధానం:- 'మోక్షః" అని చెప్పితే దేనినుండి మోక్షం- విడిపడుతున్నాడు? అనే తెలుసుకొనాలనే కోరిక కలుగుతున్నది. బంధంనుండి మోక్షం అని చెప్పాలి. ఆ తరువాత ఏది బంధం? అని తెలుసుకొనవలెననే కోరిక కలుగుతున్నది. శరీరం బంధం. ఈ ఛాందోగ్యోపనిషత్తులో సద్విద్యలోనే "అథ యదా తస్య వాఙ్మనసి సంపద్యతే" ఇత్యాదిచేత శరీరంలోనుండి ఉత్క్రాన్తి చెప్పబడి నందువల్ల శరీరంనుంచి మోక్షం అని చెప్పబడింది. మిగత ఉపనిషత్తులలో స్పష్టంగా "అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య"- ఈ(బుద్ధిస్థమైన ప్రారబ్ధావసాన)శరీరంనుండి బయటికి వచ్చి, పరమాత్మని పొంది) అనిన్నీ "ధూత్వా శరీరం"- శరీరాన్ని వదలి అనిన్నీ, "అశరీరం వా వ సన్తం ప్రియాప్రియే న స్పృశతః" (కర్మకృత)శరీరంలేనివాడిని ప్రియాప్రియములు (సుఖదుఃఖములు) సంబంధించుట లేదు. అనిన్నీ, శరీరాన్ని వదలి పోవుచున్నాడు అని చెప్పటంచేతనూ, "త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి" అని స్మృతి చెప్పటంచేతనూ, శరీరంలోనుండి విడిపడుతున్నాడు అని నిశ్చయించ బడుతున్నది. అందుచేతనే భాష్యకారులు "శరీరపాతమాత్రాన్తరాయః"- శరీరపాతంవరకే ఆలస్యము అని సాయించేరు.

నిశాధికరణము పూర్తి అయినది.

## ॥ దక్షిణాయనాధికరణమ్ ॥ 4-2-11 ॥

### ॥ సి. సూ ॥ అతశ్చాయనేఽపి దక్షిణే ॥ 4-2-19 ॥

*నిశి మృతస్యాపి విదుషో బ్రహ్మప్రాప్తౌ యో హేతురుక్తః, తత ఏవ హేతోర్దక్షిణేఽప్యయనే మృతస్య బ్రహ్మప్రాప్తిః సిద్ధా । అధికా శఙ్కా తు 'అథ యో దక్షిణే ప్రమీయతే పితౄణామేవ మహిమానం గత్వా చన్ద్రమసః సాయుజ్యం గచ్ఛతి' (తై. బ్రా.ఆ.52.అను)ఇతి దక్షిణాయనే మృతస్య చన్ద్రప్రాప్తిశ్రవణా*

## దక్షిణాయనాధికరణము (4-2-11 )

### ॥ సి. సూ ॥ అతశ్చాయనేఽపి దక్షిణే ॥ 4-2-19 ॥

**సూత్రార్థము:-** ***అతశ్చ=*** *ఇదే కారణమునుబట్టి, అనగా, బంధకారణములైన సర్వవిధకర్మలు నశించినందువలన* ***'దక్షిణే అయనేఽపి'=*** *దక్షిణాయనమున మరణించిన ఉపాసకునికికూడ అర్చిరాదిమార్గముగా గమనము, మోక్షప్రాప్తియు సంభవమే నని సూత్రార్థము.*

**సంగతి:-** వెనుకటి అధికరణములో బ్రహ్మవిద్యానిష్ఠుని మరణవిషయమందు పగలు రాత్రి అనే ప్రశస్తాప్రశస్తవిభాగాలు లేవని ఏకారణాలచేత చెప్పబడిందో, అదే కారణాలవల్ల దక్షిణాయన ఉత్తరాయణ విభాగమున్నూ లేదు అని ఈ అధికరణంలో చెప్పబడుతున్నది అని అతిదేశసంగతి.

**విషయము:-** దక్షిణాయనంలో మరణించే బ్రహ్మవిద్యానిష్ఠుని గురించినది.

**సంశయము:-** అప్రశస్తమైన దక్షిణాయనంలో మరణించే బ్రహ్మవిద్యానిష్ఠుడికి బ్రహ్మప్రాప్తి ఉన్నదా, లేదా? అని సందేహం.

**సంశయము వచ్చుటకు కారణము:-** నిశాధికరణన్యాయంప్రకారం బ్రహ్మప్రాప్తి ఉంటుంది అని తెలుస్తున్నది. దక్షిణాయనంలో మరణించినవాడు చంద్రుడిని పొందుతున్నాడు అని చెప్పబడటంచేత ధూమాదిమార్గంద్వారా వెళ్ళేవాడు చంద్రుడిని పొందినట్లే అవుతుంది గనుక దక్షిణాయనంలో మరణించిన బ్రహ్మవిద్యానిష్ఠుడికి బ్రహ్మప్రాప్తి లేదు అని నిశ్చయించవలెనని తోస్తున్నది. కనుక ఈ పక్షాలలో ఏ పక్షం యుక్తియుక్తమో నిర్ణయించలేనందున సంశయం కలుగుచున్నది.

ఈ అధికరణం అతిదేశాధికరణం. వెనుకటి అధికరణంలో చెప్పబడిన పూర్వపక్షసిద్ధాంతాలే ఇచ్చటగూడ అనువర్తిస్తాయి గనుక, ప్రత్యేకించి పూర్వపక్షసిద్ధాంతాలు లేవుగనుక ఇది అతిదేశాధి-కరణం అనబడుతుంది. అంటే, రాత్రి మరణించిన బ్రహ్మవిద్యానిష్ఠుడికి బంధహేతువైన కర్మలు లేవుగనుక, బ్రహ్మవిద్యానిష్ఠుడికి నిశిసమయంలో మరణించినప్పటికీ, బ్రహ్మమును పొందుతున్నాడని నిర్ణయించినట్లు దక్షిణాయనంలో బ్రహ్మవిద్యానిష్ఠుడు మరణించినా, బంధహేతువైన కర్మలు లేనందున అతడికి బ్రహ్మప్రాప్తి ఉంటుంది అని నిర్ణయించవలెను అని అర్థం.

అయ్యా! అలా అయితే, వెనుకటి అధికరణంలోనే "నిశి, దక్షిణాయనే నేతి చేత్ న సంబంధస్య యావద్దేహభావిత్వాత్" అని దక్షిణాయనాన్ని కూడా చేర్చి సూత్రకారులు సూత్రాన్ని రచించియుందురు గదా! "అతః చ అయనేఽపి దక్షిణే" అని వేరుగా ఒక సూత్రాన్ని(అధికరణాన్ని) ఎందుకు చెప్పేరు?

*చ్చన్ద్రం ప్రాప్తానాం చ 'తేషాం యదా తత్పర్యవైతి అథైత మేవాధ్వానం పునర్నివర్తన్తే'(ఛాం.5-10-2) ఇతి పునరావృత్తిశ్రవణాత్, భీష్మాదీనాం చ బ్రహ్మవిద్యానిష్ఠానా ముత్తరాయణప్రతీక్షాదర్శనాత్ దక్షిణాయనే మృతస్య బ్రహ్మప్రాప్తిః న సమ్భవతి-ఇతి।*

అయ్యా మీరు చెప్పినది నిజమే. సిద్ధాంతం ఒకే విధంగా ఉన్నప్పటికీ, పూర్వపక్షి వెనకటి అధికరణంలో చెప్పిన యుక్తికంటే మరొకవిధంగా ఒక యుక్తిని చెప్పి దక్షిణాయనంలో మరణించినవానికి బ్రహ్మప్రాప్తి అనేది లభించదు అని ఆక్షేపిస్తున్నాడు. ఆ ఆక్షేపానికి సమాధానం చెప్పవలసినది గనుక వేరుగా ఒక అధికరణం చెప్పవలసివచ్చింది. ఆ అధికశంక (పూర్వపక్షియొక్క యుక్తిని) ఇచ్చట చెప్పుచున్నాము–

"య ఏవం విద్వాన్ ఉదగయనే ప్రమీయతే దేవానామేవ మహిమానం గత్వా ఆదిత్యస్య సాయుజ్యం గచ్ఛతి। అథ యో దక్షిణే ప్రమీయతే పితృణామేవ మహిమానం గత్వా చన్ద్రమసః సాయుజ్యం గచ్ఛతి॥"(తై.నా.అను.52) (ఏతద్విద్యానిష్ఠానాం ఉదగయనమరణే దేవలోక(భోగ)ప్రాప్తిపూర్వక ఆదిత్యసాయుజ్యపూర్వక బ్రహ్మప్రాప్తిః। దక్షిణాయనమరణే పితృలోక(భోగ)ప్రాప్తిపూర్వక బ్రహ్మప్రాప్తిః ఇత్యర్థః) (ఉపనిషద్భాష్యమ్) (ఈ విద్యానిష్ఠులు ఉత్తరాయణంలో మరణాన్ని పొందితే, వారు సూర్యుడిని పొంది, దేవతల మహిమని (భోగాన్ని) పొంది బ్రహ్మమును పొందుతారు. ఈ విద్యానిష్ఠులే దక్షిణాయనంలో మరణిస్తే చంద్రుడిని పొంది, పితృదేవతల మహిమని(భోగాన్ని) పొంది బ్రహ్మమును పొందుతారు– అని ఉపనిషద్భాష్యం అర్థంచెప్పుతున్నది)

ఈ శ్రుతి బ్రహ్మవిద్యానిష్ఠుడిని గురించి చెప్పుతున్నది. ఇందులో దక్షిణాయనంలో మరణించిన బ్రహ్మవిద్యానిష్ఠుడికి చంద్రమససాయుజ్యం చెప్పబడుతున్నది. చంద్రుడిని పొందినవారు "తేషాం యదా తత్పర్యవైతి అథ ఇమమేవ ఆకాశ అభినిష్పద్యతే" (బృ. 8. 2. 16)(పుణ్యకర్మలను చేసినవారి భోగసాధనభూతమైన కర్మలు తొలగినవెంటనే– ఫలమును అనుభవించుటచే నశించగనే– వారు సూక్ష్మరూపంతో ఆకాశసదృశంగా అగుచున్నారు. అనగా, చంద్రుని పొందినవారు స్వర్గఫలమును అనుభవించినతరువాత స్వర్గలోకమునుండి తిరిగి వచ్చుచున్నపుడు ఆకాశము, వాయువు మొదలైనవిగా వాటికి సదృశములుగా తిరిగి భూలోకమందు పుట్టుచున్నారని చెప్పబడియుండటంచేత, "అథ ఏతమేవ అధ్వానం పునః నివర్తన్తే' అని ఛాందోగ్యంలో పునరావృత్తి చెప్పబడియుండటంచేతనూ, బ్రహ్మనిష్ఠులైన భీష్ములు ఉత్తరాయణాన్ని ప్రతీక్షించినందువల్లనూ దక్షిణాయనమృతుడికి బ్రహ్మప్రాప్తి లభించదని.

"త్వయాహం సమనుజ్ఞాతః గచ్ఛేయం పరమాం గతిమ్"(భార.అను.273)(మీచే నియమింప బడినవాడనై, ఉత్తమగతిని – పరమపదమును పొందగలను అని శ్రీకృష్ణుడితో విజ్ఞాపించేరనిన్నీ, "జగామ భిత్వా మూర్ధానం దివమభ్యుత్పపాత హ"(274) (మూర్ధన్యనాడిద్వారా పోయిరి) అనిన్నీ చెప్పటంచేత భీష్ములవారు బ్రహ్మనిష్ఠులు అనేవిషయం తెలుస్తున్నది.

సిద్ధాంతం– పితృయాణమార్గంద్వారా చంద్రుడిని పొందినవారికే– బ్రహ్మవిద్యానిష్ఠులుకానివారికే పునరావృత్తి – వారే తిరిగి వస్తారు. చంద్రుడిని పొందినంతమాత్రంలో బ్రహ్మవిద్యానిష్ఠులు తిరిగి భూలోకానికి వస్తారని కాదు. "తస్మాత్ బ్రహ్మణో మహిమానమాప్నోతి" అనే వాక్యశేషంచేత బ్రహ్మమును

*పరిహారస్తు-అవిదుషాం పితృయాణేన పథా చన్ద్రం ప్రాప్తానామేవ పునరావృత్తిః, విదుషస్తు చన్ద్రం ప్రాప్తస్యాపి, 'తస్మాద్బ్రహ్మణో మహిమాన మాప్నోతి' ఇతి వాక్యశేషాత్తస్య దక్షిణాయనమృతస్య చన్ద్రప్రాప్తిః బ్రహ్మ ప్రేప్సుతో (ప్రపత్సితో) విశ్రమ హేతుమాత్రమితి గమ్యతే । వాక్యశేషాభావేఽపి పూర్వోక్తాదేవ*

---

పొందబోయే దక్షిణాయనంలో మరణించినవారికి చంద్రప్రాప్తిఅనేది విశ్రామస్థానంమాత్రమే. అర్చిరాదిమార్గంద్వారా చంద్రుడిని పొందిన బ్రహ్మవిద్యానిష్ఠుడికి శ్రమం అంతా తీరిపోవటానికని చెప్పటానికి అసలు అలుపే ఉండదు గనుక అట్లు చెప్పకూడదు. దక్షిణాయనంలో మరణించిన పురుషవిద్యానిష్ఠుడు చంద్రుడివద్ద కాస్తంత ఆగియున్నందున విశ్రమస్థానం అని సాధించేరు. అంటే పితౄణామేవ మహిమానం గత్వా" అని శ్రుతి చెప్పటంచేత చంద్రుడిలో పితృభోగాన్ని పొందిన తరువాత విద్యుత్పురుషుడిని పొంది అతడిద్వారా బ్రహ్మమును పొందుతున్నాడని తాత్పర్యం.

ఈ విద్యానిష్ఠునికి కలిగే చంద్రమసః సాయుజ్యమంటే ధూమాదిమార్గంలో పొందే చంద్రప్రాప్తి కంటే అర్చిరాదిమార్గంలో ప్రయాణంచేసి పొందిన చంద్రప్రాప్తికంటేకూడా విలక్షణమైనది. అంటే, అర్చిరాదిమార్గంలో పోయి చంద్రుడిని పొందినప్పటికీ, కొంచెంకాలం అక్కడ ఉండి, పితృభోగాలని అనుభవించటంచేత విలక్షణమైనది. ఈ విద్యానిష్ఠుడు పితృలోకప్రాప్తిపూర్వకంగా చంద్రుడిని పొందు తున్నాడని చెప్పటం కుదరదు. అర్చిరాదిమార్గంలోపోయే ఇతడు పితృలోకానికి ఎలావెళ్తాడు? దీన్నిగురించి భాష్యాదులలో ఎక్కడా చెప్పబడలేదు. కనుక పితృలోకప్రాప్తి అన్నపదానికి పితృలోకప్రాప్తి అనే అర్థం చెప్పాలి. "పితౄణామేవ మహిమానమ్" అని శ్రుతి చెప్పటంకూడా నిజమనే దృష్టితో చూడాలి.

"ఉదగయనే ప్రమీయతే, దక్షిణాయనే ప్రమీయతే ఇత్యత్ర ధూమాదిమార్గలిఙ్గాభావాత్ బ్రహ్మప్రాప్తివచనాచ్చ అర్చిరాదిగతస్యైవ మరణకాలవిశేషేణ మార్గే సంమానవిశేషః ఉచ్యతే ఇత్యర్థః" అని శ్రుతప్రకాశికలో ఉండటంకూడా చూడవచ్చు. అంతేకాదు, పితృలోకానికి పోయివస్తే చంద్రుడిలో ఎందుకు ఆగి ఉండాలి? పితౄణామేవ మహిమానమ్ గత్వా చంద్రమసః సాయుజ్యం గచ్ఛతి అని పితృమహిమని పొందినతరువాత చంద్రమససాయుజ్యాన్ని (గత్వా అని ఉత్తరకాలాన్ని) చెప్పటానికి ఉపపత్తి ఎలాగ? అంటే, చంద్రమసః సాయుజ్యం గత్వా వర్తమానః పితౄణామేవ మహిమానం గచ్ఛతి అని అన్వయించుకొనటం ఉపపన్నమౌతున్నది. లేదా, "వక్త్రం వ్యదాయ స్వపితి" నోటిని తెరిచే నిద్రిస్తున్నాడు" అన్నప్పుడు సమకాలీనత్వం వివక్షితమైనట్లు ఇక్కడకూడా పితృభోగప్రాప్తీ, చంద్రమససాయుజ్యమూ ఏకకాలంలో ఉన్నదని చెప్పవలెను.

"తస్మాత్ బ్రహ్మణో మహిమానమాప్నోతి" అన్న వాక్యశేషం లేకపోయినా, అంటే బ్రహ్మమును పొందుచున్నాడు అనే వాక్య(శేషం) లేకపోయినా వెనుకటి అధికరణంలో చెప్పినట్లుగా (కర్మసంబంధస్య యావద్దేహభావిత్వాత్- శరీరం ఉన్నంతవరకే కర్మసంబంధం ఉంటుంది అని చెప్పినప్రకారం బ్రహ్మవిద్యానిష్ఠులు దక్షిణాయనంలో మరణించినా వారికి బంధహేతువైన -సంసారబంధానికి కారణమైన కర్మలు లేవుగనుక చంద్రుడిని పొందినా, వారు బ్రహ్మమును పొందటాన్ని అడ్డుకొనటం సాధ్యంగాదు. నిశ్చయంగా బ్రహ్మమును పొందుతారు.

*బన్ధహేత్వభావాద్విదుషశ్ఛన్దం ప్రాప్తస్యాపి బ్రహ్మప్రాప్తిరనివార్యా । భీష్మాదీనాం యోగప్రభావాత్ స్వచ్ఛన్దమరణానాం ధర్మప్రవర్తనాయోత్తరాయణప్రాశస్త్య ప్రదర్శనార్థస్తథావిధాచారః ॥ 19 ॥*

*నను చ విదుషో ముమూర్షూన్ ప్రతి పునరావృత్తిహేతుత్వేన కాలవిశేషవిధిర్దృశ్యతే, "యత్ర కాలే త్వనావృత్తిమావృత్తిం చైవ యోగినః। ప్రయాతా యాన్తి తం కాలం వక్ష్యామి భరతర్షభ!। అగ్నిర్జ్యోతి రహశ్శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్। తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః॥ ధూమో రాత్రిస్తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్। తత్ర చాన్ద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే। శుక్లకృష్ణగతీ హ్యేతే జగతః శాశ్వతే మతే । ఏకయా యాత్యనావృత్తిమన్యయాఽఽవర్తతే పునః॥ ఇతి; తత్రాహ-*

---

భీష్ములవారు యోగమాహాత్మ్యంచేతనూ, స్వచ్ఛందంగా-తమ ఇష్టపడినకాలంలో- మరణాన్ని పొందటానికి వరంపొందినందుననూ, ధర్మప్రవర్తనార్థం ఉత్తరాయణమరణానికి ప్రాశస్త్యం-గొప్పతనం ఉంటుందని తెలుపటానికి ఆవిధంగా చేసేరు. అంటే ఉత్తరాయణాన్ని ఎదురుచూసేరు.

మహోపనిషదశ్చైవ యోగమాస్థాయ వీర్యవాన్। జపన్ శాన్తనవో ధీమాన్ కాలాకాంక్షీ స్థితోఽభవత్॥
యశ్ఛదత్తో వరోమహ్యం పిత్రా తేనమహాత్మనా। ఛన్దతస్తే భవేన్మృత్యురితి తత్ సత్యమస్తు మే॥

ఇత్యాదిశ్లోకాలు భీష్ములయోగసిద్ధి పొందినవారు, పితృవరబలంచేత స్వచ్ఛన్దమరణాన్ని పొందగలిగేరు. అందుచేత ఉత్తరాయణకాలాన్ని ప్రతీక్షించేరని చెప్పుతున్నవి. 19

అయ్యా మరణించే బ్రహ్మవిద్యానిష్ఠుడిని గురించి పునరావృత్తికి కారణమైన కాలం విధించబడి యుండటం చూస్తున్నాం.(అపునరావృత్తికి కారణమైన కాలమూ చెప్పబడియుండటాన్ని చూస్తున్నాం)

యత్ర కాలే తు అనావృత్తిం ఆవృత్తిం చైవ యోగినః। ప్రయాతా యాన్తి తం కాలం లక్ష్యామి భరతర్షభ।
అగ్నిర్జ్యోతిరహః శుక్లః షణ్మాసా ఉత్తరాయణమ్। తత్రప్రయాతాగచ్ఛతి బ్రహ్మ బ్రహ్మవిదోజనాః॥

ధూమో రాత్రిః తథా కృష్ణః షణ్మాసా దక్షిణాయనమ్। తత్రచాన్ద్రమసం జ్యోతిఃయోగీప్రాప్యనివర్తతే॥
శుక్లకృష్ణేగతీ హ్యేతే జగతఃశాశ్వతేమతే। ఏకయా యాత్యనావృత్తిం అన్యయావర్తతే పునః॥(భ.గీ. 8.23,24)

(ఈ శ్లోకాలకు పూర్వపక్షియొక్క అభిప్రాయంప్రకారం అర్థం వ్రాయబడుతున్నది. అర్జునా! యోగియైనవాడు ఏకాలంలో మరణిస్తే తిరిగి రావటం ఉండదో, ఏ కాలంలో మరణిస్తే తిరిగి వస్తాడో ఆకాలాన్ని చెప్తున్నాను విను. అగ్నియైన జ్యోతిస్, పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణమైన ఆరునెలలు అనే కాలాల్లో మరణించిన బ్రహ్మవేత్తలు బ్రహ్మమును పొందుతున్నారు. ధూమం-పొగ, రాత్రి, కృష్ణపక్షం, దక్షిణాయనమైన ఆరుమాసాలు అనే కాలంలో మరణించే యోగియైనవాడు చంద్రుడిని పొంది, తిరిగి వెనక్కి వస్తున్నాడు. శుక్లము, కృష్ణము అనే ఈ రెండూ ఉపనిషత్తులో చెప్పబడినది. ప్రవాహంవలె అనాదిగా ఎల్లప్పుడూ, ఉండేవి. వీటిలో శుక్లపక్షంలో పోయినవాడు తిరిగి రాడు. కృష్ణపక్షంలో పోయినవాడు తిరిగి వెనక్కి వస్తున్నాడు)

అని కృష్ణుడు గీతలో సాదించియున్నాడు. కనుక దక్షిణాయనకాలంలో మరణిస్తే, తిరిగి సంసారాన్ని పొందుతాడు. అతడికి బ్రహ్మప్రాప్తి లభించదు అని.

ఈ ఆక్షేపానికి సమాధానం తరువాతి సూత్రంలో సాదిస్తున్నారు.

*॥ సి. సూ ॥ యోగినః ప్రతి స్మర్యతే స్మార్తే చైతే ॥ 4-2-20 ॥*

*నాత్ర ముముర్షూ న్ప్రతి మరణకాలవిశేషోపాదానం స్మర్యతే అపి తు యోగినః-యోగనిష్ఠాన్ప్రతి, స్మార్తే స్మృతివిషయభూతే స్మర్తవ్యే దేవయానపితృయాణాఖ్యే గతీ స్మర్యేతే-యోగాఙ్గతయా అనుదినం స్మర్తుమ్। తథా హ్యుపసంహారః 'నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన । తస్మా త్సర్వేషుకాలేషు యోగయుక్తో భవార్జున' (భ.గీ.8-27) ఇతి । 'అగ్నిర్జ్యోతిః', 'ధూమో రాత్రిః' (భ.గీ. 8-24/25) ఇతి చ దేవయానపితృయాణే ప్రత్యభి జ్ఞాయేతే। ఉపక్రమే చ 'యత్ర కాలే తు' (భ.గీ. 8-23) త్వితి కాలశబ్దః కాలాభిమానిదేవతాతివాహికపరః, -అగ్న్యాదేః కాలత్వాసమ్భవాత్ । అతః 'తేऽర్చిషమభి సమ్భవన్తి'(బృ. 8-2-15) ఇతి విహితదేవయానానుస్మృతిరత్ర విద్యానిష్ఠాన్ప్రతి విధీయతే, న ముముర్షూ న్ప్రతి మరణకాలవిశేషః ॥20 ॥*

---

*॥సి. సూ॥ యోగినః ప్రతి స్మర్యేతే స్మార్తే చైతే ॥ 4-2-20 ॥*

సూత్రార్థము:- **యోగినః ప్రతి** = ఉపాసకులయిన ముముక్షువులను గురించి, **స్మార్తే ఏతే** = గీతాస్మృతిలో చెప్పబడిన ఈ అర్చిరాదియాన ధూమాదియానములనబడు రెండుమార్గములును **స్మర్యేతే** = ఉపాసనాంగముగా నిత్యము స్మరించుకొనవలెనని మాత్రమే చెప్పబడినవి. అంతేగాని, అతనికి అవి మార్గవిధిని చెప్పునవి కావు అని సూత్రార్థము.

ఈ స్మృతి మరణమును పొందేవారిని గురించి మరణకాలవిశేషాన్ని చెప్పటంలేదు. అపితు-యోగినః- యోగనిష్ఠులనుగురించి స్మార్తే-స్మృతివిషయభూతములైన, స్మర్తవ్యే-దేవయానపితృయానమనే పేరులుగల మార్గములు స్మర్యేతే- యోగాంగముగా ప్రతిదినమును అనుసంధానము చేయుటకు చెప్పబడియున్నది. ఈవిధముగాగదా చివరకు చెప్పియున్నారు.

'నైతే స్మృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన। తస్మాత్ సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున॥'
(గీత. 8-27)

అర్జునా, వెనుక చెప్పిన ఈఅర్చిరాది, ధూమాదిమార్గాలు రెండింటినీ తెలుసుకున్న ఏ జ్ఞానీ ఎప్పటికీ భ్రమించదు. కనుక, ప్రతిరోజూ అర్చిరాదిగతిని చింతించడం అనే యోగంతోబాటు కూడినవాడిగా ఉండు- అని సాదించేరు. కనుక, 'యత్ర కాలే' అనే శ్లోకంలోనున్న కాలశబ్దం మార్గాన్నే చెప్పుతున్నది. కాలాన్ని చెప్పటంలేదు. వెనుక చెప్పిన నిగమనశ్లోకంలో "ఏతే శ్రుతీ- మార్గములు అని స్పష్టంగా చెప్పియుండటాన్ని గమనించవచ్చు. పైగా, "అగ్నిర్జ్యోతిః", "ధూమో రాత్రిః" అనేవికూడా దేవయాన పితృయాన మార్గాలనే జ్ఞప్తికి తెస్తున్నవిగా ఉన్నాయి. ఆరంభంలో చెప్పబడిన 'యత్ర కాలే తు' అన్న శ్లోకంలోనున్న కాలశబ్దం కాలాభిమానిదేవతయైన ఆతివాహికులని చెప్పుతున్నది. అగ్న్యాదులు కాలాలుగావుగదా! అందుచేత 'తే అర్చిష మభిసంభవన్తి' (బృ. 8-2-15) అని విధించబడిన దేవయానానుస్మరణను అనుసంధానం చేయవలెనని. ఇక్కడ ఉపాసకులనిగురించి విధించుచున్నది. మరణకాలవిశేషం ఇక్కడ విధించబడలేదు.

*॥ ఇతి దక్షిణాయనాధికరణమ్ ॥ 11 ॥*

*। ఇతి శ్రీభగవద్రామానుజవిరచితే శారీరకమీమాంసాభాష్యే*

*చతుర్థస్యాధ్యాయస్య ద్వితీయః పాదః ॥*

## ప్రశ్న-సమాధానం

**ప్రశ్న**:- భీష్ములవారు ఉత్తరాయణాన్ని ప్రతీక్షించటం అనేది, సుకృతులకు ఉత్తరాయణమనేది ప్రశస్తం అని తెలుపటానికి. "ధర్మప్రవర్తనాయ-లోకోపకారార్థం ఆవిధంగా చేసేరు' అని చెప్పటం ఉచిత మౌతుందా? బ్రహ్మవిదగ్రేసరులైన వీరు ఉత్తరాయణకాలాన్ని ప్రతీక్షించేరు అంటే బ్రహ్మవిద్యానిష్ఠులు అందరూ ఉత్తరాయణాన్ని ప్రతీక్షించవలెనని అనే స్థితిరాదా? "యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవ ఇతరో జనాః" అనిగదా నియమం ఉన్నది. అట్లు భీష్ములవారివలె ఇతర బ్రహ్మవిద్యానిష్ఠులందరూ ఉత్తరాయణాన్ని ప్రతీక్షించితే అది ఈ అధికరణసిద్ధాంతానికే విరుద్ధమైంది కదా!

**సమాధానం**:- లోకంలో ఒకరికే కొన్ని ధర్మములు ఏర్పాటయి ఉండటం చూస్తున్నాం. ఆ ఆచారాన్ని- ధర్మాన్ని ఇతరులుకూడా అనుష్ఠించాలి అని చెప్పటం కుదరదు. దీనికి కొన్ని ఉదాహరణ లున్నాయి. ద్రౌపది పాండవులు అయిదుగురినీ వివాహమాడింది. ఆమెవలె ఇతరులుకూడా చెయ్యవచ్చా? కానీనః కర్ణః కానీనో వ్యాసః- వివాహంకాని స్త్రీయొక్క పిల్లలు వీరు. (కానీనః- కన్యకాజనితస్సుతః. (అమర. 2-283)) వీరిని ఇతరులుకూడా ఉదాహరణంగా తీసుకొనవచ్చా? ఈమాదిరిగా భీష్ములు ఉత్తరాయణాన్ని ఎదురుచూసేరనటంచేత బ్రహ్మవేత్తలు అందరికీ ఈవిధమైన నియమాన్ని కల్పించటం సాధ్యంకాదు. భీష్ములవారు ఉత్తరాయణాన్ని ప్రతీక్షించేరు అనేది ప్రారబ్ధకర్మ ప్రతినియతం- అనుభవించే నాశాన్ని పొందవలసిన ప్రారబ్ధకర్మవిశేషం వారికిమాత్రమే కలిగినది. అంటే భీష్ములవారు యుద్ధం చెయ్యటం యుద్ధంలో మరణించటమనే అవకాశం పొందటం ఉత్తరాయణాన్ని ఎదురుచూడటం వారొక్కరికే కలిగిన ప్రారబ్ధకర్మవిశేషం. ఇతరులకు ఈవిధంగా జరగదు. పైగా, భీష్ములవారు అష్టవసువులలో ఒకరుగా ఉండి భూలోకంలో జన్మించి మళ్ళీ వసుపదాన్ని పొంది తరువాత బ్రహ్మమును పొందబోతున్నారు. సాక్షాత్తుగా మోక్షాన్ని పొందబోవటంలేదు. కనుక వారి ఆచారాన్ని- ఉత్తరాయణకాలప్రతీక్షణాన్ని ఇతరోపాసకులుకూడా ఎదురుచూడాలి అనికాదు.

దక్షిణాయనాధికరణం ముగిసినది.

చతుర్థాధ్యాయం రెండవపాదం ముగిసినది.

అథ శ్రీభగవద్రామానుజవిరచితే

శారీరకమీమాంసాభాష్యే

చతుర్థాధ్యాయే తృతీయః పాదః – (గతిపాదః)

## ॥ అర్చిరాద్యధికరణమ్ (4-3-1 )

॥ సి. సూ ॥ అర్చిరాదినా తత్ప్రథితేః ॥ 4-3-1 ॥

విదుష ఉత్క్రాన్తస్య నాడీవిశేషేణ హార్దానుగ్రహాత్ గత్యుపక్రమ ఉక్తః । తస్య గచ్ఛతో మార్గ

---

శ్రీరస్తు

శ్రీః శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ భగవద్రామానుజవిరచితమైన శ్రీ శారీరకమీమాంసా భాష్యము సుఖబోధినిలో

నాలుగవ అధ్యాయము మూడవ పాదము (గతిపాదము)

## అర్చిరాధికరణము (4-3-1 )

॥ సి. సూ ॥ అర్చిరాదినా తత్ప్రథితేః ॥ 4-3-1 ॥

సూత్రార్థము:– **అర్చిరాదినా=** అర్చిరాదిమార్గద్వారానే బ్రహ్మవేత్త పయనించి పరమాత్మనుచేరును. ***తత్ప్రథితేః***=ఆ అర్చిరాదిమార్గమే అన్ని ఉపనిషత్తులలోను బ్రహ్మవేత్తకు గంతవ్యముగా ప్రసిద్ధముగా చెప్పబడినందువలన.

సంగతి:– ఉత్క్రాన్తిపాదం అనబడే వెనుకటిపాదంలో మూర్ధన్యనాడిలో ప్రవేశించిన ముముక్షువు స్థూలశరీరమైన బ్రహ్మపురంనుండి బ్రహ్మనాడియైన శిరోద్వారంలోంచి(తలలో ఉన్న ద్వారంలోంచి) వత్సలుడైన హార్దుడు, మాటలాడటం నేర్చిన ముఖంతో వశీకరించుకొనే తన పుత్రుడిని రాజుగారు ఎత్తుకొని సంచరించినట్లు, రాజాధిరాజైన భగవానుడుకూడా ఇంతకాలం పోగొట్టుకొని పొందిన అత్యన్తప్రేమవిషయమైన చేతనుడిని– భక్తుడిని తీసికొని బయలుదేరి "మన్నుమ్ కడుం కదిరోన్ మణ్డలత్తిన్ నన్ నడువుళ్ అన్నతు ఓర్ ఇల్లియిన్ ఊడుపోయ్" (పె.తి.మ.16)(తీవ్రమైన కిరణాలుగల సూర్యమండలం మధ్యన గొప్పదైన రంధ్రం–ద్వారం–ద్వారా) అని చెప్పినట్లుగా, సూర్యరశ్మిద్వారా (అర్చిరాదిక్రమంగా) సూర్య– మండలంలో– దేవయానమార్గంలో ప్రవేశింపజేసేదు అని చెప్పబడింది.

తేషాం వై క్షేమమధ్వానం గచ్ఛతాం ద్విజసత్తమ।సర్వలోకతమోహన్తా ఆదిత్యో ద్వారముచ్యతే॥ (భార.శాం.354.14) (బ్రాహ్మణోత్తమా! బ్రహ్మమును పొందటానికి వెళ్ళే ఉపాసకులకు క్షేమంకరమైన అర్చిరాదిమార్గానికి సర్వలోకముల అంధకారాన్ని పోగొట్టే సూర్యుడు ద్వారమని చెప్పబడుతున్నది) అని ఆదిత్యమండలమును దేవయానమార్గపు ద్వారంగా ప్రమాణం చెప్పుతున్నది. కనుక మొదట అర్చిని పొందినట్లుగా చెప్పలేదని భావించవలదు.

ఇక అర్చిరాదిపాదం అనబడే ఈ పాదంలో 1. అర్చిస్ అనిన్నీ, 2. అహస్ అనిన్నీ, 3. పూర్వపక్షం అనిన్నీ, 4.ఉత్తరాయణం అనిన్నీ, 5.సంవత్సరమనిన్నీ, 6.వాయువు అనీ, 7. ఆదిత్యుడు అనీ, 8.చంద్రుడనీ,

*ఇదానీం నిర్ణీయతే । తత్ర శ్రుతిషు మార్గప్రకారా బహుధా ఆమ్నాయన్తే; ఛాన్దోగ్యే తావత్ 'యథా పుష్కరపలాశే ఆపో నశ్లిష్యన్తే ఏవమేవంవిది పాపం కర్మ నశ్లిష్యతే'(ఛాం. 4-14-3) ఇత్యుపక్రమ్య బ్రహ్మవిద్యాముపదిశ్యాఽఽమ్నాయతే, 'అథ యదు చైవాస్మిఞ్ఛవ్యం కుర్వన్తి। యదు చ న అర్చిష మేవాభిసమ్భవన్తి అర్చిషోఽహరహ్న ఆపూర్యమాణపక్ష మాపూర్యమాణపక్షాద్యాన్ షడుదఙ్జేతి మాసాంస్తాన్ మాసేభ్యః సంవత్సరం సంవత్సరాదాదిత్యం, ఆదిత్యాచ్చన్ద్రమసం చన్ద్రమసో విద్యుతం తత్పురుషోఽమానవః స ఏనాన్ బ్రహ్మగమయత్యేష దేవపథో బ్రహ్మపథ ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవ మావర్తం నావర్తన్తే' (ఛాం.4-14-5/6) ఇతి। తథాఽత్రైవాష్టమే 'అథైతైరేవ రశ్మిభి*

9 వైద్యుతుడనీ, అమానవసంజ్ఞుడైన ఇతడికి సహకారులైన 10. వరుణ. 11 ఇంద్ర. 12. ప్రజాపతి అని చెప్పబడుతున్న మార్గదర్శులైనపెద్దలని పెట్టి తమతమ హద్దులవరకూ ముక్తపురుషుడిని అర్చిరాది అభిమానిదేవతలను- తమచేత నియమించబడినవారితో (అంటే తాను ప్రధానుడుగా ఉంటూ) ముక్తుడిని అర్చిరాదిమార్గంలో పిలుచుకుపోతున్నాడు అని విద్వాంసుడిని పిలచితీసుకుపోయే అర్చిరాదిమార్గం చెప్పబడుతున్నది.

**విషయము:-** అర్చిరాది మార్గాన్ని చెప్పే శ్రుతివాక్యాలు.

శ్రుతుల్లో అర్చిరాదిమార్గప్రకారం - క్రమం చాలావిధాలుగా చెప్పబడియున్నాయి. . వాటిని చెప్తున్నాం.

ఛాందోగ్యోపనిషత్తులో- యథా పుష్కరపలాశే ఆపో న శ్లిష్యన్తే, ఏవమేవంవిది పాపం కర్మ న శ్లిష్యతే(4. 14. 3) (తామరాకుమీద జలము ఎలాగ అంటదో, సంబంధించదో, ఆవిధముగనే బ్రహ్మవేత్తలు చేయు అబుద్ధిపూర్వకమైన పాపకర్మలు బ్రహ్మవేత్తలకి సంబంధించుట లేదు) అని ఆరంభించి బ్రహ్మవిద్యను ఉపదేశించి "అథ యదు చ ఏవ అస్మిన్ సవ్యం కుర్వన్తి యదు చ న, అర్చిషమేవాభిసంభవన్తి అర్చిషోఽహః అహ్న ఆపూర్యమాణపక్షం ఆపూర్యమాణపక్షాత్ యాన్ షడుదఙ్జేతి మాసాంస్తాన్, మాసేభ్యః సంవత్సరం, సంవత్సరాదాదిత్యమాదిత్యాచ్చన్ద్రమసం చన్ద్రమసో విద్యుతమ్, తత్పురుషోఽమానవః స ఏనాన్ బ్రహ్మ గమయ త్యేష దేవపథో బ్రహ్మపథః ఏతేన ప్రతిపద్యమానా ఇమం మానవమావర్తం నావర్తన్తే"ఇతి(ఛాం. 4. 15. 5).

బ్రహ్మవేత్తయొక్క శవసంబంధియైన కర్మను అతడి పుత్రాదులు చేసినను చేయకపోయినను వారు అర్చిస్సునే పొందుచున్నారు. అర్చిస్- అగ్ని. దానినుండి పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణము, సంవత్సరము, ఆదిత్యుడు చంద్రుడు, విద్యుత్(మెరుపు) అనే వరుసప్రకారము మార్గమందు పోవుచున్నారు. విద్యుత్పురుషుడైన అమానవుడు ఉపాసకులను బ్రహ్మమువద్దకు పిలుచుకొని పోవుచున్నాడు. దేవతలైన ఆతివాహికులచే (మార్గదర్శకులచే) పిలువబడి పోవు ఈ మార్గము దేవపథము అనబడుచున్నది. బ్రహ్మమును పొందించు మార్గమైనదిగనుక బ్రహ్మపథము అనియు చెప్పబడుచున్నది. ఈ మార్గముద్వారా బ్రహ్మమును పొందువాడు, జననమరణములను కలిగించగల ఘోరమైన(శరీరోపలక్షితమైన)సంసారమును తిరిగి పొందదు అని చెప్పబడుచున్నది.

ఛాందోగ్యోపనిషత్తులోనే ఎనిమిదవ ప్రపాఠకములో ""అథ ఏతైరేవ రశ్మిభిః ఊర్ధ్వమాక్రమతే'(8-

*రూర్ధ్వమాక్రమతే'(ఛాం.8-6-5) ఇతి । కౌషీతకినశ్చ దేవయానమార్గ మన్యథాఽధీయతే 'స ఏతం దేవయానం పన్థానం ఆపద్యాగ్ని లోకమాగచ్ఛతి స వాయు లోకం స వరుణలోకం స ఆదిత్యలోకం స ఇన్ద్రలోకం స ప్రజాపతిలోకం స బ్రహ్మలోకమ్' (కౌ.1-అ21)ఇతి । తథా బృహదారణ్యకే 'య ఏవమేతద్విదుర్యే చేమేఽరణ్యే శ్రద్ధాం సత్యముపాసతే। తే అర్చిషమభిసమ్భవన్తి అర్చిషోఽహరహ్నః ఆపూర్యమాణ పక్షమాపూర్యమాణపక్షాద్యాన్ షణ్మాసా నుదఙ్ఙాదిత్య ఏతి, మాసేభ్యో దేవలోకం దేవలోకాదాదిత్యమ్, ఆదిత్యాద్వైద్యుతం వైద్యుతాత్పురుషోమానసః స ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి'(బృ.8-2-15) ఇతి । తత్రైవ పునరన్యథా 'యదా వై పురుషోఽస్మాల్లోకాత్ప్రైతి స వాయుమాగచ్ఛతి తస్మై స తత్ర విజిహీతే యథా రథచక్రస్య ఖమ్। తేన స ఊర్ధ్వ మాక్రమతే స ఆదిత్యమాగచ్ఛతి। తస్మై*

6-5)ఇతి. -ఈసూర్యకిరణాలమూలంగానే బ్రహ్మజ్ఞాని స్థూలదేహమునుండి మీదికి వెళ్తున్నాడు" అని మాత్రమే చెప్పబడుచున్నది. మరేమియు చెప్పలేదు.

కౌషీతక్యుపనిషత్తులో దేవయానమార్గము వేరు విధముగా చెప్పబడినది 'స ఏతం దేవయానం పన్థానమాపద్య అగ్నిలోకం ఆగచ్ఛతి స వాయులోకం స వరుణలోకం, స ఆదిత్యలోకం, స ఇంద్రలోకం, స ప్రజాపతిలోకం, స బ్రహ్మలోకం' (1-29) అని మోక్షంపొందే జ్ఞాని దేహవియోగకాలమందే- ప్రారబ్ధకర్మా-వసానశరీరమునుండి బయటికిబయలుదేరు సమయంలోనే సుకృతదుష్కృతములను వదలి, దేవయాన మార్గమును పొంది అగ్నిలోకమును పొందుచున్నాడు. ఆ తరువాత, వాయులోకం, వరుణలోకం, ఆదిత్య లోకం, ఇంద్రలోకం, ప్రజాపతిలోకం, అనే లోకాలకి వెళ్లిన తర్వాత బ్రహ్మలోకానికి వెళ్తాడని చెప్పబడుతోంది.

బృహదారణ్యకంలో 'య ఏవమేవ విదుః యే చేమే అరణ్యే శ్రద్ధాం సత్యముపాసతే, తే అర్చిషమభి సంభవన్తి అర్చిషోహః అహ్న ఆపూర్యమాణపక్షం ఆపూర్యమాణపక్షాత్ యాన్ షణ్మాసాన్ ఉదదిత్య ఏతి మాసేభ్యో దేవలోకం దేవలోకాత్ ఆదిత్యం ఆదిత్యాత్ వైద్యుతం వైద్యుతాత్ పురుషో మానసః స ఏత్యబ్రహ్మలోకాన్ గమయతి' (8-2-15) ఇప్పుడు వెనుకచెప్పబడిన రీతిలో, ద్యు,పర్జన్య,పృథ్వీ,పురుష, యోషిత్-స్త్రీ అనే అయిదు అగ్నులలో శ్రద్ధ, సోమ, వృష్టి, అన్న, రేతస్సులతో చేరినదిగా సంచరించుచున్న ప్రత్యగాత్మను బ్రహ్మాత్మకముగా ఎవరు ఉపాసిస్తారో వారు (యే ఇమే అరణ్యే శ్రద్ధాం సత్యం ఉపాసతే-ఏపురుషులు అరణ్యములోనుండుచు శ్రద్ధతో సత్యశబ్దముచే చెప్పబడు పరమాత్మను ప్రత్యగాత్మకు ఆత్మగా ఉపాసింతురో వారును వెనుక చెప్పబడిన వారును ఇరువురును(అర్చిషం అభిసంభవన్తి) అర్చిరభిమాని దేవతను పొందుచున్నారు. అర్చిస్సునుండి అహస్సు(పగలు), శుక్లపక్షం, ఉత్తరాయణం, దేవలోకం, ఆదిత్యుడు, వైద్యుతుడు అనేక్రమంలో మార్గంలోనడిపించేవారిని పొందుతున్నారు. వైద్యుతపురుషుడు మానసుడు- పరమాత్మయొక్క మనసుచేత సృష్టింపబడినవాడు. అమానవుడు అనబడే పురుషుడు వీరితో వచ్చి వీరిని బ్రహ్మలోకాన్ని పొందించుచున్నాడని చెప్పబడింది.

బృహదారణ్యకంలోనే మరొకచోట'యదా వై పురుషోఽస్మాత్ లోకాత్ ప్రైతి స వాయు మాగచ్ఛతి తస్మై స తత్రవిజిహీతే, యథా రథచక్రస్య ఖం తేన స ఊర్ధ్వమాక్రమతే, స ఆదిత్యమాగచ్ఛతి. తస్మై స తత్ర విజిహితే, యథా ఆడమ్బరస్య ఖం. తేన స ఊర్ధ్వమాక్రమతే చన్ద్రమసమాగచ్ఛతి. తస్మై స తత్ర విజిహీతే,

*స తత్ర విజిహీతే, యథా ఆడమ్బరస్య ఖమ్। తేన స ఊర్ధ్వమాక్రమతే; స చన్ద్రమస మాగచ్ఛతి తస్మై స తత్ర విజిహీతే, యథా దున్దుభేః ఖమ్'(బృ.7-10-1) ఇత్యాది । తత్ర సంశయః- కిమర్చిరాదిరేక ఏవ మార్గ ఆభిః శ్రుతిభిః ప్రతిపాద్యత ఇతి తేనైవ బ్రహ్మ గచ్ఛతి విద్వాన్? ఉత తస్మాదన్యేఽన్యత్ర మార్గా*

యదా దుందుభేః ఖమ్" (బృ. 7.10.1) ఎప్పుడు బ్రహ్మవేత్త ఈ లోకమునుండి పోవుచున్నాడో అప్పుడు అతడు వాయువును పొందుచున్నాడు. తనని పొందిన బ్రహ్మవేత్తకొఱకు ఆ వాయువనబడునతడు (విజిహీతే ఆత్మావయవాన్ విగమయతి చిద్రీకరోతి ఆత్మానం ఇత్యర్థః) తననుండి రథచక్రము మధ్యనున్న రంధ్రమువంటి వెడల్పుగల సందును సృష్టించుచున్నాడు. దానిద్వారా బ్రహ్మవేత్త మీదకు వెళ్ళి ఆదిత్యుని పొందుచున్నాడు. ఆదిత్యుడు మీదకు వెళ్ళవలెనని కోరుచున్న బ్రహ్మవేత్తయొక్క మార్గమును నిరోధనము-అడ్డుకొనుచున్నను, తనను వచ్చి చేరిన బ్రహ్మవేత్తకొఱకు ఆడంబరమనుబడు వాద్యవిశేషములోనున్న సందుకొలతగల సందును కల్పించుచున్నాడు. దానిద్వారా బ్రహ్మవేత్త మీదికి పోవుచున్నాడని చెప్పబడియున్నది.

పైన చెప్పబడియున్న శ్రుతులప్రకారము ఉన్న మార్గములను సులభముగా తెలిసికొనుటకు వరుసలో పెట్టి చెప్పుచున్నాము.

| ఛాందోగ్యము | కౌషీతకి | బృహదారణ్యకము |
|---|---|---|
| 1. అర్చిస్సు- అగ్ని | 1. అగ్నిలోకము | 1. అర్చిస్సు |
| 2. అహః- పగలు | 2. వాయులోకము | 2. అహః |
| 3. శుక్లపక్షం-వృద్ధిరోజులు | 3. వరుణలోకము | 3. శుక్లపక్షము |
| 4. ఉత్తరాయణము | 4. ఆదిత్యలోకము | 4. ఉత్తరాయణము |
| 5. సంవత్సరము | 5. ఇంద్రలోకము | 5. దేవలోకము |
| 6. ఆదిత్యుడు- రవి | 6. ప్రజాపతిలోకము | 6. ఆదిత్యుడు |
| 7. చంద్రుడు రాత్రికిరాజు | | 7. వైద్యుతుడు |
| 8. విద్యుత్- మెరుపు | | |
| (అమానవుడు అను విద్యుత్పురుషుడు) | | |

**సంశయము:-** వెనుక చెప్పబడిన శ్రుతివాక్యాలు అర్చిరాదిమార్గం ఒక్కటే అని చెప్పుతున్నవి గనుక, బ్రహ్మవేత్త ఆ మార్గంలోనే ప్రయాణించి బ్రహ్మమును పొందుతున్నాడు అని ఒక నియమాన్ని చెప్పుతున్నాయా? లేక చాలా చోట్ల చాలారకాలైన అర్చిరాదిమార్గాలు చెప్పబడినాయి గనుక ఈ మార్గంలోనే పోవలెను, లేక, ఆ మార్గంలో పోవలెను అని నియమం చెప్పటానికి కుదరదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** అనియమాధికరణంలో (3.3.32) "సర్వవిద్యాసాధారణీ ఇయం గతిః"- అందరు బ్రహ్మవిద్యానిష్ఠులకీ సాధారణమైన మార్గమిది అని అర్చిరాదిమార్గం ఒకటే అని నిర్ధారణం చెప్పబడింది గనుక, అర్చిరాదిమార్గం ఒక్కటే అని నియమం చెప్పవలె. అయినా, అర్చిరాదిమార్గాన్ని గురించిన క్రమం వేరువేరుగా చెప్పబడి యున్నందున ఎన్నో మార్గాలు ఉన్నట్లు చెప్పవలెనన్నట్లు కనబడుతున్నది. ఇందులో ఏ పక్షం యుక్తమైనదో తెలియనందువల్ల సంశయం కలుగుతున్నది.

*ఇతి తైర్వ్యాసనేన వేత్యనియమః ఇతి । కిం యుక్తమ్? అనియమ ఇతి । కుతః? అనేకరూపత్వాన్నైరపేక్ష్యాచ్చేతి॥*

*ఏవం ప్రాప్తే అభిధీయతే - అర్చిరాదినేతి । అర్చిరాదిరేక ఏవ మార్గః సర్వత్ర ప్రతిపాద్యతే, అతోఽర్చిరాదినైవ గచ్ఛతి । కుతః? తత్ప్రథితేః - తస్యైవ సర్వత్ర ప్రథితేః । ప్రథితిః - ప్రసిద్ధిః, తస్యైవ సర్వత్ర ప్రత్యభిజ్ఞానాదిత్యర్థః । ప్రత్యభిజ్ఞానాత్స ఏవ మార్గః సర్వత్ర న్యూనాధికభావేన ప్రతిపాద్యత ఇతి విద్యా గుణోపసంహారవదన్యత్ర ఉక్తానామన్యత్రోపసంహారః క్రియతే । ఛాన్దోగ్యే తావ దుపకోసల-విద్యాయాం పఞ్చాగ్నివిద్యాయాం చైకరూప ఏవామ్నాయతే। వాజసనేయకే చ పఞ్చాగ్నివిద్యాయాం*

**పూర్వపక్షము:–** ఈ మార్గంలోనే పోతున్నాడు అని నియమం చెప్పటం కుదరదు. అర్చిరాది మార్గం పలురకాలుగా చెప్పబడియున్నది గనుకనూ, ఒకదానిని ఒకటి అపేక్షించకుండా ఉన్నందువల్లనూ (ఒకదానితో మరొకదానికి సంబంధం ఉన్నా) ఒక నియమం చెప్పటానికి కుదరదు.

**సిద్ధాంతము:–** అర్చిస్సుని మొదలుగా గల ఒకటే మార్గం అన్ని ఉపనిషత్తులలోనూ చెప్పబడి యున్నది. కనుక, అర్చిరాది మార్గంలోనే వెళ్తున్నాడు. ఎందుకంటే, తత్ప్రథితేః– అన్నిస్థలాలలోనూ దానికే ప్రసిద్ధియున్నది. అంటే అన్ని ఉపనిషత్తులలోనూ మార్గంలో అర్చిస్సు సూర్యుడు చెప్పబడియున్నందున, దానికే ప్రత్యభిజ్ఞ– ఆ ఉపనిషత్తులో చెప్పబడినట్లుగనే ఈ ఉపనిషత్తులోకూడా చెప్పబడిందనే భావనే కలుగుతున్నది. కనుక అర్చిరాదిమార్గం ఒక్కటే. ఒకే అర్చిరాదిమార్గం ఆయా ఉపనిషత్తులలో న్యూనాధికంగా – కొంచెం ఎక్కువ తక్కువలుగా అంటే కొన్ని ఉపనిషత్తులలో కొన్నింటిని చెప్పకుండా వదిలేయటం, కొన్ని ఉపనిషత్తులలో కొన్నింటిని బాగా ఎక్కువగా చేర్చి చెప్పటం జరిగింది (విద్యా గుణ ఉపసంహారాలవలె). అంటే– ఒక ఉపనిషత్తులో కొన్ని గుణాలు చెప్పకుండా వదలబడినా, మరొక ఉపనిషత్తులో అనుబంధంగా చెప్పబడిన అదే విద్యయొక్క గుణాలని చెప్పకుండా, వదలివేసినచోటకూడా, చేర్చుకోవాలి అని గుణోపసంహారపాదంలో చెప్పబడినట్లు అర్చిరాదిమార్గంలోకూడా తక్కువగా చెప్పబడినప్పుడు మరొకచోట ఎక్కువగా చెప్పబడినవాటిని చేర్చుకొనాలి.

అయ్యా! పరవిద్యలన్నింటిలోనూ, ఆయావిద్యలలో చెప్పబడియండేగుణాలు అన్నింటినీ ఉపసంహారం – చేర్చి అనుసంధానం– చెయ్యటం కుదరదు గనుక విద్యైక్యం చెప్పబడకపోయినట్లు ఇక్కడకూడా, అగ్ని సూర్యాదిప్రత్యభిజ్ఞ ఉన్నప్పటికీ ఒకే మార్గం అని చెప్పటం కుదరదు. అధికరణసారావళిలోని ఈ శ్లోకము ఇక్కడి పూర్వపక్షసిద్ధాంతాలను చూపుతున్నది

శాఖాభేదేషు భిన్నాంగతి ముపనిషదో అధీయతే, తన్ముముక్షోః
విద్యావైషమ్యనీత్యా శ్రుతిరపి విషమా న వ్యవస్థా అర్చిరాదేః।
నైతత్సర్వత్ర తైస్తైరిహ తదిదం ఇతిప్రత్యభిజ్ఞానసిద్ధా
భావ్యంన్యూనాధికత్వప్రభృతినిఖిలమపి అత్ర సిద్ధావిరుద్ధమ్ ॥ – (అధి.501)

అయ్యా పరవిద్యలో అనన్తకల్యాణగుణాలనీ చేర్చి అనుసంధానం చెయ్యటం సాధ్యం కాదుగనుక, విద్యైక్యం చెప్పటం కుదరదుగదా! అర్చిరాదిమార్గంలో పన్నెండుమంది ఆతివాహికులే చెప్పబడియున్నందు వలన ఉపసంహారం చెప్పటం సాధ్యమే.

*తథైవార్చిరాదిఃఅల్పాన్తర ఆమ్నాయతే, అతస్తత్రాపి న ఏవేతి ప్రతీయతే। అన్యత్రాపి సర్వత్రాగ్న్యాదిత్యాదయః ప్రత్యభిజ్ఞాయన్తే ॥ 1 ॥*

॥ ఇతి అర్చిరాద్యధికరణమ్ ॥ 1 ॥

ఛాందోగ్యంలో ఉపకోసలవిద్యలోనూ పంచాగ్నివిద్యలోనూ, ఎక్కువతక్కువలు లేకుండా ఒకే పద్ధతిలో మార్గం చెప్పబడి ఉన్నది. బ్రహ్మారణ్యకంలో (వాజసనేయకంలో) పంచాగ్నివిద్యలో ఛాందోగ్యంలో ఉన్నట్లే చిన్న మార్పులతోచెప్పబడియున్నది. కనుక, అక్కడకూడా ఛాందోగ్యంలో చెప్పబడిన అదేమార్గం అని తెలుస్తున్నది. కౌషీతక్యుపనిషత్తులో అగ్ని, ఆదిత్యులు చెప్పబడిందిగనుక అన్నింటిలోనూ చెప్పబడిన మార్గం ఒకటే అని కనబడుతున్నది.

**ప్రశ్న, సమాధానం–** ప్రశ్న:– బ్రహ్మవేత్తలు అర్చిరాదిమార్గంలో వెళ్ళుదురు అని భగవానుడిని పొందటానికి గతినియమ మనేది చెప్పబడటం సరికాదు. వేరువేరు మార్గాల్లో వెళ్ళినవారుకూడా బ్రహ్మమును పొందియున్నారని ప్రమాణము చెప్పుచున్నది. అనగా, శిశుపాలుడు అప్పుడే వాసుదేవుని శ్రీపాదమును పొందెను. శ్రీరాముడు తన శ్రీవైకుంఠమునకు వేంచేయునపుడు అయోధ్యలోని చరాచరములనన్నింటిని వైకుంఠమునకు పిలచుకొని వెళ్ళినాడు. మహాపుణ్యాత్ముడైన పుణ్డరీకమహర్షి బ్రహ్మమును పొందినాడు. భీష్ములు వస్వాదిపదమును పొంది అచటినుండి పరమపదమును పొందెను. కొంతమంది (క్రమముక్తి పక్షములో) విభవార్చనమును పొంది అచటినుండి వ్యూహార్చనను, అచటినుండి పరవాసుదేవుని పొందితిరని ఉపాసనము చేసిన క్రమములో పొందుచున్నారు. చతుర్ముఖబ్రహ్మ తనలోకమునుండి పరమపదమును పొందినాడు బ్రహ్మపుత్రులైన పులస్త్యనారదాదులును అర్చిరాదిమార్గములో పోలేదు. వారివారి అధికారకాలము పూర్తికాగనే బ్రహ్మమును పొందవలెనని కోరికగల ఇంద్రాదులును అచటినుండే పరమపదమును పొందుచున్నారని ప్రమాణములు చెప్పుచున్నవి.

సమాధానము:– అనేకముగా(సామాన్యముగా) బ్రహ్మవేత్తలు అందరును బ్రహ్మనాడిద్వారా స్థూలశరీరమునుండి బయటపడి అర్చిరాదిమార్గముద్వారా బ్రహ్మమును పొందుదురని ప్రమాణముతో నిర్ణయించబడినది. కొందరు బ్రహ్మవేత్తలు (బ్రహ్మవిద్విశేషాః) వేరుమార్గముద్వారాకూడ బ్రహ్మమును –అనగా పరమపదమును పొందియున్నారని ప్రమాణము చెప్పుచున్నది. కనుక అర్చిరాది మార్గమందు పోవువారే బ్రహ్మమును పొందుదురని నియమము చెప్పక, అర్చిరాదిమార్గములో పోవువాడు బ్రహ్మమునే పొందుచున్నాడు అని నియమమును మార్చి చెప్పవలెను. దానిచే రెండు ప్రమాణములను అంగీకరించినట్లగుచున్నది. ఇంద్ర,ప్రజాపతులు అర్చిరాది మార్గమందు ఉన్నందున వారు మోక్షమును పొందునపుడు అర్చిరాదిమార్గసంబంధము వారికిని ఉన్నదనవచ్చును. వెనుక చెప్పబడిన ఆక్షేపమునకు సమాధానమును బుద్ధిమంతులు ఊహించికొనవలసినది అని స్వామి దేశికులు సాదించియున్నారు. ఈ విషయములను స్వామి దేశికులు ఈ క్రింది అధికరణసారావళి(502) శ్లోకములో సాదించియున్నారు.

చైద్యాదీనా మయోధ్యాస్థిరచరజనుషాం పుణ్డరీకాదికానామ్
భీష్మాదీనాముపాస్తిక్రమభవ విభవ వ్యూహ లోకస్థితానామ్।
ధాతృూనాం తత్సుతానా మధికృతివిగమే బ్రహ్మసంప్రాప్యతామపి
అన్యేషాం ప్రస్థితిస్సా సితాపృథుమతిభి శ్చిన్తనీయా యథార్హమ్॥

అర్చిరాద్యధికరణము సమాప్తము

## వాయ్వధికరణమ్ (4-3-2 )

### ॥ సి. సూ ॥ వాయుమబ్దాదవిశేషవిశేషాభ్యామ్ ॥ 4-3-2 ॥

*అర్చిరాదినైవ గచ్ఛన్తి విద్వాంస ఇత్యుక్తమ్, తత్రార్చిరాదికే మార్గే ఛన్దోగా మాసాదిత్యయోరన్తరాలే సంవత్సరమధీయతే మాసేభ్యో సంవత్సరం, సంవత్సరాదాదిత్యమ్' (ఛాం.4-15-5)ఇతి। వాజసనేయిన స్తు తయోరేవాన్తరాలే దేవలోకమ్ 'మాసేభ్యో దేవలోకం దేవలోకాదాదిత్యమ్' (బృ.8-2-15) ఇతి । ఉభయత్రాఽపి మార్గస్యైకత్వాదుభావుభయత్రోపసంహార్యౌ । తత్ర మాసాదూర్ధ్వమభిహితయోః సంవత్సరదేవలోకయోఃపంచమ్యాభిహితస్య శ్రౌతక్రమస్య తుల్యత్వేఽపి 'అర్చిషోఽహరహ్నః ఆపూర్యమాణపక్ష మాపూర్యమాణ పక్షాద్యాన్షడుదఙ్జేతి మాసాంస్తాన్' ఇత్యధికకాలానాం న్యూనకాలేభ్యః ఉత్తరోత్తరత్వేన నివేశదర్శనాత్ సంవత్సరస్యైవ మాసాదనన్తరం బుద్ధౌ విపరివృత్తేః సంవత్సర ఏవమాసాదూర్ధ్వం నివేశయితవ్య ఇతి తత ఊర్ధ్వం దేవలోక ఇతి నిశ్చీయతే । అన్యత్ర*

---

## వాయ్వధికరణము (4-3-2 )

### ॥ సి. సూ ॥ వాయుమబ్దాదవిశేషవిశేషాభ్యామ్ ॥ 4-3-2 ॥

సూత్రార్థము:- ముక్తపురుషుడు అని కర్తృపదమును అధ్యాహరించుకొని వలెను. అతడు **అబ్దాత్**= సంవత్సరాధిదేవతకంటె ***(ఊర్ధ్వం)***= అనంతరము, **వాయుం అభిగచ్ఛేత్**= వాయుదేవతను సమీపించును. ఎందుకనగా ***(అవిశేషవిశేషాభ్యామ్)*** ***అవిశేష***= సామాన్యమగు దేవలోకశబ్దనిర్దేశమును బట్టియు, ***విశేషాభ్యామ్*** = ప్రత్యేకించి స్వవాచకమైన వాయుశబ్దమునుబట్టియు సంవత్సరానంతరము వాయుదేవ సన్నిధానమునకు చేరును.

సంగతి:- వేరువేరు క్రమములలో చెప్పబడిన అర్చిరాదిమార్గములన్నియు ఒకటే అని వెనుకటి అధికరణములో నిర్ణయించబడినది. ఇక వాటియొక్క క్రమమును - వరుసను-బట్టి ఆలోచించవలసిన స్థితి కలిగినది.

విషయము:- వాయు దేవలోకశబ్దమును గురించినది.

ఇచ్చట సంశయమును చెప్పుటకు పూర్వము విషయమును శోధించుచున్నారు. బ్రహ్మవేత్తలు అర్చిరాదిమార్గములో పోవుచున్నారని చెప్పబడినది. అర్చిరాది మార్గములో పోవునపుడు ఛాందోగ్యములో "మాసేభ్యః సంవత్సరం, సంవత్సరాత్ ఆదిత్యమ్" అని మాసమునకును ఆదిత్యునికిని మధ్య సంవత్సరం చెప్పబడింది. బృహదారణ్యకంలో 'మాసేభ్యః దేవలోకం, దేవలోకాత్ ఆదిత్యమ్" అని మాసానికీ, ఆదిత్యుడికీ మధ్య దేవలోకం చెప్పబడింది. రెండుచోట్లాకూడా చెప్పబడిన అర్చిరాదిమార్గం ఒకటే గనుక సంవత్సరాన్నీ, దేవలోకాన్నీ రెండుచోట్లా చేర్చుకొనాలి. రెండు శ్రుతుల్లోనూ "మాసేభ్యః సంవత్సరం"(మాసంనుండి సంవత్సరము), 'మాసేభ్యః దేవలోకం" -(మాసంనుండి దేవలోకము) అని పంచమీవిభక్తితో శ్రుతి క్రమం సమంగా ఉన్నప్పటికీ, అర్చిస్సునుండి అహస్-పగలు, పగలునుండి ఆపూర్యమాణ-శుక్ల-పక్షము, శుక్లపక్షమునుండి ఉత్తరదిక్కునున్న సూర్యుడు ఉదయించే మాసాలు-

*వాజసనేయినః 'యదా వై పురుషోఽస్మాల్లోకాత్ప్రైతి స వాయుమాగచ్ఛతి తస్మై స తత్ర విజిహీతే యథా రథచక్రస్య ఖమ్। తేన స ఊర్ధ్వమాక్రమతే స ఆదిత్యమాగచ్ఛతి'(బృ.7-10-1) ఇత్యాదిత్యా త్పూర్వం వాయు మధీయతే । కౌషీతకినస్తు 'స ఏతం దేవయానం పన్థానమాపద్యాగ్నిలోకమాగచ్ఛతి స వాయులోకమ్' (కౌ.1-3) ఇత్యగ్నిలోక శబ్దనిర్దిష్టాదర్చిషః పరం వాయుమధీయతే। తత్ర కౌషీతకినాం పాఠక్రమేణార్చిషః పరత్వేన ప్రాప్తస్య వాయోర్వాజసనేయినాం 'తేన స ఊర్ధ్వమాక్రమతే స ఆదిత్య మాగచ్ఛతి' ఇత్యూర్ధ్వశబ్దనిర్దిష్టశ్రౌతక్రమేణపాఠక్రమాద్బలీయసా ఆదిత్యాత్పూర్వం ప్రవేశో నిశ్చీయతే। అత ఆదిత్యాత్పూర్వం సంవత్సరాదూర్ధ్వం దేవలోకోవాయుశ్చ ప్రాప్తౌ।*

ఉత్తరాయణం అని అధికకాలాన్ని తక్కువకాలానికి ముందు చెప్పియుండటంచేత మాసాల తరువాత సంవత్సరమే-వర్షమే- బుద్ధిలో వస్తుంది గనుక, సంవత్సరాన్ని మాసానికి తరువాత చేర్చుకొనవలెను. ఆ తరువాత దేవలోకాన్ని చేర్చవలెను అని నిశ్చయించబడుతున్నది. బృహదారణ్యకంలో మరొకచోట "'యదా వై పురుషోఽస్మాత్ లోకాత్ ప్రైతి స వాయు మాగచ్ఛతి తస్మై స తత్రవిజిహీతే, యథా రథచక్రస్య ఖం తేన స ఊర్ధ్వమాక్రమతే, స ఆదిత్యమాగచ్ఛతి' (బృహ. 7-10-1) (ఈబ్రహ్మజ్ఞాని ఈలోకంనించి బయలుదేరుతున్నప్పుడు వాయువుని పొందుతున్నాడు. వాయువు రథచక్రంలో ఉన్న ఒకద్వారాన్ని ఇతడువెళ్ళడంకోసం తనవద్ద కల్పించుకుంటోంది. దానిమూలంగా ఇతడు మీదికి వెళ్ళి ఆదిత్యుడిని పొందుతున్నాడు) అని ఆదిత్యుడికి ముందు వాయువుని చెప్పియున్నది. కౌషీతకిలో 'స ఏతం దేవయానం పన్థానమాపద్య అగ్నిలోకమాగచ్ఛతి స వాయులోకం' (కౌషీ. 1-3) అని అగ్నిలోకం అని చెప్పబడే అర్చిస్సుకి మీదని వాయులోకం చెప్పబడుతోంది. కౌషీతకిశ్రుతిప్రకారం -పాఠక్రమేణ అర్చిస్సుకి మీద ప్రాప్తమైన వాయువుకి, బృహదారణ్యకంలో "తేన స ఊర్ధ్వం ఆక్రమతే స ఆదిత్యమాగచ్ఛతి" అని ఊర్ధ్వశబ్దంతో చెప్పబడిన శ్రౌతక్రమేణ శ్రుతిక్రమాన్ని అనుసరించి ఆదిత్యుడికి ముందర వాయువుని చేర్చవలె, పాఠక్రమంకంటే శ్రుతిక్రమం బలీయసం గనుక.

అయ్యా, స అగ్నిలోకమాగచ్ఛతి స వాయులోకం అన్న క్రమం చెప్పబడటంకూడా శ్రుతిలోనే. వాజసనేయంకూడా శ్రుతియే. ఈ రెండింట్లోనూ క్రమం చెప్పబడినప్పుడు ఒకదాన్ని శ్రుతిక్రమం అని చెప్పి, దాన్ని బలీయసమని ఎట్లుచెప్పగలరు? అని సందేహంరావచ్చు. దానికి సమాధానం చెప్తున్నాం వినండి- కౌషీతక్యుపనిషత్తు "అతడు అగ్నిలోకానికి వచ్చుచున్నాడు, వాయులోకమునకు వచ్చుచున్నాడు, వరుణలోకమునకు, ఇంద్రలోకమునకు, ప్రజాపతిలోకమునకు వచ్చుచున్నాడు అని సామాన్యముగా చెప్పినది. దీనితరువాత ఫలానాలోకానికి వెళ్లుచున్నాడనేక్రమం అందులో చెప్పబడలేదు. బృహ-దారణ్యకంలో "విద్వాన్ వాయులోకానికి వచ్చుచున్నాడు. వాయువుయొక్క రంధ్రం ద్వారా మీదికి పోయి, ఆదిత్యుడిని పొందుతున్నాడు" అని ఊర్ధ్వశబ్దంచేత క్రమం చెప్పబడింది గనుక పాఠక్రమంకంటె శ్రౌతక్రమం బలీయసం అనబడుతున్నది. అంటే, కేవలం వరుసగా చెప్పబడటంకంటె, దీని తరువాత ఇది అని శ్రుతిలోనే చెప్పబడిన క్రమం బలమైనదని తాత్పర్యం. కనుక ఆదిత్యుడికి ముందు, సంవత్సరానికి తరువాత, దేవలోకం, వాయువు, రెండూ చేర్చబడ్డాయి. ఈ విషయాన్ని గురించి విచారించబడుతున్నది.

*తత్రేదం చిన్త్యతే। కిం దేవలోకో వాయుశ్చ అర్థాన్తరభూతౌ యథేష్టక్రమేణ విద్వానభిగచ్ఛేత్? ఉతానర్థాన్తరత్వేన సంవత్సరాదూర్ధ్వం దేవలోకం సన్తం వాయుమభిగచ్ఛేదితి। కిం యుక్తమ్? భిన్నార్థత్వం ప్రసిద్ధేః। భిన్నార్థత్వే చోర్ధ్వశబ్దేన పఞ్చమ్యా చోభయోః సంవత్సరాదిత్యాన్తరాలే శ్రుతిక్రమేణ ప్రాప్తత్వా ద్విశేషాభావాచ్చ యథేష్టమ్ -*

*ఇతి ప్రాప్తే ఉచ్యతే - వాయుమబ్దాత్-ఇతి। వాయుం సంవత్సరాదూర్ధ్వమభిగచ్ఛేత్। కుతః? అవిశేషవిశేషాభ్యాం వాయోరేవ నిర్దిష్టత్వాత్। దేవలోకశబ్దో హ్యవిశేషేణ సామాన్యేన దేవానాం లోక ఇత్యనేన రూపేణ వాయుమభిధత్తే। 'స వాయుమాగచ్ఛతి తస్మై స తత్ర' ఇతి వాయుశబ్దో విశేషేణ వాయుమభిధత్తే। అతో దేవలోకవాయుశబ్దాభ్యాం అవిశేషవిశేషాభ్యాం వాయురేవాభిధీయత ఇతి సంవత్సరాదూర్ధ్వం వాయుమేవాభిగచ్ఛేత్। కౌషీతకినాం వాయులోకశబ్దశ్చాగ్నిలోకశబ్దవత్ వాయుశ్చాసౌ లోకశ్చేతి వ్యుత్పత్త్యా వాయుమేవాభిధత్తే। వాయుశ్చ దేవానామావాసభూత ఇత్యన్యత్ర శ్రూయతే 'యోఽయం పవత ఏష(ఏవ) దేవానాం గృహాః(జై.ఉపని.బ్రా.3-1) ఇతి॥ 2॥*

*॥ ఇతి వాయ్వధికరణమ్ ॥ 2 ॥*

---

**సంశయము:–** దేవలోకమూ, వాయువూ వేరువేరా? లేక రెండూ ఒక్కటేనా? వేరువేరైతే వారివారి ఇష్టప్రకారం పోవుచున్నారని చెప్పవచ్చు. రెండూ ఒకటే అంటే సంవత్సరం తరువాత దేవలోకం అనబడే వాయువుని పొందుతున్నాడని చెప్పాలి. ఈ రెండు పక్షాల్లోనూ ఏది యుక్తము?

**సంశయము వచ్చుటకు కారణము:–** దేవలోక, వాయు, శబ్దాలకు రూఢితో అర్థం చెప్పుకుంటే దేవతలయొక్క లోకాన్ని అని, వాయువు అని, వికల్పంగా చెప్పవలెను. వాయువుని దేవతల గృహంగా శ్రుతి చెప్పటంచేత దేవానాం లోకః దేవలోకః అని తత్పురుషసమానం చెప్పితే దేవలోకశబ్దం వాయువునే చెప్తుతుంది. ఈపక్షాల్లో ఏపక్షం యుక్తమో నిర్ణయించలేనివాడికి సంశయం కలుగుతుంది.

**పూర్వపక్షము:–** దేవలోకమూ, వాయువూ రూఢితో భిన్నార్థములు గనుక ఈ రెండూ వేరు వేరే. అందుచేత ఊర్ధ్వశబ్దంచేతనూ పంచమీవిభక్తిచేతనూ (మాసేభ్యః దేవలోకం) సంవత్సరానికి ఆదిత్యునికి మధ్యని శ్రుతిక్రమంచేత దేవలోకమూ, వాయువు రెండూ ప్రాప్తములు. ఈ విషయంలో విశేషప్రమాణంగాని యుక్తిగాని లేవు గనుక వారివారి ఇష్టప్రకారము వాయు, దేవలోకాలలో ఏదో ఒకదాన్ని పొందుతారు అని చెప్పవలెను.

**సిద్ధాంతము:–** వాయుం–వాయువును సంవత్సరానికి మీద పొందదగును. ఎందుచేతంటే, అవిశేషవిశేషాభ్యాం– సామాన్యంగానూ, ముఖ్యంగానూ చెప్పి, వాయువునే నిర్దేశించియున్నందున– చెప్పినందువలన దేవలోకశబ్దం, అవిశేషేణ–సామాన్యముగా – దేవానాం లోకః అని వ్యుత్పత్తిచేత వాయువుని చెప్తుతున్నది. "స వాయుమాగచ్ఛతి తస్మై స తత్ర" అని వాయుశబ్దాన్ని విశేషంగా –అంటే ముఖ్యమైనదిగా వాయువుని చెప్తుతున్నది. కనుక సామాన్యంగానూ సూచించి, వాయువే చెప్పబడటంచేత సంవత్సరానికి తరువాత వాయువే పొందబడవలసినది. "వాయులోకమాగచ్ఛతి" అన్న కౌషీతకిశ్రుతిలో చెప్పబడినందుకు "వాయుశ్చాసౌ లోకశ్చ" అని వ్యుత్పత్తిచేత కర్మధారయసమాసంతో నిషాదస్థపతిన్యాయంచేత "వాయువనే లోకము" అని వాయువునే చెప్తున్నది. "వాయుశ్చ దేవానాం ఆవాసభూతః"( వాయువు దేవతలకు వాసస్థానము) అనియు "యో అయం పవతే ఏష దేవానాం గృహాః" అనియు శ్రుతి చెప్పుతున్నది.

వాయ్వధికరణము ముగిసినది.

## వరుణాధికరణమ్ (4-3-3 )

**॥ సి. సూ ॥ తటితోऽధివరుణః సమ్బన్ధాత్ ॥ 4-3-3 ॥**

*కౌషీతకినాం 'స ఏతం దేవయానం పన్థానమాపద్యాగ్నిలోక మాగచ్ఛతి స వాయులోకం స వరుణలోకం స ఆదిత్యలోకం స ఇన్ద్రలోకం స ప్రజాపతిలోకం స బ్రహ్మలోకమ్'(కౌ-1-3) ఇత్యత్రాగ్నిలోకశబ్దస్యార్చిః పర్యాయత్వేన ప్రాథమ్యమవిగీతమ్ । వాయోశ్చ సంవత్సరాదూర్ధ్వం నివేశ ఉక్తః ॥ ఆదిత్యస్యాప్యత్ర ప్రాప్తపాఠక్రమబాధేన 'దేవలోకాదాదిత్యమాదిత్యా ద్వైద్యుతమ్ (బృ.8-2-15) ఇతి వాజసనేయకోక్తశ్రుతిక్రమాద్దేవలోక శబ్దాభిహితా ద్వాయోరుపరి నివేశః సిద్ధః । ఇదానీం వరుణేన్ద్రాదిషు చిన్తా । కిమేతే వరుణాదయో యథాపాఠం వాయోరూర్ధ్వం నివేశయితవ్యాః? ఆహోస్విద్విద్యుతో*

---

## వరుణాధికరణము (4-3-3 )

**॥ సి. సూ ॥ తటితోऽధివరుణస్సమ్బన్ధాత్ ॥ 4-3-3 ॥**

**సూత్రార్థము:-** **తటితః** = విద్యుల్లోకమునకంటె, **అధి**= తరువాతనే, **వరుణః**= వరుణుడు ఉండవలెను. **సమ్బన్ధాత్**= తటిత్తునకు జలదేవతయైన వరుణునకు సన్నిహితసంబంధమున్నందున తటిత్తునకు తరువాత వరుణునే చేర్చవలెను అని సూత్రార్థము.

**సంగతి:-** ఈ అధికరణంలోకూడా ఆతివాహికక్రమవిశేషచిన్తయే చెయ్యబడుతున్నది

**విషయము:-** వరుణాదినివేశనక్రమమును గురించినది.

ఇక్కడకూడా విషయాన్ని గురించిన శోధనమును మొదట చేస్తున్నారు. కౌషీతక్యుపనిషత్తులో 'స ఏతం దేవయానం పన్థానం ఆపద్య అగ్నిలోకమాగచ్ఛతి, స వాయులోకం, స వరుణలోకం, స ఆదిత్యలోకం, స ఇన్ద్రలోకం, స ప్రజాపతిలోకం, స బ్రహ్మలోకం' (ఆ ముక్తాత్మ అర్చిరాదిగతిలో అగ్నిలోకాన్నీ, వాయులోకాన్నీ, వరుణ లోకాన్నీ, ఆదిత్యలోకాన్నీ, ఇంద్రలోకాన్నీ, బ్రహ్మ(ప్రజాపతి) లోకాన్నీ, బ్రహ్మలోకాన్నీ పొందుతున్నాడు) అని చెప్పబడిఉన్నది. అందులో అర్చిస్ పర్యాయమైన అగ్నిలోక శబ్దాన్ని మొదట చెప్పియుండటాన్ని గురించి వివాదం లేదు. సంవత్సరానికి తరువాత వాయువు చెప్పబడుతున్నాడు అనే విషయంలోనూ వివాదం లేదు. ఈ కౌషీతకీశ్రుతిలో వాయువు తరువాత వరుణుడు, వరుణుడు తరువాత ఆదిత్యుడు అని చెప్పబడింది. కాని పాఠక్రమాన్ని బాధించి దేవలోకాత్ ఆదిత్యం, ఆదిత్యాత్ వైద్యుతమ్" అని వాజసనేయకశ్రుతిలో చెప్పబడిన(శ్రౌత)క్రమంప్రకారం (పాఠక్రమం కంటే శ్రుతిక్రమం బలీయసంగనుక)దేవలోకశబ్దంచేత చెప్పబడుతున్న వాయువు తరువాత ఆదిత్యుడిని చెప్పవలెను అని సిద్ధిస్తున్నది- స్వరసంగా వస్తున్నది.

ఈ విషయంలో వేరు విధంగా ఆక్షేపించి సమాధానం సాదిస్తున్నారు- "ఇదానీం వరుణేంద్రాదిషు చిన్తా" అని.

**సంశయము:-** వరుణాదులను ఈ ఉపనిషత్తులో చెప్పబడిన క్రమప్రకారం వాయువు తరువాత నివేశనం చెయ్యవలెనా? లేక విద్యుత్తుకు తరువాత చెయ్యవలెనా?

ऽధీతి విశయే అర్చిః ప్రభృతి సర్వేషు 'అర్చిషోऽహః' ఇత్యాది శ్రుతిక్రమోపరోధా ద్విద్యుతః పరస్తాచ్చ, 'తత్పురుషోऽమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి' ఇతి విద్యుత్పురుషస్య బ్రహ్మగమయితృత్వ శ్రవణాచ్చ సర్వత్రావకాశాభావేనాప్రాప్తౌ చోపదేశావైయర్థ్యాయావశ్యం కస్యచిద్బాధ్యత్వే పాఠక్రమానురోధేన వాయోరనన్తరం వరుణో నివేశయితవ్యః । వాయ్వాదిత్యయోః క్రమస్య బాధితత్వేన ఇన్ద్రప్రజాపతీ అపి హ్యత్రైవ నివేశయితవ్యౌ- ఇతి ప్రాప్తే ఉచ్యతే- తటితోऽధి వరుణః- ఇతి। వరుణస్తావద్విద్యుత ఉపరిష్టాన్నివేశయితవ్యః। కుతః సమ్బన్ధాత్ - మేఘోదరవర్తిత్వాద్విద్యుతో వరుణేన సమ్బన్ధో లోకవేదయోః ప్రసిద్ధః । ఏతదుక్తం భవతి- వరుణాదీనాముపదేశావైయర్థ్యాయ క్వచిన్నివేశయితవ్యత్వే సతి పాఠక్రమాదర్థక్రమస్య బలీయస్త్వాద్విద్యుతోऽధివరుణో నివేశయితవ్యః । తతశ్చామానవస్య గమయితృత్వం వ్యవధానసహమిత్యవ గమ్యతే । తస్య చ వ్యవధానసహత్వా

---

**సంశయము వచ్చుటకు కారణము:**- పాఠక్రమంప్రకారం వాయువుతరువాత ఆదిత్యుడికి ముందు వరుణుడిని చెప్పవలెను అని తోస్తున్నది. బృహదారణ్యకంలో చెప్పిన శ్రుతిక్రమంప్రకారం (పాఠక్రమంకంటె బలీయసమైన శ్రౌతక్రమంప్రకారం) వాయువుకు తరువాత ఆదిత్యుడినే చెప్పవలెను అని కనబడుతున్నది. ఈ పక్షాల్లో ఏ పక్షం యుక్తియుక్తమైనది అని నిర్ణయించ సాధ్యంకానివాడికి సంశయం కలుగుతున్నది.

**పూర్వపక్షము:**- అర్చిస్ ఆరంభించి విద్యుత్పురుషుడివరకూ అర్చిరాదిమార్గం క్రమం చెప్పబడియున్నదికనుకనూ, విద్యుత్పురుషుడికి తరువాత "తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి" (విద్యుత్పురుషుడు బ్రహ్మవేత్తను తీసుకొని వెళ్ళుచున్నాడు) అని చెప్పబడియుండటం చేతనున్నూ వరుణాదులకు ఎక్కడా అవకాశం లేకపోతున్నది. దానివలన కౌషీతకిలో చెప్పినది వ్యర్థమై పోతుంది. కనుక వాజసనేయంలో చెప్పబడిన శ్రుతిక్రమాన్ని ఎక్కడో ఒకచోట బాధించి వరుణాదులని చేర్చవలెను. క్రమిబాధకంటెను క్రమబాధం న్యాయం. అంటే వరుణాదులకి మొదటే ప్రవేశం లేదు అని చెప్పటంకంటె శ్రౌతక్రమాన్ని బాధించి ఒకచోట చేర్చటమే న్యాయం అని తాత్పర్యం. కనుక పాఠక్రమాన్ని అనుసరించి వాయువుకు తరువాత వరుణుడిని చేర్చవలెను. ఇంద్రప్రజాపతినికూడా మరొకచోట చేర్చటంవలన రెండుచోట్లను క్రమభంగాన్ని చెయ్యవలసివస్తుంది గనుక వరుణుడికి తరువాత ఇంద్రప్రజాపతినికూడా చేర్చవలెను.

**సిద్ధాంతము:**- తటితోధి వరుణః- వరుణుడు విద్యుత్తుకుమీదను తరువాత నివేశనం మేఘంలో ఉన్నది గనుక ఇద్దరికీ సంబంధమున్నది. ఇది లోక,వేదప్రసిద్ధమైన విషయం. కనుక విద్యుత్తుతో వరుణుడిని చేర్చి చెప్పవలెను. వాజసనేయశ్రుతి క్రమంప్రకారం వాయువు, ఆదిత్యుడు, చంద్రుడు, చంద్రుడి తరువాత విద్యుత్పురుషుడు. విద్యుత్తు తరువాత వరుణుడని చేర్చవలెను.

(విద్యుత్తు, వరుణాభిమానవిషయమైన జలము- ఈ రెండును మేఘంలో ఉన్నవి వాటిలో మెరుపు మేఘంలో ఉన్నదని బాగా తెలుసును జలములు ఆవిధంగా తెలియదు. కనుక జలమనేది విద్యుత్తుకి మీదిపక్కని(ఉపరిభాగం) ఉన్నదని తెలుస్తున్నది. ఈవిధంగా అభిమానవిషయాలకి సంబంధం

*ద్రిన్ద్రాదేశ్చోపదిష్టస్య అవశ్యనివేశయితవ్యస్య వరుణాదుపర్యుపదిష్టత్వాదాగన్తూనామన్తే నివేశయితవ్యత్వాచ్చ వరుణాదుపరీన్ద్రాది ర్నివేశయితవ్య ఇతి ॥ 3 ॥*

*॥ ఇతి వరుణాధికరణమ్ ॥ 3 ॥*

చెప్పినదానికి తగినట్లు అభిమానిదేవతలకీ, సంబంధం న్యాయమేనని తటిదభిమానిదేవతకి తరువాత జలాభిమాని దేవతయైన వరుణుడిని నివేశనం చెయ్యవలెను)

తటిత్తుకి, వరుణుడికి సంబంధం ఉండవచ్చు. దానివలన పాఠక్రమాన్ని బాధించి ఎలా తటిత్తుకి తరువాత వరుణుడిని నివేశనం చెయ్యబడింది? దేనివలన ఇంద్రప్రజాపతులని వరుణుడితో చేర్చటం జరిగింది? అనే శంకకి సమాధానం సాదిస్తున్నారు – ఏతదుక్తం భవతి అనటంతో. వరుణాదులను చెప్పటం అనేది వ్యర్థం కాకుండా ఉండటానికి ఒకచోట చేర్చవలసినది గనుక పాఠక్రమంకంటె అర్థక్రమం బలీయసం గనుక విద్యుత్తుకి మీదని వరుణుడు నివేశించబడాలి. అలా అయితే "తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మగమయతి" అని శ్రుతి చెప్పి ఉండటంచేత విద్యుత్పురుషుడు సాక్షాత్తుగా బ్రహ్మమువద్దకు తీసుకొని వెళ్ళలేక వ్యవధానం కలుగుతున్నదే అన వచ్చును. ఈ ఆలస్యాన్ని సహించవలసినదే. ఒక విరామాన్ని ఒప్పుకొని తీరవలసిది గనుక ఇంద్రప్రజాపతినికూడా చేర్చుకొనవలెను. వారిని ఎచ్చట చేర్చుకొనటం అంటే "ఆగన్తూనాం అన్తే నివేశః" ఆగంతకులను చివరన కూర్చొనబెట్టవలెను అనే న్యాయంప్రకారం ఇంద్రప్రజాపతులను వరుణుడికి తరువాత చేర్చవలెను.

### ప్రశ్న సమాధానం–

ప్రశ్న– విద్యుత్పురుషుడు బ్రహ్మమువద్దకు తీసుకొని వెళ్ళుచున్నాడు అని శ్రుతి చెప్పటంచేత తటిత్తుకు ముందు వరుణుని చెప్పి, వరుణుడు తరువాత తటిత్తుని చెప్పవచ్చా? దీనివలన తటిత్తుకీ, వరుణుడికీ ఉన్నసంబంధానికి బాధకం లేదు. విద్యుత్పురుషుడు సాక్షాత్తుగా బ్రహ్మమువద్దకు తీసుకొని వెళ్ళుటకు బాధకము లేదు. వ్యవధానాన్ని సహించియుండాలి అనేమీ లేదుగదా!

సమాధానం:– వరుణుడిని తటిత్తుకి ముందు చేర్చినచో పాఠక్రమాన్ని అనుసరించి ఇంద్రప్రజాపతులను వరుణుడికి తరువాత చేర్చవలసివస్తుంది. అప్పుడు వరుణుడికీ తటిత్తుకీ సంబంధంలేకపోతుంది. దానివలన తటిత్తుకి తరువాత ఇంద్రప్రజాపతులని చేరిస్తే పాఠక్రమానికి భంగం వస్తుంది గనుక పాఠక్రమానికి భంగంరాకుండా ఉండే పద్ధతిలో అర్థక్రమాన్ని చెప్పాలి. కనుక, తటిత్తుకి తరువాతనే వరుణుడిని చేర్చవలెను. ఏవిధంగానూ పాఠక్రమాన్ని బాధించకూడదు. తటిత్పురుషుడు వ్యవధానంలేకుండా పిలిచి తీసుకొని వెళ్ళుతాడు అని స్పష్టంగా చెప్పలేదుగనుక, వ్యవధానాన్ని అంగీకరించటంలో ఏవిధమైన బాధకము లేదు. ఈ క్రమం ఆచార్యులచేత అంగీకరించ బడినదే. ఇపుడు ఇచట ఈ మూడునాలుగు అధికరణములలో నిర్ణయించబడిన అర్చిరాదిమార్గక్రమమునే పూర్వాచార్యులైన నడాదూర్ అమ్మాళ్ తమ తత్త్వసారమనే గ్రంథంలో ఈ క్రిందిశ్లోకమున నిర్దేశించిరి.

శ్లో. **అర్చిరహస్సితపక్షాన్ ఉదగయనాబ్ద మరుదర్కేన్దూన్ ।
అపి వైద్యుతవరుణేన్ద్రప్రజాపతీన్ ఆతివాహికాన్ ఆహుః॥**

ప్రశ్న– ఛాందోగ్యోపనిషత్తులో "విద్యుతం తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి" అని అమానవపురుషుడు బ్రహ్మమువద్దకు పిలచి తీసుకొని వెళ్ళునని చెప్పబడియున్నది. బృహదారణ్యకములో వైద్యుతాత్ పురుషో మానసః స ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి' అని మానసపురుషుడు బ్రహ్మలోకమునకు తీసికొని వెళ్ళుచున్నాడని చెప్పబడియున్నది. విద్యుత్పురుషుడు తీసికొని వెళ్ళుచున్నాడు అని చెప్పుచున్నాము. వీరు వేరువేరు పురుషులా లేక ముగ్గురును ఒకరేనా?

సమాధానము– అర్చిరాదులు పన్నెండుమందికి పైగా మానసునియో అమానవునియో చేర్చలేదుగనుకను, పన్నెండుమందిలో విద్యుత్పురుషుడు చేర్చబడినందునను విద్యుత్పురుషునికే మానసుడు, అమానవుడు అని నామాంతరములు. కనుక ముగ్గురును ఒకరే. అందుచేతనే సూత్రకారులు "వైద్యుతేనైవ తతః తచ్ఛ్రుతేః అని విద్యుత్పురుషుడే తీసుకొని వెళ్ళుచున్నాడని సాదించియున్నారు.

"తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి" అను వాక్యమునకు 'విద్యుత్పురుషస్య గమయితృత్వశ్రుతేః' అని అర్థమును శ్రీభాష్యకారులు ప్రసాదించియున్నారు. శ్రీదేశికులు

యత్తు అస్యామానవస్యశ్రుతమిహ పరసంప్రాపకత్వం భవేత్తత్
సద్వారత్వే అపి అబాధం తదపి సహకృతౌ త్రైశ్రుతౌచిత్యభూమా ।
యచ్ఛోక్తో మానసాఖ్యస్తటిత ఉపరి తు బ్రహ్మలోకాప్తిహేతుః
తస్మిన్నేతా స నాన్యో విదురితి వహనం వైద్యుతేనైవ తస్మాత్ ॥

అని అధికరణసారావళి 505వ శ్లోకములో సాదించియున్నారు.

తరువాతి వ్యాఖ్యాతలందరును విద్యుత్పురుషునికే అమానవుడు, మానసుడు అని వేరు పేరు అని సాదించియున్నారు. వారిని వేరువేరు ఆతివాహికులుగా భావించనవసరములేదు.

వరుణాధికరణము ముగిసినది.

## ఆతివాహికాధికరణమ్ (4-3-4 )

### ॥ సి. సూ॥ ఆతివాహికాస్తల్లిఙ్గాత్ ॥ 4-3-4 ॥

ఇదమిదానీం చిన్త్యతే- 'కిమర్చిరాదయో మార్గచిహ్నభూతాః, ఉత భోగభూమయః, అథవా విదుషాం బ్రహ్మప్రేప్సతామతివోఢారః ఇతి। కిం తావత్ యుక్తమ్? మార్గచిహ్నభూతా ఇతి। కుతః? ఉపదేశస్య తథావిధత్వాత్। దృశ్యతే హి లోకే గ్రామాదీన్ప్రతి గన్తౄణాం ఏవం విధో దేశికై రుపదేశః- 'ఇతో నిష్క్రమ్యాముకంవృక్ష మముకాం నదీమముకం చ పర్వత పార్శ్వంగత్వా అముకం గ్రామం

---

## ఆతివాహికాధికరణము (4-3-4 )

### ॥ సి. సూ ॥ ఆతివాహికా స్తల్లిఙ్గాత్ ॥ 4-3-4 ॥

సూత్రార్థము: **ఆతివాహికాః** = ముముక్షువులయొక్క ప్రయాణ మార్గమునందు ఉపనిషత్తులలో చెప్పబడిన అర్చిరాదిశబ్దములు ఇతనిని ఆయా ఊర్ధ్వలోకములకు చేర్చు తత్తల్లోకదేవతావాచకములే, **తల్లిఙ్గాత్** = ఆతివాహికత్వము అను సంబంధము అమానవపురుషునివలె వీరందరికిని అన్వయించు చిహ్నము గనుక.

సంగతి:- వెనుక చెప్పబడిన అర్చిరాదిస్వరూపమును తెలిసికొనవలసిన అవసరము కలిగినది గనుక ఈ అధికరణము చెప్పబడుచున్నది.

విషయము:- అర్చిరాదులను గురించినది

సంశయము:- ఈ అర్చిరాదులు మార్గచిహ్నభూతులా- దారిగుర్తులా? లేక భోగమును అనుభవించదగిన ప్రదేశములా? లేక బ్రహ్మమును పొందుటకు పోవు విద్వాంసులను వహించు వారా?-పిలచి తీసికొనిపోవు ఆతివాహికులా? వీటిలో ఏది యుక్తమైనది?

సంశయము వచ్చుటకు కారణము:- "అర్చిస్సునుండి పగటిని పొందుచున్నాడు, అచ్చటి నుండి శుక్లపక్షమును పొందుచున్నాడు" అని చెప్పబడియున్నది గనుక, లోకములో "ఇచ్చటినుండి అచ్చటికి పొమ్ము, అచ్చటినుండి..." అని గుర్తులను చూపునట్లున్నందున మార్గచిహ్నములు అని చెప్పవచ్చుననునట్లు కనబడుచున్నది. అగ్నిలోకము, వాయులోకము, ఇత్యాదిగా చెప్పబడుటచేత భోగభూములు అనవలెననునట్లును తోచుచున్నది. "బ్రహ్మగమయతి" అని చెప్పుటచేత వీరు ఆతివాహిక పురుషులు అనవచ్చుననియు తోచుచున్నది. ఈ పక్షములలో ఏది యుక్తమైన పక్షమో నిశ్చయించలేక సంశయము కలుగుచున్నది.

పూర్వపక్షము:- మార్గచిహ్నభూతమే. ఎందుచేతననగా, అర్చిస్సునుండి అహస్, అహస్సు నుండి శుక్లపక్షము, అని ఉపదేశించియుండుటను గమనించినచో తాను పోవు ఊరికి మార్గమును తెలియనివానికి ఆ మార్గమును గురించి బాగుగా తెలిసినవాడు "ఇచ్చటినుండి బయలుదేరి పోయి

*గచ్ఛ ఇతి । అథవా భోగభూమయ ఏతా స్యుః, కాలవిశేషతయా ప్రసిద్ధానామహరాదీనాం మార్గచిహ్నత్వానుపపత్తేః। అన్యస్య చ మార్గచిహ్నభూతస్య ఏతేషా మనభిధాయకత్వాత్। భోగభూమిత్వం చ 'ఏత ఏవలోకాః యదహోరాత్రాణ్యర్ధమాసా మాసా ఋతవః సంవత్సరాః' ఇత్యహరాదీనాం లోకత్వవచనాదుపపద్యతే। అత ఏవ చ కౌషీతకినః 'అగ్నిలోక మాగచ్ఛతి' (కౌషీతకి- 1-3)ఇత్యాదినా లోకశబ్దానువిధానేనార్చిరాదీన్ పఠన్తి।*

*ఏవం ప్రాప్తే బ్రూమః-ఆతివాహికాః-ఇతి । విదుషామతివాహే పరమ పురుషేణ నియుక్తా ఆతివాహికా దేవతావిశేషా ఏతేఽర్చిరాదయః। కుతః? తల్లిఙ్గాత్- అతివహనలిఙ్గాత్। అతివహనం హి గన్తౄణాం గమయితృత్వమ్। గమయితృత్వం చ 'తత్పురుషోఽమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి' (ఛాం.5-10-2) ఇత్యుపసంహారే శ్రూయమాణం పూర్వేషామపి అవిశేషశ్రుతానాం సఏవ సమ్బన్ధ*

---

అదిగో కనబడుచున్నదే ఆ చెట్టున్నచోటకు పోవుము. అచ్చటినుండి వెళ్ళునప్పుడు ఒక నది వచ్చును దానిని దాటి వెళ్ళినచో అచ్చట ఒక పర్వతము కనబడును అచ్చటికి పోయినచో నీవు అడిగిన గ్రామము ఉన్నది" అని చెప్పునట్లే అర్చిరాదిగతిమార్గము చెప్పబడుటచే అర్చిరాదులు మార్గచిహ్నభూతములే. అథవా, కాలవిశేషముగా ప్రసిద్ధమైన పగలు, శుక్లపక్షము, మొదలైనవి మార్గచిహ్నములుగా చెప్పుట కుదరదుగదా! వరుణాదులను మార్గచిహ్నములుగా చెప్పుట కుదరదు. కనుక భోగభూములు అని చెప్పవచ్చును. వీటిని భోగభూములు అని ఎట్లు చెప్పవచ్చు అన్నచో, "ఏత ఏవ లోకాః యదహోరాత్రా-ణ్యర్ధమాసాః" (ఈ లోకములు అహోరాత్రశబ్దవాచ్యములు) అని అహరాదులనులోకములుగా చెప్పుటచే, భోగభూములనవచ్చును. దానిచేతనే కౌషీతకిలో "అగ్నిలోకమాగచ్ఛతి, వాయులోకం, వరుణలోకమ్" అని లోకశబ్దములతో చేర్చి అర్చిరాదులను చెప్పియున్నారు.

**సిద్ధాంతము:-** విద్వాంసులు(బ్రహ్మోపాసకులు) అతివహింపబడుటకు భగవానునిచేత నియమించబడినవారు - ఆతివాహికులు. ఈ అర్చిరాదులు దేవతావిశేషములు. ఎందుచేతననగా, తల్లిఙ్గాత్- అతివహనలిఙ్గాత్- అతివహించుచున్నవి అనగా, బ్రహ్మలోకమునకు పోవువారిని పిలచి తీసుకొనిపోవుట. గంతౄణాం గమయితృత్వమ్. అహరాది కాలములను వరుణాది దేవతలను భోగభూములని ఎప్పటికిని చెప్పుట కుదరదు. పైగా, "సందిగ్ధే తు వాక్యశేషాత్" (సందేహమున్నప్పుడు వాక్యశేషముతో అర్థమును నిర్ణయించవలెను) అను పూర్వమీమాంసాన్యాయము ప్రకారము ఇక్కడ "తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతీతి" వాక్యశేషములో పురుషశబ్దమును, గమయితృత్వమును చెప్పబడియున్నవి గనుక, ఆతివాహికులు అనియే చెప్పవలెను. అర్చిరాదులు పిలచి తీసికొని వెళ్ళుచున్నారు అని విశేషించి చెప్పలేదే అని సందేహింపనవసరము లేదు. "తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి" అని చివరలో చెప్పబడియుండుటచేత ఆ సంబంధము అర్చిరాదులకును ఉన్నది. కనుక, అర్చిరాదులును ఆతివాహికులే.

అర్చిరాదులను దేవతావిశేషములని ఎట్లు చెప్పవచ్చును? అంటే, అర్చిరాదిశబ్దములను అర్చిరభిమానిదేవతని చెప్పుచున్నది. "తం పృథివ్యబ్రవీత్", "ఆపో వా అకామయత", "అగ్నిర్వాగ్భూత్వా

*ఇతి గమయతి । వదన్తి చార్చిరాదయః శబ్దాః అర్చిరాద్యాత్మభూతా నభిమానిదేవతావిశేషాన్। 'తం పృథివ్యబ్రవీత్'(తై. సం.5-5-2-2) ఇతివత్॥4॥*

*యద్యేవం 'తత్పురుషోఽమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి' ఇతి వైద్యుతస్యైవ పురుషస్య బ్రహ్మగమయితృత్వశ్రుతేః, విద్యుతః పరేషాం వరుణాదీనాం కథమాతివాహికత్వేనాన్వయ ఇత్యత్రాహ*

***॥ సి. సూ ॥ వైద్యుతేనైవ తతస్తచ్ఛ్రుతేః ॥ 4-3-5 ॥***

*తతః-విద్యుత ఉపరి, వైద్యుతేన- అమానవేనైవాతివాహికేన విదుషామాబ్రహ్మప్రాప్తేః గమనమ్ । కుతః? తచ్ఛ్రుతేః ' స ఏనాన్ బ్రహ్మ గమయతి' (ఛాం. 4-15-5) ఇతి తస్యైవ గమయితృత్వశ్రుతేః ।*

---

ముఖం ప్రావిశత్", "ఆదిత్యః చక్షుర్భూత్వా అక్షిణీ ప్రావిశత్" అనే శ్రుతివాక్యాల్లో ఆయా అభిమానిదేవతలని చెప్పినట్లే ఇక్కడ కూడా అర్చిరాద్యభిమానిదేవతలని చెప్పుతున్నది.

అట్లైనచో, "తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి" అనుటచే విద్యుత్పురుషుని తరువాత చెప్పబడిన వరుణుడు ఇంద్రుడు ప్రజాపతులకు గమయితృత్వము- ఆతివాహికత్వేన అన్వయము ఎట్లు సంభవించును? అను ఆక్షేపమునకు సమాధానము సాదించుచున్నారు-

***॥ సి. సూ ॥ వైద్యుతేనైవ తతః తచ్ఛ్రుతేః ॥ 4-3-5 ॥***

**తతః**= విద్యుల్లోకము మీదను, **వైద్యుతేన ఏవ**= అమానవపురుషుడనబడు వైద్యుత(ఆతివాహిక) పురుషుడే బ్రహ్మప్రాప్తిపర్యంతము ముక్తపురుషునితో పోవుచున్నాడు. ఎందుకనగా - **తచ్ఛ్రుతేః**= 'స ఏనాన్ బ్రహ్మగమయతి' అతడికే గమయితృత్వమును (బ్రహ్మవద్దకు తీసుకొని వెళ్ళుట) శ్రుతివాక్యము చెప్పుచున్నది. అట్లైనచో ఆతివాహికసంబంధము ఎట్లు చెప్పబడుచున్నదన్నచో, వరుణాదులు వారివారి ఎల్లలవరకును అమానవునికి వత్తాసుగా నుండుటచే, ఆతివాహికులయందు వారును చేరిన వారగుచున్నారు.

ప్రశ్న-సమాధానములు

ప్రశ్న- "అమానవుడు అనబడు విద్యుత్పురుషుడు బ్రహ్మోపాసకులను బ్రహ్మమువద్దకు పిలచుకు పోవుచున్నాడు' అని చెప్పబడినది. అతడు నిత్యసూరిగానున్ననే శ్రీవైకుంఠలోకములో వేంచేసియుండు పరబ్రహ్మమువద్దకు తీసికొని వెళ్ళుట సాధ్యము అని తోచుచున్నది. ఇట్లు అతడు నిత్యసూరియా? లేక సుకృతకర్మల ఫలముగా అగ్ని, ఇంద్రుడు మొదలగు స్థానములను పొందిన అగ్ని, ఇంద్రుడు మొదలగు వారివలె అమానవుడును కర్మవశ్యుడై ఒక సుకృతవిశేషముచేత పరమాత్మవద్దకు తీసికొనిపోవు పదవిని పొందినవాడా? ఇట్లు అతడును కర్మవశ్యుడేనా?

సమాధానము- అమానవుడు బ్రహ్మోపాసకుని పరమాత్మవద్దకు తీసికొనిపోవుచున్నాడు. "స ఏనాన్ బ్రహ్మ గమయతి" అని చెప్పియుండుటచేత కర్మవశ్యులు పరమపదమునకు ఎప్పుడును పోవుట సాధ్యము కాదుగనుక అమానవుడుమాత్రము నిత్యసూరులలో ఒకనిగనే ఉండవలెను. నిత్యసూరియైన విద్యుత్పురుషునితో అర్చిరాదిదేవతలను చెప్పియుండుటచేత ఆ అగ్న్యాది విభూతులకు అధిదేవతలైన కొంతమంది నిత్యసూరులుగ ఇతరులనుకూడ చెప్పవచ్చునని కొంతమంది చెప్పుచున్నారు.

*వరుణాదయస్తు అనుగ్రాహకా ఇతి తేషామప్యాతివాహికత్వేనాన్వయో విద్యత ఏవ ॥ 5 ॥*

*॥ ఇతి ఆతివాహికాధికరణమ్ ॥ 4 ॥*

## *కార్యాధికరణమ్ (4-3-5 )*

*॥ పూ. సూ॥ కార్యం బాదరిరస్య గత్యుపపత్తేః ॥ 4-3-6 ॥*

*అర్చిరాదినైవ గచ్ఛతి విద్వాన్; అర్చిరాదిరమానవాన్తశ్చ గణ ఆతివాహికో విద్వాంసం బ్రహ్మ గమయతీత్యుక్తమ్ । ఇదమిదానీం చిన్త్యతే। కిమయం అర్చిరాదికో గణః కార్యం హిరణ్యగర్భ*

---

ఈ అర్చిరాది దేవతలందరును కర్మవిశేషములచే పదవిని పొందిన ప్రసిద్ధ అగ్న్యాది దేవతలనియు, అమానవుని నిత్యసూరులలో ఒకనిగను అంగీకరించి క్రిందివారిని కర్మవశ్యులనియు, వీరందరును అమానవుని వలె భగవన్నియుక్తులై అగ్న్యాది విభూతులకు అధిదేవతలైన కొంతమంది నిత్యసూరులనియు మతభేదములు ఉన్నవి' అని స్వామి దేశికులు పరమపదసోపానమందు సాదించియున్నారు.

ఆతివాహికాధికరణము ముగిసినది.

## కార్యాధికరణము (4-3-5 )

*॥ పూ. సూ ॥ కార్యం బాదరిః అస్య గత్యుపపత్తేః ॥ 4-3-6 ॥*

సూత్రార్థము:- **బాదరిః**= 'బాదరి' అనే ఆచార్యుడు, **కార్యం**= కార్యబ్రహ్మమైన బ్రహ్మను (ఉపాసించే వాడిని ఆతివాహికగణం పిలుచుకు పోవుచున్నది అని భావిస్తున్నారు), **అస్య** = ఈ బ్రహ్మని ఉపాసించేవాడికే **గత్యుపపత్తేః** = (తాను ప్రాప్యాన్ని పొందడానికి) గమనం (పోవటం) తగియుండడంవల్ల.

సంగతి:- వెనుకటి అధికరణములో విద్వాంసుడు అర్చిరాదిమార్గముద్వారానే పోవు చున్నాడు. అర్చిస్సు మొదలైన అమానవాన్తమైన ఆతివాహికగణం విద్వాంసుని బ్రహ్మమువద్దకు తీసుకొని పోవుచున్నదని చెప్పబడినది. వెనుకటి అధికరణములో గమయితనుతీసికొనిపోవువారిని గురించి విచారించ బడినది. ఇందులో గంత(పోవువాడు)నుగురించి విచారించబడుచున్నది. లేక, వెనుకటి అధికరణములో గతినిగురించి చెప్పబడినది. ఇందు గంతవ్యమును అనగా ప్రాప్యమును గురించి విచారించబడుచున్నది.

విషయము:- "తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి" అను శ్రుతివాక్యము.

సంశయము:- అర్చిరాది ఆతివాహికులు (బ్రహ్మమునకు) కార్యభూతుడైన హిరణ్యగర్భుని ఉపాసించువారినే పిలచుకొని తీసికొనిపోవుచున్నారా? లేక బ్రహ్మమును ఉపాసించువారినే పిలచుకొని తీసుకుపోవుచున్నారా? లేక బ్రహ్మమును ఉపాసించువారిని, ప్రకృతివియుక్తప్రత్యగాత్మను బ్రహ్మాత్మకముగా ఉపాసించువారినికూడ పిలచుకొని పోవుచున్నారా? అని త్రికోటికమైన - మూడు విధములైన సంశయము కలుగుచున్నది.

సంశయము వచ్చుటకు కారణము:- కారణబ్రహ్మమనునది సర్వవ్యాపియై అన్నిచోట్లను ఉండుటచేత ఆ అర్చిరాదిమార్గములో పోయి పొందవలసినప్రసక్తియే లేదు. కనుక కార్యబ్రహ్మమైన

*ముపాసీనాన్ నయతి, ఉత పరమేవ బ్రహ్మోపాసీనాన్, అథ పరంబ్రహ్మోపాసీనాన్ ప్రత్యగాత్మానం బ్రహ్మాత్మకతయోపాసీనాంశ్చేతి విశయే- కార్యముపాసీనానేవ గమయతీతి బాదరి రాచార్యో మన్యతే । కుతః? అస్య హిరణ్యగర్భముపాసీనస్యైవ గత్యుపపత్తేః । న హి పరిపూర్ణం సర్వజ్ఞం సర్వగతం*

---

హిరణ్యగర్భుని పొందుచున్నాడని , "స ఏనాన్ బ్రహ్మ గమయతి" అనువాక్యమునకు అర్థము చెప్పవలెననునట్లు తోచుచున్నది. బ్రహ్మము సర్వవ్యాపియైయున్నను, దేశవిశేషమునకు పోయిననే సర్వకర్మబన్ధనివృత్తి కలుగునని శాస్త్రము చెప్పుటచే, పరబ్రహ్మమును ఉపాసించువారినే ఆతివాహికులు పిలుచుకు తీసుకొని పోవుచున్నారని చెప్పవలెననియు తోచుచున్నది. "తత్ య ఇత్థం విదుః యే చ ఇమే అరణ్యే శ్రద్ధా తప ఇత్యుపాసతే తే అర్చిషమేవ అభిసంభవన్తి" అని చెప్పుటచే సద్విద్యాద్యుపాసననిష్ఠులైన బ్రహ్మోపాసకులను, పంచాగ్నివిద్యానిష్ఠులైన బ్రహ్మాత్మకమైన ప్రత్యగాత్మోపాసకులను అర్చిరాదిగణముపిలుచుకొని తీసుకొనిపోవుచున్నదని చెప్పవలెననియు తోచుచున్నది. వీటిలో ఏది యుక్తిమత్పక్షమో తెలియనివారికి సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:**- బాదరి అను ఆచార్యులు కార్యబ్రహ్మమైన హిరణ్యగర్భుని ఉపాసించువారినే ఆతివాహికులు పిలుచుకొని తీసుకొనిపోవుచున్నారని చెప్పుచున్నారు. బాదరి పక్షమును అయిదు సూత్రములలో చెప్పుచున్నారు. ఆ పూర్వపక్షసూత్రములు ఈ క్రిందనియ్యబడుచున్నది.-

(ప్రాప్తియనునది ఉపాసనాధీనముగనుక, గన్తవ్యదేశమందు వివాదము కలిగినది అన్నచో, తత్క్రతు- న్యాయముచే ఉపాస్యవిషయమందును వివాదము వచ్చుచున్నది. దానివలన "ఏనాన్ బ్రహ్మ గమయతి" అనుదానికి కార్యబ్రహ్మమును పొందించువారన్నచో కార్యబ్రహ్మమును ఉపాసించువారిని అని చెప్పవలసియున్నది. ఉపాస్తినయత్యోః కర్మ హిరణ్యగర్భః (శ్రుతప్రకాశిక) అందుచేతనే కార్యముపాసీనానేవ అని సాదించియున్నారు. గుణోపసంహారపాదమందు సత్యత్వాది గుణవిశిష్టుడైన నారాయణుడిని ఉపాస్యునిగా నిర్ణయించబడినది. ఆయనయే ప్రాప్యుడగుచున్నాడు. ఆయనను వదలి ఇచ్చట హిరణ్యగర్భుని ఉపాస్యునిగా నిర్ణయించబడినది. ఆయనయే ప్రాప్యుడగుచున్నాడు. ఆయనను వదలి, ఇచ్చట హిరణ్యగర్భుని ఉపాస్యునిగా ప్రాప్యునిగా ఎట్లు చెప్పుదురని అడుగవచ్చును. కారణపరబ్రహ్మము సర్వాన్తర్యామిగనుక అర్చిరాది మార్గంలో పోయి, ఆ పరమాత్మని పొందవలసినదేమీ లేదు. కనుక అన్నింటినీ, ఉపాస్యాన్నీ ప్రాప్యాన్నీ మార్చుకొనుచూ పోవలెనని పూర్వపక్షియొక్క అభిప్రాయము.)

హిరణ్యగర్భునిఉపాసించువానినే ఆతివాహికులు పిలచి తీసికొని పోవుటకు కారణమేమి? అన్నచో, అస్య- హిరణ్యగర్భుని ఉపాసించువారికే అర్చిరాది అనునది ఉపపన్నమగుచున్నది. పరిపూర్ణుడును సర్వజ్ఞుడును సర్వాత్మభూతుడును అయియున్న బ్రహ్మమును ఉపాసించువానికి ఆయనను పొందుటకు దేశాంతరగతియనునది ఉపపన్నము కాలేదు. అనగా పరబ్రహ్మము అన్నిస్థలములలోను ఉండునది గనుక ముక్తుడు అతడిని పొందుటకు వేరొక దేశమునకు పోవనవసరము లేదు. భగవానుడు సర్వవ్యాపియైనను దేశవిశేషమును పొందినవారినే ఆయన తెలిసికొనును, ఇతరులను అతడు తెలిసికొనుట లేదు అని చెప్పలేముగదా! ఆయన సర్వజ్ఞుడు గనుక ఎచ్చటనున్నను అందరిని బాగుగా తెలిసినవాడే. ఒక

*సర్వాత్మభూతం పరంబ్రహ్మోపాసీనస్య తత్ప్రాప్తయే దేశాన్తరగతిరుపపద్యతే ప్రాప్తత్వాదేవ । నిత్యప్రాప్తపరబ్రహ్మవిషయా విద్యానివృత్తిమాత్రమేవ హి పరవిద్యాకార్యమ్। కార్యంతు హిరణ్యగర్భ-రూపం బ్రహ్మోపాసీనస్య పరిచ్ఛిన్నదేశవర్తిప్రాప్యప్రాప్త్యర్థం గమనముపపద్యతే। అతోఽర్చిరాదిరాతి-వాహికగణస్తమేవ నయతి ॥ 6 ॥*

### ॥ పూ. సూ ॥ విశేషితత్వాచ్చ ॥ 4-3-7 ॥

*"పురుషో మానస(వ) ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి'(బృ.8-2-15) ఇతి లోకశబ్దేన బహువచనేన*

---

దేశవిశేషములోనే అతడికి కల్యాణగుణపూర్తియున్నది, ఇతరప్రదేశములలో అట్లు కాదు, కనుకనే దేశవిశేషమునకు పోవలెనె అనియును కాదు. ఆయన ఎచ్చటనున్నను ఎప్పటికిని కల్యాణగుణపరిపూర్ణుడే. భగవానుని సంబంధమును పొందుటకు దేశవిశేషమునకు పోవలెననియు కాదు. ఆయన సర్వాత్మయై అంతటను ఉన్నాడు అని వెనుక చెప్పబడినవిశేషణములకు తాత్పర్యము.

నిత్యప్రాప్తమైన బ్రహ్మమును ఎందుకు ఉపాసించవలెను? పరవిద్యను విధించుటలో తాత్పర్యమేమి? అన్నచో, పరబ్రహ్మమును ఉపాసించినచో అవిద్య నివర్తించుచున్నది. అనగా, స్వాత్మాత్వేన నిత్యప్రాప్తమైన బ్రహ్మమునుపొందలేదు అను భ్రాన్తిరూపావిద్యానివృత్తిఫలము. ఇందుకొఱకే శ్రుతియనునది పరోపాసనమును విధించినది. కనుక, కార్యబ్రహ్మమైన హిరణ్యగర్భుని ఉపాసనము చేయువానికి పరిచ్ఛిన్నదేశవర్తియైన ఏదో ఒకదేశములోనున్న, ప్రాప్యమును ప్రాప్త్యర్థమును- పొందుటకు అర్చిరాదిగమనము ఉపపన్నమగుచున్నది. కనుక అర్చిరాది ఆతివాహికులు హిరణ్యగర్భుని ఉపాసించు వారినే పిలచుకొని తీసుకొని పోవుచున్నారు.

'ఉపాసీనాన్' అని అధ్యాహారము చేసికొనవలెను. "అప్రతీకాలమ్బనాన్ నయతీతి" అను సూత్రమునుండి "నయతీతి" పదమును ఆకర్షించుకొనవలెను. **కార్యమ్**- హిరణ్యగర్భుని, **ఉపాసీనాన్**- ఉపాసించువారిని. అర్చిరాది ఆతివాహికగణము, **నయతి** - తీసికొని పోవుచున్నది అని బాదరి ఆచార్యులు అభిప్రాయపడుచున్నారు. **అస్య**- హిరణ్యగర్భుడను పేరుగల కార్యబ్రహ్మోపాసకునికి, తాను పొందవలసిన దానిని పొందుటకు (స్వప్రాప్యప్రాప్తయే) గత్యుపపత్తేః-గమనమనునది ఉపపన్నము అగుచున్నది అని.

### ॥ పూ. సూ ॥ విశేషితత్వాచ్చ ॥ 4-3-7 ॥

'పురుషః మానస ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి' (బృహ 8-2-15)- మానసపురుషుడు వచ్చి ఉపాసకుని పిలుచుకొని తీసికొని పోవుచున్నాడు అని చెప్పియుండుటచేతను, "హిరణ్యగర్భుని ఉపాసించువానినే మానసుడు పిలచుకొని తీసికొని పోవుచున్నాడు" అని చెప్పవలెను. అనగా, లోకశబ్దమనునది ముఖ్యముగా దేశవిశేషమును చెప్పును గనుక, బ్రహ్మణో లోకః బ్రహ్మలోకః అని సమాసమును చేసి కార్యబ్రహ్మలోకమునకు పిలచుకొని తీసికొనిపోవుచున్నాడనియే చెప్పుచున్నది. బ్రహ్మమువద్దకు పిలుచుకొని తీసుకుపోవుచున్నదని చెప్పలేదు.

*చ లోకవిశేషవర్తినం హిరణ్యగర్భముపాసీనమేవ అమానవో గమయతీతి విశేష్యతే । కిఞ్చ, "ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే"(ఛాం.8.14.1)ఇతి కార్యస్యహిరణ్యగర్భస్య సమీపగమనమర్చిరాదినాగతః ప్రత్యభిసంధత్తే॥7॥*

*నన్వేవమ్ "తత్పురుషోఽమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి" ఇత్యయం నిర్దేశో నోపపద్యతే హిరణ్యగర్భనయనే హి "స ఏనాన్ బ్రహ్మాణం గమయతి" ఇతి నిర్దేష్టవ్యం స్యాత్, అత ఆహ-*

---

అయ్యా "ఏతం బ్రహ్మలోకం విన్దన్తి" అన్నప్పుడు బ్రహ్మలోకశబ్దమునకు బ్రహ్మైవ లోకః బ్రహ్మలోకః అని కర్మధారయసమాసమును చేసి పరమాత్మపరముగా అర్థము చెప్పుచున్నట్లు, ఇచ్చటకూడ కర్మధారయసమాసమును చేసి బ్రహ్మలోకశబ్దముచే పరమాత్మనే చెప్పుచున్నదని అనుచున్నాము.

అయ్యా! మీరు చెప్పునది సరికాదు. ఎందుచేతననగా, ఈ శ్రుతిలో "లోకాన్ గమయతి" అను బహువచనము ఉన్నది గనుక, కర్మధారయసమాసమును అంగీకరించినచో అనేక బ్రహ్మలను అంగీకరించవలసివచ్చును. అందుచే లోకశబ్దముచేతను, బహువచనముచేతను లోకవిశేషవర్తియైన హిరణ్యగర్భుని ఉపాసించువానినే మానసుడు పిలచుకొని తీసుకొనిపోవునని నిశ్చయించవలెను.

స మానసః ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి' అని చెప్పినతరువాత "తేషు బ్రహ్మలోకేషు పరాః పరావన్తో వసన్తి" (బృహ 8-2-15) ఆ బ్రహ్మలోకాలలో, పరాః-నిరతిశయమైన ఐశ్వర్యముగలవారు, పరావన్తః నాథవన్తః- నాథుని గలవారై అతడి అనుగ్రహముచే అతడిచే ఇయ్యబడిన భోగ్య, భోగస్థాన, భోగోపకరణములను అనుభవించుచున్నవారుగా సుఖముగా అచ్చటనే వసించుచున్నారని వాసస్థానముగా చెప్పియుండుటచేతను, లోకశబ్దమునకు దేశవిశేషపరముగనే అర్థమును చెప్పవలెను.

అయ్యా! మీ పక్షమందును 'లోకాన్' అను బహువచనము కుదరదు. హిరణ్యగర్భుని లోకము సత్యలోకమొక్కటే గదా! అవును. హిరణ్యగర్భుని లోకమునకు పోవువారు హిరణ్యగర్భుడు ముక్తిపొందునప్పుడే ముక్తిని పొందుటచే అంతవరకును వారు సత్యలోకములోనున్న పలుప్రదేశములలో యుండియుందురు అని చెప్పవలెను. ఇట్లు ప్రదేశభేదముతో లోకాన్ అని చెప్పుచున్నట్లు తీసికొనవలెను. అనేకబ్రహ్మాండములు ఉన్నందున ఆయా సత్యలోకములకన్నింటికిని పోవుచున్నాడని చెప్పుట కుదరదు. ఏ అండాంతరములో నున్న బ్రహ్మను ఉపాసించుచున్నారో ఆ బ్రహ్మయున్న లోకమునకే పోవును. ఉపాసకుల భేదముచే బహువచనము ఉపపన్నమగుచున్నదని చెప్పినచో బ్రహ్మలోకశబ్దమునకు కర్మధారయ సమాసము చెప్పి బ్రహ్మపరముగా అర్థము చెప్పువారి పక్షములోకూడ బహువచనము ఉపపన్నమగును. కనుక ప్రదేశభేదముతో చెప్పుటయే సరియైనదిగా కనబడుచున్నది.

ఇక సూత్రమందున్న "చ"కారమునకు వివక్షితమైన అర్థమును 'కిఞ్చ' అనుచు వివరించి చెప్పుచున్నారు. పైగా, "ప్రజాపతేః సభాం వేశ్మప్రపద్యే" (ఛాం. 8. 14. 1)-ప్రజాపతి శబ్దనిర్దిష్టుడైన వాని రాజభవనమును, అందులోనున్న సభను, పొందుచున్నాడు" అని చెప్పుటచేతను, "బ్రహ్మ గమయతి" అన్నప్పుడున్న బ్రహ్మశబ్దమునకు హిరణ్యగర్భపరముగనే అర్థము చెప్పవలెను.

అయ్యా! అట్లైనచో "తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి" అను శ్రుతిలో నపుంసకలింగబ్రహ్మశబ్దము చెప్పబడియుండుటచే ఈ బ్రహ్మశబ్దమునకు హిరణ్యగర్భపరముగా అర్థమును చెప్పుట కుదరదు. హిరణ్యగర్భుని చెప్పునదియైనచో "బ్రహ్మాణం గమయతి" అనియే

**॥ పూ. సూ ॥ సామీప్యాత్తు తద్వ్యపదేశః ॥ 4-3-8 ॥**

*"యో బ్రహ్మాణం విదధాతి"(శ్వే.6.18) ఇతి హిరణ్యగర్భస్య ప్రథమజత్వేన బ్రహ్మసామీప్యాత్ తస్య బ్రహ్మశబ్దేన వ్యపదేశ ఇతి గత్యనుపపత్తివిశేషణాదిభి రుక్తై ర్హేతుభిః నిశ్చీయత ఇత్యర్థః ॥ 8॥*

*అథ స్యాత్- అర్చిరాదినా హిరణ్యగర్భప్రాప్తౌ, "ఏవ దేవపథో బ్రహ్మపథః ఏతేన ప్రతిపాద్యమానా ఇమం మానవమావర్తంనావర్తన్తే "తయోర్ధ్వమాయన్నమృతత్వమేతీత్యమృతత్వప్రాప్త్యపునరావృత్తి వ్యపదేశో నోపపద్యతే, హిరణ్యగర్భస్య కార్యభూతస్య ద్విపరార్ధకాలావసానే వినాశశ్రావణాత్, "ఆబ్రహ్మ భువనా ల్లోకాః పునరావర్తినోఽర్జునేతి వచనాద్ధిరణ్యగర్భం ప్రాప్తస్య పునరావృత్తేరవర్జనీయత్వాత్- ఇతి; అత్రాహ-*

---

చెప్పియుండవలసినది అను ఆక్షేపమునకు సమాధానము చెప్పుచున్నారు.

**॥ పూ. సూ ॥ సామీప్యాత్తు తద్వ్యపదేశః ॥ 4-3-8 ॥**

**సూత్రార్థము: (సామీప్యాత్ తు)** హిరణ్యగర్భలోకమునకు పరబ్రహ్మ యొక్క ఆవాసము దగ్గరగా నున్నందున ***(తద్వ్యపదేశః)*** అపరబ్రహ్మవాచక శబ్దముతో ఈ చతుర్ముఖబ్రహ్మమును వ్యవహరించుట జరిగినది అని సూత్రార్థము.

"యో బ్రహ్మాణం విదధాతి" అని హిరణ్యగర్భుడు ఇతరులకంటెను మొట్టమొదట సృష్టమైనవాడుగనుక జగత్స్రష్టయైన - కారణబ్రహ్మమునకు సమీపములో నుండుటచే "బ్రహ్మాణం" అని చెప్పవలసియుండగా బ్రహ్మ అని నపుంసకబ్రహ్మశబ్దము ప్రయోగించబడినది. "కార్యే కారణోపచారః" అని నిర్ణయించవలెను, ఎందుకనగా, కారణబ్రహ్మమును చెప్పునదైనచో గత్యనుపపత్తి వచ్చుటచేతను, బ్రహ్మశబ్దముతో చేర్చి లోకశబ్దము, బహువచనము చెప్పబడియుండుటచే, 'ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే" అని హిరణ్యగర్భుని ప్రజాపతిశబ్దముచే - రూఢిచేత- చెప్పియుండుటచేతను బ్రహ్మశబ్దమనునది హిరణ్యగర్భునే చెప్పుచున్నదని నిశ్చయించబడుచున్నది.

అయ్యా అర్చిరాదిమార్గముతో హిరణ్యగర్భునిపొందినచో "ఏష దేవపథః బ్రహ్మపథః ఏతేన ప్రతిపద్యమానాః ఇమం మానవం ఆవర్తం నావర్తన్తే" - ఇది దేవయానమార్గము, బ్రహ్మపథము. ఈ దేవయానమార్గముచేత అర్చిరాదిమార్గముద్వారా బ్రహ్మమును పొందినవారు ఈ భూలోకములో మరల తిరిగి జన్మించరనియు 'తయోర్ధ్వమాయన్ అమృతత్వమేతి' (కఠ. 2-6-16) మూర్ధన్యనాడిద్వారా స్థూలశరీరము నుండి బయలుదేరి ఆ అర్చిరాదిగతివల్ల మీదికి వెళ్ళేవాడు ముక్తుడవుతున్నాడు, మోక్షాన్ని పొందుతున్నాడు అనియు శ్రుతులు అపునరావృత్తిని, అమృతత్వమును చెప్పియుండుట ఉపపన్నము కాదు. కార్యభూతుడైన బ్రహ్మమునకు ద్విపరార్ధావసానమందు వినాశము చెప్పబడినది. 'ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావృత్తినోఽర్జున' (గీత. 8-16) అర్జునా! బ్రహ్మలోకం వరకూనున్న సమస్తలోకాలూ పునరావృత్తి(మళ్ళీ పుట్టడం) గలవే అవుతాయి అని బ్రహ్మయొక్క లోకానికి వెళ్లినవాళ్ళు మళ్ళీ పుట్టుకపొందుతారని చెప్పబడింది. అందుచేత హిరణ్యగర్భుడిని పొందేవారికి పునరావృత్తి నిశ్చయంగా ఉంటుందని తేలుతున్నది. కనుక, కార్యబ్రహ్మాన్ని పొందుతున్నట్లు చెప్పకూడదనే ఆక్షేపానికి సమాధానం చెప్పుతున్నారు.

॥ పూ. సూ ॥ కార్యాత్యయే తదధ్యక్షేణ సహాతః పరమభిధానాత్ 4-3-9 ॥

కార్యస్య - బ్రహ్మలోకస్యాత్యయే తదధ్యక్షేణ హిరణ్య గర్భేణాఽఽధికారికేణ అవసితాధికారేణ విదుషా సహ స్వయమపి తత్రాధిగత విద్యః, అతః - కార్యాత్ బ్రహ్మలోకాత్ పరం బ్రహ్మ ప్రాప్నోతీతి అర్చిరాదినా గతస్యామృతప్రాప్త్యపునరావృత్త్యభిధానాత్, "తే బ్రహ్మలోకే తు పరాన్తకాలే పరామృతాత్ పరిముచ్యన్తి సర్వే" (తై.నా.10-24)ఇతి వచనాచ్చావగమ్యతే ॥ 9 ॥

॥ పూ. సూ ॥ స్మృతేశ్చ ॥ 4-3-10 ॥

స్మృతేశ్చాయమర్థోఽవగమ్యతే, "బ్రహ్మణా సహ తే సర్వే సంప్రాప్తే ప్రతిసఞ్చరే। పరస్యాన్తే కృతాత్మనః ప్రవిశన్తి పరంపదమితి(కూర్మ.పూర్వ.12.269)। అతః కార్యముపాసీనమేవార్చిరాదికో గణో నయతీతి బాదరేర్మతమ్ ॥ 10॥

---

॥ పూ. సూ ॥ కార్యాత్యయే తదధ్యక్షేణ సహాతః పరమభిధానాత్ 4-3-9॥

**కార్యస్య**- సృష్టిలో అంతర్భవించిన చతుర్ముఖబ్రహ్మలోకము గూడ **అత్యయే సతి**- నాశే సతి- మహాప్రళయమునందు అంతరించిపోయినపిదప **తదధ్యక్షేణ**-ఆలోకమున కధ్యక్షు డైన ఆధికారికపురుషులలో నొకడైన ఆచతుర్ముఖబ్రహ్మతోపాటు అతని అధికారము తీరిపోయినందున అతనితోకలసి భక్తియోగమును అనుష్ఠించిన ఈ బ్రహ్మవేత్తకూడ (అతః పరం) అతని కార్యబ్రహ్మలోకమునకుపైనున్న పరబ్రహ్మమును పొందునని (అభిధానాత్) ఉపనిషత్తులో చెప్పబడినందున చతుర్ముఖబ్రహ్మయు ఈ ఉపాసకుడు కూడ పునరావృత్తిని పొందక మోక్షమునే పొందుదురని సూత్రార్థము. అనగా అర్చిరాదిమార్గముద్వారా పోయినవానికి అమృతత్వప్రాప్తియు అపునరావృత్తియు చెప్పబడియున్నది. అనగా "తే బ్రహ్మలోకే తు పరాన్తకాలే పరామృతాత్ పరిముచ్యన్తి సర్వే- బ్రహ్మలోకమందునున్న, తే - వారు, పరస్య - పరుడు అను పేరుగల చతుర్ముఖుని ఆయుస్సుయొక్క అన్తకాలే- చివర సమయములో, పరామృతాత్- చతుర్ముఖునివలె మరణప్రసక్తి లేనిపరతత్త్వోపాసనబలముచేత, సర్వే- చతుర్ముఖునివలె ఇతరులు అందరును పరిముచ్యన్తి-ముక్తిని పొందుచున్నారని చెప్పు ప్రమాణముచేత తెలియుచున్నది. 9

॥ పూ. సూ ॥ స్మృతేశ్చ ॥ 4-3-10 ॥

'బ్రహ్మణా సహ తే సర్వే సమ్ప్రాప్తే ప్రతిసఞ్చరే। పరస్యాన్తే కృతాత్మానః ప్రవిశన్తి పరం పదమ్।' (కూర్మపురాణం 12-269) బ్రహ్మలోకంలోనున్న అపరబ్రహ్మనిష్ఠులు అందరూ పరకాలం పూర్తైనప్పుడు మహాప్రళయం వచ్చినప్పుడు బ్రహ్మవిద్యపూర్తైనవాళ్ళై, బ్రహ్మతోకూడా అక్కడ భక్తియోగాన్ని అనుష్ఠించినవారు -పుణ్యవంతులైన వారందరూ పరమపదాన్ని పొందుతున్నారని కూర్మపురాణములోని ఒక స్మృతి వాక్యమునుబట్టి కూడ చతుర్ముఖునితోపాటు ఈ ఉపాసకముముక్షువు లందరును పరబ్రహ్మమును పొందుదురని ఈ అర్థము నిర్ణయించబడుచున్నది. కనుక పరబ్రహ్మమును ఉపాసించినవారికి పరబ్రహ్మప్రాప్తికి ఒక దేశవిశేషమునకు పోవలసిన అవసరము లేదుగనుక (గత్యనుపపత్తేః) హిరణ్యగర్భుని పొందుటకొఱకు మరొకదేశవిశేషమునకు వెళ్ళవలసినను, (గత్యుపపత్తేః చ) తయోర్ధ్వమాయన్ అమృతత్వమేతి" అనే శ్రుతికి క్రమముక్తిపరముగా అర్థము చెప్పుటచే ఉపపన్నమగుటచేతకూడ, నపుంసక లింగ బ్రహ్మశబ్దము ఉన్నదేయను ఆక్షేపమునకు పరిహారము చెప్పబడినది గనుకను, హిరణ్యగర్భోపాసకుడినే

*అత్ర జైమినిః పక్షాన్తరపరిగ్రహేణ ప్రత్యవతిష్ఠతే-*

***॥ పూ. సూ ॥ పరం జైమినిర్ముఖ్యత్వాత్ ॥ 4-3-11 ॥***

*పరంబ్రహ్మోపాసీననానర్చిరాదిర్నయతీతి జైమినిరాచార్యో మన్యతే । కుతః? ముఖ్యత్వాత్ । "తత్పురుషోఽమానవస్స ఏనాన్ బ్రహ్మ గమయతి"(ఛాం.5-10-2)ఇతి బ్రహ్మశబ్దస్య పరస్మిన్నేవ బ్రహ్మణి ముఖ్యత్వాత్ । ప్రమాణాన్తరేణ కార్యత్వనిశ్చయే సత్యేవ హి లాక్షణికత్వం యుక్తమ్। న చ గమనానుపపత్తిః ప్రమాణం, పరస్య బ్రహ్మణః సర్వగతత్వేఽపి విదుషో విశిష్టదేశగతస్యైవావిద్యా- నివృత్తిశాస్త్రాత్, యథాహి విద్యోత్పత్తిర్వర్ణాశ్రమధర్మశౌచాచారదేశకాలాద్యపేక్షా "తమేతం వేదానువచనేన" (బృ. 6-4-22) ఇత్యాది శాస్త్రాదవగమ్యతే, తథా నిశ్శేషావిద్యానివర్తనరూపవిద్యానిష్పత్తిరపి విశిష్టదేశ గతిసాపేక్షేతి*

---

అర్చిరాది ఆతివాహికగణములు పిలచి తీసుకుపోవుచున్నారని బాదరి అభిప్రాయపడుచున్నారు.

ఇక ఈ విషయమందు జైమిని మహర్షి భిన్నమైన అభిప్రాయము గలిగియున్నారని మూడు సూత్రములతో చెప్పుచున్నారు.

***॥ పూ. సూ॥ పరం జైమినిర్ముఖ్యత్వాత్ (4-3-11)***

**పరం** = పరబ్రహ్మాన్ని ఉపాసించేవాళ్ళనే అర్చిస్సు మొదలైన ఆతివాహికులు తీసుకుపోవుచున్నారు అని **జైమినిః** = జైమిని అనే మహర్షి భావిస్తున్నారు, ఎందుకంటే, **ముఖ్యత్వాత్** 'తత్పురుషో అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి' అనే శ్రుతిలోనున్న నపుంసకబ్రహ్మశబ్దం పూర్వాపరప్రకరణానుసారంగా ముఖ్యంగా పరమాత్మనే చెప్పుతున్నది. ముఖ్యార్థాన్ని పరిగ్రహించటంలో అనుపపత్తి ఏదీ లేదు. అనగా, ప్రమాణాంతరముచేత బ్రహ్మశబ్దమునకు కార్యపరముగానే అర్థము చెప్పవలెను అను దశ వచ్చినచో లక్షణను స్వీకరించుట యుక్తమగును. బ్రహ్మంఅనేది అన్నిచోట్లా ఉన్నప్పటికీ చెప్పబడిన దేశవిశేషానికి పోయి ఆ బ్రహ్మమును పొందితేనే విద్వాంసుడి అవిద్యానివృత్తి- ప్రత్యగాత్మయొక్క స్వరూపాన్ని కప్పివేసేటటువంటి కర్మలన్నింటికీ నివృత్తి అనేది కలుగుతుంది అని శాస్త్రం చెప్పుతున్నది గనుక మీరు చెప్పిన గమనానుపపత్తి అనేది ప్రమాణం కానేరదు. విద్యోత్పత్తి – భక్తి అనేది – వర్ణాశ్రమ ధర్మాలని, శౌచాదుల అనుష్ఠానాలను, దేశకాలాలనీ, అపేక్షిస్తున్నది అని "తమేవం వేదానువచనేన" అనే శాస్త్రం ఎలా చెప్పుతున్నదో అలాగనే ప్రాప్యమైన దేశానికి పోయిననే నిశ్శేషముగా అవిద్యానివృత్తి–రూపవిద్యానిష్పత్తి కూడా కలుగుతుందని శాస్త్రంచేత తెలుసుకుంటున్నాం.

(విద్యాయాః నిష్పత్తిః విద్యానిష్పత్తిః– విద్యయొక్క నిష్పత్త్యనంతరమే ఇక్కడికి వచ్చుచున్నాడు. ఇచ్చట విద్యఅనగా ఏది? అని అనుకొనవలదు. విద్య అనేది తనమాహాత్మ్యముచేత సూక్ష్మశరీర స్థితికి కారణమై అనువర్తిస్తున్నది. ఆ విద్యయొక్క నిష్పత్తి– నితరాం వికాసము. గతిసాపేక్షము. అనగా అర్చిరాది మార్గములో దేశవిశేషమునకు పోయిననే కలుగును అని తాత్పర్యము. బ్రహ్మము నిత్యమైనను కాలవిశేషమందే దాని ప్రాప్తి లభించినట్లు సర్వగతత్వేపి– అంతటా ఉన్నప్పటికీ, దేశవిశేషాపేక్ష అనేది యుక్తమే యగును.) విద్వాంసునికి ఉత్క్రాన్తి అనునది లభించదు. "అత్ర బ్రహ్మసమశ్నుతే", "అమృత ఇహ భవతి", "న తస్య ప్రాణా ఉత్క్రామన్తి" ఉతస్మాత్ ప్రాణాః ఉత్క్రామన్తి ఆహో న? చేతి హోవాచ

*గతిశాస్త్రాదవగమ్యతే । విదుష ఉత్క్రాన్తి ప్రతిషేధాది తు పూర్వమేవ పరిహృతమ్।*

*యత్తు బ్రహ్మలోకానితి లోకశబ్దబహువచనాభ్యాం విశేషణాత్కార్యభూత హిరణ్యగర్భప్రతీతిరితి తదయుక్తం, నిషాదస్థపతిన్యాయేన బ్రహ్మైవ లోకో బ్రహ్మలోక ఇతి కర్మధారయస్యైవ యుక్తత్వాత్, అర్థస్య చైకత్వే నిశ్చితే బహువచనస్య అదితిః పాశానితి(పూ.మీ.8-3-4)వదుపపత్తేః। పరస్య బ్రహ్మణః పరిపూర్ణస్య సర్వగతస్య సత్యసఙ్కల్పస్య స్వేచ్ఛాపరికల్పితాః స్వాసాధారణాః అప్రాకృతాశ్చ లోకాః నాత్యన్తాయ న సన్తి, శ్రుతిస్మృతీతిహాసపురాణప్రామాణ్యాత్ ॥ 11 ॥*

***॥ పూ. సూ ॥ దర్శనాచ్చ ॥ 4-3-12 ॥***

*దర్శయతి చ శ్రుతిః మూర్ధన్యనాడ్యా నిష్క్రమ్య దేవయానేన గతస్య పరబ్రహ్మప్రాప్తిం 'ఏష సమ్ప్రసాదో*

---

యాజ్ఞవల్క్యః" అని శ్రుతులు చెప్పుచున్నవే అన్నచో, దీనికి ఆసృత్యుపక్రమాధికరణములో ఇదివరకే సమాధానము చెప్పబడినది.

అయ్యా 'బ్రహ్మలోకాన్" అని లోకశబ్దముచేతను బహువచనముచేతను విశేషితమైన బ్రహ్మశబ్దముచే కార్యభూతుడైన హిరణ్యగర్భునికే ప్రతీతి కలుగుచున్నది అని మీరు చెప్పినది యుక్తముగాదు. నిషాదస్థపతిన్యాయముచే బ్రహ్మైవ లోకః బ్రహ్మలోకః అని కర్మధారయసమాసము చేయుటచే యుక్తమగును. బ్రహ్మశబ్దము ముఖ్యవృత్తిచే పరమాత్మనే చెప్పును. అది ఒక్కటియే అని నిశ్చయించబడినప్పుడు బహువచనమునకు "అదితిః పాశాన్" అన్నప్పుడు బహువచనమునకు అర్థము లేదని చెప్పినట్లే పాశాధికరణన్యాయముచే ఇచ్చటకూడ బహువచనమునకు అర్థములేదని చెప్పవలెను. పైగా, మీరు భావించినట్లు బహువచనాన్త లోకశబ్దము ఉపపన్నము కాదు అని భావించవద్దు. సర్వగతుడై సత్యసంకల్పుడును పరిపూర్ణుడును అయియున్న పరబ్రహ్మమునకు అతడి ఇచ్ఛచే సృష్టింపబడిన , అతడికే చెందిన అప్రాకృతలోకములులేవనిగాదు. (న అత్యన్తాయ న సన్తి న న సన్తి-నిషేధప్రసఙ్గో నాస్తి సన్త్యేవ. అత్యర్థం సన్త్యేవేత్యర్థః - శ్రుతప్రకాశిక). ఛాందోగ్యములో "అథ యదతః పరో దివో జ్యోతిర్దీప్యతే విశ్వతఃపృష్ఠేషు సర్వతః పృష్ఠేషు అనుత్తమేషు ఉత్తమేషు లోకేషు" అని ఉన్నది గమనీయం. దీనిచే ద్యుపృథివ్యాదిలోక ప్రత్యభిజ్ఞ కలుగుచున్నది. కౌషీతక్యుపనిషత్తులో పర్యఙ్కవిద్యప్రకరణములో పరబ్రహ్మ అసాధారణలోక, పుర, మణ్డపాదులు విస్తృతముగా చెప్పబడియున్నవి. "లోకేషు విష్ణోః నివసన్తి కేచిత్" అనే శ్రుతిస్మృతీతిహాసపురాణములలో భగవానుని ప్రాకృత, అప్రాకృతలోకములను గురించి విస్తారముగా చెప్పబడియుండుట గమనించవచ్చును.

***॥ పూ. సూ ॥ దర్శనాచ్చ ॥ 4-3-12 ॥***

***సూత్రార్థము:*** *బ్రహ్మవేత్తయే అర్చిరాదిద్వారా ఆతివాహికులచే తీసుకొనిపోబడునని **దర్శనాత్ చ=** శ్రుతిప్రమాణము స్పష్టముగా నున్నందున అని సూత్రార్థము.*

మూర్ధన్యనాడిద్వారా బయటకు బయలుదేరి అర్చిరాదిమార్గములో పోయినవానికి పరబ్రహ్మప్రాప్తిని 'ఏష సంప్రసాదః అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరం జ్యోతిరుపసంపద్య - స్వేనరూపేణ అభినిష్పద్యతే' (ఛాం. 8-3-4) (ఉపాసకుడైన ఈ జీవుడు హేయముగా తోచుచున్న ఈ

ऽस्माच्छरीरात्समुत्थाय परंज्योति रुपसंपद्य स्वेनरूपेणाभिनिष्पद्यते'(ఛాం.8-3-4)ఇతి ॥12॥

యదుక్తం 'ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే' (ఛాం.8-14-1) ఇత్యర్చిరాదినా గతస్య కార్యే ప్రత్యభిసంధిర్దృశ్యత ఇతి, తత్రోత్తరమ్-

**॥ పూ. సూ ॥ న చ కార్యే ప్రత్యభిసన్ధిః ॥ 4-3-13 ॥**

న చాయం ప్రత్యభిసన్ధిః కార్యే హిరణ్యగర్భే అపి తు పరస్మిన్నేవ బ్రహ్మణి, వాక్యశేషే 'యశోఽహం భవామి బ్రాహ్మణానామ్' (ఛాం.8-14-1) ఇతి తస్యాభిసన్ధాతుః సర్వావిద్యా- విమోకపూర్వక

---

(ప్రారబ్ధకర్మావసాన) శరీరంలోంచి బయలుదేరి (అర్చిరాది మార్గంలో) దేశవిశేషములోనున్న పరమాత్మ-వస్తువుని పొంది తనస్వరూపం ప్రకాశించడాన్ని పొందుతున్నాడు అని శ్రుతి చెప్పుచున్నది. (ఉత్థాయ ఇతి ఉపసంపత్తి వచనేన దేవయానప్రాప్తిస్థితి-శ్రుతప్రకాశిక)

అయ్యా "ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే" అని అర్చిరాదిమార్గములో పోవువారు కార్యబ్రహ్మమైన హిరణ్యగర్భుని పొందుదురని భావించి చెప్పినదానికి సమాధానమును చెప్పుచున్నాను వినుడు.

**॥ పూ. సూ ॥ న చ కార్యే ప్రత్యభిసన్ధిః ॥ 4-3-13 ॥**

***సూత్రార్థము: ప్రత్యభిసన్ధి*** *అనగా స్వగతమైన భావన. ముక్తపురుషుడు బ్రహ్మవద్దకు చేరునపుడు ఇట్లుచేయుదును, అట్లుచేయుదును అని స్వగతముగా కొన్ని భావములను చెప్పుకొన్నట్లు శ్రుతిలోనున్నది. అట్టి భావన* ***(కార్యే న)*** *కార్యచతుర్ముఖబ్రహ్మను గురించినదియైనచో సంభవించదు. అని సూత్రార్థము.*

ఇతడు కార్యమైన హిరణ్యగర్భునివిషయమైన భావనలతో లేడు. పరమాత్మయందు ప్రత్యభిసంధి గలవాడుగా నున్నాడు. "ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే- ప్రజాపతేః- పరమాత్మయొక్క సభాస్థానమైన వేశ్మను, ప్రపద్యే-పొందబోవుచున్నాను. అనగా, "ప్రభు విమతం హిరణ్మయమ్" అని దహరవిద్యలో చెప్పబడిన వేశ్మను పొందబోవుచున్నాను అని అర్థము. కనుక, ఈ శ్రుతిలోనున్న ప్రజాపతిశబ్దము హిరణ్యగర్భుని చెప్పుటలేదు. "ప్రజాపతిః చరతి గర్భే అన్తః" అని నారాయణానువాకములో భగవానునికి ప్రజాపతిశబ్దప్రయోగము ఉన్నదని కనబడుచున్నది. "పతిం విశ్వస్య ఆత్మేశ్వరమ్" అనునప్పుడు చెప్పిన పద్ధతిలోనే నిరుపాధికసర్వప్రజాపతిత్వము భగవానునివిషయములోనే ఉపపన్నమగుచున్నది.

వాక్యశేషమందు "యశోహం భవామి బ్రాహ్మణానాం" అని ఉన్నదానితో ఇచ్చట ప్రజాపతిశబ్దము పరమాత్మనే చెప్పుచున్నదని నిశ్చయించవలెను. అనగా- ఉపనిషత్తులో "ప్రజాపతేః సభాం వేశ్మ ప్రపద్యే" అన్న వాక్యమునకు తరువాత "యశోహం భవామి బ్రాహ్మణానామ్, యశో రాజ్ఞాం, యశో విశాం యశోహమ్ అనుప్రాపత్సి సహాహమ్ యశసా యశః" (ఛాం8-14-1) అని చెప్పబడియున్నది. దీని యర్థమేమనగా- "యశోహం భవామి బ్రాహ్మణానాం.. విశామ్" ఇచ్చట యశః శబ్దముచే ఆత్మ చెప్పబడుచున్నది. అనగా బ్రాహ్మణాదులకు ఆత్మగా నున్నాను అని అర్థము. ఇచ్చటనున్న అహంశబ్దమునకు అన్తర్యామి పరమాత్మ అని అర్థము. అయ్యా మీకు బ్రాహ్మణాదులను గురించి యశశ్శబ్దముచే చెప్పబడు ఆత్మత్వము ఎట్లు కుదురును? అన్నచో, -యశోహమ్ అనుప్రాపత్సి సహాహం యశసా యశః- అహం

*సర్వాత్మభావాభిసన్ధానాత్, 'అశ్వ ఇవ రోమాణి విధూయ పాపం చన్ద్ర ఇవ రాహోర్ముఖాత్ ప్రముచ్య। ధూత్వా శరీరమకృతం కృతాత్మా బ్రహ్మలోకమభిసమ్భవామి' (ఛాం. 8-13-1) ఇత్యభిసంభావ్యస్య బ్రహ్మలోకస్యాకృతత్వశ్రవణాత్ సర్వబన్ధవినిర్మోకస్య చ సాక్షాచ్ఛ్రవణాత్। అతః పరమేవ బ్రహ్మోపాసీన మర్చిరాదిరాతివాహికో గణో నయతీతి జైమినేర్మతమ్ ॥ 13 ॥*

*ఇదానీం బాదరాయణస్తు భగవాన్స్వమతేన సిద్ధాన్తమాహ-*

***॥ సి. సూ ॥ అప్రతీకాలమ్బనాన్నయతీతి బాదరాయణ ఉభయథా చ దోషాత్తత్క్రతుశ్చ ॥ 4-3-14 ॥***

*అప్రతీకాలమ్బనాన్- ప్రతీకాలమ్బనవ్యతిరిక్తాన్నయత్యర్చిరాదిః ఆతివాహికో గణ ఇతి భగవాన్బాదరాయణో మన్యతే। ఏతదుక్తం భవతి - కార్యముపాసీనాన్నయతీతి నాయం పక్షః సమ్భవతి, పరమేవోపాసీనానిత్యయమపి నియమో నాస్తి, న చ ప్రతీకాలమ్బనాపి నయతి। అపి తు యే పరం*

---

-నేను, యశః-యశోరూపమ్. పరమాత్మను ఆత్మగా అహంత్వేన ప్రాప్తవానస్మి- సాక్షాత్కృతవానునిగా నున్నాను. కనుక, సోహమ్- పరమాత్మరూపుడనైన నేను, యశసాం-జీవాత్మలకు, యశః అస్మి- ఆత్మగా నున్నాను అని అభిసంధిని చేయువాడు సర్వావిద్యానివృత్తిపూర్వకముగా సర్వాత్మత్వమును అభిసంధిచేయుటచే ప్రజాపతి శబ్దము పరమాత్మనే చెప్పును.

పైగా, వెనుకటి ఖండమందును "అశ్వ ఇవ రోమాణి విధూయ పాపం, చంద్ర ఇవ రాహోః ముఖాత్ ప్రముచ్య, ధూత్వా శరీరమ్ అకృతం కృతాత్మా బ్రహ్మలోకం అభిసంభవామి (ఛాం. 8-13-1) అను శ్రుతిలో శరీరమును వదలి నిత్యమైన బ్రహ్మలోకమును పొందబోవుచున్నాను అని పొందబోవు లోకము నిత్యమైన బ్రహ్మలోకమని చెప్పియుండుటచేతను, నశ్వరమైన చతుర్ముఖబ్రహ్మలోకమును చెప్పలేదు. పైగా, సర్వబంధములనుండి విడిపడుదనియు స్పష్టముగా చెప్పియుండుటచేకూడ పరబ్రహ్మమును ఉపాసించువారినే అర్చిరాది ఆతివాహికగణములు పిలచి తీసుకుపోవుచున్నారని జైమినిమహర్షి మతము - 13

ఇప్పుడు భగవానులు బాదరాయణులు తమ సిద్ధాంతమును సాధించుచున్నారు.

***॥ సి. సూ ॥ అప్రతీకాలమ్బనాన్నయతీతి బాదరాయణ ఉభయథా చ దోషాత్తత్క్రతుశ్చ ॥***

***॥ 4-3-14 ॥***

బాదరాయణుడు (వ్యాసుడు) (అప్రతీకాలమ్బనాన్) ప్రతీకోపాసకులకంటె భిన్నమైనవారిని (నామాదులయందు బ్రహ్మదృష్టిని పెట్టి ఉపాసించువారినితప్ప ఇతరులను) అర్చిరాది ఆతివాహికగణము పరంబ్రహ్మవద్దకు పిలచుకొని తీసికొనిపోయి, నయతీతి= చేర్చును అని స్వమతమును చెప్పుచున్నాడు. ఇదియే ఆయనయొక్క నిర్దిష్టసిద్ధాంతము. అయ్యా! మీ పక్షమందు పరబ్రహ్మోపాసకులు ప్రతీకాలమ్బన వ్యతిరిక్తులు. వారిని అర్చిరాదులు పిలచుకొని పోవుచున్నారని చెప్పుచున్నారు. జైమిని మహర్షియొక్క సిద్ధాంతము ఇదియే గదా! మరి వ్యత్యాసమేమున్నది? అను ఆక్షేపమునకు సమాధానము- ఏతదుక్తమ్ భవతి అని చెప్పుచున్నారు. కార్యమైన హిరణ్యగర్భుని ఉపాసించువారిని అర్చిరాదులు పిలిచుకొని తీసుకొని వెళ్ళుచున్నారను బాదరియొక్క మతము సరియైనది కాదు. పరబ్రహ్మమును ఉపాసించువారినిమాత్రమే

*బ్రహ్మోపాసతే, యే చాత్మానం ప్రకృతివియుక్తం బ్రహ్మాత్మక ముపాసతే తానుభయవిధాన్నయతి, యే తు బ్రహ్మకార్యాన్తర్భూతం నామాదికం వస్తు దేవదత్తాదిషు సింహాదిదృష్టివ ద్బ్రహ్మదృష్ట్యా కేవలం వా తత్తద్వస్తూపాసతే, న తాన్నయతి । అతః, పరం బ్రహ్మోపాసీనా నాత్మానఞ్చ ప్రకృతివియుక్తం బ్రహ్మాత్మకముపాసీనాన్నయతి ఇతి । కుతః? ఉభయథా చ దోషాత్, కార్య ముపాసీనాన్నయతీతి పక్షే 'అస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరం జ్యోతిరుప సంపద్య (ఛాం.8-3-4) ఇత్యాదికాః శ్రుతయః ప్రకుప్యేయుః। పరమేవోపాసీనానితి బ్రహ్మోపాసీనానితి నియమే 'తద్య ఇత్థం విదుర్యే చేమేఽరణ్యే శ్రద్ధా తప ఇత్యుపాసతే తేఽర్చిషమభిసమ్భవన్తి'(ఛాం.5.10.1)ఇతి పఞ్చాగ్నివిదోఽర్చిరాదిగణో నయతీతి శ్రుతిః*

అర్చిరాదులు పిలచికొని తీసుకొని పోవుచున్నారు అను నియమమును లేదు. ప్రతీకోపాసనము చేయువారినికూడ తీసుకొని పోవుట లేదు. అపితు– ఎవరు పరబ్రహ్మమును ఉపాసించుచున్నారో అట్టి రెండువిధములుపాసకులనును ఆతివాహికులు పిలచుకొని తీసుకొనిపోవుచున్నారు. దేవదత్తునియందు సింహపుదృష్టిని (సింహో దేవదత్తః అని) పెట్టినట్లు, నామాదులను మాత్రము ఉపాసించువారిని గాని, కేవలము నామాదులనుమాత్రము ఉపాసించువారినో ఆతివాహికులు పిలచుకొని పోవుట లేదు. అనగా, ప్రతీకోపాసకులను పిలచుకొని తీసుకుపోవుట ఉండదు అని అర్థము. కనుక, పరమాత్మను ఉపాసించు వారినియు, ప్రకృతివియుక్తమైన ఆత్మను బ్రహ్మాత్మకముగా ఉపాసించువారిని మాత్రము ఆతివాహికులు పిలచుకుపోవుదురని నిర్ణయించబడినది.. ఎందుచే ఇట్లు చెప్పబడుచున్నది? అన్నచో ఉభయథా చ దోషాత్– కార్యముపాసీనాన్ నయతి– హిరణ్యగర్భుని ఉపాసించువారిని ఆతివాహికులు పిలచుకొని పోవుచున్నారను బాదరియొక్క పక్షమందు "అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య" (ప్రారబ్ధకర్మావసాన శరీరమునుండి బయటికి బయలుదేరుటయు (ఆలస్యములేకుండ వెంటనే) పరంజ్యోతిస్సును పొందుచున్నారు) అను శ్రుతులు కోపించును– ప్రకుప్యేయు– బాధితా భవేయుః– ఇత్యర్థః – అనగా శరీరమునుండి బయటికి బయలుదేరుటయు, బ్రహ్మమునే పొందుచున్నాడు. కనుక హిరణ్యగర్భుని ఉపాసించిన వారికి అర్చిరాదిగతియనునది ఉపపన్నము కాదు. అర్చిరాదిమార్గములో వెళ్ళినవానికి వెంటనే బ్రహ్మప్రాప్తి చెప్పబడియున్నది. హిరణ్యగర్భోపాసకునికి బ్రహ్మప్రాప్తి లభించదు. యథోపాసనం హి ఫలమ్.– దేనిని ఉపాసించునో దానినే పొందును. కనుక పరబ్రహ్మమును ఉపాసించినవాడే అర్చిరాదిమార్గములో పోవుచున్నాడు.

పరబ్రహ్మమును ఉపాసించువానినే అర్చిరాదులు పిలచుకుపోవుచున్నారు అను నియమమున్నచో, "తత్ య ఇత్థం విదుః యే చేమే అరణ్యే శ్రద్ధా తప ఇత్యుపాసతే, తే అర్చిషం అభిసంభవన్తి" (మొదట ప్రస్తుతుడైన సంసారిజీవుని స్వరూపము తత్ అనుపదముచే పరామర్శించబడుచున్నది. తత్– ప్రత్యగాత్మ స్వరూపమును, యే– ఎవరు, ఇత్థం– వెనుక చెప్పబడినట్లు , ద్యు–ప్రాజ్య–పృథివీ–పురుష– యోషిత్తులలో, శ్రద్ధా–సోమ–వృష్టి–అన్న–రేతశ్శరీరకముగను, దేహాదిలక్షణప్రకృతివియుక్తమును బ్రహ్మాత్మకమును ఎవరు ఉపాసింతురో, తే–వారును; ఎవరు అరణ్యే– అడవులలోనుండి శ్రద్ధతో తపశ్శబ్దముచే చెప్పబడు బ్రహ్మమును ఉపాసించుచున్నారో వారును, అర్చిరాదిగతిని పొందుచున్నారు) అని పంచాగ్నివిద్యానిష్ఠులను అర్చిరాదులు

*ప్రకుప్యేత్ అతః ఉభయస్మిన్నపిపక్షే దోషస్స్యాత్, తస్మాదుభయవిధాన్నయతీతి। తదేతదాహ తత్క్రతుశ్చేతి। తత్క్రతుః- తథోపాసీనస్తథైవ ప్రాప్నోతీత్యర్థః, 'యథా క్రతురస్మిన్‌లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి', 'తం యథాయథోపాసతే' ((ఛాం.3-14-1))ఇతిన్యాయాత్ పఞ్చాగ్నివిదోऽప్యర్చిరాదినా గతి శ్రవణాత్ అర్చిరాదినా గతస్య బ్రహ్మప్రాప్త్యపునరావృత్తిశ్రవణాచ్చ। అత ఏవ తత్క్రతున్యాయాత్ ప్రకృతి-వినిర్ముక్తబ్రహ్మాత్మకాత్మానుసన్ధానం సిద్ధమ్ । నామాదిప్రాణపర్యన్త ప్రతీకాలమ్బనానాం తూభయవిధ శ్రుతిసిద్ధోపాసనాభావాదచిన్మిశ్రోపాసనే తత్క్రతున్యాయాచ్చార్చిరాదినా గతిర్బ్రహ్మప్రాప్తిశ్చ న విద్యతే॥14॥*

పిలచుకొని పోవుచున్నారను శ్రుతి కోపించును కనుక, బాదరి, జైమిని ఇరువురి పక్షములలోను దోషములు ఉన్నవి. కనుక, పంచాగ్నివిద్యానిష్ఠులను- బ్రహ్మప్రకారక జీవవిశేష్యకముగా పరమాత్మ శరీరోహం అని ఉపాసనము చేయువారినికూడ పరమాత్మోపాసకులను- జీవప్రకారకపరమాత్మవిశేష్యకముగా అహం బ్రహ్మాస్మి( మచ్ఛరీరి పరమాత్మా) అని ఉపాసించువారిని- రెండువిధముల ఉపాసకులను అర్చిరాదులు పిలచుకు పోవుచున్నారు.

జీవాత్మను ఉపాసించువారికి పరబ్రహ్మప్రాప్తి యనునది ఎట్లు లభించును? అన్నచో, అనగా, జీవోపాసకునికి పరమాత్మప్రాప్తియనునది ఇష్టమైనచో, హిరణ్యగర్భోపాసకునికిని అది రావచ్చును. అది అనిష్టమని భావించినచో, పంచాగ్నివిద్యానిష్ఠులకును బ్రహ్మప్రాప్తిలేకపోవుగాక అని ఆక్షేపమునకు సమాధానము చెప్పుచున్నారు. రెండువిధములైన ఉపాసకులకును అప్రతీకాలంబనత్వమును సాధించుటకు చెప్పుచున్నారు- తత్క్రతుశ్చ- తత్క్రతుః-ఏ విధమైన ఉపాసనమునకు ఆ విధముగనే ఫలమును పొందుచున్నాడని అర్థము.

అయ్యా తత్ య ఇత్థమ్ విదుః అను శ్రుతిఖండము పంచాగ్నివిద్యను గురించి చెప్పుచున్నది. శ్రుతిలోనున్న తత్‌అను పదముచే సంసారిజీవస్వరూపము పరామర్శింపబడుచున్నది. బ్రహ్మమును గురించి ప్రస్తావమును లేదు. అట్లుండగా, మీరు ప్రకృతివియుక్త ఆత్మను బ్రహ్మాత్మకముగా ఎవరు ఉపాసింతురో అని ఈ శ్రుతిఖండమునకు అర్థమును చెప్పుట ఎట్లు కుదురును?

దీనికి సమాధానమును చెప్పుచున్నాము వినుడు- పంచాగ్నివిద్యానిష్ఠులకు అర్చిరాదిమార్గము చెప్పబడియున్నను, అర్చిరాదిమార్గమందు పోవువారికి బ్రహ్మప్రాప్తియు అపునరావృత్తియు చెప్పబడి యున్నందున, 'యథాక్రతుః అస్మిన్ లోకే పురుషో భవతి తథా ఇతః ప్రేత్య భవతి" అను తత్క్రతున్యాయముచే ప్రకృతివియుక్తబ్రహ్మాత్మకత్వానుసంధానమే సిద్ధించుచున్నది.

ప్రతీకాలంబనులు ఎవరు? అన్నచో, భూమవిద్యలో చెప్పబడిన నామాదిప్రాణపర్యన్తమైనవాటిలో ఏదో ఒకదానిని ఉపాసించువారు. అవి వెనుక చెప్పిన "తత్ య ఇత్థం విదుః యే చ ఇమే అరణ్యే శ్రద్ధా తప ఇత్యుపాసతే" అను శ్రుతిలో చెప్పబడిన రెండువిధములైన ఉపాసనములలో చేరవు. కనుక వాటిని ఉపాసించువారికి బ్రహ్మప్రాప్తి లభించదు. ప్రతీకోపాసకులు అందరును అర్చిరాదిగతిలో పోనందున పరిమితమైన - స్వల్పమైన ఫలవిశేషమును పొందుదురు అని శ్రుతియే చెప్పుచున్నది అనుచున్నారు.

*తమిమం విశేషం శ్రుతిరేవ దర్శయతీత్యాహ-*

**॥ సి. సూ ॥ విశేషం చ దర్శయతి ॥ 4-3-15 ॥**

*'యావన్నామ్నో గతం తత్రాస్య యథాకామచారో భవతి' (ఛాం.7-1-5) ఇత్యాదికా శ్రుతిః నామాదిప్రాణపర్యన్తప్రతీకముపాసీనానాం గత్యనపేక్షం పరిమితఫలవిశేషం చ దర్శయతి।*

*తస్మాదచిన్మిశ్రం, కేవలం వా చిద్వస్తు, బ్రహ్మదృష్ట్యా తద్వియోగేన చ య ఉపాసతే, న తాన్*

---

*ఈవిషయమునే మరియొక శ్రుతికూడ ప్రతిపాదించుచున్నదని సూత్రకారుదు మరొకసూత్రముతో స్వాభిమతమును వివరించుచున్నాడు*

**॥ సి. సూ ॥ విశేషం చ దర్శయతి ॥ 4-3-15 ॥**

**సూత్రార్థము:** *ఒకానొక ఉపనిషద్వాక్యము (విశేషం చ) ప్రతీకోపాసకులకు ఫలము పరిమితమే అను విశేషమును గూడ (దర్శయతి) స్పష్టముగా తెలుపుచున్నది.*

'యావన్నామ్నో గతం తత్రాస్య యథాకామచారో భవతి' (ఛాం.7-1-5) (నామముయొక్క ప్రవృత్తియనునది ఎంతవరకు దేశములో వ్యాపించియున్నదో అంతవరకు దేశములలో నామమును బ్రహ్మముగా ఉపాసించువాడు యథేష్టముగా సంచరించుచున్నాడు) అని భూమవిద్యాప్రకరణములో ప్రతీకోపాసకులకు గత్యనపేక్షం– అర్చిరాదిమార్గమందు పోవకనే పరిమితఫలమును ఈ శ్రుతి చెప్పుచున్నది.

కనుక అచిన్మిశ్రమైన ఆత్మనో, కేవల అచిత్తునో బ్రహ్మదృష్టితోనో, అది లేకనో, ఎవరు ఉపాసించు చున్నారో, వారిని అర్చిరాదిమార్గములో పిలచి తీసుకొని పోవుట లేదు. అనగా, ప్రకృతితో చేరిన తన ఆత్మను బ్రహ్మముగా ధ్యానము చేయుట ఒక ఉపాసనము. దానినే ప్రకృతితో చేరియున్న స్వాత్మోపాసనమునే బ్రహ్మదృష్టిలేకనే స్వరూపణే– అహం అహం అని ధ్యానము చేయుట ఒక ఉపాసనము. ప్రకృతివియుక్తమైన తన ఆత్మను బ్రహ్మముగా ధ్యానము చేయుట ఒక ఉపాసనము. ప్రకృతివియుక్త శుద్ధ స్వాత్మను బ్రహ్మముగా భావించక స్వరూపేణ– అహమ్ అహమ్ అని ధ్యానము చేయుట ఒక ఉపాసనము. ఇట్లు నాలుగువిధములైన ఉపాసనములు భూమవిద్యాప్రకరణములో చెప్పబడియున్నవి. అవి యన్నియు, చేతనాచేతనశరీరక– బ్రహ్మవయవ(ప్రతీకః అవయవః) జీవోపాసనములు గనుక ప్రతీకోపాసనములు అనబడుచున్నవి. వీటిలో స్వరూపోపాసనములు రెండును భగవచ్ఛేషత్వవిశిష్టయథావస్థితాత్మస్వరూపవిషయములైనందునను, బ్రహ్మముగా భావించి చేయు ఉపాసనములు రెండును ఆరోపితములు గనుకను (బ్రహ్మదృష్టియుండుటచే) ఈ నాలుగువిధములైన ఉపాసనములును విషయముచేత దుష్టములని తాత్పర్యము. ఈ నలుగురినియు ఆతివాహికులు పిలచి తీసికొనిపోవుట లేదు. అపితు, పరమాత్మను ఉపాసించువారినియు, ప్రకృతివియుక్తమైన ఆత్మను బ్రహ్మాత్మకమైన ఉపాసనము చేయువారినికూడ ఆతివాహిక గణములు పిలచికొని తీసుకొనిపోవు చున్నారని నిశ్చయించబడుచున్నది.

హిరణ్యగర్భుని పొందినచో అర్చిరాదిమార్గమందు పోవువానికి అమృతత్వప్రాప్తియు, అపునరావృత్తియు చెప్పబడుట కుదరదే అను ఆక్షేపమునకు "తే బ్రహ్మలోకే తు పరాన్తకాలే పరామృతాత్ పరిముచ్యన్తి సర్వే" అను శ్రుతినియు, "బ్రహ్మణాసహ తే సర్వే..." అను స్మృతినియు ప్రమాణములుగా చూపి, చతుర్ముఖబ్రహ్మలోకమును పొందినవాడు దాని అధ్యక్షుడైన హిరణ్యగర్భునితో పరమాత్మను

*నయతి, అపితు పరంబ్రహ్మోపాసీనానాత్మానంచ ప్రకృతివియుక్తం బ్రహ్మాత్మకముపాసీనానాతివాహికో గణో నయతీతి సిద్ధమ్॥ 15 ॥*

పొందుచున్నాడు అని చెప్పబడుటకు శ్రీభాష్యములో సమాధానము చెప్పబడలేదు. అయినను, వేదాంతదీపములోను, శ్రుతప్రకాశికలోను దీనికి సమాధానము చెప్పబడియుండుటచే, ఇక్కడ ఆ సమాధానమును ఇచ్చుచున్నాము–

"బ్రహ్మణా సహ తే సర్వే" ఇతి వచనం తు పుణ్యకర్మవిశేషేణ హిరణ్యగర్భలోకం ప్రాప్తానాం "తదుపర్యపి బాదరాయణః" ఇతి న్యాయేన తత్రైవ నిష్పన్నవిద్యానాం గతిప్రకారవిషయం। తే బ్రహ్మలోకే ఇతి తు బ్రహ్మలోకశబ్దస్య కర్మధారయవృత్త్యా బ్రహ్మవిషయత్వాత్। బ్రహ్మణ్యుపాస్యే వర్తమానాః పరాన్తకాలే – చరమదేహావసానసమయే, పరామృతాత్–పరస్మాద్బ్రహ్మణ ఉపాసనప్రీతాత్ హేతోః పరిముచ్యన్తి సర్వే సర్వస్మాత్ బన్ధాత్ విముచ్యన్తే ఇతి "వేదాన్తవిజ్ఞానసునిశ్చితార్థాః" ఇతి ప్రకరణాత్ అవగమ్యతే॥ (దీపమ్)

"బ్రహ్మణా సహ తే..." అనే స్మృతి అనేది, పుణ్యకర్మవిశేషముచే, హిరణ్యగర్భలోకమును పొందువారు "తదుపర్యపి బాదరాయణః" అను సూత్రములో దేవలోకములోనున్నవారికిని అర్థిత్వసామర్థ్యముండుటచే బ్రహ్మోపాసనమందు అధికారముండునని చెప్పినట్లుగా, సర్వకర్మరూప అవిద్యానివృత్తిపూర్వక బ్రహ్మప్రాప్తిని కోరి బ్రహ్మోపాసనముచేసి విద్యానిష్పత్తినిపొందినవారు పరబ్రహ్మమును పొందు ప్రకారమును చెప్పుచున్నది.

తే బ్రహ్మలోకే తు అను శ్రుతికి ఇక అర్థము చెప్పబడుచున్నది. బ్రహ్మైవ లోకః బ్రహ్మలోకః అను కర్మధారయసమాసముచే బ్రహ్మలోకశబ్దము పరమాత్మను చెప్పుచున్నది. "బ్రహ్మమును ఉపాసించుచున్నవారు (వర్తమానః)పరాన్తకాలే–చరమదేహావసానకాలమందు పరామృతత్వాత్– ఉపాసనముచే ప్రీతిని చెందిన కారణముచే – పరమాత్మచేత, పరిముచ్యన్తి సర్వే– అందరును సర్వబంధములనుండియు విడిపడుచున్నారు" అని వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః అను ప్రకరణముచేత తెలియుచున్నది. అనగా "తే బ్రహ్మలోకే తు" అను వాక్యమునకు పూర్వము

"న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేన ఏకే అమృతత్వమానశుః।
పరేణనాకం నిహితం గుహాయాం విభ్రాజతే యద్యతయో విశన్తి॥ (తై.నారా. 10.21)

యతయః – యతులు, ఏ అమృతత్వమును పొందుచున్నారో, ఏ అమృతత్వమనునది, నాకస్య –భగవల్లోకమునకు మీదను పరమవ్యోమమందు ఉన్నదై ప్రకాశించుచున్నదో, ఆ అమృతత్వము కర్మచేతనో, ప్రజలచేతనో ధనముచేతనో, పొందుటకు సాధ్యముకానిది. అపితు, త్యాగేన' సన్యాసః త్యాగః ఇత్యుక్తః శరణాగతిః" అనియు చెప్పబడిన భగవచ్చరణారవిందమును శరణవరణముచేయుచున్న – ఉపాయముగా ఆశ్రయించు త్యాగముచేతనే, ఏకే–కొంతమంది పొందిరి. భక్తియోగనిష్ఠులును భక్తికి అంగముగా ప్రపత్తి చేయవలసి యున్నది. స్వతంత్ర ప్రపత్తినిష్ఠులు ముఖ్యముగనే ప్రపత్తి చేయవలసియున్నది. "తస్య చ వశీకరణం తచ్ఛరణాగతిరేవ" అని ఆనుమానికాధికరణములో భాష్యకారులు ప్రసాదించుటచేతను, ఇప్పుడు చెప్పబడిన అర్థమే తగియున్నదని చెప్పబడియున్నది. దీని తరువాత

వేదాన్తవిజ్ఞానసునిశ్చితార్థాః సన్యాసయోగాత్ యతయః శుద్ధసత్త్వాః।
తే బ్రహ్మలోకేతు పరాన్తకాలే పరామృతాత్ పరిముచ్యన్తి సర్వే॥ (తై.నారా. 10–22)

॥ ఇతి కార్యాధికరణమ్ ॥ 5 ॥

॥ఇతి శ్రీభగవద్రామానుజవిరచితే శారీరకమీమాంసాభాష్యే చతుర్థస్యాధ్యాయస్య తృతీయఃపాదః॥

(యతయః – సన్యాసులు యమనియమాదులతో నున్నవారుగా నుండివేదాంతజ్ఞానముచే తత్త్వహితపురుషార్థ విషయమందు సుదృఢమైన జ్ఞానముగలవారు సంన్యాసము అనబడు ప్రపదనముచే భక్తివిరోధిపాపమును పోగొట్టుకొనినవారై, నిర్మమైన అంతఃకరణముతో భక్తియోగమును అనుష్ఠించినవారు, పరాంతకాలే– చరమశరీరవియోగకాలములో బ్రహ్మమును పొందుచున్నారు అనియున్న ప్రకరణమును పరామర్శించినచో హిరణ్యగర్భప్రాప్తికి ప్రసక్తియే లభించదు.

ప్రశ్న–హిరణ్యగర్భుని ఉపాసించి సత్యలోకము పోయి, పరబ్రహ్మమును ఉపాసించిన విద్యావంతులు ప్రతి ప్రళయకాలమందును, చతుర్ముఖలోకమునకు అధ్యక్షులై యుండు హిరణ్యగర్భునితో పరబ్రహ్మమును పొందుచున్నారని చెప్పబడినది. సుకృతవిశేషముచేత త్రైలోక్యాధిపత్యమును పొందిన అందరుచతుర్ముఖులును మోక్షమును పొందుచున్నారని చెప్పవలెనా? లేక బ్రహ్మలోకమును పొందినవారు అచ్చటనే పరబ్రహ్మమును ఉపాసించుచు ముక్తులగుటవలె హిరణ్యగర్భుడును సత్యలోకమందు పరబ్రహ్మమును ఉపాసనము చేసిననే మోక్షమును పొందగలడా?

సమాధానము:–"బ్రహ్మణా సహ తే" అను స్మృతిలో దీనిని గురించి స్పష్టముగా ఏదియును చెప్పలేదు. అయినను దీనికి అర్థమును చెప్పు రీతిలో "కార్యాత్యయే తదధ్యక్షేణ..." అను సూత్రమందు "కార్యస్య–బ్రహ్మలోకస్య, అత్యయే–తదధ్యక్షేణ–హిరణ్యగర్భేణ, ఆధికారికేణ–అవసిత అధికారేణ, విదుషా సహ స్వయమపి తత్ర అధిగతవిద్యః" అని శ్రీభాష్యకారులు సాదించియుండుటను గమనించవలెను. విదుషా సహ అని యుండుటచే హిరణ్యగర్భుడును భక్తియోగమును అనుష్ఠించియుండవలెను అని తేలుచున్నది.

అందరు చతుర్ముఖులును బ్రహ్మమును ఉపాసించి శ్రీవైకుంఠలోకమును పొందుచున్నారా? ఉపాసించని కొంతమంది చతుర్ముఖులు ఉందురా? అన్నచో,

యుగకోటిసహస్రాణి విష్ణుం ఆరాధ్య పద్మభూః పునః త్రైలోక్యధాతృత్వం ప్రాప్తవానితి శుశ్రుమ॥ (భార. కుండధరోపాఖ్యానమ్) అను వచనమందు మరల మూడులోకములకును అధిపతిగా కావలెనని భగవానుని ఆరాధించి పద్మభూవైనవాడు తిరిగి మూడులోకములకును అధిపతిగా అయినాడని చెప్పబడి యుండుట గమనించినచో కొంతమంది మోక్షార్థము ఉపాసనము చేయకుండకూడ ఉందురని తోచుచున్నది.

త్రైలోక్యధాతృత్వం– లోకత్రయస్రష్టృత్వం పునః ప్రాప్తవాన్ ఇత్యనేన, ఒక బ్రహ్మ మోక్షేచ్ఛలేక స్వస్థానమందే రూఢాభిలాషుడై స్వస్థానలాభార్థము యుగకోటిసహస్రములు భగవానుని ఆరాధించి మరుజన్మ యందును స్వస్థానమును పొందుచున్నాడని అర్థము ద్యోతితమగుచున్నది. ఇచ్చట వసుపదమందున్న ఒకడు పునర్జనయందుకూడ స్వస్థానమైన వసుపదప్రాప్తియందలి ఇచ్ఛచేత వస్వాద్యుపాసనరూపమైన మధువిద్యను అనుష్ఠించవలెననియును, దానిచే అతడికి మరుజన్మమందుకూడ వసుపదము లభించునని చెప్పుచున్న మధ్వధికరణసిద్ధాంతము స్మర్తవ్యము. (పరదేవతాపారమార్థ్యాధికారం శ్రీసారబోధిని. 193వపేజీ).

కార్యాధికరణము ముగిసినది

చతుర్థాధ్యాయము మూడవ పాదము ముగిసినది.

అథ శ్రీభగవద్రామానుజవిరచితే

శారీరకమీమాంసాభాష్యే

చతుర్థాధ్యాయే చతుర్థఃపాదః - (ముక్తిపాదః)

## ॥ సంపద్యావిర్భావాధికరణమ్ (4-4-1 )

### ॥సి. సూ॥ సంపద్యావిర్భావః స్వేన శబ్దాత్ ॥ 4-4-1 ॥

పరం బ్రహ్మోపాసీనానామ్ ఆత్మానఞ్చ ప్రకృతివియుక్తం బ్రహ్మాత్మకముపాసీనానా మర్చిరాదినా మార్గేణాపునరావృత్తిలక్షణా గతిరుక్తా। ఇదానీం ముక్తానా మైశ్వర్యప్రకారం చిన్తయితు మారభతే । ఇదమామ్నాయతే - "ఏవ మేవైష సమ్ప్రసాదోఽస్మాచ్ఛరీరా త్సముత్థాయ పరం జ్యోతిరుప సంపద్య

---

శ్రీరస్తు

శ్రీః శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ భగవద్రామానుజవిరచితమైన శ్రీ శారీరకమీమాంసా భాష్యము సుఖబోధినిలో

నాలుగవ అధ్యాయము నాలుగవ పాదము (ముక్తిపాదము)

## సంపద్యావిర్భావాధికరణము (4-4-1 )

### ॥సి. సూ॥ సంపద్యావిర్భావః స్వేన శబ్దాత్ ॥ 4-4-1 ॥

సూత్రార్థం:- **సంపద్య**= (పరంజ్యోతిని)పొంది, (పొందదగినదిగా చెప్పబడే అభినిష్పత్తి), **ఆవిర్భావః** = (స్వరూపముయొక్క)ఆవిర్భావరూపమే, **స్వేన శబ్దాత్** = 'స్వేన'అను(రూపశబ్దానికివిశేషణమైన) శబ్దంచేత

సంగతి:- పరమాత్మను ఉపాసించువారికిని, ప్రకృతివియుక్తమైన తన ఆత్మను బ్రహ్మాత్మకముగా ఉపాసించినవారికిని పునరావృత్తిలేని అర్చిరాదిమార్గముద్వారా గమనము చెప్పబడినది. ఈ పాదంలో ముక్తుల ఐశ్వర్యప్రకారము పరామర్శించబడుతున్నది. అనగా, మూడవపాదములో అర్చిరాదిమార్గములో బయలుదేరిన విద్వాంసుని ఆతివాహికగణములు "ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అని చెప్పబడిన అప్రాకృతమైన లోకవిశేషమందు అపరాజితము అని పేరుగల వాసస్థానమందు హిరణ్మయమైన పర్యంకమందు -దివ్యసింహాసనముపై నిరతిశయజ్యోతిర్మయమై పరవాసుదేవుడు అను తిరునామముగల దివ్యమంగళవిగ్రహవిశిష్టుడై వేంచేసియుండువానిని "తదా విద్వాన్ నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్" అని చెప్పినట్లు ముక్తప్రాప్యునిగా(ముక్తులచే పొందబడువానిగా) చెప్పబడినది. ఈ నాలుగవపాదములో పరబ్రహ్మమును పొందినపిదప పొందగల ముక్తుని ఐశ్వర్యమును చెప్పుచున్నారు.

ఈశ్వరస్య భావః ఐశ్వర్యమ్; ఈశ్వరస్య ధర్మప్రాప్తి; స్వరాడ్త్వమ్. స్వరాడ్త్వమనగా అకర్మవశ్యత్వమును మాత్రము చెప్పుచున్నదా? లేక జ్ఞానానందసంబంధముచేత అప్రాకృతదేహత్వము, సత్యసంకల్పత్వాదులును చెప్పబడుచున్నవా? సంకల్పమనగా ఒక హద్దుకు లోబడినదా? అనునవి ఈ పాదములో విచారించబడుచున్నవి అని చెప్పవచ్చును.

*స్వేనరూపేణాభినిష్పద్యతే(ఛాం.8-12-2)ఇతి। కిమస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతి రుపసమ్పన్నస్య దేవాదిరూపవత్సాధ్యేనరూపేణ సమ్బన్ధోऽనేన వాక్యేన ప్రతిపద్యతే? ఉత స్వాభావికస్య స్వరూప-స్యావిర్భావః? ఇతి సంశయే సాధ్యేనరూపేణ సమ్బన్ధ ఇతి యుక్తమ్। అన్యథా హ్యపురుషార్థావ బోధిత్వం మోక్షశాస్త్రస్యస్యాత్; స్వరూపస్య స్వతోऽపురుషార్థత్వదర్శనాత్। న హి సుషుప్తౌ దేహేన్ద్రియ వ్యాపారేషు ఉపరతేషు, కేవలస్యాత్మస్వరూపస్య పురుషార్థసమ్బన్ధో దృశ్యతే । న చ దుఃఖనివృత్తిమాత్రం*

---

**విషయము:-** ఏవమేవైష సంప్రసాదః అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య స్వేనరూపేణ అభినిష్పద్యతే (ఛాం. 8. 12. 2) అను శ్రుతివాక్యమును గురించినది. (వెనుక చెప్పబడినట్లు ఉపాసనము చేసిన జీవుడు ఈ శరీరమునుండి బయలువెడలి, దేశవిశేషమందు వేంచేసియుండు పరమాత్మను మార్గవిశేషముద్వారా పొంది, సంసార్యవస్థను వదలి, పరమాత్మతుల్యముగా ఆవిర్భవించుచున్నాడు-అగుచున్నాడు అని ఈ శ్రుతికి సిద్ధాంతి చెప్పు అర్థము. (సంప్రసాదః అనగా జీవుడు)

**సంశయము:-** పరమాత్మను పొందినవానికి దేవాదిశరీరమువంటి సాధ్యమైన శరీరముతో సంబంధము ఈ విషయవాక్యముచే చెప్పబడుచున్నదా? లేక స్వాభావికమైన స్వరూపావిర్భావమా? అనగా యజ్ఞయాగాదులను చేసినవాడు ఈ శరీరమును వదలి స్వర్గమునకు పోయినచో స్వర్గానుభవయోగ్యమైన దేవశరీరమును పొందినట్లు, విద్వాంసుడు ఈ శరీరమును వదలి పరంజ్యోతిస్సును-అనగా పరమాత్మను పొందినచో, పరమాత్మను అనుభవించుటకు యోగ్యమైన అసాధారణమైన శరీరము విద్యాబలముచే సాధించబడుచున్నదా? లేక సృష్టింపబడుచున్నదా? లేక స్వస్వరూపావిర్భావమా? అనగా కర్మచేత తిరోహితమైయున్న అపహతపాప్మత్వాది కల్యాణగుణములకు ఆవిర్భావమా?

**సంశయము వచ్చుటకు కారణము:-** విషయవాక్యమందున్న అభినిష్పత్తి, స్వేన అను శబ్దములచే సంశయము కలుగుచున్నది. అభినిష్పద్యతే-పుట్టుచున్నది అనుటచే సాధ్యమైన దేవతాశరీరమువలె సాధ్యమైన అసాధారణమైన శరీరము కలుగుతున్నది అని చెప్పాలని తోస్తున్నది. స్వేనరూపేణ- తన స్వరూపముతో అనుటచే స్వస్వరూపావిర్భావమే అని చెప్పవలెనని అనిపించుచున్నది. ఈ పక్షములలో ఏ పక్షము యుక్తియుక్తమైనదో నిర్ణయించలేకపోయినందున సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** సాధ్యమైన శరీరముతో సంబంధము కలుగుచున్నది అనే పక్షమే యుక్తియుక్తము. ఈ విధముగా అంగీకరించకపోయినచో మోక్షశాస్త్రము పురుషార్థములేనిదానిని చెప్పుచున్నదగును. సుషుప్తిదశలో - నిద్రాసమయములో దేహేంద్రియవ్యాపారములు లేని సమయములో కేవలము ఆత్మస్వరూపమునకు (ఇంద్రియాదిసంబంధములులేక ఆత్మమాత్రము స్వస్వరూపముతో నుండు సమయములో) ఆనందానుభవము మొదలైన పురుషార్థసంబంధముండదుగదా! దీనిని మనము ప్రతిరోజును అనుభవించుచున్నాము. కనుక స్వరూపము స్వతః అపురుషార్థముగనే యుండును.

అయ్యా! స్వస్వరూపావిర్భావమే అని చెప్పుటచే పరంజ్యోతిస్సును పొందినవానికి దుఃఖనివృత్తి మాత్రమే పురుషార్థము అని చెప్పుచున్నాము.

అయ్యా మీరు చెప్పునది సరికాదు. "స ఏకో బ్రహ్మణ ఆనన్దః, శ్రోత్రియస్య చ అకామహతస్య"

*పరంజ్యోతిరుపసమ్పన్నస్య పురుషార్థః, యేన స్వరూపావిర్భావ ఏవ మోక్ష ఇత్యుచ్యేత। 'స ఏకో బ్రహ్మణ ఆనన్దః । శ్రోత్రియస్య చాకామహతస్య'(తై.2-8-4) 'రసగ్ం హ్యేవాయం లబ్ధ్వాఽఽనన్దీ భవతి (తై.2-7-1) ఇత్యాదిభ్యో ముక్తస్య సుఖానన్త్య శ్రవణాత్ । న చాపరిచ్ఛిన్నానన్దరూపచైతన్యమేవాస్య స్వరూపం, తచ్చ సంసారదశాయామవిద్యయా తిరోహితం పరం జ్యోతిరుపసమ్పన్నస్యావిర్భవతీతి శక్యం వక్తుం, జ్ఞానస్వరూపస్య తిరోధానాసమ్భవాత్, ప్రకాశపర్యాయస్య జ్ఞానస్య తిరోధానం తద్వినాశ ఏవేతి హి పూర్వమేవోక్తమ్। న చ ప్రకాశమాత్రస్యాఽఽనన్దతా సమ్భవతి, సుఖస్వరూపతా హ్యానన్దస్వరూపతా, సుఖస్వరూపత్వం చాత్మనోఽనుకూలత్వమ్ । ప్రకాశమాత్రాత్మవాదినః కస్య ప్రకాశోఽనుకూలవేదనీయో భవేదితి ప్రకాశమాత్రాత్మవాదినః కథఞ్చిదప్యానన్ద స్వరూపతా దురుపపాదా। స్వరూపాపత్తిమాత్రే చ సాధ్యే స్వరూపస్య నిత్యనిష్పన్నత్వాత్ ఉపసమ్పన్నస్య 'స్వేనరూపేణాభినిష్పద్యతే' (ఛాం.8-12-3)*

---

(శ్రోత్రియః బ్రహ్మనిష్ఠః అకామహతః సాంసారికభోగానుపహతః– భోగములను వదలినవాడు. కనుక అతడు ముక్తుడు. అకామహతస్య శ్రోత్రియస్య ముక్తస్యాపి విషయానన్దో అస్తి। ముక్తస్య సర్వానన్ద అనుభవశాలిత్వాత్) ఉపనిషద్భాష్యమ్. "రసం హి ఏవాయం లబ్ధ్వా ఆనన్దీ భవతి। (సుకృతం అని చెప్పబడిన బ్రహ్మము రసము–ఆనన్దము. తల్లాభాత్– అస్య ఆనన్దిత్వమ్) అను శ్రుతివాక్యములచేత ముక్తునికి అధికసుఖమున్నట్లు తెలియుటచే దుఃఖనివృత్తిమాత్రము పురుషార్థమని చెప్పుట కుదరదు. అయం భావః– దుఃఖనివృత్తిమాత్రము మోక్షమన్నచో అది పురుషార్థ–అపురుషార్థములు కలసియుండుటచే సంసారమువంటిదే అగును. లోకములో దుఃఖనివృత్తియు, సుఖప్రాప్తియు ఇష్టముగానుండుట చూచు చున్నాము. సుఖనివృత్తియు, దుఃఖప్రాప్తియు అనిష్టముగా నుండును. వీటిలో దుఃఖనివృత్తి ఇష్టమైనది. సుఖనివృత్తి అనిష్టము. కనుక మోక్షమందు దుఃఖనివృత్తి కలుగుచున్నది అని చెప్పుటచే ఇష్టమును, సుఖము లభించదు అని చెప్పినచో అనిష్టమును(ఇష్టానిష్టములు) కలిసియున్నచో మోక్షమును సంసారతుల్యమగును. పురుషార్థాపురుషార్థమిశ్రము మోక్షము కాజాలదు. అపరిచ్ఛిన్నానందరూపచైతన్యమే ఆత్మయొక్క స్వరూపము. దానికి సంసారదశలో అవిద్యచే తిరోధానము(కప్పివేత) కలుగుచున్నది. పరంజ్యోతిస్సును పొందుటయు, ఆ ఆనందస్వరూపము ఆవిర్భవించుచున్నది అనిచెప్పుట సాధ్యముకాదు. జ్ఞానస్వరూపస్య తిరోధానాసంభవాత్ ప్రకాశాపరపర్యాయమైన జ్ఞానమునకు తిరోధానము అనునది దాని వినాశమేగదా! అని వెనుకనే చెప్పి యున్నాము. ప్రకాశమాత్రమునకు తిరోధానమును దాని నివృత్తియు కలిగినను పురుషార్థరూపత్వము స్వరూపమునకు సంభవించదు. సుఖస్వరూపతయే ఆనందస్వరూపతగదా! సుఖస్వరూపత్వము ఆత్మకు అనుకూలత్వము.

ఆత్మ అనునది ప్రకాశమాత్రమని చెప్పువారిపక్షమున ఎవరిప్రకాశము అనుకూలముగా తెలియబడుచున్నది? అనుకూలత్వము అనునది సప్రతియోగికధర్మవిశేషముగనుక ప్రకాశవత్ అని అర్థము. ఇట్లు చెప్పకపోయినచో అనుకూలత్వమే న స్యాత్ అని అభిప్రాయము.

ఈ విధముగా తర్కవిరోధము మాత్రము చెప్పబడినట్లు భావించవలదు. శ్రుతివిరోధముకూడ ఉన్నదనుచున్నారు. స్వరూపాపత్తినే పొందుచున్నాడు అన్నచో, స్వరూపమనునది నిత్యముగా నుండుటచే భగవానుని పొందినవానికి స్వేన రూపేణ అభినిష్పద్యతే (స్వరూపము ఆవిష్కృతమగుచున్నది) అను

*ఇతి వచన మనర్థకం స్యాత్। అతోऽపూర్వేణ సాధ్యేన రూపేణ సమ్పద్యతే। ఏవం చాభినిష్పద్యత ఇతి వచనం ముఖ్యార్థమేవ భవతి, స్వేన రూపేణేత్యప్యానన్దైకాన్తేన స్వాసాధారణేనాభినిష్పద్యత ఇతి సఙ్గచ్ఛతే ఇతి।*

*ఏవం ప్రాప్తే ప్రచక్ష్మహే సమ్పద్యావిర్భావః ఇతి। అయం ప్రత్యగాత్మాऽర్చిరాదినా పరం జ్యోతిరుపసమ్పద్య యం దశావిశేష మాపద్యతే స స్వరూపావిర్భావరూపః, నాऽపూర్వాకారోత్పత్తిరూపః। కుతః? స్వేన శబ్దాత్- స్వేనరూపేణేతి విశేషణోపాదానాదిత్యర్థః। ఆగన్తుకవిశేషపరిగ్రహే హి స్వేన రూపేణేతి విశేషణమనర్థకం స్యాత్। అవిశేషణేऽపి తస్య స్వకీయరూపత్వసిద్ధేః ॥ 1 ॥*

వాక్యము అర్థరహితమగును. కనుక అపూర్వేణ–కొత్తదియగు సాధ్యరూపముతో–ఆకారముతో–దేహముతో 'సంపద్యతే' చేరుచున్నాడు అనియే చెప్పవలెను. దీనిచే, "అభినిష్పద్యతే" అనుదానికి ముఖ్యార్థము చెప్పబడినట్లైనది.

అయ్యా! కొత్తదిగా వచ్చు శరీరముతో చేరుచున్నాడు అన్నచో 'స్వేన రూపేణ– తన ఆకారముతో' అని చెప్పుటకు అర్థమేమి? అన్నచో, "ఆనందైకాన్తమైన స్వాసాధారణధర్మముతో అభినిష్పత్తిని పొందు చున్నాడు.' అని చెప్పుట తగియున్నదగుచున్నది. (స్వశబ్దః అసాధారణ్యపరః నతు అసాధ్యత్వపరః అభినిష్పత్తివచనాత్. స్వరూపేణ అభినిష్పద్యతే –రూఢవిశిష్టతయా సాధ్యత ఇతి రూపం సాధ్యం ఇత్యర్థః. ఏవం చ సతి స్వశబ్ద అభినిష్పత్తి శబ్దౌ ఉభావపి ముఖ్యావిత్యర్థః"(శ్రుతప్రకాశిక) (స్వేన అనునప్పుడు స్వశబ్దమునకు అసాధారణధర్మపరముగా అర్థము చెప్పవలెను. మీరు చెప్పునట్లు అసాధ్యత్వమును సాధ్యముకాని ఆకారమును చెప్పుచున్నది అనిగాదు. స్వరూపేణ అభినిష్పద్యతే–రూపవిశిష్టతయా సాధ్యతే ఇతి రూపం సాధ్యం ఇత్యర్థః)(శ్రుతప్రకాశిక)

**సిద్ధాంతము:**– ముక్తుడైన జీవాత్మ అర్చిరాదిమార్గముద్వారా పరంజ్యోతిస్సును పొంది ఏ దశావిశేషమును–జ్ఞానవికాసరూప అవస్థను పొందుచున్నాడో అదియే స్వరూపావిర్భావము (జ్ఞానవికాసము ఒక కాలవిశేషములో కలుగునది గనుక దానికి అవస్థాత్వము సిద్ధించుచున్నది. జ్ఞానమనునది వికాసార్హము గనుక స్వాభావికత్వము సిద్ధించుచున్నది) అపూర్వ–ఆకార ఉత్పత్తిరూపముకాదు. ఎందుచేతననగా– విషయవాక్యములో – శ్రుతిలో 'స్వేన' అనే శబ్దమున్నందున. అనగా, 'స్వేన రూపేణ' అని రూపమునకు విశేషణముగా చెప్పబడినందున అని అర్థము. దేవాదిశరీరమువలె విద్యాసాధ్యమైన శరీరమును పొందుచున్నాడు అన్నచో "స్వేన రూపేణ" అను విశేషణము అనర్థకం స్యాత్– అర్థం లేనిదే అగును. అయ్యా! అర్థరహితమెందుకైనది? ఆనందైకతానమైన స్వ–అసాధారణేన అభినిష్పద్యతే అని వెనకనే సమాధానము చెప్పియున్నాముగదా!

అయ్యా స్వేన రూపేణ అను విశేషణములేకుండ "పరంజ్యోతిరుపసంపద్య అభినిష్పద్యతే" అని చెప్పినను, ముక్తునికి స్వకీయమైన రూపము సిద్ధించును. అనగా, బ్రహ్మసంబంధముచేతనే తదసాధారణత్వం స్వరూపమునకు ఆనందైకతానత్వము సిద్ధము. అన్యుని రూపముచే వేరొకటి కలుగదు. కనుక తత్సంబంధముచేత తదసాధారణ్యము సిద్ధము. అందుచే స్వేన అను పదము అర్థరహితమగును. కనుక స్వరూపావిర్భావము కలుగును అనియే చెప్పవలెను.

*యత్తూక్తం స్వరూపస్య నిత్యప్రాప్తత్వాదుపసమ్పద్యాభినిష్పద్యత ఇతి వచనమనర్థకమితి తత్రోత్తరమ్-*

**॥ సి. సూ ॥ ముక్తః ప్రతిజ్ఞానాత్ ॥ 4-4-2 ॥**

*కర్మసమ్బన్ధతత్కృతదేహాదివినిర్ముక్తః స్వాభావిక రూపేణావస్థితోఽత్ర 'స్వేనరూపేణాభి-నిష్పద్యతే'(ఛాం.8-12-3)ఇత్యుచ్యతే। అతో నిత్యప్రాప్తస్యాపి స్వరూపస్య కర్మరూపావిద్యాతిరోహితస్య తిరోధాననివృత్తి రత్రాభినిష్పత్తిరుచ్యతే, కుతః? ప్రతిజ్ఞానాత్। సా హి ప్రతిపాద్యతయా ప్రతిజ్ఞాతా। కుత ఇదమవగమ్యతే, "య ఆత్మేతి" ప్రకృతం ప్రత్యగాత్మానం జాగరితాద్యవస్థా త్రితయవినిర్ముక్తం ప్రియాప్రియ హేతుభూతకర్మారబ్ధశరీరవినిర్ముక్తం చ ప్రతిపాదయితుమ్ 'ఏతం త్వే భూయో ఽనువ్యాఖ్యాస్యామి'(ఛాం.8-11-3)ఇతి పునః పునరుక్త్వా 'ఏవమేవైష సమ్ప్రసాదోస్మాచ్ఛరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసమ్పద్య స్వేనరూపేణాభినిష్పద్యతే' ఇత్యభిధానాత్ । అతః కర్మణా సంబద్ధస్య*

---

అయ్యా, స్వరూపమనగా నిత్యప్రాప్తముగనుక "ఉపసంపద్య అభినిష్పద్యతే" - బ్రహ్మమును పొందిన తరువాతనే స్వరూపావిర్భావము కలుగుచున్నది అను వచనము- అభినిష్పద్యతే అనునది అర్థరహిత మగుచున్నది అని మీచే చెప్పబడుటకు సమాధానమును చెప్పుచున్నాము వినుడు-

**॥ సి. సూ ॥ ముక్తః ప్రతిజ్ఞానాత్ (4-4-2) ॥**

కర్మసంబంధమైతేనేమి, దానివలన కలిగిన దేహసంబంధమైతేనేమి, వీటినుండి విడిపడి స్వాభావిక రూపంతో నున్నవానిని ఇచ్చట స్వేనరూపేణ అభినిష్పద్యతే అని చెప్పుతున్నది. కనుక, స్వరూపము నిత్యప్రాప్తమైనను, కర్మమని పేరుగల అవిద్యచే కప్పబడిన స్వరూపముయొక్క తిరోధాననివృత్తియే అభినిష్పత్తి అని చెప్పబడుచున్నది. అనగా, ఇదివరకు లేని తిరోధాననివృత్తియే కలుగుచున్నది. దీనివలన అభినిష్పద్యతే అనునది అర్థరహితమగుటలేదు. కుతః? ఈవిధముగా ఎందు చెప్పవలెను? ప్రతిజ్ఞానాత్- తిరోధాననివృత్తిని చెప్పునదిగా ప్రతిజ్ఞను చేసియున్నందువలన. (సా- తిరోధాన నివృత్తిః నివృత్తతిరోధానస్వరూపం ప్రతిజ్ఞాతమిత్యర్థః) ఇట్లు ప్రజాపతి ప్రతిజ్ఞ చేసిరనునది దేనిచే తెలియుచున్నది? అన్నచో, వివరముగా చెప్పుచున్నాను వినుము- "య ఆత్మా" అని ఆరంభములో ప్రత్యగాత్మను సూచించి చెప్పుటచే, ప్రకృతమైన ప్రత్యగాత్మను జాగరిత(కన్నులు విప్పియున్న దశ), స్వప్న, సుషుప్తి(నిదురించు సమయము) అవస్థలలో నుండి విడివడినవాడై ప్రియాప్రియములకు - సుఖదుఃఖములకు కారణమైన పుణ్యాపుణ్యకర్మలచే ఆరంభించబడిన శరీరమునుండి వినిర్ముక్తుడగుచున్నాడు అని చెప్పుటకే 'ఏతం త్వేవ తే భూయః అనువ్యాఖ్యాస్యామి" (ఛాం. 8. 11. 3) (పూర్వము చెప్పిన ఆత్మనిగురించియే (దోషములేనిదిగా) తిరిగి చెప్పుచున్నాను) అని మరల మరల చెప్పి, "ఏవమేవ ఏష సంప్రసాదః అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య స్వేన రూపేణ అభినిష్పద్యతే" (ఛాం, 8. 12. 2) అని చెప్పియుండుటచే తెలియుచున్నది. అనగా, జాగరితాద్యవస్థలలో ప్రతి పర్యాయమునను "ఏతం త్వేవ తే భూయః అనువ్యాఖ్యాస్యామి" అని చెప్పిరి. ఈవిధముగా ప్రతిసారిని, చెప్పబడిన ఏతత్ శబ్దము ప్రాకృతమైన అర్థమును పరామర్శించుటచేత "య ఆత్మా" అనుటచే ప్రకృతమైన ఆత్మ అపహతపాప్మత్వాది

*పరంజ్యోతిరుపసంపద్య బన్ధనివృత్తిరూపా ముక్తిః స్వేనరూపేణాభినిష్పత్తిరుచ్యతే। స్వరూపావిర్భావే ఽప్యభినిష్పత్తిశబ్దో దృశ్యతే, యుక్త్యాఽయమర్థో నిష్పద్యత ఇత్యాదిషు ॥ 2 ॥*

*యచ్చోక్తమ్ ఆత్మస్వరూపస్య సుషుప్తావపురుషార్థత్వదర్శనాత్ స్వరూపావిర్భావే మోక్షశాస్త్రస్య అపురుషార్థావబోధిత్వం స్యాదితి కృత్వా దేవాద్యవస్థావత్సుఖసమ్బన్ధ్యవస్థాన్తర ప్రాప్తిః అభినిష్పత్తిరితి, తత్రోత్తరమ్-*

***॥ సి. సూ ॥ ఆత్మా ప్రకరణాత్ ॥ 4-4-3 ॥***

*స్వరూపేణైవాయమాత్మా అపహతపాప్మత్వాదిసత్యసఙ్కల్పత్వపర్యన్త గుణకః ప్రకరణాదవ గమ్యతే 'య ఆత్మాఽపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసఙ్కల్పః'* (ఛాం. 8-7-1) *ఇతి హి ప్రజాపతివాక్యప్రక్రమః । ఇదం చ ప్రకరణం ప్రత్యగాత్మవిషయమితి*

---

గుణాష్టకములను గలది అనియు, ఆ గుణములు జాగ్రతాద్యవస్థలలో గుణాష్టకములతో కూడిన స్వాభావికరూపమును చెప్పునదిగా ప్రతిజ్ఞ చేసిరి అని అర్థము. కనుక కర్మసంబంధము గలవానికి పరంజ్యోతిస్సును పొంది, కర్మబంధనివృత్తిరూపమైన ముక్తి యనునది "స్వేన రూపేణ" అభినిష్పద్యతే అని చెప్పబడుచున్నది.

అభినిష్పత్తి శబ్దము స్వరూపావిర్భావమును ఎట్లు చెప్పును? అన్నచో, స్వరూపావిర్భావముమందును "యుక్త్యా అయమర్థః నిష్పద్యతే- యుక్తిచేత ఈ అర్థము వచ్చుచున్నది' అని అభినిష్పత్తి శబ్దము ప్రయోగించబడియుండుటను చూడవచ్చును. భాష్యమందు ఇత్యాదిషు అన్నచోట నున్న ఆదిశబ్దముచేత "విచార్య చ పునఃపునః ఇదం ఏకం సునిష్పన్నమ్" అను ప్రయోగముకూడ వివక్షితము. అయమర్థః- సిద్ధ్యర్థత్వేన ప్రయోగించబడియున్న అభినిష్పత్తి శబ్దము ఆవిర్భూతమునకు వాచకము అని తాత్పర్యము

పూర్వపక్షి ఆత్మస్వరూపమునకు సుషుప్తిదశలో – నిద్రించుకాలములో సుఖాదులేమియు లేనందున అపురుషార్థముగా నుండుటను చూచుటచేత స్వరూపావిర్భావములో మోక్షశాస్త్రము అపురుషార్థమునే బోధించుచున్నది- తెలుపుచున్నది, అని చెప్పబడినట్లగును అని భావించియే దేవాద్యవస్థనువలె సుఖసంబంధి- సుఖమును అనుభవించదగిన అవస్థాన్తరప్రాప్తియే అభినిష్పత్తి అని చెప్పినందుకు సమాధానమును ప్రసాదించుచున్నారు –

***॥ సి. సూ ॥ ఆత్మా ప్రకరణాత్ ॥ 4-4-3 ॥***

ఈ ఆత్మ స్వరూపమందే అపహతపాప్మత్వాది సత్యసఙ్కల్పత్వ పర్యన్తగుణాష్టకమును గలవాడు అని అచ్చటనున్న ప్రకరణముచే తెలియవచ్చుచున్నది. అనగా ప్రజాపతి యనువారు "య ఆత్మా, అపహతపాప్మా, విజరః, విమృత్యుః విశోకః విజిఘత్సః, అపిపాసః, సత్యకామః సత్యసంకల్పః సోన్వేష్టవ్యః (ఛాం. 8-7-1) (ఏ ఆత్మ అనునది పాపము లేనిదై, ముసలితనము, మరణము, శోకము, ఆకలి, దాహము మొదలగువాటిని పోగొట్టుకొనినదై, సత్యకామత్వ సత్యసఙ్కల్పత్వ కల్యాణగుణములు గలదియై, యున్నదో అది వెతకదగినది) అని చెప్పి, తమ ఉపదేశమును ప్రారంభించుచున్నారు.

అయ్యా, పరమాత్మకు గదా ఈ గుణములు ఉన్నట్లుగా చెప్పబడుచున్నది? అందుచే, ఈ వాక్యము పరమాత్మవిషయముగదా।అందుచేత ఈ వాక్యము పరమాత్మవిషయమే గదా!

*"ఉత్తరాచ్చేదావిర్భూతస్వరూపస్తు"(బ్ర.సూ.1-3-18)ఇత్యత్ర ప్రతిపాదితమ్। అతోऽపహతపాప్మత్వాదిస్వరూప ఏవాయమాత్మా సంసారదశాయాం కర్మాఖ్యాऽవిద్యయా తిరోహితస్వరూపః పరంజ్యోతిరుపసమ్పద్య ఆవిర్భూతస్వరూపో భవతి । అతః ప్రత్యగాత్మనోऽపహతపాప్మత్వాదయః స్వాభావికా గుణాః పరం జ్యోతిరుపసంపన్నస్యాऽऽవిర్భవన్తి; నోత్పద్యన్తే, యథోక్తం భగవతా శౌనకేనాపి - "యథా న క్రియతే జ్యోత్స్నా మలప్రక్షాలనాన్మణేః । దోషప్రహాణాన్న జ్ఞానమాత్మనః క్రియతే తథా॥ యథోదపానకరణాత్ క్రియతే న జలామ్బరమ్ । సదేవ నీయతే వ్యక్తిమసతః సమ్భవః కుతః? ॥ తథా హేయగుణధ్వంసా-దవబోధాదయో గుణాః । ప్రకాశ్యన్తే న జన్యన్తే, నిత్యా ఏవాऽऽత్మనో హి తే ॥"(విష్ణుధర్మ.104-55,56,57)ఇతి।*

---

అయ్యా, ఈ ప్రకరణం ప్రత్యగాత్మ ప్రకరణం అని ఉత్తరాచ్చేత్ ఆవిర్భూతస్వరూపస్తు (1.3.18) అనే సూత్రవ్యాఖ్యానంలో విశేషంగా నిరూపించబడింది.

అపహతపాప్మత్వాది గుణాలుస్వాభావికమైనవి అంటే ఆ గుణాలు ఎల్లప్పుడూ కూడా ప్రకాశిస్తూండాలి గదా! కాని అలా ప్రకాశించటం లేదే! ఎందువలన? ఈ ఆత్మ అపహతపాప్మస్వరూపుడే. సంసారదశలో కర్మ అని పేరున్న అవిద్యచేత తిరోహితః- అడ్డుకొనబడిన స్వరూపంగల అతడు పరంజ్యోతిస్సుని పొందిన తరువాత ఆవిర్భవించిన స్వరూపుడు అగుచున్నాడు. కనుక, ప్రత్యగాత్మకి అపహతపాప్మత్వాది స్వాభావిక గుణాలు పరంజ్యోతిస్సునిపొందినవాడికి ఆవిర్భవిస్తున్నాయి, ప్రకాశిస్తున్నాయి కొత్తగా పుట్టటం లేదు. శౌనకభగవానులు ఈ విధంగానే చెప్తున్నారు-

1. *"యథా న క్రియతే జ్యోత్స్నా మలప్రక్షాలనాన్మణేః ।*
   *దోషప్రహాణాన్న జ్ఞాన మాత్మనః క్రియతే తథా।'*
2. *"యథోదపానకరణాత్ క్రియతే న జలామ్బరమ్ ।*
   *సదేవ నీయతే వ్యక్తిమసతః సమ్భవః కుతః? ।"*
3. *"తథా హేయగుణధ్వంసాదవబోధాదయో గుణాః ।*
   *ప్రకాశ్యన్తే న జన్యన్తే నిత్యా ఏవాత్మనో హి తే ।"* (వి.ధ.104-55,56,57)

వజ్రమునకు పైన మకిలవలె పట్టుకొనియున్న మాలిన్యమును మంచినీటితో కడిగివేసిన తరువాత ఆవజ్రానికి ఉన్న ప్రకాశం కొత్తగా కలిగించబడినది కాక సహజమైనదే ఆవిష్కృతమైనట్లు దోషాలు తొలగిపోయిన తరువాత జీవాత్మకి జ్ఞానాన్ని కొత్తగా కలిగించటం లేదు. అంటే వజ్రంలోనున్న మాలిన్యం కడిగివేయబడటంతో తనంతటతానుగా ఆ వజ్రముయొక్క కాంతి ప్రసరిస్తున్నట్లుగా, అజ్ఞానము, అవిద్య తొలగిపోయినచో అనగా దోషహేతువగు ప్రాకృత సంబంధము తొలగిపోగా జ్ఞానము తనంతటతానుగా ప్రసరించుచున్నది. జలమునో ఆకాశమునో (అవకాశమునో) కొత్తగా సృష్టించు లేదుగదా! అనగా జలము మొదలైనవి ఇదివరలోనే మొదటనే యున్నవి. కనుక సదేవ నీయతే వ్యక్తిం - మునుపు ఉన్నవే ఇప్పుడు అభివ్యంజ్యమైన దశను పొందుచున్నవి. పూర్వము లేనిదానినుండి సత్- ఒక వస్తువు ఎట్లు కొత్తగా సృష్టింపబడును? అసతః సంభవః కుతః? (ద్రవ్యమంతయు సత్ అని సత్కార్యవాదులు చెప్పుదురు). వెనుకచెప్పినట్లు, హేయగుణనాశముచే- పుణ్యపాపరూపకర్మము నాశమును పొందినచో ధర్మభూత జ్ఞానమును, అపహతపాప్మత్వాది శక్తివిశేషములును ప్రకాశించుచున్నవి. న జన్యన్తే-క్రొత్తగా పుట్టుట

*అతో జ్ఞానానన్దాది గుణానాం కర్మణాఽఽత్మని సఙ్కుచితానాం పరం జ్యోతిరుపసంపద్య కర్మ-రూపబన్ధక్షయే వికాసరూపావిర్భావో నానుపపన్న ఇతి సుష్ఠూక్తం సమ్పద్యావిర్భావః- ఇతి।3॥*

*॥ ఇతి సమ్పద్యావిర్భావాధికరణమ్ ॥ 1 ॥*

## *॥ అవిభాగేనదృష్టత్వాధికరణమ్॥ 4-4-2 ॥*

### *॥ సి. సూ ॥ అవిభాగేన దృష్టత్వాత్ ॥ 4-4-4 ॥*

*కిమయం పరం జ్యోతిరుపసమ్పన్నః సర్వబన్ధవినిర్ముక్తః ప్రత్యగాత్మా స్వాత్మానం పరమాత్మనః పృథగ్భూతమనుభవతి? ఉత తత్ప్రకారతయా తదవిభక్తమ్-ఇతి విశయే 'సోఽశ్నుతే సర్వాన్కామాన్*

---

లేదు. ఆత్మగుణములైన అవి నిత్యములు అని శౌనకభగవాను ప్రసాదించియున్నారు. కనుక కర్మచే సంకుచితమైన జ్ఞానానందాది గుణములకు, పరమాత్మను పొందుటయు- కర్మబంధము నివృత్తమగుటయు, వికాసరూపమైన ఆవిర్భావము కలుగుచున్నదను విషయములో ఏవిధమైన అనుపపత్తియు లేదని సంపద్యావిర్భావాత్ అన్నదానిచే బాగుగా వివరించబడినది.

సంపద్యావిర్భావాధికరణము ముగిసినది.

## *అవిభాగేన దృష్టత్వాధికరణము (4-4-2)*

### *॥ సి. సూ ॥ అవిభాగేన దృష్టత్వాత్ (4-4-4)*

సూత్రార్థము:- **అవిభాగేన**= తనను పరమాత్మతో అభిన్నునిగానే భావించుచు ఆనందానుభవమును పొందును. ఎందుకనగా - **దృష్టత్వాత్**= బ్రహ్మసన్నిధికి చేరిన పిదప ప్రాకృతసంబంధము పూర్తిగా తొలగిపోయినందున తాను బ్రహ్మకు అవిభక్తవిశేషణమైనవాడను అని యథాతథముగా తన స్వరూపమును గ్రహించినందున అని సూత్రార్థము.

**సంగతి:-** పరబ్రహ్మమును పొందుటచే స్వరూపావిర్భావము కలిగినవానికి పరబ్రహ్మమును అనుభవించు ప్రకారము ఇందులో చెప్పబడినది.

**విషయము:-** 'సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా' అను శ్రుతిని ప్రధానముగా తీసికొని విచారించుచున్నారు.

**సంశయము:-** పరంజ్యోతిస్సును పొంది, సర్వబంధములనుండి వినిర్ముక్తుడైన- విడిపడిన వాడైన ఈ జీవాత్మ తనను పరమాత్మకంటెను వేరైనవానిగ అనుభవించుచున్నాడా? లేక అతడికి ప్రకారముగా నున్నందున అతడును తానును అవిభక్తులు (వదలి వేరుగానుండనివారు- అపృథక్సిద్ధులు) ప్రకారి-ప్రకారములుగా అనుభవించుచున్నాడా? అనగా, అహం బ్రహ్మాస్మి అని అనుభవించుచున్నాడా?

**సంశయము వచ్చుటకు కారణము:-** "సోఽశ్నుతే సహ బ్రహ్మణా విపశ్చితా" అను శ్రుతికి "పుత్రేణ సహౌదనం భుఙ్క్తే' అనునప్పుడువలె బ్రహ్మముతోకూడ ముక్తుడు బ్రహ్మముయొక్క కల్యాణగుణములను అనుభవించుచున్నాడు అని అర్థము చెప్పవలెనా? అనగా- భోక్తృసాహిత్యపరముగా - ఇద్దరును (కలసియుండి) భుజించుచున్నారు- అనుభవించుచున్నారు అని అర్థమా? ఈవిధముగా

*సహ బ్రహ్మణా విపశ్చితా' (తై. 2-1-1) 'యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్ । తదా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరఞ్జనః పరమం సామ్యముపైతి॥'(ముం.3-1-3), 'ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః । సర్గేऽపి నోపజాయన్తే ప్రలయే న వ్యథన్తి*

అర్థమును చెప్పినచో, బ్రహ్మమువేరు, జీవాత్మవేరు అని చెప్పవలెను. లేక "క్షీరేణ సహ ఓదనం భుఙ్క్తే" అన్నప్పటివలె, భోగ్యసాహిత్యపరముగా అర్థము చెప్పినచో, అనగా బ్రహ్మము, అతడి కల్యాణగుణములును అనుభవింపబడుచున్నవి (అనుభవించువాడు ఒకడు, అనుభవింపబడు వస్తువులు రెండు), ఇచ్చట క్షీరస్థానములోనున్న బ్రహ్మము అప్రధానము. ఓదనస్థానములోనున్న గుణములు ప్రధానము అని చెప్పినచో పృథక్త్వేన అనుభవించుచున్నాడని చెప్పుట కుదరదు. కనుక తత్త్వమస్యాది శ్రుతులను చూచినచో అవిభాగేన అనుభవించుచున్నాడు అని చెప్పవలెను అని తోచుచున్నది. ఈ పక్షములలో ఏ పక్షము యుక్తియుక్తమో నిర్ణయించలేనివానికి సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** "సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా" (తై.ఆ. 1)(బ్రహ్మముతో కూడ కలసి అతడి కల్యాణగుణములను అనుభవించుచున్నాడు. అనగాముక్తుడు పరమాత్మయొక్క గుణములను అనుభవించుచున్నాడు. బ్రహ్మముకూడ అనుభవించుచున్నది అని అర్థము.) 'యదా పశ్యః పశ్యతే రుక్మవర్ణం కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిం। తథా విద్వాన్ పుణ్యపాపే విధూయ నిరఞ్జనః పరమం సామ్యముపైతి" (ముం. 3. 1. 3) (ఎప్పుడు దేదీప్యమైన దివ్యమంగళవిగ్రహంతోనున్న జగదీశ్వరుడును, కర్తయు, (ప్రకృతికి) ఉపాదానకారణభూతుడును నిరుపాధికపురుషశబ్దవాచ్యుడును అయిన వాసుదేవుని దర్శించుచున్నాడో అప్పుడే పుణ్యపాపములని వదల్చుకొని, నిరఞ్జనః- సూక్ష్మకర్మసంబంధమునుకూడ వదలి, నిర్దోషుడై, బ్రహ్మసంబంధియైన అపహతపాప్మత్వాది గుణాష్టకములను పొంది, బ్రహ్మముతో సామ్యమును పొందుచున్నాడు) ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః। సర్గేపినోపజాయన్తే ప్రళయే న వ్యథన్తి చ।। (గీ. 14. 2) ఈ జ్ఞానాన్ని పొందినవారు నాయొక్కసాధర్మ్యమును పొందుచున్నారు. వారు సృష్టికాలములో సృష్టింప బడలేదు, ప్రళయకాలములో కష్టపడుటయు లేదు. ఇట్టి శ్రుతిస్మృతులచే ముక్తునికి పరబ్రహ్మముతోకూడ సాహిత్యసామ్యసాధర్మ్యము చెప్పియుండుటచేత పృథగ్భూతం అనుభవతి అనియే అర్థము చెప్పవలెను.

ఇచ్చట చెప్పబడిన సామ్యసాధర్మ్యశబ్దములు అర్థభేదములను గలవి అను అభిప్రాయముచే రెండు విధములుగా చెప్పబడుటలేదు. శ్రుతిస్మృతులలో వేరువేరు పదములను ప్రయోగించి చెప్పుటచే రెండింటిని చెప్పియున్నారు.

(సాహిత్యశ్రుతికి విరోధము వచ్చును గనుక అవిభాగశబ్దమునకు అభేదార్థము చెప్పకూడదు. పరమసామ్యశ్రుతికి విరోధము వచ్చును గనుక ప్రకారప్రకారిభావము చెప్పకూడదు. కనుక పృథక్త్వేన అనుభవతి అనియే అర్థము చెప్పవలెను. శ్రుతిలో ప్రకారప్రకారిభావము చెప్పియుండుట బద్ధదశలో చెప్పబడినదని గ్రహించవలెను. పూర్వపక్షములో పితృస్థానములోనున్న ముక్తుడు ప్రధానుడు. పుత్రస్థానములోనున్న బ్రహ్మము అప్రధానమగుచున్నది.)

*చ॥'(భ.గీ.14-2) ఇత్యాది శ్రుతిస్మృతిభ్యాం ముక్తస్య పరేణ సాహిత్యసామ్యసాధర్మ్యావగమాత్ పృథగ్భూత మనుభవతి-*

*ఇతి ప్రాప్తే ఉచ్యతే - అవిభాగేన- ఇతి। పరస్మాద్బ్రహ్మణః స్వాత్మానమవిభాగేనానుభవతి ముక్తః । కుతః? దృష్టత్వాత్- పరబ్రహ్మోపసమ్పత్త్యా నివృత్తావిద్యాతిరోధానస్య యాథాతథ్యేన స్వాత్మనో దృష్టత్వాత్ । స్వాత్మనః స్వరూపం హి 'తత్త్వమసి' (ఛాం.6-8-7) 'అయమాత్మా బ్రహ్మ' (బృ.4-5-19) 'ఐతదాత్మ్యమిదం సర్వమ్' (ఛాం.3-14-1) 'సర్వం ఖల్విదం బ్రహ్మ' (ఛాం.3-14-1) ఇత్యాది సామానాధికరణ్య నిర్దేశైః 'య ఆత్మని తిష్ఠన్నాత్మనోఽన్తరో యమాత్మా న వేద యస్యాఽఽత్మా శరీరం య ఆత్మాన మన్తరో యమయతి స త ఆత్మాఽన్తర్యామ్యమృతః'(బృ.మా.6-7), 'అన్తః ప్రవిష్టః శాస్తా జనానాం సర్వాత్మా' (య.ఆ.1-3-21) ఇత్యాదిభిశ్చ పరమాత్మాత్మకం తచ్ఛరీరతయా తత్ప్రకారభూతమితి ప్రతిపాదితమ్-''అవస్థితేరితి కాశకృత్స్నః'(బ్ర.సూ.1-4-22) ఇత్యత్ర । అతోఽవిభాగేన అహం*

---

అయ్యా వెనుక 'ఆత్మేతి తు ఉపగచ్ఛతి గ్రాహయన్తి చ"(4-1-3)అనే సూత్రంలో తత్క్రతున్యాయం వలన యథా ఉపాసనం తథా ఫలం అని ఉపాసనం ఎట్లా ఉంటే ఫలంకూడా దానికి తగినట్లే ఉంటుంది అని అంటే- ఇక్కడ ఉపాసించినప్రకారమే ముక్తదశలో ఫలమును అనుభవిస్తాడు గనుక తనయొక్క ఆత్మగానే, అహం బ్రహ్మాస్మి అనే ఉపాసించవలెను అని నిర్ధారణం చెయ్యబడియున్నది. దానికి బదులుగా పూర్వపక్షి పృథక్త్వేన అనుభవించవలెను అని ఎట్లు చెప్పుట కుదురును? ఈ ఆక్షేపమునకు సమాధానము చెప్పుచున్నాము. వినుడు. సహశ్రుతి, సామ్యశ్రుతి సాధర్మ్యస్మృతి వీటి బలముచేత తత్క్రతున్యాయము తిరస్కరించబడుచున్నది. దీనిని పూర్వపక్షియొక్క అభిప్రాయముగా గ్రహించవలెను.

**సిద్ధాంతము:-** ముక్తుడు పరబ్రహ్మముతో తన ఆత్మను అవిభాగముగా అనుభవించు చున్నాడు. ఎందుచేత? దృష్టత్వాత్- పరబ్రహ్మమును పొందుటచే, జ్ఞానసంకోచాదులను కలిగించిన అవిద్య నివృత్తమైనవానికి యథావస్థితమైన ఆత్మను చూచినను, తన స్వరూపము "తత్త్వమసి", "అయమాత్మా బ్రహ్మ", "ఐతదాత్మ్యమిదం సర్వమ్", "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఇత్యాది శ్రుతులలో సామానాధికరణ్యము చెప్పబడియుండుటచేతనును, "య ఆత్మని తిష్ఠన్, ఆత్మనో అన్తరో యమాత్మా న వేద, యస్య ఆత్మా శరీరం య ఆత్మానం అన్తరోయమయతి స త ఆత్మా అన్తర్యామి అమృతః", "అన్తః ప్రవిష్టః శాస్తా జనానాం సర్వాత్మా" ఇత్యాది శ్రుతులచేతను పరమాత్మాత్మకముగా - పరమాత్మను ఆత్మగా గలదిగా నుండుటచేత తత్ప్రకారభూతమ్ అని చెప్పబడినది. ఈ అర్థము అవస్థితేః ఇతి కాశకృత్స్నః (1-4-22) అను సూత్రమందును చెప్పబడినది. కనుక అవిభాగేన అహం బ్రహ్మాస్మి అనియే అనుభవించుచున్నాడు. సామ్యసాధర్మ్యవ్యపదేశము బ్రహ్మమునకు ప్రకారభూతమైన ప్రత్యగాత్మ యొక్క స్వరూపము పరమాత్మకు సమము అన్నది కర్మకృత దేవాదిప్రాకృతశరీరమును వదలినందున కలుగు బ్రహ్మసమానశుద్ధిని చెప్పుచున్నదని తాత్పర్యము. సహశ్రుతి బ్రహ్మసమానశుద్ధిని పొందిన ప్రత్యగాత్మకు ప్రకారియైన బ్రహ్మముతో కూడ అతడి గుణానుభవములను, అనుభవించుటను చెప్పుచున్నదనుటచే ఏవిధమైన విరోధమును లేదు. బ్రహ్మప్రకారతయా తదవిభాగముగా చెప్పబడినది "సంకల్పాదేవతత్ శ్రుతేః" అనుటకు విరోధమును పొందుట లేదు. "అధికం తు భేదనిర్దేశాత్",

*బ్రహ్మాస్మీత్యేవానుభవతి । సామ్యసాధర్మ్యవ్యపదేశో బ్రహ్మప్రకారభూతస్యైవ ప్రత్యగాత్మనః స్వరూపం తత్సమమితి దేవాదిప్రాకృతరూపప్రహాణేన బ్రహ్మసమానశుద్ధిం ప్రతిపాదయతి। సహశ్రుతి స్త్వేవం-భూతస్య ప్రత్యగాత్మనః ప్రకారిణా బ్రహ్మణా సహ తద్గుణానుభవం ప్రతిపాదయతీతి న కశ్చిద్విరోధః। బ్రహ్మప్రకారతయా తదవిభాగోక్తేర్హి 'సఙ్కల్పాదేవ తచ్ఛ్రుతేః'(బ్ర.సూ.4-4-8) ఇత్యాది న విరుధ్యతే, 'అధికం తు భేదనిర్దేశాత్'(బ్ర.సూ. 2-1-22) 'అధికోపదేశాత్'(బ్ర.సూ. 3-4-8) ఇత్యాది చ॥4॥*

*॥ ఇతి అవిభాగేనదృష్టత్వాధికరణమ్ ॥ 2 ॥*

"అధికోపదేశాత్" ఇత్యాది సూత్రములు జీవుని కంటెను బ్రహ్మమును పృథక్త్వేన కూడ చెప్పియున్నవి.

## సూచన

అయ్యా! ప్రకారప్రకారి భావము చెప్పినచో పరమసామ్యశ్రుతితో విరోధించునని చెప్పితిని. ప్రకారప్రకారిభావమును శ్రుతిచెప్పియున్నదే అనవచ్చును. ప్రకారప్రకారి భావమనునది బద్ధదశలోనే అని నాచే చెప్పబడినదన్నచో దీనికి సమాధానము వివరముగా చెప్పుచున్నాము, వినుడు. ప్రకారప్రకారి–భావమును చెప్పినను పరమసామ్యశ్రుతితో విరోధమును పొందుట లేదు. ఆనందాది పరమసామ్యమును చెప్పినను ప్రకారప్రకారిభావమును చెప్పవచ్చును. అన్ని గుణములతో సర్వాత్మనా సామ్యం చెప్పటం ఇక్కడ వివక్షితం కాదు. అన్నివిధాలచేతను సామ్యం చెప్పినందువలన వ్యావర్తక ధర్మాభావేన– ముక్తుడిని, బ్రహ్మమును విడివిడిగా చెప్పగలిగిన ధర్మమంటూ లేదుగనుక రెండూ ఒకటేనని (అభేదం) చెప్పవలసి వస్తుంది. కనుక ముక్తదశలో చెప్పబడిన పరమసామ్యం ప్రకారప్రకారిభావంగానే గ్రహించబడవలెను. కనుక బద్ధదశలోనే ప్రకారప్రకారిభావమని మీరు చెప్పటం సరికాదు. సర్వాత్మనాసామ్యమనేది ఎప్పుడూ సంభవించదు. ఇక్కడ చెప్పబడే సామ్యమనేది త్రాసులో ఒకప్రక్కని స్వర్ణాన్నీ, మరొకప్రక్కని తూకపురాళ్ళనీ వేసినప్పుడు కొంతమాత్రం(మితం)గానే రెండూ సమంగా ఉన్నట్టు చెప్పుతాం. అదేవిధంగా ఏదో ఒక ఆకారంచేతమాత్రం సామ్యం చెప్పటానికి సాధ్యం. వివక్షితమైన అంశంలో– చెప్పబడిన అంశంలో అత్యంతసామ్యమున్నందున పరమసామ్యం చెప్పబడు తున్నది. దానివలన ప్రకారప్రకారిభావానికి ఎటువంటి విరోధమూ లేదు.

ఈ సూత్రంలోనున్న 'అవిభాగేన' అనే పదం జీవపరమాత్మలకి స్వరూపైక్యాన్ని చెప్పటం లేదు. స్వరూపైక్యాన్ని చెప్పుతున్నట్లుగా తీసికొన్నట్లైతే, ముందువెనకటి సూత్రాలకి విరోధం వస్తుంది. 'సమ్పద్యావిర్భావస్స్వేనశబ్దాత్" అనే సూత్రంలో బ్రహ్మప్రాప్తిచేత జీవునికి స్వరూపావిర్భావం చెప్పబడింది. దానివలన పరమాత్మను ప్రాప్యమని, ప్రత్యగాత్మని ప్రాప్త అనిన్నీ చెప్పబడింది. అందువలన వీరి స్వరూపాలు వేరువేరు అని స్పష్టం. వీరికి ఐక్యం చెప్పటం కుదరదు. ఈ విషయం కర్మకర్తృవ్యపదేశాత్ (1.2.4) అన్న సూత్రంలోనే స్పష్టంగా చెప్పబడియున్నది. అదేవిధంగా సంకల్పాదేవ తచ్ఛ్రుతేః అని తరువాత చెప్పబడే సూత్రంలో ముక్తుడి సంకల్పంచేత పిత్రాదులను సృష్టించునట్లుగా చెప్పబడి యుండటంచేత ముక్తుడు వేరు, బ్రహ్మము వేరు అని తెలిస్తున్నది. ముక్తునికిని, బ్రహ్మమునకును ఐక్యమును చెప్పినచో ముక్తుడు సృష్టిస్తున్నాడు అని సూత్రకారులు చెప్పినది అసంగతమగును. నిర్విశేషచిన్మాత్రబ్రహ్మముతో ఐక్యమును పొందినవానికి సృష్ట్యాదివ్యాపారము సంభవించనే సంభవించదు

## ॥ బ్రాహ్మాధికరణమ్ ॥ 4-4-3 ॥

### ॥ పూ. సూ ॥ బ్రాహ్మేణ జైమినిరుపన్యాసాదిభ్యః ॥ 4-4-5 ॥

ప్రత్యగాత్మనః పరం జ్యోతిరుపసమ్పద్య నివృత్తతిరోధానస్య స్వరూపావిర్భావ ఏవేత్యుక్తమ్। తత్ర యేన స్వరూపేణాయమాऽऽవిర్భవతి తత్స్వరూపం శ్రుతివైవిధ్యాద్విచార్యతే। కిమపహతపాప్మత్వాదిక మేవాస్య స్వరూపమితి తేనరూపేణాయమావిర్భవతి? ఉత విజ్ఞానమాత్రమేవేతి తేన రూపేణ?

---

జగద్వ్యాపారవర్జాధికరణముచేత ముక్తునికి జగద్వ్యాపారము- జగత్తును సృష్టించటమనేది లేదు అని చెప్పటంచేతకూడా ఈశ్వరుడికి జగద్వ్యాపారము చెప్పియుండుటచేతను, వారిలో భేదమును సూత్రకారులు అంగీకరించియున్నారు. కనుక జీవేశ్వరులకు ఐక్యము చెప్పుట కుదరదు.

అవిభాగేనదృష్టత్వాధికరణము ముగిసెను.

## బ్రాహ్మాధికరణము (4-4-3)

### ॥ పూ. సూ ॥ బ్రాహ్మేణ జైమినిరుపన్యాసాదిభ్యః (4-4-5)

**సూత్రార్థం:-** **బ్రాహ్మేణ** = బ్రహ్మమునకుగల గుణాలైన అపహతపాప్మత్వం మొదలైనవాటి వలన (ముక్తాత్మ ప్రకాశం పొందుతున్నాడు) **ఉపన్యాసాదిభ్యః** = (ఛాందోగ్యంలోనున్న ప్రజాపతివాక్యంలో ముక్తుడికి ఈగుణాల) ఉపన్యాసం మొదలైనవి కనబడడంవల్ల. **(ఇతి) జైమినిః** = అని జైమినిమహర్షి భావిస్తున్నారు.

**సంగతి:-** పరంజ్యోతిస్సును పొంది తిరోధానము తొలగిన ప్రత్యగాత్మకు స్వరూపావి-ర్భావము సంపద్యావిర్భావాధికరణములో చెప్పబడినది. ఈ అధికరణములో ముక్తుడు ఏ స్వరూపముతో ఆవిర్భవించుచున్నాడు అనువిషయమునుగురించి విచారించుచున్నారు.

**విషయము:-** ముక్తుని స్వరూపమును గురించి.

**సంశయము:-** అపహతపాప్మత్వాదులే ముక్తునికి స్వరూపము అని అపహతపాప్మత్వాది-విశిష్టునిగనే ఆవిర్భవించుచున్నాడా? లేక జ్ఞానమాత్రమే ముక్తుని స్వరూపమని ఆ రూపముతో ఆవిర్భవించుచున్నాడా? లేక వెనుక చెప్పిన రెండింటికిని విరోధములేదుగనుక రెండును అతడి స్వరూపము అని అపహతపాప్మత్వాదివిశిష్ట జ్ఞానమాత్రస్వరూపుడై ఆవిర్భవించుచున్నాడా? వీటిలో ఏ స్వరూపమునకు ఆవిర్భావము?

**సంశయము వచ్చుటకు కారణము:-** జీవస్వరూపమును గురించి శ్రుతులు రెండు విధములుగా చెప్పియుండుటచే సంశయము కలుగుచున్నది. ఆ శ్రుతులలో ప్రాబల్యదౌర్బల్యము లున్నవా? లేవా? వాటిలో విరోధమున్నదాలేదా? ఒకశ్రుతిననుసరించి అర్థముచెప్పినచో వేరొకశ్రుతికి విరోధముగా అర్థము చెప్పినట్లగునా? లేక రెండుశ్రుతులలో చెప్పబడిన అర్థములను చేర్చి అర్థము చెప్పవలెనా? ఈ పక్షములలో ఏ పక్షము యుక్తియుక్తమో నిశ్చయించలేక సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** ఈ విషయములో జైమిని మహర్షియొక్క అభిప్రాయము ఈ సూత్రములో చెప్పబడుచున్నది. అనగా బ్రహ్మసంబంధియైన అపహతపాప్మత్వాది గుణాష్టకములే ప్రత్యగాత్మయొక్క

*అథోభయోరవిరోధ ఇత్యుభయరూపేణేతి। కిం తావత్ప్రాప్తమ్? బ్రాహ్మేణేతి జైమినిరాచార్యో మన్యతే। బ్రాహ్మేణ-అపహతపాప్మత్వాదినేత్యర్థః। అపహతపాప్మత్వాదయో హి దహరవాక్యే బ్రహ్మసమ్బన్ధితయా శ్రుతాః। బ్రాహ్మేణేతి కుతోఽవగమ్యతే? ఉపన్యాసాదిభ్యః, ఉపన్యస్యన్తే హి బ్రహ్మగుణాః అపహత-పాప్మత్వాదయః ప్రత్యగాత్మనోఽపి ప్రజాపతివాక్యే 'య ఆత్మాఽపహతపాప్మా' ఇత్యాదినా 'సత్యసఙ్కల్పః'(ఛాం.8-7-1) ఇత్యన్తేన। ఆదిశబ్దేన సత్యసఙ్కల్పత్వాదిగుణాయత్తా జక్షణాదయః, 'జక్షత్క్రీడన్ రమమాణః'(ఛాం.8-12-3) ఇత్యాదివాక్యావగతా వ్యవహారా గృహ్యన్తే। అత ఏభ్య ఉప-న్యాసాదిభ్యః ప్రత్యగాత్మనో విజ్ఞానమాత్రస్వరూపత్వం న సమ్భవతీతి జైమినేర్మతమ్ ॥5॥*

***॥ పూ. సూ ॥ చితితన్మాత్రేణ తదాత్మకత్వాదిత్యౌడులోమిః ॥ 4-4-6 ॥***

*చైతన్యమేవాస్యాత్మనః స్వరూపమితి తేన రూపేణావిర్భవతీతి ఔడులోమిరాచార్యో మన్యతే।*

---

స్వరూపమని జైమినిఆచార్యులు చెప్పుచున్నారు. బ్రాహ్మేణ– బ్రహ్మసంబంధియైన అపహతపాప్మత్వాదులు దహరవిద్యయందు చెప్పబడినవి. ఆ గుణములు బ్రహ్మసంబంధులు అనునది దేనిచే తెలియుచున్నది? అన్నచో –ఉపన్యాసాదిభ్యః–బ్రహ్మగుణములైన అపహతపాప్మత్వాదులు ప్రత్యగాత్మకును యున్నవని ప్రజాపతివాక్యములో ఉపన్యసించబడినది– చెప్పబడినది గనుక. "య ఆత్మా అపహతపాప్మా' అని ఆరంభించి 'సత్యసఙ్కల్పః' అనునంతవరకును చెప్పబడియున్నది. సూత్రమందు 'ఉపన్యాసాదిభ్యః' అనుపదములోనున్న ఆదిశబ్దముచే సత్యసఙ్కల్పగుణాయత్తమైన – జక్షణాదులు "జక్షన్ క్రీడన్ రమమాణః" ఇత్యాదివాక్యములలో చెప్పబడిన వ్యవహారములను ప్రవృత్తులను గ్రహించవలెను. కనుక, ఇట్టి ఉపన్యాసాదులచే ప్రత్యగాత్మకు విజ్ఞానమాత్రస్వరూపత్వము ఎప్పుడును సంభవించదు. అనగా స్వరూపము జడము. దానిని జ్ఞానముగా అంగీకరించినచో దానికి జ్ఞానాశ్రయత్వము సంభవించదు అని జైమిని మహర్షియొక్క అభిప్రాయము. (న సంభవన్తి– స్వరూపం జడమ్. జ్ఞానత్వే జ్ఞానాద్యాశ్రయత్వాయోగాత్ ఇతి భావః. శ్రుతప్రకాశిక). అయం భావః– "విజ్ఞాన ఘన ఏవ" అను వాక్యమందున్న ఏవకారముచే విజ్ఞానగుణకత్వమే సిద్ధించుటచే విజ్ఞానత్వము గుణమునకుతప్ప స్వరూపమునకు కాదు. కనుక, స్వరూపమునకు విజ్ఞానత్వవ్యవచ్ఛేదమును ఏవకారము చెప్పుచున్నది అని జైమిని మతమని తాత్పర్యము.

***॥ పూ. సూ ॥ చితి తన్మాత్రేణ తదాత్మకత్వాదిత్యౌడులోమిః ॥ (4-4-6)***

సూత్రార్థము: **ఔడులోమిః**= ఔడులోమి అనుమహర్షి, **తదాత్మకత్వాత్** = చైతన్యమాత్రమే, అతని సహజస్వరూపము గనుక **చితితన్మాత్రేణ**= ఆ జ్ఞానమాత్రస్వరూపముతోనే ఆవిర్భవించును ఇతి= అని చెప్పుచున్నాడు. (చితి అనునది భిన్నపదముకాదు. అది సప్తమ్యంతము కాదు. ఈ జ్ఞానవాచకమైనచితిశబ్దము ఇప్రత్యయాంతము, స్త్రీలింగము. చితితన్మాత్రేణ అనునది ఏకసమాసము. (చితిరేవ తన్మాత్రమ్ చితితన్మాత్రమ్).

చైతన్యమాత్రమేవ ఆత్మయొక్క స్వరూపమనుటచే ఆ రూపముతో – జ్ఞానమాత్రస్వరూపముతో ఆవిర్భవించుచున్నాడని ఔడులోమి అను ఆచార్యుల అభిప్రాయము. ఎందుచేతననగా, తదాత్మకత్వాత్– ఈ ప్రత్యగాత్మ అనునది జ్ఞానమాత్ర స్వరూపముగనుక– 'స యథా సైన్ధవఘనోఽనన్తరోఽబాహ్యః కృత్స్నో రసఘన ఏవ, ఏవం వా అరే అయమాత్మాఽనన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవ'(బృహ. 6–5–

*కుతః? తదాత్మకత్వాత్ - తావన్మాత్రాత్మకత్వా దస్య ప్రత్యగాత్మనః 'స యథా సైన్ధవఘనోఽనన్తరో ఽబాహ్యః కృత్స్నో రసఘన ఏవ ఏవం వా అరేఽయమాత్మానన్తరోఽబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవ' (బృ.6-5-13) 'విజ్ఞానఘన ఏవ' (బృ.4-4-12) ఇత్యవధారణాత్ విజ్ఞానమాత్ర మేవాస్య స్వరూపమిత్యవగమ్యతే*

13) (ఉప్పుగడ్డ అనేది లోపలా బైటా మధ్యనీ అంతటా ఉప్పగానే ఉన్నట్టుగా, ఈఆత్మ అనేది లోపలా, బైటా, మధ్యనీ అంతటా జ్ఞానస్వరూపంగానే ఉన్నది.) అనిన్నీ, 'విజ్ఞాన ఘన ఏవ' (బృహ. 4-4-12) (జీవాత్మ పూర్తిగా జ్ఞానస్వరూపంగానే ఉన్నది) ప్రజ్ఞానఘన ఏవ" అనిన్నీ వేదవాక్యాల్లో జీవాత్మ స్వరూపం జ్ఞానమాత్రంగానే ఉన్నది అని అవధారణ- 'ఏ'వకారంతో చెప్పబడడంచేత, జీవాత్మస్వరూపం జ్ఞానంఒక్కటే రూపంగాగలది అని తెలుస్తోంది. జ్ఞానమునకు జ్ఞానాన్తరాశ్రయిత్వమనునది సంభవించదు గనుక జ్ఞానస్వరూపమైన ఆత్మకు జ్ఞానాదిధర్మాన్తరాశ్రయిత్వముకూడ లేదు. కనుక పూర్వము సంసారదశలో తిరోహితమైన చైతన్యమాత్రస్వరూపము ముక్తిదశలో ఆవిర్భవించుచున్నది అని ఔడులోమి మహర్షియొక్క మతము. కనుక ఏవకారముచే గుణాంతరములు నిషేధించబడుటచే అపహతపాప్మత్వాది గుణములుగలవాడు అని చెప్పుట కుదరదు.

ప్రజాపతివాక్యమందు అపహతపాప్మత్వాది గుణములు ప్రత్యగాత్మస్వరూపముగా చెప్పబడి యున్నవే అన్నచో, అపహతపాప్మత్వాదులచే ఆత్మకు భావరూపధర్మాంతరములు చెప్పినట్లు తీసికొన కూడదు. అపహతపాప్మా అని ఆరంభించి అపిపాసః అనునంతవరకును ఉన్న పదములచేత వికార, జరా,మరణ, శోక, క్షుత్(ఆకలి), పిపాసలు(దాహం) లేవనిన్నీ, సత్యకామపదంచేత అనిత్యసుఖాభావమూ, సత్యసంకల్పపదంచేత ఉపేక్షారాహిత్యమూ చెప్పబడుతున్నాయి. అభావమనేది అధికరణరూపంగనుక అపహతపాప్మత్వాది శ్రుతులకు విరోధం లేదు.

ఇక్కడ రాహిత్యవాచకపదం లేకుండా ఉన్నప్పుడు సత్యకామసత్యసంకల్పపదాలకి దేనివలన ఈవిధమైన అర్థం చెప్పబడుతున్నది? అంటే, లోకంలో ఏది సుఖమో ఏసంకల్పమో అవన్నీ కాదాచిత్కములుగనే ఉన్నవి గనుక "కాదాచిత్కసుఖరాహిత్యం" అని సత్యకామశబ్దానికి అర్థం చెప్పబడింది. వ్యర్థసంకల్పరహితుడు అని సత్యసంకల్పమునకు అర్థం చెప్పబడింది. 'విషాణరహితః" కొమ్ములేనివాడు అని చెప్పవలసినసందర్భంలో శశవిషాణముగలవాడు అని ప్రయోగించటం చూస్తున్నాము అని అభిప్రాయము. (సత్యకామః- సత్యం-అకాదాచిత్కం సుఖమస్య ఇతి సత్యకామపదం కాదాచిత్క సుఖరాహిత్యపరమ్. న తు నిత్యసుఖత్వపరమ్. సత్యసంకల్పః- ఉపేక్షారహితః న హి ఉపేక్షకః సత్యసంకల్పోవతిమోఘేన సంకల్పేన రహితః ఇతి వా పూర్వపక్షార్థః: శ్రుతప్రకాశిక).

(ఔడులోమిమతంప్రకారం ఆత్మ జ్ఞానమాత్రస్వరూపం అంటే దానివలన ఏ ప్రయోజనమును లేదు. ధర్మి అనేది తనని మాత్రము గ్రహించునుతప్ప వేరొకదానిని గ్రహించదు గనుక బ్రహ్మానుభవమనేది సిద్ధించదు. అందుచేత జైమిని మహర్షియొక్క అభిప్రాయంప్రకారం పరమాత్మ సామ్యాన్ని తెలిపే అపహతపాప్మత్వాది గుణాష్టకతనే అంగీకరిస్తున్నాం అంటే, సతిధర్మిణి ధర్మాః చిన్తనీయాః- ధర్మి అనేది ఉన్నట్లైతే దాని ధర్మాలని గురించి ఆలోచించవలెను. (గోడ ఉంటేనే చిత్రం చిత్రించవచ్చు) అనే న్యాయంప్రకారం

*। అతోऽస్య గుణాన్తరాభావా దపహతపాప్మేత్యాదయః శబ్దాః వికారసుఖదుఃఖాద్యవిద్యాత్మకధర్మ-వ్యావృత్తిపరా ఇతి చితితన్మాత్రరూపేణావిర్భావ ఇత్యౌడులోమేర్మతమ్ ॥ 6 ॥*

*సమ్ప్రతి భగవాన్ బాదరాయణః స్వమతేన సిద్ధాన్తమాహ-*

***॥ సి. సూ ॥ ఏవమప్యుపన్యాసాత్పూర్వభావాదవిరోధం బాదరాయణః ॥ 4-4-7 ॥***

*ఏవమపి- విజ్ఞానమాత్రస్వరూపత్వప్రతిపాదనే సత్యపి సత్యకామత్వాదీనాం పూర్వోక్తానాం గుణానామవిరోధం-అబాధం బాదరాయణ ఆచార్యో మన్యతే । కుతః? ఉపన్యాసాత్ పూర్వభావాత్ -ఔపనిషదాత్ 'య ఆత్మాऽపహతపాప్మా'(ఛాం.8-7-1) ఇత్యాద్యుపన్యాసాత్ప్రమాణాత్పూర్వేషా మపహతపాప్మత్వ సత్యకామత్వాదీనామపి భావాత్ - విద్యమానత్వాత్ । తుల్యప్రమాణకానా మితరేతర*

ధర్మిని గురించి చెప్పకుండా, అపహతపాప్మత్వాది గుణాలని మాత్రం చెప్పి ప్రయోజనమేమి? కనుక, రెండు పక్షాలూ నిరసింపబడదగినవే)

ఇప్పుడు భగవాన్ బాదరాయణులు తమ సిద్ధాంతమును ప్రసాదించుచున్నారు.

***॥ సి. సూ ॥ ఏవమప్యుపన్యాసాత్పూర్వభావాదవిరోధం బాదరాయణః ॥ 4-4-7 ॥***

**సూత్రార్థం:-** **ఏవం అపి**= ఔడులోమి చెప్పినట్లుగా జీవుడు జ్ఞానమాత్రమై ఉన్నాడు అని అంగీకరించినా(అభ్యుపగమ్యవాదం), **అవిరోధం** = (సత్యకామత్వం మొదలైన గుణాలు జీవుడికి ఉన్నట్టుగా చెప్పుకోవడంలో) వైరుధ్యం లేకపోడాన్ని, **బాదరాయణః** = సూత్రకారులైన బాదరాయణులు (భావిస్తున్నారు.) ఎందుచేతనంటే, **ఉపన్యాసాత్** = ('య ఆత్మా అపహతపాప్మా' అని మొదలయ్యే ప్రజాపతివాక్యంలో ఈఎనిమిదిగుణాలూ జీవుడికి ఉన్నట్టుగా) ఉపన్యసించబడి ఉండడంవల్ల, **పూర్వ భావాత్** = వెనుక (జైమిని) చెప్పిన అష్టగుణాలూ జీవుడికి ఉండడంవల్ల. రెండింటికి విరోధము లేదు.

**సిద్ధాంతము:-** అయ్యా జైమిని మహర్షి చెప్పిన అపహతపాప్మత్వాది గుణములను అంగీకరించకూడదు. ఆవిధముగా చెప్పితే అన్యయోగమును, నిషేధించుచున్న విజ్ఞాన ఘన ఏవ అనే చోటనున్న ఏవకారము వ్యర్థమైపోతుందేమో అని జైమినిపక్షాన్ని పూర్వపక్షంగా చేసి, దానిని ఖండించియే ఔడులోమి తనమతమును స్థాపించిరి. ఇట్లుండగా, రెండింటికిని విరోధములేదని ఎట్లు చెప్పగలరు? అని సందేహము రావచ్చును. దానికి సమాధానము చెప్పుచున్నాము వినుడు. అపహతపాప్మత్వాదులను ప్రత్యగాత్మయొక్క స్వరూపమని శ్రుతియే చెప్పుచున్నది. "విజ్ఞానఘన ఏవ ప్రజ్ఞానఘన ఏవ అనుటచే జ్ఞానమాత్రస్వరూపము, అనే శ్రుతియే చెప్పుచున్నది. రెండును శ్రుతులే గనుక, సమబలముగలవి. వీటిలో ఒకదానిని ఖండించి ఒకదానిని ప్రమాణముగా తీసికొనుట న్యాయవిరుద్ధము.

అయమభిప్రాయః- విజ్ఞానఘన ఏవ అన్నప్పుడున్న ఏవకారము ఇతరవ్యావృత్తిని చేయుచున్నదని చెప్పవలెను. ఇతరవ్యావృత్తిని చేయుచున్నది అనవచ్చును. కాని ఏవకారము ఒక వాక్యమునకు శేషభూతముగా నుండియే అర్థమును నిర్ణయము చేయును. ఏవకారము స్వతంత్రముగా ఏ అర్థమును చెప్పలేదు. అవధారణము అవధారణీయమును - అవధారణము చేయవలసినదానిని అపేక్షించును గనుక శేషభూతమైన ఏవకారమునకు అర్థమును చెప్పుటకు శేషిభూతపదజాతములకు భంగము

*బాధో నయుజ్యతే ఇత్యర్థః। న చ వస్తువిరోధాదపహతపాప్మత్వాదీనామవిద్యాపరికల్పితత్వం న్యాయ్యమ్. విశేషాభావా ద్విపరీతం కస్మాన్న భవతీతి న్యాయాత్। తుల్యబలత్వేప్యశక్యస్యావధారణ- స్యాన్యపరత్వ మేవ న్యాయ్యమ్।*

*ఏవమప్యవిరోధ ఇత్యభ్యుపగమ్య వదన్ జ్ఞానమాత్రమేవాస్య స్వరూపం నాన్యత్కిఞ్చిదస్తీ- త్యయమర్థో 'విజ్ఞానఘన ఏవ' ఇత్యాదిభిర్న ప్రతిపాద్యత ఇతి మన్యతే। కస్తర్హి 'విజ్ఞానఘన ఏవ' (బృ. 4-4-12) ఇత్యవధారణస్యార్థః? కృత్స్నోఽప్యాత్మా జడవ్యావృత్తః స్వప్రకాశో నాన్యాయత్త ప్రకాశః స్వల్పోఽపి ప్రదేశోఽస్తీత్యయమర్థో వాక్యాదేవ సువ్యక్తః, 'స యథా సైన్ధవఘనోఽనన్తరోబాహ్యః కృత్స్నో రసఘన ఏవ ఏవం వా అరేఽయమాత్మాఽనన్తరోబాహ్యః కృత్స్నః ప్రజ్ఞానఘన ఏవ' (బృ.6-5-13) ఇతి। న చైవం ప్రత్యగాత్మనో ధర్మిస్వరూపస్య కృత్స్నస్య విజ్ఞానఘనత్వేప్యపహతపాప్మత్వ సత్యసఙ్కల్పత్వాది ధర్మసమ్బన్ధో వాక్యాన్తరావగతో విరుధ్యతే యథా సైన్ధవ ఘనస్య కృత్స్నస్య రసఘనత్వే రసనేన్ద్రియావగతే*

చేయుట ఉచితముకాదు. శేషిని – ప్రధానమును నశింపజేయకుండ, శేషభూతమైన ఏవకారమునకే అర్థమును సంకోచించి చెప్పవలెను. కనుక ఏవకారస్వారస్యముకొఱకు వాక్యాంతరములలో చెప్పబడిన గుణములను ఆత్మకు లేవని చెప్పుట కుదరదు. కనుక విజ్ఞానరూపత్వం అపహతపాప్మత్వాదికం తుల్య ప్రమాణసిద్ధముగనుక ఏవకారమునకు ఇప్పుడు చెప్పబడియున్న అర్థమును వదలి వేరువిధముగా అర్థమును చెప్పవలెను అని సిద్ధాంతియొక్క అభిప్రాయము).

జ్ఞానమందు జ్ఞానాంతరము ఉండదు గనుక వస్తువిరోధముచే అపహతపాప్మత్వాదులు అవిద్యాపరికల్పితములని చెప్పుటయు, న్యాయముకాదు. విశేషాభావాత్–రెండింటిని శ్రుతి చెప్పియుండుటచేత జ్ఞానమాత్రస్వరూపము అని చెప్పుటలో సూచించదగిన కారణము లేదు గనుక అపహతపాప్మత్వాదులే జ్ఞానమాత్రస్వరూపమనునది అవిద్యాపరికల్పితమని ఎందుకు మార్చి చెప్పకూడదు? కనుక, వాటిలో బాధ్యబాధకభావం చెప్పకూడదు. "ప్రజ్ఞానఘన ఏవ" అని ఏవకారము చెప్పబడినదే అన్నచో, తుల్యబలముగా చెప్పిబడినందున అశక్యస్య గుణాంతరములను బాధించి నిర్వహించవీలుకాని అవధారణమునకు – ఏవకారమునకు, వేరువిధముగా అర్థమును చెప్పుటయే న్యాయమగును. ఏవమపి అని ఆరంభించి ఇంతవరకును జ్ఞానమాత్రస్వరూపమును అంగీకరించినను అని అభ్యుపగమవాదము చెప్పబడినది.

అట్లైనచో ఏవకారమునకు ఏమి అర్థము చెప్పుదురు? అన్నచో, ఆత్మయొక్క పూర్తిభాగమును– కృత్స్నోపి– జడసంబంధములేనందున స్వయంప్రకాశమైనది. స్వల్పభాగముకూడ అన్యాయత్త ప్రకాశముగ లేదని అర్థము. ఈ అర్థము "సయథా సైంధవఘనః అనన్తరో అబాహ్యః కృత్స్నః రసఘన ఏవ" అను శ్రుతివాక్యముచే స్పష్టముగా తెలియుచున్నది. అనగా, వాక్యమందు కొంతభాగములో చెప్పబడియున్న దృష్టాన్తముచే తెలియుచున్నది అని అర్థము. కనుక ధర్మియైన ప్రత్యగాత్మ పూర్తిగా జ్ఞానమయముగనే యున్నను, వేరువాక్యమందున్న అపహతపాప్మత్వసత్యసంకల్పత్వాదిధర్మసంబంధము విరోధించుట లేదు. ఉప్పుగడ్డయనునది లోపలను, బయటను (పూర్తిగా) రసఘనముగనే ఉన్నదని రసనేంద్రియముచే తెలియవచ్చినను, చక్షురింద్రియముచే తెల్లనిదిగానుండుటకు గడ్డగా తెలియుట విరోధించుట లేదుగదా!

*చక్షురాద్యవగతాః రూపకారిన్యాదయో న విరుధ్యన్తే । ఇదమత్ర వాక్యతాత్పర్యం-యథా రసవ త్స్వామ్ర-ఫలాదిషు త్వగాదిప్రదేశభేదేన రసభేదే సత్యపి సైన్ధవఘనస్య సర్వత్రైకరసత్వమ్ తథాత్మనోపి సర్వత్ర విజ్ఞానస్వరూపత్వం, స్వప్రకాశస్వరూపత్వమిత్యర్థః ॥ 7 ॥*

*॥ ఇతి బ్రాహ్మాధికరణమ్ ॥ 3 ॥*

## ॥ సఙ్కల్పాధికరణమ్ - 4-4-4 ॥

## ॥ సి. సూ ॥ సఙ్కల్పాదేవ తచ్ఛ్రుతేః ॥ 4-4-8 ॥

*ముక్తః పరంబ్రహ్మోపసంపద్య జ్ఞానస్వరూపః అపహత పాప్మత్వాది సత్యసఙ్కల్పత్వపర్యన్త-గుణక ఆవిర్భవతీత్యుక్తమ్ । తమధికృత్య తస్య సత్యసఙ్కల్పత్వప్రయుక్తా వ్యవహారాశ్చ శ్రూయన్తే 'స తత్ర పర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః స్త్రీభిర్వా యానైర్వా జ్ఞాతిభిర్వా'(ఛాం.8-12-3) ఇతి। కిమస్య*

అని ఏవిధముగా చెప్పుచున్నామో, ఆవిధముగనే ఆత్మయనునది కృత్స్నం- పూర్తిగా జ్ఞానస్వరూపముగా నున్నను అపహతపాప్మత్వాది గుణములుండుటలో ఎట్టి విరోధమును లేదు. అయ్యా! దృష్టాంతములో నున్న ఏవకారమునకు అర్థమేమి? అందులో మనము తెలిసికొనవలసిన అంశమేది? అన్నచో ఇదమత్ర వాక్యతాత్పర్యం అని చెప్పుచున్నారు. మామిడిపండు మొదలైన ఫలములలో తొక్కలోపల నుండు భాగములో ఒకవిధమైన రసమును, రుచియు., తొక్కకు వేరువిధమైన రసమును రుచియు ఉండుట చూచుచున్నాముగదా! ఉప్పులో ఆవిధముగా లేక అన్ని భాగములలోను ఒకేవిధమైన రసము ఉన్నట్లు ఆత్మకు అన్నిభాగాల్లోనూ విజ్ఞానస్వరూపత్వము -స్వప్రకాశత్వము చెప్పబడుచున్నదని తాత్పర్యము.

బ్రాహ్మాధికరణము సమాప్తము.

## సఙ్కల్పాధికరణము - 4-4-4

## ॥ సి. సూ ॥ సఙ్కల్పాదేవ తచ్ఛ్రుతేః ॥ 4-4-8 ॥

సూత్రార్థం:- **సఙ్కల్పాత్ ఏవ**= (ముక్తుడికి)సంకల్పంచేతనే (కోరినవన్నీ లభిస్తున్నాయి) **తచ్ఛ్రుతేః** = 'స యది పితృలోకకామో భవతి సఙ్కల్పాదేవాస్య పితరః సముత్తిష్ఠన్తి'అని వేదవాక్యం సంకల్పంచేతనే వీడి కోరిక నెరవేరుతున్నట్లుగానే చెప్పడంవల్ల.

సంగతి:- వెనుకటి అధికరణములో ముక్తుడు పరమాత్మను పొంది, జ్ఞానస్వరూపుడై, అపహతపాప్మత్వాదిసత్యసంకల్పత్వపర్యన్తగుణకుడై ఆవిర్భవించుచున్నాడని నిర్ణయించబడినది. ఈ అధికరణములో ఆ ముక్తునిగురించి చెప్పబడినసత్యసంకల్పత్వము ప్రయత్నాంతరనిరపేక్షముగా కార్యకరమగుచున్నదని చెప్పబడుచున్నది.

విషయము:- "పరంజ్యోతిరుపసంపద్య స్వేన రూపేణ అభినిష్పద్యతే...సతత్రపర్యేతి జక్షత్క్రీడన్ రమమాణః స్త్రీభిర్వా యానైర్వా" (ఛాం. 8. 12. 2) అని ప్రజాపతివిద్యాప్రకరణములో చెప్పబడినది. దహరవిద్యాప్రకరణములో "స యది పితృలోకకామో భవతి, సంకల్పాదేవ అస్య పితరః సముత్తిష్ఠన్తి" అనుటచే పితృమాత్రాదిప్రాప్తులు సంకల్పముచేత కలుగుచున్నవని చెప్పబడియున్నది.

*జ్ఞాత్యాదిప్రాప్తిః ప్రయత్నాన్తరసాపేక్షా? ఉత పరమపురుషస్యేవ సఙ్కల్పమాత్రాదేవ భవతీతి విశయే లోకే రాజాదీనాం సత్యసఙ్కల్పత్వేన వ్యవహ్రియమాణానాం కార్యనిష్పాదనే ప్రయత్నాన్తరసాపేక్షత్వ-దర్శనాదస్యాపి తత్సాపేక్షా ।*

*ఇతి ప్రాప్తే ఉచ్యతే- సఙ్కల్పాదేవ-ఇతి । కుతః? తచ్ఛ్రుతేః, 'స యది పితృలోకకామో భవతి సఙ్కల్పాదేవాస్య పితరః సముత్తిష్ఠన్తి' (ఛాం. 8-2-1) ఇతి హి సఙ్కల్పాదేవ పిత్రాదీనాం సముత్థానం శ్రూయతే । న చ ప్రయత్నాన్తరసాపేక్షత్వాభిధాయి శ్రుత్యన్తరం దృశ్యతే; యేనాస్య సఙ్కల్పాదేవే-*

---

ఇట్లు ముక్తుని సంకల్పమునుగురించిన విషయము విచారించబడుచున్నది.

**సంశయము:-** ముక్తునికి శ్రుతిలో చెప్పబడిన జ్ఞాత్యాది ప్రాప్తియనునది ప్రయత్నాంతర సాపేక్షసంకల్పముచేత కలుగుచున్నదా? లేక భగవత్సంకల్పమువలె సంకల్పమాత్రముచేతనే కలుగు చున్నదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** సంకల్పాదేవ అన్నప్పుడున్న ఏవకారమునకు, వెనుకటి అధికరణములో విజ్ఞానఘన ఏవ అన్నప్పుడు ఏవకారమునకు అర్థము చెప్పినట్లు అయోగవ్యవచ్ఛేదమును చేసియున్నట్లు అర్థమును చెప్పినచో ప్రయత్నాంతరసాపేక్షత్వము చెప్పవచ్చునట్లు కనబడుచున్నది. విజ్ఞానఘన ఏవ అను నప్పుడు 'య ఆత్మా అపహతపాప్మా' అను శ్రుత్యన్తరసిద్ధమైన అపహతపాప్మత్వాదులను వ్యవచ్ఛేదించసాధ్యము కాదు గనుక అచ్చటనున్న ఏవకారమునకు అయోగ-వ్యవచ్ఛేదపరముగా అర్థమును చెప్పవలసివచ్చినది. ఇక్కడ ప్రయత్నాంతరమును చెప్పునట్టి శ్రుతి ఏదియును లేదుగనుక, ఇక్కడనున్న ఏవకారమునకు అన్యయోగవ్యవచ్ఛేదపరముగనే అర్థము చెప్పవలెనని తోచుచున్నది. దీనివలన అన్యాపేక్షలేకనే సంకల్పమాత్రముచేతనే జ్ఞాత్యాది ప్రాప్తియనునది సంభవించుచున్నదని చెప్పవలెనని తోచుచున్నది. ఈ పక్షములలో ఏ పక్షము యుక్తియుక్తమో నిర్ణయించలేని వానికి సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** లోకములో "సత్యసంకల్పుడు"-సంకల్పించినదానిని సంకల్పించిన ప్రకారము చేయువాడని చెప్పదగిన రాజులు అందరును కార్యములను చేయునపుడు ప్రయత్నాంతరసాపేక్షులుగా నుండుటను చూచుచున్నాము. అదేవిధముగ, ముక్తునికిని ప్రయత్నాంతరసాపేక్షత్వము ఉండును. ఇట్లు సంకల్పాదేవ అన్నప్పుడున్న ఏవకారమునకు అయోగవ్యవచ్ఛేదపరముగనే అర్థమును చెప్పవలెను.

**సిద్ధాంతము:-** సంకల్పాదేవ- ముక్తునికి సంకల్పమాత్రముచేత సర్వమును సిద్ధించుచున్నది. ఎందువలన అనగా, తచ్ఛ్రుతేః-"స యది పితృలోకకామో భవతి, సంకల్పాదేవ పితరః అస్య సముత్తిష్ఠన్తి" అను వాక్యమందు ప్రయత్నాంతరనిరపేక్షసంకల్పమాత్రముచేత పిత్రాదులు సృష్టింపబడుతున్నట్లు చెప్పబడియున్నది. ఇట్లు ఇచ్చటనున్న ఏవకారమునకు అన్యయోగవ్యవచ్ఛేదపరముగనే అర్థమును చెప్పవలెను. ప్రయత్నాంతరాపేక్షను చెప్పు శ్రుత్యంతరమేదియును కానరాదు. అందువలననే విజ్ఞానఘన ఏవ అనునప్పటివలె అయోగవ్యవచ్ఛేదపరముగా అర్థము చెప్పకూడదు.

*త్యవధారణస్య విజ్ఞానఘన ఏవేతివత్ వ్యవస్థాపనం క్రియతే ॥ 8 ॥*

**॥ సి. సూ ॥ అత ఏవ చానన్యాధిపతిః ॥ 4-4-9 ॥**

*యతో ముక్తః సత్యసఙ్కల్పః అత ఏవానన్యాధిపతిశ్చ । అన్యాధిపతిత్వం హి విధినిషేధ-యోగ్యత్వమ్। విధినిషేధయోగ్యత్వే హి ప్రతిహతసఙ్కల్పత్వం భవేత్। అతః సత్యసఙ్కల్పత్వశ్రుత్యై-వానన్యాధిపతిత్వం చ సిద్ధమ్। అత ఏవ 'స స్వరాడ్ భవతి' (ఛాం. 7-25-2) ఇత్యుచ్యతే । ॥9॥*

*॥ ఇతి సఙ్కల్పాధికరణమ్ ॥ 4 ॥*

---

జక్షణాది వ్యాపారములు పుణ్యపాపరూపములుగనుక సత్యసంకల్పత్వమునకు ప్రతిఘాత మనునది - ఆటంకము సంభవించును గనుక ముక్తుని సంకల్పము ప్రతిఘాతములుగలదగుచున్నది. కనుక ముక్తసంకల్పమునకు ప్రయత్నాన్తరసాపేక్షత్వమును తప్పక అంగీకరించవలెను అను శంకను ఈ సూత్రము నిరసించుచున్నది.

**॥ సి. సూ.॥ అత ఏవ చానన్యాధిపతిః ॥ 4-4-9 ॥**

సూత్రార్థం:- **అతః ఏవ**= ఈ విధంగా ముక్తుడు సత్యసంకల్పుడుగా ఉండడంవల్లనే **అనన్యాధిపతిః చ** = (అతను) సర్వేశ్వరుడు తప్ప వేరు దేనికీ (కర్మ మొదలైనవాటికి) వశపడినవాడు కాడు(అనికూడ తెలుస్తున్నది)

ఈ సూత్రము సత్యసంకల్పత్వమును ఉపపాదనము చేయుచున్నది. ఎందుచేత ముక్తుడు సత్యసంకల్పుడో, అందుచేతనే అతడు అనన్యాధిపతి. విధినిషేధములకు యోగ్యుడు అన్యాధిపతియైన వాడు. విధినిషేధయోగ్యుడైతే అతడి సంకల్పం ప్రతిఘాతయుక్తమే యగును. కనుక సత్యసంకల్పత్వ శ్రుతిచేతనే అనన్యాధిపతిత్వము, అకర్మవశ్యత్వము ముక్తునికి సిద్ధించుచున్నవి. కనుక సంకల్పాదేవ అనుదానిలోని ఏవకారమునకు - అవధారణకు సంకోచములేని అర్థము తనంతట తానుగా ప్రాప్తమగు చున్నది. ముక్తుని జక్షణాది వ్యాపారములు పుణ్యపాపరూపములు అని ఎక్కడను చెప్పబడలేదు. శ్రుత్యన్తరములో "సస్వరాడ్భవతి" - ముక్తుడు విధినిషేధయోగ్యుడగుట లేదు అని చెప్పబడియున్నది.

ఈ విధముగ చెప్పబడుటచేత ఈ సూత్రముచే ముక్తులకు సర్వేశ్వరునివలె బ్రహ్మసంబంధి యగు అపహతపాప్మత్వాది సత్యసంకల్పపర్యన్తగుణములు ఉన్నవని స్థిరప్రతిష్ఠితమైనది. అపహతపాప్మత్వ మనగా, పాపప్రధ్వంసవైశిష్ట్యుడు అని అర్థముకాదు. కిన్తు పుణ్యపాపసజాతీయవ్యాపారములను చేసినను దాని ఫలసంబంధమునకు అనర్హుడు అని అర్థము. ఈ అర్థము ఇచ్చటనే స్పష్టముగా చెప్పబడియున్నది.

సూచన- స్వరాట్ అనుపదమునకు "స్వయమేవ రాజా నియన్తా" అను ముఖ్యార్థము చెప్పుట కుదరదు గనుక, "అన్యవశ్యత్వాభావము- ఇతరునికి వశ్యుడు కాకపోవుట- అని అర్థము చెప్పవలెను. అప్పుడు "య ఆత్మానం అన్తరో యమయతి" అని పరమాత్మనియామ్యునిగా జీవుని శ్రుతి చెప్పి యుండుటచే ప్రత్యగాత్మకు అన్యవశ్యత్వమే యుండగా, అన్యవశ్యత్వాభావము చెప్పుట సంభవించదు. కనుకనే ముక్తప్రకరణమగుటచే కర్మవశ్యత్వాభావరూపమే స్వరాడ్త్వము అని చెప్పవలెను.

## ॥ అభావాధికరణమ్ - 4-4-5 ॥

### ॥ పూ. సూ - అభావం బాదరిరాహ హ్యేవమ్ ॥ 4-4-10 ॥

*కిం ముక్తస్య దేహేన్ద్రియాణి న సన్తి, ఉత సన్తి, అథవా యథాసఙ్కల్పం సన్తి? న సన్తి చేతి*

---

అనన్యాధిపతి అనగా స్వాభావికశేషియైన పరమపురుషునికంటే అన్యః- వేరొకడు ముక్తునికి అధిపతిగా లేడు అని అర్థము శ్రుతప్రకాశికలో చూపబడుచున్నది.

ముక్తుని సంకల్పముచే పిత్రాదులు సృష్టమగుచున్నారని, స్త్రీలతో, వాహనములతో క్రీడించు చున్నాడని చెప్పు శ్రుతిలో చెప్పబడుట, పరమాత్మశేషభావమును సాక్షాత్కరించినవానికి తనయొక్క భోగార్థము సృష్టించుకొనినట్లుగా చెప్పలేదు. తన స్వరూపము భగవానునికి శేషముగనే యున్నది అని సాక్షాత్కరించికొనినవానికి భగవద్వ్యతిరిక్తవ్యాపారములు కొన్నింటిలో ప్రవృత్తి యనునది ఎప్పటికిని కలుగనే కలుగదు. అందుచే తాను భూమవిద్యాప్రకరణములో "ఆత్మరతిః, ఆత్మక్రీడః, ఆత్మమిథునః, ఆత్మానన్దః" అని ముక్తుని గురించి చెప్పబడినది. కనుక పిత్రాదిప్రాప్తి యనునది భగవత్ప్రీతిని ముఖ్యోద్దేశముగా చెయ్యబడిన సంకల్పమనియే చెప్పవలెను.

సంకల్పాధికరణము ముగిసెను.

## అభావాధికరణము (4-4-5)

### ॥ పూ. సూ॥ అభావం బాదరిరాహ హ్యేవమ్ (4-4-10) (533)

**సూత్రార్థం:-** **బాదరిః** = బాదరి మహర్షి, **అభావం** = (ముక్తుడికి శరీరం, ఇంద్రియములు మొదలైనవి) లేవు అని (భావిస్తున్నారు.) **ఏవం హి ఆహ** = (వేదవాక్యం) ఇలాగేగదా చెప్తోంది.

**సంగతి:-** వెనుకటి అధికరణంలో ముక్తునికి సంకల్పమాత్రముచే భగవత్పరిచరణోప యుక్తపిత్రాదిసృష్టి చెప్పబడినది. ఈ అధికరణములో ముక్తుని సంకల్పవిశేషము నిర్ణయించబడు చున్నది

**విషయము:-** ముక్తుని సంకల్పవిశేషమును గురించినది.

**సంశయము:-** ముక్తునికి దేహేంద్రియాదులు ఉన్నవా లేవా? లేక అతడి సంకల్పానుసారము ఉండనూవచ్చును ఉండకపోయినను ఉండకపోవచ్చునా?

**సంశయము వచ్చుటకు కారణము:-** "అశరీరం వావసన్తం న ప్రియాప్రియే స్పృశతః" "మనసా ఏతాన్ కామాన్ పశ్యతి రమతే య ఏతేపరంలోకే" అను శ్రుతులచే ముక్తునికి శరీరము లేదు అని తోచుచున్నది. "స ఏకధా భవతి త్రిధా భవతి పంచధా" "ఏతత్సామగాయన్నాస్తే" ఇత్యాదిశ్రుతు లలో గానము చేయుచున్నాడు, క్రీడించుచున్నాడు అని చెప్పుటచే శరీరము ఉన్నదని తెలియుచున్నది. అకర్మవశ్యుడుగనుక శరీరము ఉన్నను బాధకముకాదు, శరీరము లేకపోయినను భగవదనుభవమునకు లోటు లేదు అని తోచుచున్నది. కనుక ఈ పక్షములలో ఏది యుక్తియుక్తమో నిర్ణయించలేనందున సంశయము కలుగుచున్నది.

*విశయే- శరీరేన్ద్రియాణామభావం బాదరి రాచార్యో మన్యతే । కుతః? ఆహ హ్యేవమ్- 'నహ వై సశరీరస్య సతః ప్రియాప్రియయోరపహతిరస్తి । అశరీరం వా వ సన్తం న ప్రియాప్రియే స్పృశతః'(ఛాం. 8-12-1,2)ఇతి శరీరసంబన్ధే దుఃఖస్యావర్జనీయత్వమభిధాయ 'అస్మాచ్ఛరీరాత్సముత్థాయ పరంజ్యోతి రుపసంపద్య స్వేనరూపేణాభినిష్పద్యతే (ఛాం. 8-12-1,2) ఇతి ముక్తస్యాశరీరత్వం హ్యాహ శ్రుతిః ॥10॥*

***॥ పూ. సూ ॥ భావం జైమినిర్వికల్పామననాత్ ॥ 4-4-11 ॥***

*ముక్తస్య శరీరేన్ద్రియభావం జైమినిరాచార్యో మన్యతే, కుతః? వికల్పామననాత్-వివిధః కల్పో వికల్పః, వైవిధ్యమిత్యర్థః, 'స ఏకధా భవతి త్రిధా భవతి పఞ్చధా సప్తధా'(ఛాం.7-26-2) ఇత్యాది*

---

**పూర్వపక్షము:-** శరీరేంద్రియాదులు లేవు అని బాదరి మహర్షి అభిప్రాయపడుచున్నారు. ఎందుచేతననగా, "న హ వై సశరీరస్యసతః ప్రియాప్రియయోరపహతిరస్తి. అశరీరం వావసన్తం న ప్రియాప్రియే స్పృశతః"(ఛాం. 8. 12. 1,2) (శరీరసంబంధము ఉన్నంతవరకును సుఖదుఃఖములను అనుభవించకుండుట సాధ్యము కాదు. శరీరసంబంధము లేనిచో సుఖదుఃఖములు ఇతడిని స్పృశించవు.) అని చెప్పి "అస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతిరుపసంపద్య స్వేనరూపేణ అభినిష్పద్యతే" (ముక్తుడు ఇంతవరకు యున్న శరీరమునుండి భయటపడి పరంజ్యోతిస్సును పొంది తనస్వరూపప్రకాశమును పొందుతున్నాడు,) అని చెప్పుటచే ముక్తునికి శరీరము లేదని తెలియుచున్నది.

ఈ సూత్రములోనున్న "అభావ"శబ్దమునకు ప్రతియోగి ఏది? అను ఆకాంక్షకలుగుచున్నది గనుక తన్వభావే సన్ధ్యవదుపపత్తేః(4-4-13) అను సూత్రములోనున్న తను-శరీరశబ్దమును చేర్చుకొని అర్థమును చెప్పుచున్నారు. శరీరేంద్రియాణాం అభావం బాదరిరాచార్యో మన్యతే" అని, తరువాత జైమినిమహర్షి యొక్క భావమును తరువాతి పూర్వపక్షసూత్రములో చెప్పబడుచున్నది.

***॥ పూ. సూ ॥ భావం జైమినిర్వికల్పామననాత్ ॥ 4-4-11 ॥***

**సూత్రార్థము:-** **జైమినిః** = జైమిని మహర్షి, **భావం** = (ముక్తుడికి శరీరం ఇంద్రియాలు మొదలైనవి) ఉంటాయి అని (భావిస్తున్నారు) **వికల్పామననాత్** = (ముక్తుడు) అనేకవిధాలుగా అగుచున్నాడు అని శ్రుతి చెప్తున్నదిగనుక.

ఇది కూడా పూర్వపక్షసూత్రమే. ఈ సూత్రంలోకూడా "తను(శరీర)" శబ్దమును చేర్చుకొని "ముక్తస్య శరీరేంద్రియభావం జైమినిరాచార్యో మన్యతే" అని ప్రసాదించుచున్నారు. ముక్తునికి శరీరేంద్రియములు ఉండునని జైమిని మహర్షి అభిప్రాయపడుచున్నారు. ఎందులకనగా, వికల్పామననాత్- వివిధః కల్పః వికల్పః- వైవిధ్యం బహువిధములు అని అర్థము. "స ఏకధా భవతి త్రిధా భవతి పఞ్చధా సప్తధా' (ఛాం. 7-16-2) (ఆముక్తాత్మ ఒకటిగా అవుతున్నాడు, మూడు(శరీరాలుగా) అవుతున్నాడు, ఐదువిధాలుగా అవుతున్నాడు, ఏడుగా అవుతున్నాడు) అని శ్రుతి చెప్పుటచే శరీరముండుననుచున్నారు. ద్విధాభావాదులు ధర్మిభేదే ఏవ స్వారస్యంగలవి. అయినను, అచ్ఛేద్యుడైన ఆత్మ అనేకవిధములుగా నుండును అని చెప్పవీలుగాదు. ఈ శ్రుతిలో శరీరవాచిశబ్దమును లేదు.

*శ్రుతేః ఆత్మన ఏకస్యాచ్ఛేద్యస్యానేకధాభావాసమ్భవాత్, త్రిధాభావాదయః శరీరనిబన్ధనా ఇత్యవగమ్యతే। అశరీరత్వవచనం తు కర్మనిమిత్తశరీరాభావపరమ్। తదేవ హి శరీరం ప్రియాప్రియహేతుః ॥ 11 ॥*

*భగవాంస్తు బాదరాయణః స్వమతేన సిద్ధాన్తమాహ -*

***॥ సి. సూ ॥ ద్వాదశాహవదుభయవిధం బాదరాయణోఽతః ॥ 4-4-12 ॥***

*'సఙ్కల్పాదేవ' ఇత్యేతదతశ్శబ్దేన పరామృశ్యతే, అత ఏవ సఙ్కల్పాత్, ఉభయవిధం సశరీరమశరీరం చ ముక్తం భగవాన్బాదరాయణో మన్యతే। ఏవం చోభయీ శ్రుతిరుపపద్యతే। ద్వాదశాహవత్-యథా 'ద్వాదశాహమృద్ధికామా ఉపేయుః', 'ద్వాదశాహేన ప్రజాకామం యాజయేత్'*

---

అయినను, శరీరముద్వారానే త్రిధాభావాదులు చెప్పవలెనని నిశ్చయించబడుచున్నది. అట్లైనచో, అశరీరశ్రుతికి అర్థమేమి అని ప్రశ్నించవచ్చును? కర్మకృతమైన శరీరము లేదు అని తాత్పర్యము. కర్మకృతమైన శరీరమున్ననే ప్రియాప్రియములు సుఖదుఃఖములు కలుగును. కనుక, కర్మకృతశరీరము లేదు అని చెప్పుచున్నది. సశరీరత్వశ్రుతికి నివారకములేదుగనుక ముక్తదశలో ఒకప్పుడుమాత్రమే శరీరము వచ్చుచున్నదనుటకు కారణము చెప్పబడనందునను ఎల్లప్పుడును ముక్తుడు సశరీరునిగనే ఉన్నాడని సిద్ధించుచున్నది. (సశరీరత్వశ్రుతేః నివారకాభావాత్ కాదాచిత్కహేత్వన్తరానుక్తేశ్చ సర్వదా సశరీరత్వం ఫలితమితి సూత్రాభిప్రాయః- శ్రుతప్రకాశిక)

భగవాన్ బాదరాయణులు తమ మనోగతానుగుణముగ సిద్ధాంతమును ప్రసాదించుచున్నారు-

***॥ సి. సూ ॥ ద్వాదశాహవదుభయవిధం బాదరాయణోఽతః ॥ 4-4-12 ॥***

**సూత్రార్థం:-** **అతః**= ముక్తుని సంకల్పముచేత **ఉభయవిధం** = (కొన్ని సమయాల్లో) శరీరంగల వానిగను, (కొన్ని సమయాల్లో)శరీరం లేనివాడిగానూ (ముక్తుడు ఉంటాడు) అని భగవానులు **బాదరాయణః** = భగవాన్ బాదరాయణులు (భావించుచున్నారు). ఈ విధముగాచెప్పుటచేత శరీరముండును అను శ్రుతియు, శరీరము లేదు అను శ్రుతియు అర్థవంతములగుచున్నవి. **ద్వాదశాహవత్** = (రెండువిధాలైన వేదవాక్యాలవల్ల) ద్వాదశాహం అనే ఒకేయాగం (సత్రం, అహీనం అని రెండువిధాలుగా అవుతున్నట్లుగా)

అయ్యా! అశరీరత్వశ్రుతి కర్మకృతశరీరము లేదని చెప్పునదిగా చెప్పబడినది. కర్మకృతశరీరభావ మనునది ఎప్పుడును ఉన్నచో అదే శ్రుతికాదాచిత్కశరీరాభావమునకు ఎట్లు ప్రమాణమగును?

స్వామీ! అశరీరత్వశ్రుతిని నేను ప్రమాణముగా తీసికొనలేదు. సత్యసంకల్పవాక్యానుగృహీతమైన సశరీరత్వశ్రుతిచే ముక్తునికి ఇచ్ఛానుగుణముగా శరీరము వచ్చుచున్నదని అభ్యుపగమము చేసినపుడు అశరీరత్వశ్రుతియు అర్థవంతమగుచున్నది. సశరీరత్వశ్రుతియు బాధింపబడలేదని భాష్యాభిప్రాయము.

ద్వాదశాహవత్- పంద్రెండు దినములు చేయునది- ద్వాదశాహయాగమునకు "ద్వాదశాహం ఋద్ధికామాః ఉపేయుః" అను విధి ప్రకారము బహుయజమానకర్తృకత్వరూపమైన సత్రత్వమును, "ద్వాదశాహేన ప్రజాకామం యాజయేత్" అను విధిప్రకారము ఏకయజమానకర్తృత్వరూపమైన

*ఇత్యుపైతి యజతిచోదనాభ్యాం సఙ్కల్పభేదేన సత్రమహీనఞ్చ భవతి॥12॥*

*యదా శరీరాద్యుపకరణవత్త్వమ్; తదా తాని శరీరాద్యుపకరణాని స్వేనైవ సృష్టానీతి నాస్తి నియమ ఇత్యాహ -*

**॥ సి. సూ ॥ తన్వభావే సన్ధ్యవదుపపత్తేః ॥ 4-4-13 ॥**

*స్వేనైవ సృష్టతనుప్రభృత్యుపకరణాభావే పరమపురుషసృష్టైరుపకరణైర్భోగోపపత్తేః సత్యసఙ్కల్పోఽపి స్వయం న సృజతి । యథా స్వప్నే 'అథ రథాన్ రథయోగాన్ పథః సృజతే'(బృ.*

అహీనత్వరూపమును చెప్పబడుచున్నది. రెండు విధములుగ శ్రుతులు చెప్పియుండుటను అనుసరించి సంకల్పభేదముచే ఒకే యాగమునకే సత్రత్వము, అహీనత్వము – ద్వివిధత్వము అంగీకరించినట్లే ముక్తుని సంకల్పభేదముచేత, సశరీరత్వము, అశరీరత్వము రెండును ఒప్పుకొనవలెననుచున్నారు.

అనగా, "'స యది పితృలోకకామో భవతి' (ఛాం. 8-2-1) అని మొదలుబెట్టి 'సఙ్కల్పాదేవాస్య పితరః సముత్తిష్ఠన్తి'అని 'ముక్తుడు పితృదేవతలని చూడాలని కోరుకున్నట్లైతే అతని సంకల్పంవల్లనే పితరులు (పితృదేవతలే) సృష్టింపబడుతున్నారు' అని చెప్పే వాక్యం ముక్తకర్తృకసృష్టి ఐచ్ఛికము అని తెలియుటచే ఎప్పుడు ముక్తుడు "సశరీరస్యామ్" అని సంకల్పించునో అప్పుడు సశరీరునిగనే భగవానుని అనుభవించుచున్నాడు. ఎప్పుడు అశరీరస్యామ్ అని సంకల్పించునో అప్పుడు అశరీరునిగనే భగవానుని అనుభవించుచున్నాడు అనుటచే సశరీరత్వనియమము లేదు అనుచున్నాము.

ముక్తుడు శరీరముతో నున్నాడు అనుటలో ఎట్టి నియమమును లేదో, ఆవిధముగనే శరీరసృష్టిలో కూడ నియమము లేదనుచున్నారు. అనగా, ముక్తుడు భగవానుని అనుభవించుటకు శరీరాద్యుపకరణములు కావలెనని ఎప్పుడు భావించుచున్నాడో, అప్పుడు శరీరాద్యుపకరణములు ముక్తునిచేతనే సృష్టింపబడినవిగా ఉండవలెనను నియమము లేదనుచున్నారు–

**॥ సి. సూ ॥ తన్వభావే సన్ధ్యవదుపపత్తేః ॥ 4-4-13 ॥**

సూత్రార్థం:– **తన్వభావే** = (ముక్తుడికి తనవల్ల సృష్టింపబడ్డ) శరీరం లేకపోతే, **సన్ధ్యవత్** = స్వప్నావస్థలోలాగ **ఉపపత్తేః**= (పరమపురుషుడిచేత సృష్టింపబడ్డ శరీరం మొదలైనవాటితో భగవదనుభవం) కుదురుతుంది గనుక.

ముక్తునికి తనచే సృష్టింపబడిన శరీరాద్యుపకరణములు లేనిచో, పరమపురుషునిచేత సృష్టింపబడిన శరీరముతో భగవదనుభవరూప భోగము సంభవించును. ముక్తుడు సత్యసంకల్పునిగా నున్నను, స్వయం న సృజతి– తానే సృష్టించుట లేదు. దేహాదిసృష్టి బ్రహ్మానుభవములో చేరదుగనుక ముక్తునికి శరీరాదిసృష్టివిషయములో ఇచ్ఛయనునది కలుగదు అని ఒప్పుకొనినను, "ఏకధా భవతి త్రిధా భవతి" అని శ్రుతి చెప్పుటచే దానికి అనుగుణముగా శరీరపరికల్పనము చేసి నిర్వహించవలసివచ్చుట న్యాయము గనుక, సర్వేశ్వరుడు సాక్షాత్తుగ ముక్తునికి శరీరమును సృష్టించుచున్నాడని చెప్పవలెను. (ముక్తుడు సంకల్పముచే సృష్టించుట ఈశ్వరసంకల్పాధీనము గనుక ఆ సృష్టి సద్వారకసృష్టి అనబడును).

*6-3-10) ఇత్యారభ్య 'అథ వేశాన్తాన్ పుష్కరిణ్యః స్రవన్త్యః సృజతే స హి కర్తా'(బృ. 6-3-10) ఇతి 'య ఏషు సుప్తేషు జాగర్తి కామంకామం పురుషో నిర్మిమాణః। తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే। తస్మిన్ల్లోకాః శ్రితాస్సర్వే తదు నాత్యేతి కశ్చన'(క. 5-8)ఇతి ఈశ్వరసృష్టైః రథాద్యుపకరణైర్జీవో భుఙ్క్తే, తథా ముక్తోఽపి లీలాప్రవృత్తేనేశ్వరేణ సృష్టైః పితృలోకాదిభిర్లీలారసం భుఙ్క్తే ॥ 13॥*

## ॥ సి. సూ - భావే జాగ్రద్వత్ ॥ 4-4-14 ॥

స్వసఙ్కల్పాదేవ సృష్టతనుప్రభృతిపితృలోకాద్యుపకరణభావే జాగ్రత్పురుషభోగవన్ముక్తోఽపి

భగవానుడు ముక్తానుభవార్థము శరీరాద్యుపకరణములను సృష్టించుచున్నాడు అను విషయములో ఒక ఉదాహరణమును చూపుచున్నారు. 'సన్ధ్యవత్' అని స్వప్నములో "'అథ రథాన్ రథయోగాన్ పథః సృజతే' (బృహ 6-3-10) ((స్వప్నావస్థలో) రథములు, వాటికి పూన్చబడిన గుఱ్ఱములు, అవివెళ్ళే మార్గములు మొదలైనవాటిని (పరమాత్మ) సృష్టించుచున్నాడు) అని ప్రారంభించి 'అథ వేశాన్తాన్ పుష్కరిణ్యః స్రవన్త్యః సృజతే। సహికర్తా' (చిన్న నీటికుంటలనీ, చెరువులనీ నదులనీ (పరమపురుషుడు) సృష్టించుచున్నాడు, సృష్టించేవాడు అతనేగదా!) అని జాగ్రద్దశలో అనుభవించుటకు యోగ్యమైన రథములు, వాటికి పూన్చబడిన గుఱ్ఱములు, అవి పోవు మార్గములు మొదలైనవి స్వప్నములో లేవు. అయినను స్వప్నమును చూచు పురుషుడు స్వప్నమును చూచుసమయములో మాత్రము అనుభవించ కూడిన రథాదులను పరమాత్మ సృష్టించుచున్నాడు- అనగా కాలప్రపంచనాటకసూత్రధారి యైన సర్వేశ్వరుడు స్వప్నపదార్థములను సృష్టించుచున్నాడు. అతడే కర్త- స హి కర్తా- భగవానుడే స్వప్న పదార్థములను సృష్టించుచున్నాడు అని కఠశ్రుతి స్పష్టముగా చెప్పుచున్నది. "'య ఏషు సుప్తేషు జాగర్తి కామం కామం పురుషో నిర్మిమాణః, తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే తస్మిన్ల్లోకాః శ్రితాస్సర్వే తదు నాత్యేతి కశ్చన' *(క. 5-8)*" (ఎవడు సకలప్రాణులును నిద్రించునపుడు కన్నులు విప్పుకొని, సంకల్పించి సంకల్పించి సృష్టించుచున్నాడో అతడే అనన్యాధీనామృతమని చెప్పబడుచున్నాడు. అతడినే అందరును ఆశ్రయించియున్నారు) అని చెప్పుచున్నట్లు ఈశ్వరసృష్టమైన రథాద్యుపకరణములతో జీవుడు స్వప్నమందు అనుభవించుటవలె, ముక్తుడును లీలాప్రవృత్తుడైన సర్వేశ్వరునిచే సృష్టింపబడిన పితృలోకాదులచే లీలారసమును అనుభవించుచున్నాడు. ఈ స్వప్నదృష్టాంతము ఈశ్వరసృష్టశరీరముతో భగవదనుభవభోగమాత్రమునే చెప్పుచున్నదని గ్రహించవలెను. సుఖదుఃఖములనుకూడ అనుభవించు చున్నాడు- అని చెప్పకూడదు. ముక్తుడు దుఃఖమును అనుభవించుచున్నాడని ఎచ్చటను చెప్పబడలేదు. ఎప్పుడు "ముక్తః సఙ్కల్పేన సృజతు" అని ఈశ్వరుడు కోరుచున్నాడో అప్పుడు ముక్తుడు తన సంకల్పముద్వారా ఈశ్వరసృష్టశరీరముచే భగవానుని లీలారసమును అనుభవించుచున్నాడు. 13

## ॥ సి. సూ ॥ భావే జాగ్రద్వత్ ॥ 4-4-14 ॥

సూత్రార్థం:- **భావే** = ముక్తునికి తనసంకల్పముచేతనే సృష్టింపబడిన తనుప్రభృతి పితృలోకాద్యుపకరణములు ఉన్నచో, **జాగ్రద్వత్** = జాగ్రదావస్థలో నుండు జీవునివలెనే (ముక్తుడుకూడ లీలారసమును అనుభవించుచున్నాడు).

*లీలారసం భుజ్తే ౹౹ పరమపురుషోऽపి లీలార్థం దశరథవసుదేవాదిపితృలోకాదికమాత్మనః సృష్ట్వా తైర్మనుష్యధర్మలీలారసం యథా భుఙ్క్తే, తథా ముక్తానామపి స్వలీలాయై పితృలోకాదికం స్వయమేవ సృజతి కదాచిత్, కదాచిచ్చ ముక్తాః సత్యసఙ్కల్పత్వాత్ పరమపురుషలీలాన్తర్గతస్వపితృలోకాదికం స్వయమేవ సృజన్తీతి సర్వముపపన్నమ్॥ 14 ॥*

అయ్యా! ముక్తునికి పిత్రాదిసృష్టి సాపేక్షత్వే బ్రహ్మానుభవమును వదలి ఇతరకార్యములలో ప్రవృత్తియున్నట్లుగను, బ్రహ్మమునందు భోగ్యతాబుద్ధివైకల్యము– లోటు ఉన్నట్లుగను అగును. పిత్రాదివిషయమైన ఇచ్ఛ అకర్మకృతముగను కాదు అని భావించవలదు. లీలార్థము ప్రవర్తించు పరమపురుషుడును దశరథవసుదేవాది పిత్రాది సృష్టులను తనకు సృష్టించుకొని వారితో మనుష్యధర్మ–లీలారసమును ఎట్లు అనుభవించుచున్నాడో, అట్లే తన లీలకొఱకు ముక్తులకును పిత్రాదులను భగవానుడు సృష్టించుచున్నాడు. ముక్తులును ఈశ్వరసృష్టమైన ఆ పిత్రాదులచే పితృమంతులై మనుష్యధర్మములు గలవారై భగవదనుభవలీలాంతర్గతమైన రసమును అనుభవించుచున్నారు. కొంతకాలము ముక్తుడు ఈశ్వరుని అభిప్రాయముననుసరించి తానుగనే తన సంకల్పముచే తనకు పిత్రాదులను సృష్టించుకొని మనుష్యధర్మములను గలవాడై భగవదనుభవాంతర్గతమైన భగవల్లీలారసమును అనుభవించుచున్నాడు. భగవానుని మనోభావసూచనను అనుసరించిచేయబడిన పిత్రాదిసృష్టి భగవానుని నిరవధికప్రీతిచే చేయబడినది గనుక భగవత్ప్రియతమమైనది గనుక భగవదనుభవమందు వైకల్యమునకు ప్రసక్తియే లేదు. అథవా, ముక్తునికి ఇతరవిషయములలో ప్రవృత్తి కలుగదని భావము.

ఈ విధముగా నిత్యవిభూతిలోకూడ “స తత్ర పర్యేతి జక్షన్ క్రీడన్ రమమాణః స్త్రీభిర్వా యానైర్వా” అని చెప్పినట్లు ముక్తుని వ్యాపారమైన స్త్రీయాదులతో క్రీడించుట మొదలైనవి బంధకమగుట లేదు అని “అత ఏవ చ అనన్యాధిపతిః” అను సూత్రములో సాదించియున్నారు. ఆత్మరతిః ఆత్మక్రీడః ఆత్మమిథునః ఆత్మానన్దః అని భూమవిద్యయందుచెప్పబడియుండుటచే ముక్తునికి పరమపురుషానుభవ విషయమందు అంతర్గతముకాని అనుభవము ఏదియును లేదని చెప్పియుండుటచే స్త్రీయాదులతో క్రీడించుచున్నాడు అన్నచో వారితోకూడ భగవత్ప్రీతిని ఉద్దేశించి భగవానుని సమక్షములో ఆటపాటలను కైంకర్యముకూడ సంభవించును. భగవచ్ఛేషత్వైకరసత్వరూప స్వయాథాత్మ్యమును – తనయొక్క యథావస్థితిని అనుభవించిన ముక్తునికి స్త్రీయాది విషయకామన ఎప్పుడును కలుగనే కలుగదు. పైగా అనావృత్తిసూత్ర శ్రీభాష్యమందు “అనవధికాతిశయానన్దం బ్రహ్మానుభవతః అన్యాపేక్షాతదర్థారంభా–ద్యసంభవాత్' అని సాదించియుండుటచేకూడ నిత్యవిభూతియందు స్వర్గాదులలోవలె కామపురుషా–ర్థానుభవములేదు.

(ఈ సూత్రమందు చెప్పబడిన ఈ అర్థములు అన్నియు శ్రుతప్రకాశికయందును, కపిస్థలం స్వామి సాదించియున్న దర్పణమందును వివరించబడియున్నవి. ఖరవర్షము శ్రీమాలోలవిద్వత్సదస్సులో విద్వచ్ఛ్రేష్ఠులమధ్యన ఇంజిమేడు శ్రీమదఴకియశింగర్ వెనుకచెప్పినప్రకారము తమ సిద్ధాంతమును ప్రసాదించిరి.)

నన్వాత్మాఽణుపరిమాణ ఇత్యుక్తమ్, కథమనేకశరీరేష్వేకస్యాణోరాత్మాభిమానసమ్భవ ఇత్యత్రాహ-

**॥ సి. సూ ॥ ప్రదీపవదావేశస్తథా హి దర్శయతి ॥ 4-4-15 ॥**

యథా ప్రదీపస్యైకస్యైకస్మిన్దేశే వర్తమానస్య స్వప్రభయా దేశాన్తరావేశః, తథాఽఽత్మనోఽప్యేకదేహస్థితస్యైవ స్వప్రభారూపేణ చైతన్యేన సర్వశరీరావేశో నానుపపన్నః । యథా చైకస్మిన్నపి దేహే హృదయాద్యేకప్రదేశవర్తినోఽపి చైతన్యవ్యాప్త్యా సర్వస్మిన్దేహే ఆత్మాభిమానస్తద్వత్। ఇయాన్విశేషః। అముక్తస్య కర్మణా సఙ్కుచితజ్ఞానస్య దేహాన్తరేష్వాత్మాభిమానానుగుణా వ్యాప్తిర్న సమ్భవతి; ముక్తస్య త్వసఙ్కుచితజ్ఞానస్య యథాసఙ్కల్పమాత్మాభిమానానుగుణా వ్యాప్తిః, "ఇదమితి" గ్రహణానుగుణా

---

అయ్యా ఆత్మ అణుపరిమాణము గలది అని చెప్పబడినది. ఇట్టి ఒక ఆత్మకు అనేకశరీరములలో ఆత్మాభిమానము ఎట్లు సంభవించును? అన్నచో, సమాధానమును ప్రసాదించుచున్నారు-

**॥ సి. సూ.॥ ప్రదీపవదావేశస్తథాహి దర్శయతి ॥ 4-4-15 ॥**

సూత్రార్థం:- **ప్రదీపవత్** = దీపం ఒకస్థలంలో ఉన్నప్పటికీ, తన కాంతిచేత అంతటా (ఎన్నో చోట్ల వ్యాపించడం) లాగనే, **ఆవేశః** = (ఒకచోట ఉన్న జీవాత్మకూడా తనకాంతి అనే ధర్మభూతజ్ఞానంవల్ల అన్ని శరీరాల్లోనూ) వ్యాపించవచ్చు. **తథా** = ఆవిధంగా, **దర్శయతి హి** = వేదవాక్యం చూపిస్తోందిగదా!

హృదయప్రదేశమందున్నను, ధర్మభూతవ్యాప్తిచే దేహమంతటను ఆత్మాభిమానము ఏవిధముగా కలుగుచున్నదో, అట్లే ముక్తాత్మయు అనేకశరీరములను ధరించినను, వాటిలో ధర్మభూతజ్ఞానముచే వ్యాపించు చున్నాడు. (ఇచ్చట చెప్పవలసినదంతయు "గుణాద్వా లోకవత్" (2-3-16) అను సూత్రమందును చెప్పవలసివచ్చినందున అచ్చటకూడ భాష్యమందు ప్రసాదించియున్నారు) స్వరూపము శరీరముయొక్క ఏకదేశమందున్నను, దాని ధర్మము ప్రదేశాంతరములో కార్యకరమగుచున్నది అని దృష్టాంతముచే తెలియదగును. ఇట్లుండగా వస్త్వంతరములుకూడ జ్ఞానాధిష్ఠితములుకావచ్చునుగదా అన్నచో, ఇయాన్ విశేషః- పుణ్యపాపరూపకర్మలచే సంకుచితజ్ఞానమునుగల ముక్తుడుకానివానికి - అనగా బద్ధునికి దేహాంతరములలో ఆత్మాభిమానానుగుణవ్యాప్తి కలుగదు. అసంకుచితజ్ఞానము గల ముక్తునికి యథాసంకల్పము- అతడి ఇచ్ఛననుసరించి ఆత్మాభిమానానుగుణముగా వ్యాప్తియు ఈ శరీరము నాకు చెందినది అని గ్రహించుటయు అనుపపన్నముకాదు. (ఆత్మాభిమానో హి శరీరత్వాభిమానః, తదేకప్రవర్త్యం హి శరీరమ్। తత్ప్రేరకత్వం శరీరిత్వం ఇదమితి గ్రహణానుగుణే ఇతి ప్రకాశకత్వశక్తిరుక్తా- శ్రుతప్రకాశిక)

తన స్వరూపము అణువుగా నున్నను, ధర్మభూతజ్ఞానముచే అనేకశరీరిత్వోపపత్తౌ శ్రుతి-ప్రమాణమును చూపుచున్నారు - దర్శయతి హి అని - 'వాలాగ్రశతభాగస్య శతధా కల్పితస్య చ భాగో జీవః స విజ్ఞేయః స చానన్త్యాయ కల్పతే।' (శ్వే. 5-9) నల్లనిధాన్యపుచిగురు చివరను నూరుగా విభజించి, దానిని తిరిగి నూరుగా విభజించినచో అందులో ఒకభాగపు పరిమాణంగలవాడు జీవుడు. - మోక్షములో ధర్మభూతజ్ఞానవికాసముచే విభుత్వలక్షణానన్త్యమును గలదై యుండును. విభువై అంతటను వ్యాపించినదై యుండును అని.

*చ నానుపపన్నా । తథా హి దర్శయతి - "వాలాగ్రశతభాగస్య శతధా కల్పితస్య చ । భాగో జీవః స విజ్ఞేయః స చానన్త్యాయ కల్పతే"(శ్వే.5-9)ఇతి । అముక్తస్య కర్మ నియామకమ్, ముక్తస్య తు స్వేచ్ఛేతి విశేషః ॥ 15 ॥*

*నను పరంబ్రహ్మ ప్రాప్తస్యాఽన్తరబాహ్యజ్ఞానలోపం దర్శయతి శ్రుతిః, 'ప్రాజ్ఞేనాఽఽత్మనా సమ్పరిష్వక్తో న బాహ్యం కిఞ్చన వేద నాన్తరమ్'(బృ.6-3-21)ఇతి, తత్కథం ముక్తస్య సార్వజ్ఞ్యముచ్యతే? తత్రోత్తరమ్-*

***॥ సి. సూ ॥ స్వాప్యయసమ్పత్త్యోరన్యతరాపేక్షమావిష్కృతం హి ॥ 4-4-16 ॥***

*నేదం వచనం ముక్తవిషయమ్, అపి తు స్వాప్యయ సమ్పత్త్యోరన్యతరాపేక్షమ్। స్వాప్యయః- సుషుప్తిః, సమ్పత్తిశ్చ-మరణం, 'వాఙ్మనసి సమ్పద్యతే' ఇత్యారభ్య 'తేజః పరస్యాందేవతాయా(ఛాం.6-*

---

అయ్యా, ముక్తదశని పొందని బద్ధులైన సౌభరిప్రభృతులుకూడ అనేకశరీరములను కలిగియుండిరని తెలియుచున్నదే. ముక్తునకును సౌభరిప్రభృతులకును వ్యత్యాసమేమి? ముక్తుడు అనేక శరీరములను గ్రహించి వాటిలో ధర్మభూతజ్ఞానద్వారా వ్యాపించియున్నాడు అన్నచో పూర్వావస్థలో కూడ – బద్ధావస్థలో కూడ ఆవిధముగా చేయవచ్చునుగదా! అన్నచో సమాధానము చెప్పుచున్నాము– అముక్తులైన సౌభరియనువారు వారు చేసిన పుణ్యకర్మచే తపోబలముచే పలు శరీరములను గ్రహించి వాటిలో జ్ఞానద్వారా వ్యాపించియుండిరి. ముక్తుడు కర్మసంబంధములేనివాడుగనుక తన ఇచ్ఛచే – సంకల్పముచే పలుశరీరములను ధరించి వాటిలో జ్ఞానద్వారా వ్యాపించియున్నాడు అనుటయే భేదము– విశేషము. 15

అయ్యా పరబ్రహ్మమును పొందినవాడు లోపల, బయటను ఉన్న విషయములను తెలిసికొనుటకు సాధ్యము కానివాడై జ్ఞానశూన్యుడై యుండును అని శ్రుతి చెప్పుచున్నది. 'ప్రాజ్ఞేనాత్మనా సంపరిష్వక్తో న బాహ్యం కిఞ్చన వేదనాన్తరమ్' (బృహ. 6-3-21) సర్వజ్ఞుడైన పరమాత్మతో చేరియున్నవాడు బాహ్యంగాఉన్నదాన్నీ, ఆంతరంగా ఉన్నదాన్నీకూడా దేన్నీ తెలుసుకోలేదు.) అని చెప్పునపుడు పరమాత్మసంపత్తిని పొందిన ముక్తునకు ఒకే సమయములో జ్ఞానముచే అనేకశరీరవ్యాప్తియనునది ఎట్లు సంభవించును? అను ఆక్షేపమునకు సమాధానమును ప్రసాదించుచున్నారు–

***॥ సి. సూ.॥ స్వాప్యయసంపత్త్యోరన్యతరాపేక్షమావిష్కృతం హి ॥ 4-4-16 ॥***

సూత్రార్థం:– ఇచ్చట చెప్పబడిన వచనము ముక్తుని విషయము కాదు. **స్వాప్యయసమ్పత్త్యోరన్యతరాపేక్షం** = (ప్రాజ్ఞేనాత్మనా' అని మొదలయ్యే వాక్యం)నిద్రావస్థ లేదా మరణావస్థ అనే రెండింట్లో ఒకదాన్ని ఈ శ్రుతివాక్యం చెప్తోంది. స్వాప్యయః– సుషుప్తి. నిద్ర. సంపత్తిః– మరణము. ఈ వాక్యము స్వాపకాలమందు జీవాత్మ పరమాత్మతో చేరియుండును, అనగా, (జీవాత్మకు పరమాత్మ సుషుప్తిస్థానము.) అని చెప్పుచున్నది. "వాఙ్మనసి సంపద్యతే" అని ఆరంభించి "తేజః పరస్యాం దేవతాయామ్" అను శ్రుతి, సంపత్తికాలమందు –మరణకాలములో– జీవాత్మయనువాడు పరమాత్మతో చేరియుండును అని చెప్పుచున్నది. ఇట్లు ఈ రెండు అవస్థలలో పరమాత్మను పొందినవానికి జ్ఞానాభావము చెప్పబడియున్నది. కనుక ఇచ్చట చెప్పబడిన ఈ శ్రుతివాక్యము ఈ అవస్థలలో ఒకదానిని చెప్పుచున్నది.

*8-6)మితి వచనాత్। తయోశ్చావస్థయోః ప్రాజ్ఞప్రాప్తిర్నిఃసమ్బోధత్వం చ విద్యేతే । అతస్తయో రన్యతరాపేక్షమిదం వచనమ్ । సుషుప్తిమరణయోర్నిఃసమ్బోధత్వం ముక్తస్య చ సర్వజ్ఞత్వమావిష్కృతం హి శ్రుత్యా। 'నాహ ఖల్వయమేవం సమ్ప్రత్యాత్మానం జానాతి అయమహమస్మీతి. నో ఏవేమాని భూతాని; వినాశ మేవాపీతో భవతి। నాహమత్ర భోగ్యం పశ్యామి'(ఛాం. 8-11-2)ఇతి సుషుప్తి వేలాయాం నిస్సంబోధత్వముక్త్వా తస్మిన్నేవ వాక్యే ముక్తమధికృత్య 'స వా ఏష దివ్యేన చక్షుషా మనసైతాన్ కామాన్ పశ్యన్ రమతే య ఏతే బ్రహ్మలోకే' (ఛాం.8-12-5)ఇతి సర్వజ్ఞత్వముచ్యతే। తథా, "సర్వం హ పశ్యః పశ్యతి సర్వమాప్నోతి సర్వశః'(ఛాం.7-26-2)ఇతి చ స్పష్టమేవ సర్వజ్ఞత్వముచ్యతే । తథా మరణే చ నిస్సమ్బోధత్వం, "ఏతేభ్యో భూతేభ్యః సముత్థాయ తాన్యేవానువినశ్యతి(బృ.4-41-2)ఇత్యుక్తమ్। వినశ్యతి-న పశ్యతీత్యర్థః। అతః 'ప్రాజ్ఞేనాత్మనా'(బృ.6-3-21)ఇతి వచనం స్వాప్యయసమ్పత్త్యో రన్యతరాపేక్షమ్॥16॥*

*॥ ఇతి అభావాధికరణమ్ ॥ 5 ॥*

---

సుషుప్తి, మరణములలో అజ్ఞత్వమును ముక్తునికి సర్వజ్ఞతమును శ్రుతియే ప్రకాశింపచేయుచున్నది–చెప్పుచున్నది **ఆవిష్కృతం హి** = (ఈవిషయం) ఉపనిషద్వాక్యాల్లోనే బైటపెట్టబడిందిగదా!

'నాహ ఖల్వయమేవం సంప్రత్యాత్మానం జానాతి అయమహమస్మీతి। నో ఏవేమాని భూతాని వినాశమేవాపీతో భవతి।' (ఛాం. 8–11–2) (నిద్రిస్తున్న ఈజీవుడు నిద్రిస్తున్నప్పుడు 'నేను ఉన్నాను' అని తనని తెలుసుకోవడం లేదు. తనని తప్ప మిగతాపదార్థాలనీ తెలుసుకోవడం లేదు. ఆస్థితిలో మరణించినవాడిలాగ ఉన్నాడు.)అని నిద్రావస్థలో జ్ఞానశూన్యుడౌతున్నాడని చెప్పి, అక్కడే ముక్తాత్మనిగురించి, 'స వా ఏష దివ్యేన చక్షుషా మనసైతాన్ కామాన్ పశ్యన్ రమతే యేతే బ్రహ్మలోకే' (ఛాం. 8–12–5)(ఈముక్తాత్మ (కర్మకారణంగా కలిగిన శరీరేంద్రియాలని వదిలి) 'మనస్సు' అనబడే దివ్యమైన సహజమైన కంటితో బ్రహ్మలోకంలోనున్న ఈసమస్తకామాలనీ అనుభవించి ఆనందంపొందుతున్నాడు) అని మోక్షావస్థలో సర్వజ్ఞత్వాన్ని చెప్పి, 'సర్వగ్ం హ పశ్యః పశ్యతి సర్వమాప్నోతి సర్వశః'(ఛాం. 7–26–2)( అన్నింటినీ తెలిసిన ముక్తుడు సమస్తాన్నీ చూస్తున్నాడు. సమస్తాన్నీ అన్నివిధాలుగానూ పొందుతున్నాడు.) అని మరోవాక్యంకూడా ముక్తావస్థలో సర్వజ్ఞుడవడాన్ని అతిస్పష్టంగా చెప్పింది. ఇలాగే మరణావస్థలోకూడా 'వాఙ్మనసి సంపద్యతే'(ఛాం. 6–8–6) అని మొదలుబెట్టి, 'తేజః పరస్యామ్ దేవతాయామ్' అని జీవుడికి పరమాత్మప్రాప్తి చెప్పబడింది. 'ఏతేభ్యో భూతేభ్యః సముత్థాయ తాన్యేవానువినశ్యతి' (బృహ. 4–4–12)(ఈభూతాలనించి బయలుదేరి, వాటినివేటినీ తెలుసుకోలేదు.)అని జీవుడు జ్ఞానశూన్యుడౌతున్నాడని ఉపనిషద్వాక్యం చెప్పింది. కనుక, పరమాత్మ ప్రాప్తినీ, జ్ఞానశూన్యస్థితినీ చెప్పే 'ప్రాజ్ఞేనాత్మనా' (బృహ. 6–3–21) అని మొదలయ్యే వాక్యం సుషుప్త్యవస్థ, మరణావస్థ అనేవాటిలో ఏదో ఒకదాన్ని గురించినదే తప్ప ముక్తావస్థనిగురించినది కాదు. కనుక, ముక్తుడు కొంతసమయం దేహంలేకుండానూ ఉండవచ్చు అని తేలింది.

అభావాధికరణము ముగిసినది.

## ॥ జగద్వ్యాపారవర్జాధికరణమ్ ॥ 4-4-6 ॥

### ॥ సి. సూ ॥ జగద్వ్యాపారవర్జం ప్రకరణాదసన్నిహితత్వాచ్చ ॥ 4-4-17 ॥

*కిం ముక్తస్యైశ్వర్యం జగత్సృష్ట్యాది పరమపురుషాసాధారణం సర్వేశ్వరత్వమపి? ఉత తద్రహితం కేవలపరమపురుషానుభవవిషయమితి సంశయః । కిం యుక్తమ్? జగదీశ్వరత్వమపీతి। కుతః? 'నిరఞ్జనః పరమం సామ్యముపైతి"(ము.3-1-3)ఇతి పరమపురుషేణ పరమసామ్యాపత్తిశ్రుతేః, సత్యసఙ్కల్పత్వ శ్రుతేశ్చ। న హి పరమసామ్యసత్యసఙ్కల్పత్వే సర్వేశ్వరాసాధారణ జగన్నియమనేన వినోపపద్యేతే ।*

---

## జగద్వ్యాపారవర్జాధికరణము (4-4-6)

### ॥ సి. సూ ॥ జగద్వ్యాపారవర్జం ప్రకరణాదసన్నిహితత్వాచ్చ ॥ 4-4-17 ॥

**సూత్రార్థం:-** **జగద్వ్యాపారవర్జం**= (ముక్తుడి ఐశ్వర్యం)లోకాలని సృష్టించడం మొదలైన (పరమాత్మ వస్తువుకే చెందిన) వ్యాపారాలని తప్పించినదే. **ప్రకరణాత్** = (బ్రహ్మలక్షణాన్ని చెప్పే)ప్రకరణంనించి(ఇది తెలుస్తోంది), **అసన్నిహితత్వాత్ చ** = (లోకాలని నియమించడాన్ని చెప్పేచోట్ల ముక్తుడికి) సన్నిధి లేకపోవడంవల్లనూ (ఇది తెలియుచున్నది).

**సంగతి:-** వెనుకటి అధికరణంలో ముక్తుడికి సంకల్పమాత్రేణ పరమపురుషానుభవా-న్తర్గత శరీరాదిసృష్టి అనునది చెప్పబడినది. ఈ అధికరణములో ముక్తుడు సత్యసంకల్పునిగనున్నను, అతడికి జగత్సృష్ట్యాది వ్యాపారము లేదు అని నిర్ణయించుచున్నారు.

**విషయము:-** ముక్తుని ఐశ్వర్యమును గురించినది.

**సంశయము:-** ముక్తుని ఐశ్వర్యము అనునది జగత్తును సృష్టించుట మొదలైన పరమపురుష అసాధారణధర్మమైన సర్వేశ్వరత్వముకూడ ఉన్నదా? లేక జగద్వ్యాపారవర్జం పరమపురుషానుభవ మాత్రమే యున్నదా?

**సంశయము వచ్చుటకు కారణము:-** పరమసామ్యము చెప్పుటచే జగత్సృష్ట్యాది వ్యాపారములనుకూడ ముక్తుడు చేయునని చెప్పవలెనన్నట్లు తోచుచున్నది. లేనిచో పరమసామ్యము సంభవించదు. సత్యసంకల్పాదులును సిద్ధించవు. కనుక జగత్సృష్ట్యాదులనుకూడముక్తుడు చేయుచున్నాడని చెప్పవలెనన్నట్లు కనబడుచున్నది. పరమసామ్యమనునది అన్నివిధములుగను సామ్యము అని అర్థముగాచెప్పికొనినచో పరమాత్మకు అసాధారణధర్మము దేనిని చెప్పుట సాధ్యము గాదు. అందుచే ముక్తునికిని పరమాత్మకును తేడా లేకుండ పోవును. కనుక పరమాత్మయొక్క అసాధారణధర్మమైన జగత్సృష్ట్యాదివ్యాపారవర్జము ముక్తునికి ఐశ్వర్యమని చెప్పవలెనని తోచుచున్నది. ఈ రెండు పక్షములలో ఏ పక్షము యుక్తియుక్తమో నిర్ణయించలేనందున సంశయము కలుగుచున్నది.

**పూర్వపక్షము:-** ముక్తునకు జగదీశ్వరత్వముండును. ఎందువలననగా, "నిరఞ్జనః పరమం సామ్యముపైతి" అను శ్రుతి పరమపురుషునితో ముక్తునకు పరమసామ్యాపత్తిని చెప్పుటచే సర్వేశ్వరునికి అసాధారణమైన జగన్నియమనము లేకపోయినచో పరమసామ్యమును సత్యసంకల్పత్వాదులును ఉప-

*అతః సత్యసఙ్కల్పత్వపరమసామ్యోపపత్తయే సమస్తజగన్నియమనరూపమపి ముక్తస్యైశ్వర్యమితి।*

*ఏవం ప్రాప్తే ప్రచక్ష్మహే - జగద్వ్యాపారవర్జం ఇతి । జగద్వ్యాపారః-నిఖిలచేతనాచేతనస్వరూప-స్థితిప్రవృత్తిభేదనియమనమ్ । తద్వర్జం నిరస్తనిఖిలతిరోధానస్య నిర్వ్యాజబ్రహ్మానుభవరూపం ముక్తస్యైశ్వర్యమ్। కుతః? ప్రకరణాత్, నిఖిలజగన్నియమనం హి పరం బ్రహ్మ ప్రకృత్యాఽఽమ్నాయతే 'యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసంవిశన్తి, తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మ'(తై-3-1-1)ఇతి । యద్యేతన్నిఖిలజగన్నియమనం ముక్తానామపి సాధారణం స్యాత్, తతశ్చేదం జగదీశ్వరత్వరూపం బ్రహ్మలక్షణం న సంగచ్ఛతే । అసాధారణస్య హి లక్షణత్వమ్ । తథా 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయం, తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి తత్తేజోఽసృజత'(ఛాం-6.2.1) 'బ్రహ్మ వా ఇదమేకమేవాగ్ర ఆసీత్తదేకం సన్నవ్యభవత్ తచ్ఛ్రేయోరూపమత్యసృజత క్షత్రం యాన్యేతాని దేవత్రా క్షత్రాణి ఇన్ద్రో వరుణః సోమో రుద్రః పర్జన్యో యమో మృత్యురీశాన ఇతి'(బృ-3-4-11) 'ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్కిఞ్చన మిషత్। స ఈక్షత లోకాన్ను సృజా ఇతి। స ఇమాన్ లోకా నసృజత' (ఐ.1-1), 'ఏకో హ వై నారాయణ ఆసీన్న బ్రహ్మ నేశానో నేమే ద్యావాపృథివీ న నక్షత్రాణి నాపో నాగ్నిర్న సోమో న సూర్యః। స ఏకాకీ న రమేత। తస్య ధ్యానాన్తస్థస్యైకా కన్యా దశేన్ద్రియాణి(మహో-1-1) ఇత్యాదిషు, 'యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అన్తరః' (బృ.5-7-3)ఇత్యారభ్య "య ఆత్మని తిష్ఠన్"(బృ.మా-6-7) ఇత్యాదిషు చ నిఖిలజగన్నియమనం పరమపురుషం ప్రకృత్యైవ శ్రూయతే ।*

---

పన్నములు కావు. కనుక సత్యసంకల్పత్వముకూడ పరమసామ్యత్వమును ఉపపన్నములగుటకు సమస్తజగన్నియమనముకూడ ముక్తుని ఐశ్వర్యమని చెప్పవలెను.

**సిద్ధాంతము:**- జగద్వ్యాపారవర్జమ్ అని చెప్పవలెను. జగద్వ్యాపారము అనునది సమస్త చేతనాచేతనముల స్వరూపస్థితిప్రవృత్తులును వాటి అవాంతరభేదములును అగు వీటిని నియమించుట. తద్వర్జం- కర్మబంధము తొలగినవానికి (నివృత్తతిరోధానస్య) జగద్వ్యాపారవర్జ్యమే ఐశ్వర్యము. ఎందువలననగా- ప్రకరణాత్- నిర్వ్యాజబ్రహ్మానుభవరూపమ్- యథావస్థిత బ్రహ్మానుభవరూపం నిఖిలజగన్నియమనముగదా పరమాత్మయొక్క అసాధారణధర్మము అని శ్రుతి చెప్పుచున్నది. "యతో వా ఇమాని భూతాని జాయన్తే... తద్విజిజ్ఞాసస్వ" (ఈ ప్రపంచమనునది ఎవనినుండి సృష్టింపబడినదో, ఎవనిచేత రక్షింపబడుచున్నదో ఎవనియందు లయమును పొందుచున్నదో అదియే బ్రహ్మము. దానిని తెలిసికొనుము) అని ఇటువంటి జగన్నియమనము ముక్తులకుకూడ సాధారణమైనచో అప్పుడు జగదీశ్వరత్వరూపం బ్రహ్మలక్షణం న సంగచ్ఛతే- జగత్కారణత్వాదులు బ్రహ్మలక్షణముగా చెప్పుట సంగతముకాదు. అసాధారణం హి లక్షణం. లక్షణమనునది లక్ష్యమాత్రమందు ఉండవలసినది గదా. అట్లే, "సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్ తత్తేజో అసృజత... ఏకో హ వై నారాయణ ఆసీత్ న బ్రహ్మ నేశానః న ఇమే ద్యావాపృథివీ... దశేన్ద్రియాణి" ఇత్యాదులలోను, "యః పృథివ్యాం తిష్ఠన్ పృథివీమన్తరః" అని ఆరంభించి "య ఆత్మని తిష్ఠన్" ఇత్యాదులలోకూడ నిఖిలజగన్నియమనము పరమపురుషునికే చెప్పబడియున్నది. అసన్నిహితత్వాచ్చ- జగన్నియమనమునుగురించి చెప్పబడు సమయమున ముక్తునికి

*అసన్నిహితత్వాచ్చ। న చైతేషు నిఖిలజగన్నియమనప్రసఙ్గేషు ముక్తస్య సన్నిధానమస్తి, యేన జగద్వ్యాపారస్తస్యాపి స్యాత్ ॥ 17 ॥*

### *॥ సి. సూ ॥ ప్రత్యక్షోపదేశాదితి చేన్నాధికారికమణ్డలస్థోక్తేః ॥ 4-4-18 ॥*

*'స స్వరాడ్ భవతి తస్య సర్వేషు లోకేషు కామచారో భవతి'(ఛాం.7-25-2), 'ఇమాన్ లోకాన్కామాన్నీ కామరూప్యనుసఞ్చరన్'(తై.3-10-5)ఇతి ప్రత్యక్షేణ శ్రుత్యా ముక్తస్య జగద్వ్యాపార ఉపదిశ్యతే। అతో న జగద్వ్యాపారవర్జమితి చేత్ - తన్న, ఆధికారికమణ్డలస్థోక్తేః, ఆధికారికాః- అధికారేషు నియుక్తా హిరణ్యగర్భాదయః, మణ్డలాని-తేషాం లోకాః, తత్స్థాః- భోగా ముక్తస్యాకర్మవశ్యస్య భవన్తీత్యయమర్థః 'తస్య సర్వేషు లోకేషు కామచారో భవతి'(ఛాం.7-25-2)ఇత్యాదినోచ్యతే, అకర్మప్రతిహతజ్ఞానో ముక్తో వికారలోకాన్ బ్రహ్మవిభూతిభూతాననుభూయ యథాకామం తృప్యతీత్యర్థః । తదేవం వికారాన్తర్వర్తిన: ఆధికారికమణ్డలస్థాన్సర్వాన్ భోగాన్ బ్రహ్మవిభూతిభూతా ననుభవతీ త్యనేన వాక్యేనోచ్యతే న జగద్వ్యాపారః ॥18॥*

---

సన్నిధిలేదుగనుకను జగన్నియమనాది ఐశ్వర్యము ముక్తునికి లేదు. కనుక జగద్వ్యాపారవర్జం ముక్తైశ్వర్యం అని చెప్పవలెను. 17

### ॥ సి. సూ ॥ ప్రత్యక్షోపదేశాదితి చేన్నాధికారికమణ్డలస్థోక్తేః ॥ 4-4-18 ॥

**సూత్రార్థం:-** **ప్రత్యక్షోపదేశాత్ ఇతి చేత్** = శ్రుతిలోనే (ముక్తుడికి జగద్వ్యాపారం) ఉపదేశింపబడి ఉండడంవల్ల (ముక్తుడి ఐశ్వర్యంలో జగద్వ్యాపారాన్ని తప్పించకూడదు) అంటే, **న** = ఇది సరిగాదు. **ఆధికారికమణ్డలస్థోక్తేః**= (ఆవాక్యాల్లో) సృష్టిమొదలైన వాటిలో అధికారమున్న బ్రహ్మ మొదలైన పురుషుల లోకాలలో నున్న భోగాలే (ముక్తుడికి) చెప్పబడడంవల్ల.

'స స్వరాట్ భవతి తస్య సర్వేషు లోకేషు కామచారో భవతి' (ఛాం. 7-25-2) (ఆ ముక్తుడు (కర్మ)పారతంత్ర్యం లేనివాడగుచున్నాడు. వానికి అన్నిలోకములలో ఇష్టప్రకారము సంచారమున్నది) 'ఇమాన్ లోకాన్ కామాన్నీకామరూప్యనుసంచరన్'(తై. భృగు. 10-5) (కోరుకొనిన రూపముతో కావలసిన దానిని అనుభవించువాడై, ఈలోకములలో సంచరించుచున్నాడు) అని ముక్తునికి జగద్వ్యాపారము సాక్షాత్తుగనే చెప్పబడినది. కనుక జగద్వ్యాపారవర్జమని చెప్పకూడదు అని పూర్వపక్షి చెప్పుట సరికాదు. ఆధికారికమణ్డలస్థోక్తేః- ఆధికారికాః-అధికారేషు నియుక్తాః- జగత్తును సృష్టించునట్లు శ్రీమన్నారాయణునిచే నియమించబడిన హిరణ్యగర్భుడు మొదలైనవారి లోకములు- మండలములు. తత్స్థాః- ఆ మండలములలోనున్నభోగములు అకర్మవశ్యుడైన ముక్తునికి సంభవించును అను అర్థము "తస్య సర్వేషు లోకేషు కామచారో భవతి" అనుటచే చెప్పబడుచున్నది. హేయాతీతుడైన- పుణ్యాపాపరహితుడైన ముక్తునికి హేయాస్పదమైన వికారలోకాపేక్ష- కార్యభూతలోకాపేక్ష ఎట్లు కలుగును? అని శంకించకూడదు. కర్మసంబంధములేదుగనుక వికసితజ్ఞానముగల ముక్తునికి కార్యభూతలోకములన్నియు భగవద్విభూతి యనుటచే, అత్యన్తభోగ్యమగుచున్నవి. వాటిని తన ఇష్టప్రకారము అనుభవించి తృప్తిపొందుచున్నాడని అర్థము. ఇక తదేవం అని ఆరంభించి సూత్రమును చెప్పి ముగించుచున్నారు.

*యది సంసారివన్ముక్తోఽపి వికారాన్తర్వర్తినో భోగాన్ భుఙ్క్తే, తర్హి బద్ధస్యేవ ముక్తస్యాప్యన్తవదేవ భోగ్యజాతమ్; అల్పం చ స్యాత్; తత్రాహ-*

**॥ సి. సూ ॥ వికారావర్తి చ తథా హి స్థితిమాహ ॥ 4-4-19 ॥**

*వికారే-జన్మాదికే న వర్తతే ఇతి వికారావర్తి, నిర్ధూతనిఖిల వికారం నిఖిలహేయప్రత్యనీక కల్యాణైకతానం నిరతిశయానన్దం పరంబ్రహ్మ సవిభూతికం సకలకల్యాణగుణమనుభవతి ముక్తః। తద్విభూత్యన్తర్గతత్వేన వికారవర్తినాం లోకానామపి ముక్తభోగ్యత్వమ్। తథా హి పరస్మిన్ బ్రహ్మణి నిర్వికారే అనవధికాతిశయానన్దే ముక్తస్యానుభవితృత్వేన స్థితిమాహ శ్రుతిః- 'యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే, అథ సోఽభయం గతో భవతి', 'రసో వై సః। రసం హ్యేవాయం లబ్ధ్వాఽఽనన్దీభవతి' (తై.7-2-1) ఇత్యాదికా। తద్విభూతిభూతం జగత్తత్రైవ వర్తతే 'తస్మిన్ లోకాః శ్రితా, సర్వే తదు నాత్యేతి కశ్చన' (కఠ.2-5-9) ఇతి శ్రుతేః। అతః సవిభూతికం*

---

అనగా వికారాన్తర్వర్తియైన ఆధికారికమండలస్థులైన బ్రహ్మ విభూతిభూతములైన సమస్త భోగములను అనుభవించుచున్నాడు అని కామాన్నీకామరూప్యనుసంచరన్ ఇత్యాది శ్రుతివాక్యముచే చెప్పబడుచున్నది. కనుక జగద్వ్యాపారవర్జమే ముక్తైశ్వర్యమని చెప్పవలెను. 18

ముక్తుడు తన ఇష్టప్రకారము సంచరించుచు వికారాన్తర్వర్తియైన భోగములను అనుభవించు చున్నాడు అన్నచో అప్పుడు బద్ధునికివలె ముక్తునికిని భోగములు అంతముగలవిగను అల్పములుగను అగునను ఆక్షేపమునకు సమాధానము ప్రసాదించుచున్నారు-

**॥ సి. సూ ॥ వికారావర్తి చ తథా హి స్థితిమాహ ॥ 4-4-19 ॥**

సూత్రార్థం:- **వికారావర్తి చ** = సమస్తవికారాలూ లేని బ్రహ్మాన్నికూడా (ముక్తుడు అనుభవిస్తున్నాడు), **తథా స్థితిం ఆహ హి** = ఆవిధంగానే వికారంలేని బ్రహ్మవద్ద (దాన్ని అనుభవించేవాడిగా ఈముక్తుడికి) స్థితిని శ్రుతి చెప్తోందిగదా!

వికారే -జన్మాదికే(జననమరణాదులు) న వర్తత ఇతి వికారావర్తి. -సమస్తవికారరహితుడై, నిఖిల హేయప్రత్యనీకుడై, కల్యాణైకతానుడై, నిరతిశయానందుడై, వేంచేసియుండే పరబ్రహ్మమును ఉభయ-విభూతినాయకుడై, సకలకల్యాణగుణగణాకరుడై ముక్తుడు అనుభవిస్తున్నాడు. భగవానుడి విభూతిలో అంతర్గతమైనందువలన, వికారావర్తియైన లోకాలకిన్నీ ముక్తభోగ్యత్వము సంభవించుచున్నది. తథా హి-అనవధికాతశయానందుడును నిర్వికారుడును అయియున్న పరబ్రహ్మమువద్ద అనుభవించువానిగా ముక్తునికి అనుభవితృత్వస్థితిని శ్రుతి చెప్పుచున్నది. 'యదా హ్యేవైష ఏతస్మిన్ అదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే, అథ సోఽభయంగతో భవతి' (తై. ఆనం. 7-2) (ఎప్పుడు ఈఉపాసకుడు అదృశ్యే-కళ్ళకి కనబడనిదీ, అనాత్మ్యే- ఆత్మ్యం-శరీరం, అనాత్మ్యం- అశరీరమిత్యర్థః- శరీరంలేనిదీ. అందుచేత అనిరుక్తే- జాతి, గుణం మొదలైనవాటితో దేవాదిశబ్దాలవల్ల వర్ణించసాధ్యంగానిదీ, అనిలయనే-ఆధారం లేనిదీ అయిన ఈ పరమాత్మవస్తువువద్ద భయంలేకుండా ఉండడంకోసం, ప్రతిష్ఠాం-నిరన్తరస్మృతిలక్షణం నిష్ఠాం- ధ్యానాన్ని పొందుతున్నాడో, అప్పుడు అతడు భయంలేనివాడుగా

*బ్రహ్మానుభవన్ వికారాన్తర్వర్తిన ఆధికారికమణ్డలస్థానపి భోగాత్ భుఙ్క్త ఇతి, 'సర్వేషు లోకేషు కామచారః' (ఛాం.7-25-2)ఇత్యాదినోచ్యతే; న ముక్తస్య జగద్వ్యాపారః ॥ 19 ॥*

## *॥ సి. సూ ॥ దర్శయతశ్చైవం ప్రత్యక్షానుమానే ॥ 4-4-20 ॥*

*అస్య ప్రత్యగాత్మనో ముక్తస్య నియామ్యభూతస్య నియన్తృభూతపరమపురుషాసాధారణం జగద్వ్యాపారరూపం నియమనం న సమ్భవతీత్యుక్తమ్। నిఖిలజగన్నియమనరూపో వ్యాపారః పరమపురుషాసాధారణ ఇతి దర్శయతః శ్రుతిస్మృతీ । 'భీషాస్మాద్వాతః పవతే భీషోదేతి సూర్యః। భీషాऽస్మాదగ్నిశ్చేన్ద్రశ్చ మృత్యుర్ధావతి పఞ్చమః' (తై.2-8-1) ఇతి 'ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచన్ద్రమసౌ విధృతౌ తిష్ఠతః' (బృ. 1-8-6) ఇత్యాదిః। తథా 'ఏష సర్వేశ్వర ఏష భూతాధిపతిరేష భూతపాల ఏష సేతుర్విధరణ ఏషాం లోకానామసమ్భేదాయ'(బృ.6-4-22)ఇతి చ శ్రుతిః । స్మృతిరపి 'మయాऽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ । హేతునాऽనేన కౌన్తేయ జగద్ధి పరివర్తతే'(భ.గీ.9-10)*

అవుతున్నాడు) అనిన్నీ, 'రసోవై సః। రసంహ్యేవాయం లబ్ధ్వాऽऽనన్దీ భవతి' (తై.ఆన. 7-2-1) (ఆపరమాత్మ రసంగానే ఉన్నవాడుగదా! ఈరసస్వరూపినిపొంది ఈజీవుడుకూడా, ఆనందముగలవాడౌతున్నాడు) మొదలైన వేదవాక్యాలు భగవానుడి విభూతిభూతమైన జగత్తు ఆయనవద్దనే ఉన్నది అనే ఈవిషయం స్పష్టమౌతోంది. పరమాత్మతాలూకు ఐశ్వర్యమైన లోకం ఆయనలోనే ఇమిడి ఉన్నదనే విషయం కూడా 'తస్మిన్ లోకాః శ్రితాః సర్వే తదునాత్యేతి కశ్చన' (ఆపరమాత్మ వద్దనే లోకాలన్నీ ఒదిగిఉన్నాయి. ఏవస్తువైనా దానినుండి దూరంగా ఉండదు.) అని వేదవాక్యంలో చెప్పబడింది. కనుక, సవిభూతికమైన బ్రహ్మమును అనుభవించుచున్నవానిగా వికారావర్తులైన ఆధికారికమండలాంతర్వర్తులైన భోగములను అనుభవించుచున్నాడని "సర్వేషు లోకేషు కామచారో భవతి" అను శ్రుతి చెప్పుచున్నది. కనుక ముక్తునికి జగద్వ్యాపారము లేదు. 19

## *॥ సి. సూ ॥ దర్శయతశ్చైవం ప్రత్యక్షానుమానే ॥ 4-4-20 ॥*

సూత్రార్థం:- **ప్రత్యక్షానుమానే** = శ్రుతిస్మృతులు, **ఏవమ్ చ** = జగద్వ్యాపారం పరమపురుషుడికే చెందినదిఅని **దర్శయతః** = చూపుతున్నాయి.

నియామ్యభూతుడైన ముక్తునికి నియంతృభూతుడైన పరమాత్మయొక్క అసాధారణమైన జగద్వ్యాపార రూపమైన నియమనము సంభవించదు అని చెప్పబడింది. నిఖిలజగన్నియమనరూపమైన వ్యాపారము అని ప్రత్యక్షానుమానే దర్శయతః- శ్రుతులును, స్మృతులును చెప్పుచున్నవి. 'భీషాస్మాద్వాతః పవతే భీషోదేతి సూర్యః। భీషాస్మాదగ్ని శ్చేన్ద్రశ్చ మృత్యుర్ధావతి పఞ్చమః ఇతి' (తై.ఆనం. 8-1) (ఈపరమాత్మకిభయపడి గాలివీస్తోంది. ఇతనంటేభయంచేత సూర్యుడు ఉదయిస్తున్నాడు, అగ్ని, ఇంద్రుడు, పంచముడైన యముడు మొదలైన దేవతలున్నూ ఇతనిభయంవల్లనే తమతమ కార్యాలని చేస్తున్నారు.) అనియు, 'ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః' (బృహ5-8-9) (ఓగార్గీ, అక్షరశబ్దవాచ్యుడైన (నాశములేనివాడైన) ఈపరమపురుషుని నియమనముచేతనే సూర్యచంద్రులు విశేషేణ ధరింపబడినవారై నిలబెట్టబడి ఉన్నారు) అనిన్నీ, "ఏష సర్వేశ్వరః ఏష భూతాధిపతిః ఏష భూతపాలః ఏష సేతుర్విధరణః ఏషాంలోకానాం అసంభేదాయ"(ఇతడు సర్వేశ్వరుడు, ప్రాణులకు అధిపతి అనగా శేషి, ప్రాణులకు

*ఇతి, 'విష్టభ్యాహమిదం కృత్స్న మేకాంశేన స్థితో జగ'దితి చ (భ.గీ. 10-42)। తథా ముక్తస్య సత్యసఙ్కల్పాది పూర్వకస్యాప్యానన్దస్య పరమపురుష ఏవ హేతురితి శ్రుతిస్మృతీ దర్శయతః - 'ఏషహ్యేవానన్దయాతి'(తై.7-21) 'మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే। స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే। బ్రహ్మణోహి ప్రతిష్ఠాఽహమమృతస్యావ్యయస్య చ। శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాన్తికస్య చ'(భ.గీ.14-26,27) ఇతి। యద్యప్యపహతపాప్మత్వాదిః సత్యసఙ్కల్పత్వపర్యన్తో గుణగణః ప్రత్యగాత్మనః స్వాభావిక ఏవాఽఽవిర్భూతః- తథాఽపి తస్య తథావిధత్వ మేవ పరమపురుషాయత్తం, తస్య నిత్యస్థితిశ్చ తదాయత్తా, పరమపురుషస్యైతన్నిత్యతాయాః నిత్యేష్టత్వాన్నిత్యతయా వర్తత ఇతి న కశ్చిద్విరోధః। ఏవమేవ పరమపురుషభోగోపకరణస్య లీలోపకరణస్య చ నిత్యతయా శాస్త్రావగతస్య పరమపురుషస్య*

---

రక్షకుడు, సమస్తలోకములనుసాంకర్యమును పొందకుండ నుండుటకు (ఒకదానితో మరొకటి చేరిపోకుండ నుండుటకు) విధరణః – ధారకుడు, సేతువువలె అడ్డుకొనువాడు) అనియు చెప్పుచున్న శ్రుతులు పరమాత్మ నియంత, ధారకుడు అని చెప్పుచున్నవి. స్మృతియు 'మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్। హేతునానేన కౌన్తేయ జగద్ధి పరివర్తతే' (గీత 9–10) (సత్యసంకల్పుడనైన నేనే వారువారు చేయు కర్మలను అనుసరించి, నావల్ల నిలపబడిన ప్రకృతి, చరాలు అచరాలు అయిన అనేక వస్తువులుగా పరిణమించవలెను అని సంకల్పించి దానిని కటాక్షించుచున్నాను. నాచేత కటాక్షింపబడిన ప్రకృతి దేవాదిశరీరముగ పలువిధములుగా పరిణామమును పొందుచున్నది)అనియు, 'విష్టభ్యాహమిదం కృత్స్నం ఏకాంశేన స్థితో జగత్' (గీత 10–42) (ఈసమస్తలోకాన్నీ, దేనినీ కొంచెంకూడా వదలకుండ నేను నా సంకల్పంలోని పదివేలలో ఒక అంశచేత ధరించియు వ్యాపించియు ఉన్నాను), మొదలైన స్మృతులుకూడా జగద్వ్యాపారం పరమపురుషుడికేనని చూపుతున్నాయి. ముక్తుడు అనుభవించే ఆనందానికి కూడా పరమాత్మే కారణం అన్నదాన్నికూడా 'ఏషహ్యేవానన్దయాతి' (తై.ఆన. 7–21) (ఈపరమపురుషుడే (ముక్తుడికి) ఆనందంపొందింపచేస్తున్నాడు,) మొదలైన శ్రుతులున్నూ, 'మాఞ్చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే। స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే।'(గీత 14–26) ఎవరు, ఇతరదైవాలనీ ఫలాలనీ భావించకుండా ఉన్న భక్తియోగంచేతనూ, (దానికి అంగములతోనూ) నన్ను ఆరాధిస్తున్నాడో, వాడు (సత్వం మొదలైన) ఈమూడు గుణాలనీ దాటిపోయి, బ్రహ్మంతో సరిసమానమైన స్వభావాన్ని పొందతగిన వాడౌతున్నాడు) 'బ్రహ్మణో హి ప్రతిష్ఠా ఽహమమృతస్యావ్యయస్య చ। శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాన్తికస్య చ।।' (గీత 14–27)( ఎందుకంటే, నేను మరణంలేని, నాశములేని జీవాత్మ తనస్వరూపాన్ని పొందడానికి ఉపాయమైనాను. శాశ్వత ధర్మమైన భక్తియోగంవల్ల సాధించబడే అతివిశిష్టమైన ఐశ్వర్యాన్ని పొందడానికికూడా ఉపాయమౌతున్నాను. జ్ఞానివలన పొందబడే మహానందానికీ ఉపాయమౌతున్నాను) మొదలైన స్మృతులున్నూ చూపుతున్నాయి. యద్యపి, అపహతపాప్మత్వాది సత్యసంకల్పపర్యంతమైన ప్రత్యగాత్మయొక్క స్వాభావికమైన గుణగణములే ఆవిర్భవించుచున్నవి. అయినను ముక్తునికి తథావిధత్వము– స్వాభావికత్వము పరమపురుషాయత్తము– పరమపురుషుని అధీనమైనదిగనే– సంకల్పముచేతనే సిద్ధించుచున్నవి. స్వాభావికమైన ఆ గుణములు యావదాత్మభావియై నిత్యముగా నున్నవి" అనుటలో ఎట్టి విరోధములను లేదు. ఈవిధముగా పరమపురుషభోగోపకరణములును లీలోపకరణములును నిత్యములు అని శాస్త్రములచే

నిత్యేష్టత్వాదేవ తథాఽవస్థానమస్తీతి శాస్త్రాదవగమ్యతే। అతో ముక్తస్య సత్యసఙ్కల్పత్వం పరమపురుషసామ్యఞ్చ జగద్వ్యాపారవర్జమ్॥20॥

**॥ సి. సూ ॥ భోగమాత్రసామ్యలిఙ్గాచ్చ ॥ 4-4-21 ॥**

బ్రహ్మయాథాత్మ్యానుభవరూపభోగమాత్రే ముక్తస్య బ్రహ్మసామ్యప్రతిపాదనాచ్చ లిఙ్గాత్ జగద్వ్యాపారవర్జమిత్యవగమ్యతే 'సోఽశ్నుతే సర్వాన్కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా' (తై.1-2) ఇతి। అతో ముక్తస్య పరమపురుషసామ్యం సత్యసఙ్కల్పత్వం చ పరమపురుషాసాధారణ నిఖిల-జగన్నియమనశ్రుత్యానుగుణ్యేన వర్ణనీయమితి జగద్వ్యాపారవర్జమేవ ముక్తైశ్వర్యమ్ ॥ 21 ॥

---

తెలియబడుచున్నవి. భగవానుని నిత్యేచ్ఛాసంకల్పముచేతనే అవి నిత్యములుగా నున్నవి అని శాస్త్రముచే తెలియుచున్నది. కనుక ముక్తునికి నియంతృత్వము లేదుగనుక ఆనందవైకల్యము- లోటుపాటు లేదు. ప్రత్యుత ఆనందాధిక్యమే యున్నది అందరికిని స్వాత్మాభిమానానుగుణముగ భోగ్యవ్యవస్థయు దానికి భిన్నమైన వ్యవస్థయు ఉన్నదని చూచుచున్నాము.

అన్నం భోజ్యం మనుష్యాణాం అమృతం తు దివౌకసామ్।
శ్వపశువిధృణాహారౌ సన్తో దాస్యైకజీవనాః॥ ఇత్యాదులలో తనను మనుష్యునిగా భావించినవానికి అన్నము పురుషార్థమగును. దేవునిగా భావించినవానికి అమృతము పురుషార్థమగును. కుక్కగా, పశువులుగా భావించినవానికి వితృణములు పురుషార్థములగును. సత్తాకాభిమానికి (అనగా పరబ్రహ్మశేషత్వ జ్ఞానముచే సత్తను పొందినవానిగా భావించువానికి) భగవద్దాస్యమే పురుషార్థమగును అని చెప్పినట్లుగా, తత్తదాత్మాభిమానానుగుణపురుషార్థవ్యవస్థప్రకారమే అని తాత్పర్యము. కనుక ఆవిర్భూతయథావస్థిత-స్వరూపమును గల ముక్తుడు శేషత్వమే తనకు స్వాభావికరూపము అని సాక్షాత్కరించి- ప్రత్యక్షముగా దర్శించుటచే సర్వశేషియైన పరమపురుషుని పరిచరణమే-పరమపురుషునికి కైంకర్యము చేయుటయే తనకు ప్రియతమమగును అని భావించును. దానికి బదులైన ఈశ్వరత్వము-నియంతృత్వము అనిష్టమే యగును. కనుక ఆనందవైకల్యము లేదు, అధికానందమే యున్నది.

**॥ సి. సూ ॥ భోగమాత్రసామ్యలిఙ్గాచ్చ ॥ 4-4-21 ॥**

**సూత్రార్థం:-** **భోగమాత్రసామ్యలిఙ్గాచ్చ** = (బ్రహ్మానుభవమనే) భోగమాత్రంచేత, (ముక్తుడికి బ్రహ్మంతో) సామ్యాన్ని చెప్పే కారణంచేతనూ, (జగద్వ్యాపారంలేనిదే ముక్తుడి ఐశ్వర్యం)

బ్రహ్మానుభవరూపభోగమాత్రముచే ముక్తునికి బ్రహ్మసామ్యప్రతిపాదనలిఙ్గాత్- బ్రహ్మసామ్యతను చెప్పు కారణముచే జగద్వ్యాపారవర్జం సామ్యమ్ అనునది తెలియుచున్నది. "సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా (ముక్తుడు భగవానుని కల్యాణగుణములను సర్వజ్ఞుడైన బ్రహ్మముతోబాటుగా అనుభవించుచున్నాడు) అని శ్రుతి చెప్పుచున్నది. కనుక, ముక్తునికి పరమపురుషసామ్యమును సత్యసంకల్పత్వమును పరమపురుష అసాధారణనిఖిలజగన్నియమన శ్రుత్యానుగుణ్యేన అర్థమును చెప్పవలెను. అనగా, సామాన్యముగా చెప్పబడిన సామ్యము "ఛాగోవా మన్త్రణాత్"అను న్యాయప్రకారము సామ్యవిశేషములో పర్యవసించవలెను. పరమాత్మ నియామ్యత్వాదులను చెప్పు శ్రుతిని అనుసరించి ఈఅర్థము చెప్పబడుచున్నది అని తాత్పర్యము. కనుక, జగద్వ్యాపారవర్జమే ముక్తుని ఐశ్వర్యము. 21

*యది పరమపురుషాయత్తం ముక్తైశ్వర్యం, తర్హి తస్య స్వతన్త్రత్వేన తత్సఙ్కల్పాన్ముక్తస్య పునరావృత్తిసమ్భవాశఙ్కేత్యత్రాహ -*

**॥ సి. సూ ॥ అనావృత్తిశ్శబ్దాదనావృత్తిశ్శబ్దాత్ ॥ 4-4-22 ॥**

*యథా నిఖిలహేయప్రత్యనీకకల్యాణైకతానో జగజ్జన్మాదికారణం సమస్తవస్తువిలక్షణః సర్వజ్ఞః సత్యసఙ్కల్పః ఆశ్రితవాత్సల్యైకజలధిః పరమకారుణికో నిరస్తసమాభ్యధికసమ్భావనః పరబ్రహ్మాభిధానః పరమపురుషోఽస్తీతి శబ్దాదవగమ్యతే, ఏవమహరహరనుష్ఠీయమాన వర్ణాశ్రమధర్మానుగృహీత తదుపాసనరూప తత్సమారాధనప్రీతః ఉపాసీనానాదికాలప్రవృత్తానన్తదుస్తర కర్మసఞ్చయ రూపావిద్యాం వినివర్త్య స్వయాథాత్మ్యానుభవరూపానవధికాతిశయానందం ప్రాపయ్య పునర్నావర్తయతీత్యపి శబ్దాదేవావగమ్యతే । శబ్దశ్చ 'స ఖల్వేవం వర్తయన్ యావదాయుషం బ్రహ్మలోకమభిసమ్పద్యతే న*

---

ముక్తైశ్వర్యము పరమపురుషాయత్తము అని చెప్పినచో, పరమపురుషుడు స్వతంత్రుడు గనుక అతడి సంకల్పముచే ముక్తునికి పునరావృత్తి సంభవించవచ్చును అనే సందేహం కలుగవచ్చు. (ఈశ్వరుడు స్వతంత్రుడు గనుక కొంతమందికి పునరావృత్తిని చేయవచ్చునని పూర్వపక్షం అపునరావృత్తిశ్రుతికి (పాక్షికత్వాభిప్రాయపడి) అర్థము చెప్పుచున్నాడు. దానికి సమాధానమును చెప్పుచున్నారు–

**॥ సి. సూ ॥ అనావృత్తిశ్శబ్దాదనావృత్తిశ్శబ్దాత్ ॥ 4-4-22 ॥**

సూత్రార్థం:– **అనావృత్తిః** = (ముక్తుడు సంసారమునకు) తిరిగి వచ్చుటయనునది లేదు. **శబ్దాత్** = వేదవాక్యము ఆవిధముగా చెప్పుటచే.

నిఖిలహేయప్రత్యనీక కల్యాణైకతానుడు, జగజ్జన్మాదికారణము, సమస్తవస్తువిలక్షణుడు, సర్వజ్ఞుడు, సత్యసంకల్పుడు, ఆశ్రితులపై నిరవధికమైన వాత్సల్యము గలవాడును, పరమకారుణికుడు సమాభ్యధికరహితుడు, పరబ్రహ్మమని చెప్పబడువాడును అగు పరమపురుషుడు ఒకడు ఉన్నాడు అని శబ్దముచే -శ్రుతివాక్యములచే తెలియుచున్నది.

(భగవానుడు ముక్తుని తిరిగి పంపించడు అను విషయమును తెలియచేయుటకును, ముక్తునికి బ్రహ్మమును వదలి వేరగుటను కోరే మనసే ఉండదనియు తెలియచేయుటకును, నిఖిలహేయప్రత్యనీక, కల్యాణగుణములు చెప్పబడినవి. పరమపురుషునికంటెను శ్రేష్ఠమైన వానిచే తిరిగి పంపబడినచో ఏమి చేయుట? అను సందేహమును తొలగించుటకై నిరస్తసమాభ్యధికసంభావనః అని ప్రసాదించిరి)

పరమపురుషుడు ఒకడున్నాడని శ్రుతితో ఏవిధముగ తెలిసికొనుచున్నామో, ఆవిధముగనే ప్రతిదినమును అనుష్ఠించుచున్న వర్ణాశ్రమధర్మములచే అనుగ్రహీతమైన భగవదుపాసనరూప భగవదారాధనముచే ప్రీతిచెందిన భగవానుడు ఉపాసించినవారి అనాదికాలముగా చెయ్యబడుచున్న నివర్తింపబడలేని కర్మసంచయరూపమైన అవిద్యను పోగొట్టి తనుయొక్క యాథాత్మ్య అనుభవరూపమైన అనవధికాతిశయానందమును పొందునట్లు చేయించి, పునః నావర్తయతి– తిరిగి పంపుట లేదు అనియును, శబ్దముచేతనే – శ్రుతివాక్యములతోనే తెలిసికొనుచున్నాము. శబ్దశ్చ– స ఖల్వేవం వర్తయన్

*చ పునరావర్తతే న చ పునరావర్తతే'(ఛాం.8-15-1)ఇత్యాదికః। తథా చ భగవతా స్వయమేవోక్తమ్ 'మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్। నాప్నువన్తి మహాత్మానః సంసిద్ధిం పరమాంగతాః॥ ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున । మాముపేత్య తు కౌన్తేయ పునర్జన్మ న విద్యతే'(భ.గీ.8-15/16)ఇతి।*

*న చోచ్ఛిన్నకర్మబన్ధస్యాసఙ్కుచితజ్ఞానస్య పరబ్రహ్మానుభవైకస్వభావస్య తదేకప్రియస్యానవధి-కాతిశయానన్దం బ్రహ్మానుభవతః అన్యాపేక్షాతదర్థారమ్భాద్యసమ్భవాత్ పునరావృత్తిశఙ్కా । న చ పరమపురుషః సత్యసఙ్కల్పోఽత్యర్థప్రియం జ్ఞానినం లబ్ధ్వా కదాచిదావర్తయిష్యతి య ఏవమాహ - 'ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః । ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్*

---

యావదాయుషం బ్రహ్మలోకం అభిసంపద్యతే న చ పునరావర్తతే న చ పునరావర్తతే" (వర్ణాశ్రమ ధర్మములను (ఉపాసనమును) యావదాయుషము అనుష్ఠించి బ్రహ్మలోకమును పొంది(నవాడు) మరల వెనుకకు వచ్చుట లేదు). ఇత్యాదిశ్రుతులు. ఆదిశబ్దముచేత "తత్పురుషోఽమానవః ఏత్య బ్రహ్మలోకాన్ గమయతి. తేషు బ్రహ్మలోకేషు పరా పరావన్తో వసన్తి తేషాం న పునరావృత్తిః" (బృ. 8. 2. 15) అను శ్రుతిని తీసికొనవలెను.

మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయమశాశ్వతమ్।
నాప్నువన్తి మహాత్మనః సంసిద్ధిం పరమాం గతాః॥

ఆబ్రహ్మభువనాన్ లోకాః పునరావర్తినోర్జున।
మాముపేత్య తు కౌన్తేయ! పునర్జన్మ న విద్యతే (భ.గీ. 8.15, 16)

(నన్ను పొందినవారు సమస్తదుఃఖములకును వాసస్థానమై, స్థిరముకాని జన్మను మరల పొందరు. ఎందువలననగా, వారు మహాత్ములు, పెద్దమనసుగలవారు, నన్ను యథావస్థితముగా తెలిసికొనినవారు. నాయందు అనవధికమైన ప్రీతిచే నన్ను విశ్లేషించి క్షణకాలముకూడ సహించలేనివారు. వీరు నాయందే మనస్సును నిలిపి నన్నే ధ్యానించి, పరప్రయోజనమైన నన్ను పొందియుందురు.)

బ్రహ్మండములోనుండు బ్రహ్మలోకపర్యన్తమైన సమస్తలోకములును ఒకకాలవిశేషమందు నశించిపోవును. అందుచే వాటిని పొందినవారు తిరిగి జన్మించుచున్నారు. నాస్థానమైన పరమపదము స్థిరమైనది. పరమపదమును పొందినవారికి పునర్జన్మము – మరల జన్మించుట లేదు" అని కృష్ణుడు గీతలో ప్రసాదించిరి. దీనిచే పుణ్యపాపరూపకర్మచే వచ్చు పునరావృత్తియనునది లేదు అని చెప్పబడినది.

కర్మబంధము తొలగి వికసితజ్ఞానమును గలవాడై, పరబ్రహ్మమును అనుభవించుచుండు స్వభావముగలవాడై, తదేకప్రియుడై అనవధికాతిశయానందరూపమైన బ్రహ్మమును అనుభవించుచున్న ముక్తునికి వేరొక విషయమందు అనుభవాపేక్షగాని, దానికొఱకు మరియొక ఉపాయమును అనుష్ఠించుటగాని సంభవించదుగనుక మరల జన్మించునా అని శంకించుటకు ప్రసక్తియే లేదు. దీనిచే ముక్తుడు పునరావృత్తిని కోరడని చెప్పబడినది.

*॥ ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ । బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే । వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః'(భ.గీ.7-17/19)ఇతి। సూత్రాభ్యాసః శాస్త్రపరిసమాప్తిం ద్యోతయతీతి సర్వం సమఞ్జసమ్॥ 22॥*

*॥ ఇతి జగద్వ్యాపారవర్జాధికరణమ్ ॥ 6 ॥*

*ఇతి శ్రీభగవద్రామానుజవిరచితే శారీరకమీమాంసాభాష్యే*

---

సత్యసంకల్పుడైన పరమపురుషుడును అత్యర్థప్రియుడైన జ్ఞానినిపొంది ఎప్పుడును తిరిగి పంపడు. దీనిని భగవానుడే చెప్పుచున్నాడు-

శ్లో. ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమహం స చ మమ ప్రియః ।
ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్ ॥

శ్లో. ఆస్థితః స హి యుక్తాత్మా మామే వానుత్తమాం గతిమ్ ।
బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే ।
వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥

ఈ భగవత్సూక్తుల అర్థమేమనగా (1)జ్ఞాని అనబడు ఉత్తమభక్తునికి నేను అత్యంత ప్రియమైనవాడను. అతనికి నాకంటే ప్రియమైనది మరొకటి లేదు. నేనుగూడ అతనిని అట్లే ప్రేమించుచున్నాను. ఇతరాపేక్షలను అన్నింటిని వదలి నన్ను అత్యంతప్రియముగా ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అను చతుర్విధ భక్తులు నాపై భక్తి కలిగి యున్నారు. వారిలో జ్ఞాని అనబడువాడు మాత్రము నాకు ఆత్మసమానుడు. ఇది నా స్థిరమైన నిశ్చయము. (2)ఎందుకనగా ఆ జ్ఞాని అనబడు మహానుభావుడు ఇతరప్రాప్య ఫలములను అన్నిటినివిడచి నన్నే సర్వోత్తమమైన ప్రాప్యవస్తువుగా విశ్వసించి యున్నాడు. అనేకజన్మములుగడిచిన పిదప, ఇంతకాలమునకు తత్త్వ-జ్ఞానమును పొందిన అతడు పరవాసుదేవుడే నాకు సర్వస్వము అని స్థిరమైన నిశ్చయముతో (మాం ప్రపద్యతే) నన్ను సేవించి నాసన్నిధికి చేరినాడు. అట్టి మహానుభావుడు అత్యన్తదుర్లభుడు. దీనిచే అత్యర్థప్రియుడైన జ్ఞానియైన ముక్తుని పొందిన భగవానుడు స్వాతంత్ర్యముచేతను తిరిగి పంపనేరడు అని తెలియుచున్నది.

అనావృత్తిశ్శబ్దాత్ అను సూత్రమును రెండు సారులు చెప్పియుండుట శారీరకశాస్త్రము పూర్తిని పొందెనని ద్యోతనము చేయుచున్నది- తెలుపుచున్నది.

ఇతి సర్వమ్ సమఞ్జసమ్- సర్వశబ్దముచే భేదశ్రుతి, అభేదశ్రుతి, ఘటకశ్రుతి- గుణాది విధినిషేధ శ్రుతులకును సమంజసముగా అర్థము చెప్పబడినది. ఇతి శబ్దము- "అఖిలభువనజన్మస్థేమభంగాదిలీలే" అని ఆరంభించి భాష్యకారులచే ప్రసాదించబడిన అశేషార్థములను పరామర్శించుచున్నది. సర్వశబ్దముచే భాష్యమందు ప్రమాణముగా చెప్పబడని శ్రుతిస్మృతీతిహాసవచనములును, తదనుగ్రాహకతర్కజాతమ్- యుక్తులును వివక్షితములు. ఇతి సర్వం సమఞ్జసమ్.

జగద్వ్యాపారవర్జాధికరణము సమాప్తము.

శ్రీభగవద్రామానుజులచే రచింపబడిన శారీరకమీమాంసాభాష్యమను

*చతుర్థస్యాధ్యాయస్య చతుర్థః పాదః ॥ 4 ॥*
*శ్రీశారీరకమీమాంసాశాస్త్రం శ్రీభాష్యఞ్చ పరిసమాప్తమ్॥*
*శ్రీమతే రామానుజాయ నమః॥*
*శ్రీరస్తు॥ శుభమస్తు॥*

***అవిస్తృతాః సుగమ్భీరా రామానుజమునేర్గిరః। దర్శయన్తు ప్రసాదేన స్వం భావమఖిలం దృఢమ్॥***

---

శ్రీభాష్యములో నాలుగవ అధ్యాయములో నాలుగవ పాదము సమాప్తమైనది.
శ్రీభాష్యమును పరిసమాప్తియైనది.
శ్రీమతే రామానుజాయ నమః
శ్రీలక్ష్మీనృసింహః ప్రీయతామ్।
ప్రీయతామ్ వాసుదేవః
ప్రణామం లక్ష్మణమునిః ప్రతిగృహ్ణాతు మామకమ్।
ప్రసాదయతి యత్సూక్తిః స్వాధీనపతికాం శ్రుతిమ్॥
అత్ర కశ్చిత్ విశేషశ్చేత్ కృష్ణాచార్యముఖోద్గతః।
దోషశ్చేన్మామకీనోయం క్షమ్యతాం హృదయాళుభిః॥
ఇతి విజ్ఞాపయత్యేషః ఖ్యాతశ్రీభాష్యవంశజః ।
కౌండిన్యశ్రీనివాసేతి శ్రీనివాసస్య కిఙ్కరః ॥